
కాపూరి కుటుంబరావు

ప్రస్థానం



డా॥ జె. చెన్నయ్య

కావూరి కుటుంబరావు

ప్రస్థానం

డాక్టర్ జె. చెన్నయ్య

కావ్య ప్రచురణలు

కావూరి హిల్స్, హైదరాబాద్

కావూరి కుటుంబరావు
ప్రస్థానం

రచన:
డా॥ జె. చెన్నయ్య

తొలి ముద్రణ:
అక్టోబర్ 2007

ప్రతులు: 2000

ఆర్టిస్ట్ :
జి.వి. అమరేశ్వరరావు

డిటిపి:
కె. సరస్వతి
303, నార్త్ బ్లాక్, డ్రీమ్‌హోమ్, శాలివాహన టవర్స్
శాలివాహన నగర్, ముసారాంబాగ్
హైదరాబాద్ - 500 036, ఫోన్: 040 - 66367452

ముద్రణ:
సాయి లిఖిత ప్రింటర్స్
6-2-959, దక్షిణ భారత హిందీ ప్రచారసభ కాంప్లెక్స్
ఖైరతాబాద్, హైదరాబాద్ - 4, ఫోన్: 040 - 23325979


ప్రతులకు:
'కావ్య'
ప్లాట్‌నెంబర్ 126, కావూరి హిల్స్
జూబిలీహిల్స్, హైదరాబాద్ - 33

మరియు

విశాలాంధ్ర ప్రచురణాలయం
ఆబిడ్స్, హైదరాబాద్ - 1

ధర: రూ. **50/-**

నివాళి




జననం :

05-05-1918

మరణం :

16-10-2007

١



వెంకట రామయ్య (ఆదెమ్మ)
బుచ్చయ్య (సుందరమ్మ)
1. వీరన్న (మహాలక్ష్మమ్మ)
2.సుబ్బయ్య (సుబ్బమ్మ)
1. కోటయ్య (కుటుంబమ్మ)
దత్తు శివరామయ్య (సీతారామమ్మ)
లక్ష్మీదేవి భర్త రావి జానకి రామయ్య
1. వెంకట కుటుంబరావు (వరలక్ష్మి)
వెంకటరావు (అరుణకుమారి)
రవికుమార్ (సుధారాణి)
2. వెంకటేశ్వరరావు (తులశమ్మ)
సీతారాం ప్రసాద్
3. కోటయ్య (నాంచారమ్మ)
4. వీర రాఘవయ్య (సూర్యకుమారి)
గోపీనాథ్ (కళ్యాణి)
కొండలరావు (నీరజ)
1. నాగయ్య (రత్నమ్మ)
దత్తు కోదండ రామయ్య సీతారామమ్మ
1. సోమశేఖర ప్రసాదరావు (దుర్గాంబ) నైజాం
రమేశ్‌బాబు
2. దేవకీనందన సుభద్రాదేవి
1. వెంకట కోదండ రామయ్య (కమలాపురం)
2. నాగేశ్వర ప్రసాదరావు
2. శేషయ్య (నరసమ్మ)
1. వెంకట కృష్ణయ్య పున్నమ్మ
2. కోదండ రామయ్య దత్తు
3. శివరామయ్య దత్తు
1. సీతా రామయ్య
2. బసవయ్య
3. సత్య నారాయణ విమలమ్మ
4. బల రామయ్య తులశమ్మ
5. రామశేషయ్య వెంకటరామమ్మ
1. సీతా రామయ్య కోడూరు
2. నాగేశ్వరరావు నరసింహాపురం
1. రవీంద్రబాబు
2. కృష్ణమూర్తి
3. శ్రీరాములు (ఇరువురు భార్యలు మొదటి భార్య రత్నమ్మ)
1. పెదరామకృష్ణయ్య (సీతారత్తమ్మ)
చిదంబర రావు లక్ష్మీ నరసమ్మ
1. వెంకట నారాయణ
2. వీర రాఘవయ్య వెంకటరత్నం
3. శివరామ కృష్ణయ్య లక్ష్మీకాంతం
4. సుబ్బారావు
5. రామలింగయ్య గుండుపాలెం
2. సూర్యనారాయణ (లక్ష్మమ్మ)
3. సుబ్బయ్య సత్యజ్ఞాన ప్రసూనాంబ
4. వెంకట రత్నం
దేవకీనందన ప్రసాద్
చల్లమ్మ
5. సత్యనారాయణ సీతారామమ్మ
(ఖానాపురం) (వరంగల్)
4. వెంకట రామయ్య (శేషమ్మ)
1. సీతారామయ్య (రామాంజమ్మ)
చిన రామకృష్ణయ్య సీతారామమ్మ
వెంకట రాంబాబు
2. రామచంద్రయ్య (కుటుంబమ్మ)

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Andhra Saraswatha Parishath
Tilak Road, Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాదు-500 001.
ఫోన్ : (ఆ) 24753724

No.

తేది: 25/9/07

ఆముఖం

ఆశయనిబద్ధనతో అటు ఉద్యమశీలిగా, ఇటు సేవాజీవిగా తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకున్న గణనీయ వ్యక్తి శ్రీ కావూరి కుటుంబరావు. కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పోరాటాలలో క్రియాశీలకంగా పాల్గొన్న కుటుంబరావుగారు ఎన్నో పర్యాయాలు జైలు జీవితం గడిపారు. చల్లపల్లి జమీందారీ వ్యతిరేక పోరాటంలో చురుకుగా పాల్గొని తమ అభ్యుదయ దృక్పథాన్ని ఆచరణలో చూపారు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత కావూరివారు హైద్రాబాదులో స్థిరపడిపోయారు. బంజారాహిల్స్‌లో స్వయంగా కొన్న భూముల్లో నుంచి కొంత భాగాన్ని ఇటు మెహర్‌బాబా మందిరానికి, అటు చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌కు ఉచితంగా కేటాయించారు. ఇదీ రేఖామాత్రంగా కావూరివారి జీవిత చరిత్ర.

వచన రచనలో, ప్రత్యేకించి జీవిత చరిత్రల రచనలో పరిణతి పొందిన డా॥ చెన్నయ్య కుటుంబరావుగారి బాల్యదశ నుంచి ఈనాటి వయోధిక దశ వరకు ఈ గ్రంథంలో చిత్రించి చూపాడు. ఏయే అంశాలను ఏయే ప్రమాణాల్లో ఉల్లేఖించాలో ఎరిగిన డా॥ చెన్నయ్య ఈ గ్రంథాన్ని పరమ పఠనీయంగా రూపొందించాడు.

ఈ గ్రంథానికి మూలబిందువైన కావూరి కుటుంబరావు గారు ఇటీవలే కన్ను మూశారు. వారిని స్మరిస్తూ రూపకర్తగా వున్న డా॥ చెన్నయ్యకు నా హార్దికాభినందనలు తెలియజేస్తున్నాను.

(డాక్టర్ సి. నారాయణరెడ్డి)

Grams : "TELVERS"

Phone : Off : 040-23234815
Tele Fax : 040-23236911
E-mail : info@teluguuniversity.ac.in

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

Dr. A. MANJULATA
VICE-CHANCELLOR

Lalitha Kala Kshetram
Public Gardens,
Hyderabad - 500 004. (A.P)

ఆదర్శజీవికి అక్షరాంజలి

కుటుంబరావుగారు చరిత్ర సృష్టించిన మనిషి. ఇటువంటి వ్యక్తులు భావితరాలకు ఆదర్శం. చాలా మంది ఏ పని చేసినా తమకు కష్టం కలగని పనులే చేస్తుంటారు. తమ కుటుంబానికి మేలు చేసే పనులే చేస్తుంటారు. కాని కుటుంబరావు వంటి సామాజిక హితాన్ని కోరేవారు అరుదుగా వుంటారు. తమకు ఎన్ని కష్టాలు ఎదురొచ్చినా సహించి ప్రజలకోసం వాటిని చిరునవ్వుతో స్వీకరిస్తారు. కుటుంబరావు కూడా అంతే. చల్లపల్లి జమీందారీకి వ్యతిరేకంగా ఉద్యమం సాగించినప్పుడు అటు జమీందారుల రౌడీలు, ఇటు పోలీసుల నుంచి ఎన్ని బెదిరింపులు వచ్చినా లెక్క చేయలేదు. రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ధైర్యంగా ప్రతిఘటించారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో పాల్గొని గ్రామగ్రామానా రైతులను, యువతను సమీకరించే సందర్భంలో ఎన్నో ఇబ్బందుల నెదుర్కొన్నారు. ఆనందంగా కుటుంబంతో సుఖసంతోషాలతో జీవనం సాగించే పరిస్థితులను తోసిరాజని పోరాట బాటను ఎంచుకొన్నారు. జైలు జీవితాన్ని గడిపారు. తాను చేసిన త్యాగాలకు ఎవరి నుంచీ ఏ ప్రతిఫలమూ కోరలేదు. అలాంటి విశిష్టవ్యక్తి మన మధ్య నిన్నమొన్నటి వరకు సంచరించారు. మనల్ని ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాల్ని తెలుసుకుంటూ వున్నారు. వ్యక్తిగతంగా కుటుంబరావుగారు మా కుటుంబానికి ఎంతో ఆత్మీయులు. మా నాన్నగారు జస్టిస్ ఆవుల సాంబశివరావుగారికి ప్రేమాస్పదులైన చిరకాల మిత్రులు. మా పట్ల అవ్యాజమైన వాత్సల్యాన్ని చూపేవారు. హఠాత్తుగా అందరినీ వదిలివెళ్లడం ఎంతో బాధను కలిగించింది. వారిని ఈ సందర్భంగా స్మరిస్తూ వారి స్ఫూర్తి దాయకమైన జీవిత చరిత్రను రచించిన డా॥ చెన్నయ్యను అభినందిస్తున్నాను.

(ఆవుల మంజులత)

ఈ పుస్తకాన్ని గురించి....

హైదరాబాద్ నగరంలోని కావూరి హిల్స్‌లో చాలామంది సంపన్నులు నివసిస్తు న్నారు. వారిలో ఒకరు కుటుంబరావు. అంతేనా! అంతే అయితే ఈ పుస్తకమే రాయవలసిన అవసరం వుండేది కాదు. కావూరి హిల్స్‌గా చెప్పబడుతున్న ఆ ప్రాంతమంతా ఆయనదే. ఆ స్థలాన్ని ఎప్పుడో కొని ప్లాట్లు చేసి మిత్రులకు, ఆశ్రితులకు, ఇతరులకు చాలా చవగ్గా, ఉచితంగా కూడా ఇచ్చాడు. ఆ ప్రాంతమంతా ఆయనదే. కావూరి కుటుంబరావు పేరున వెలిసిందే ఈ కావూరి హిల్స్. అందుకే ఆయనపై ఆ పుస్తకమా! కాదు.

హైదరాబాద్‌లో ముప్పయ్యేళ్లుగా ఉంటూ చాలామంది స్నేహితులను సంపాదించుకున్నా నిజానికి హైదరాబాద్‌కు, హైదరాబాద్‌లోని వారికి కుటుంబరావును గురించి తెలిసింది చాలా తక్కువ.

తెలుగు విద్యార్థి కొల్లూరి కోటేశ్వరరావుగారి ద్వారా నాకు కావూరి కుటుంబరావు గారితో పరిచయం ఏర్పడింది. కుటుంబరావు ఎప్పుడో రాసి వుంచిన 'చల్లపల్లి రైతాంగ పోరాటం' రాతప్రతిని కాస్త సంస్కరించి దాన్ని పుస్తక రూపంలో చూడాలన్న వారి ఆకాంక్ష నెరవేర్చడంలో సహకరించమని నన్ను కోరారు. ఆ పని మీద కుటుంబరావుగారిని చాలాసార్లు కలిశాను. పుస్తకం వెలువరించాం. నిజానికి ఆ పని అయిపోయింది. కాని ఆ సందర్భంలో ఆయన గురించి అనేక విషయాలు తెలుసుకున్నాను. ఆ విషయాలే నన్నీ పుస్తకం రాయడానికి పురిగొల్పాయి. కథా నాయకుని కథ రూపుదిద్దుకుంది.

కృష్ణా జిల్లా దివిసీమ ప్రాంతంలోని రావివారిపాలెంలో ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన కుటుంబరావుకు ఇప్పుడు 90 ఏళ్లు. ఈ 90 ఏళ్ల జీవితంలో గొప్ప గొప్ప సంఘటనలు చూశాడు. తొలుత జీవితంలో స్థిరపడి పైకి రావడానికి అనువైన పరిస్థితులేవీ కుటుంబరావుకు ఎదురవలేదు. చాలా రకాలుగా ఎదురుదెబ్బలు తిన్నాడు. అయితే వైఫల్యాలను అధిగమిస్తూ నాటి ఉద్యమాలు, నాయకుల నుంచి ఉదాత్తమైన ఆశయాలను పుణికి పుచ్చుకున్నారు. జాతీయోద్యమ గురుతులతో పరిమళించిన బందరు పరిసరాల్లో విద్య నేర్చారు. గొప్ప గొప్ప నాయకులను దగ్గర్నుంచి చూసే అవకాశం కలిగింది. స్వాతంత్ర్యోద్యమం, మరోవైపు అప్పుడప్పుడే అంకురించి రూపుదిద్దుకుంటున్న కమ్యూనిస్టు ఉద్యమం, భగత్‌సింగ్ త్యాగం కుటుంబరావును ఆకర్షించాయి. గాంధీజీ పర్యటన జరిగింది. తనకు పరిచితులైన నాయకులు జాతీయోద్యమంలో పాల్గొని జైళ్లకు వెళ్లారు. ముఖ్యంగా కుటుంబరావును ఆలోచింపజేసిన సంఘటనల్లో భగత్‌సింగ్ వీరమరణం ప్రధానమైంది. కాంగ్రెస్ కార్యక్రమాల కంటే కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలే ఎక్కువగా కుటుంబరావును తమలో లీనం చేసుకున్నాయి.

చల్లపల్లి జమీందారీ వ్యతిరేక పోరాటం తక్షణ కార్యరంగమై కట్టెదుట నిలిచింది. ఏ వ్యక్తికీ జన్మించక పూర్వమే వేలాది ఎకరాల నేల, ప్రజల మీద నిరంకుశాధికారం చేసే హక్కు వుండదని నమ్మిన వ్యక్తి కుటుంబరావు. చల్లపల్లి జమీందార్లకు కూడా అంతే. జమీందార్లు అనేక రకాలైన మాయోపాయాలతో క్రమక్రమంగా ఎస్టేట్‌లోని భూములను తమ పరం చేసుకోవడం, ఇంకో వైపు ప్రజలను ముక్కు పిండి శిస్తులు వసూలు చేయడం, ఈ అరాచకం నుండి ప్రజల్లో ముఖ్యంగా రైతుల్లో ప్రతిఘటన రూపుదిద్దుకోవడం జరిగింది. ఈ ప్రతిఘటన ఉద్యమ రూపు సంతరించుకొన్నది. దానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించింది. ఉద్యమాన్ని ముందుండి నడిపించిన వారిలో కుటుంబరావు ఒకరు. జమీందార్లు, వారి మనుషులు, వారికి వత్తాసు పలికిన పోలీసులు, వారికున్న రాజకీయ అండదండలు, వీటికి తోడు కమ్యూనిస్టు పార్టీపై నిర్బంధ, నిషేధాలు... ఇవన్నిటినీ తట్టుకొంటూ కూడా ఉద్యమం సాగింది. దివిసీమలో కమ్యూనిస్టు పార్టీ చల్లపల్లి రైతాంగ పోరాటానికి నాయతక్వం వహించడమే కాదు అనేక విషయాల్లో సామాజిక మార్పుకు, ప్రజల ఆలోచనా విధానంలో మార్పుకు పాటుపడింది. చల్లపల్లి నారాయణరావు, చంద్ర రాజేశ్వరరావు, కావూరి కుటుంబరావు, చంద్ర రామలింగయ్య.... ఇంకా ఎంతో మంది రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల్లో ముఖ్య పాత్ర వహించారు.

కుటుంబరావును మరికొందర్ని పోలీసులు అరెస్టు చేసి తొలుత రాజమండ్రి జైలుకు అక్కడ్నించి కడలూరు జైలుకు పంపించారు. కుటుంబరావు జైల్లో వుండగానే ఇక్కడ జమీందారుతో కుమ్మక్కైన పోలీసులు కాల్పులు జరిపి 26 మందిని పొట్టన బెట్టుకున్నారు. చల్లపల్లి నారాయణరావుతో సహా ముఖ్య నాయకులూ వీరమరణం చెందిన వారిలో వున్నారు.

జైలు జీవితంలో కుటుంబరావు ఎంతో మంది కమ్యూనిస్టు పార్టీ అగ్రనేతలతో సాహచర్యం, సాన్నిహిత్యం ఏర్పడింది. ఎ.కె. గోపాలన్, ఎం.ఆర్. వెంకట్రామన్ వంటివారు కుటుంబరావును తాతా అని పిలిచేవారు. జైల్లో కూడా పార్టీ ఇచ్చిన వెర్రిమొర్రి ఆదేశాలను పాటించవలసి వచ్చి ఎన్నో ఇబ్బందులు పడ్డారు. జైల్లో కూడా పోరాటాలకు దిగవలసి రావడంతో అక్కడ కొందరు కాల్పుల్లో మరణించారు.

జైలు నుంచి విడుదలయ్యాక కూడా రైతాంగ పోరాటాన్ని కొనసాగించారు. పార్టీ నాయకుల అసంబద్ధ వైఖరి వల్ల ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా సహించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ఎన్నికల్లో, ఆంధ్ర రాష్ట్ర ఎన్నికల్లో పార్టీ పరంగా ముఖ్య పాత్ర నిర్వహించారు. ఎన్నడూ పదవుల కోసం పాకులాడలేదు. నిస్వార్థంగా తాను చేయవలసిన విధి చేస్తూ వచ్చారు. పోరాటాలు ముగిసి ఎన్నికల రాజకీయాలు ప్రారంభమయ్యాక కుటుంబరావు క్రియాశీల రాజకీయాలకు స్వస్తి చెప్పి హైదరాబాద్ పయనమయ్యారు.

ఇంత చరిత్ర వున్న వ్యక్తి కుటుంబరావు. ఆయన ఉద్యమ సహచరులు ఈనాడు లేరు.

గతించారు. ఇప్పుడున్న చాలామందికి ఆయనెవరో తెలియదు. ఈ వ్యక్తి చరిత్రను శాశ్వత చరిత్రలో లీనం చెయ్యాలని అనిపించింది.

నేను తన జీవిత చరిత్రను రాయడం ఆయన కళ్లారా చూసుకున్నారు. అయితే పుస్తక రూపంలో రాకముందే ఆయన కన్నుమూశారు. ఆయన స్మృత్యర్థం ఇలా ఈ పుస్తకం వెలువరించాల్సి వస్తుందని నేను అనుకోలేదు. ఇందుకు నాకు బాధగానే వుంది.

ఇది ఒక వ్యక్తి జీవితంలోని కొన్ని వాస్తవ సంఘటనలకు మరిన్ని కల్పించి రాసిన తరహాలోనిది కాదు. కల్పనలేవీ లేని అసలు సిసలు చారిత్రాకాంశాలు. ఇందులో కుటుంబరావు ఒక నాయకునిగా కనిపించడు. ఆ పోరాటాల్లో, ఉద్యమాల్లో అందరితో పాటు తాను అన్నట్లుగా కనిపిస్తారు. అతిశయోక్తులకు దూరంగా వాస్తవాలకు సన్నిహితంగా నడిచింది. ముందు ముందు ఇలాంటి జీవిత చరిత్ర రాయించుకోవాలని అనుకోలేదు ఆయన. కాబట్టి రికార్డులేవీ సమకూర్చుకోలేదు. భద్రపరుచుకోలేదు. అయితే ఆయన జ్ఞాపకశక్తికి జోహార్లు. పుస్తకంలో ఏదైనా గొప్పదనం వుందంటే ఆ గొప్పదనం కుటుంబరావుదే తప్ప నా రచనది ఏ మాత్రం కాదు. ఏవైనా తప్పులుంటే పెద్దలు నా దృష్టికి తెస్తే మలి ముద్రణలో సవరించుకుంటాను. ఇంకో విషయం చరిత్రలో ఆయన సమకాలికులైన ఎంతో మంది పెద్దలను నేను మరిచిపోయి వుండవచ్చు. అందుకు క్షంతవ్యుడ్ని.

– జె. చెన్నయ్య

పూర్వీకుల గురించి...

కావూరి కుటుంబరావు పూర్వీకులది గుంటూరు జిల్లా తెనాలి తాలూకా గుడివాడ. ఆ గ్రామానికి చెందిన కావూరి వెంకట్రామయ్య, ఆదెమ్మ దంపతులకు బుచ్చయ్య అనే కుమారుడు కలిగారు. కృష్ణా జిల్లా దివి తాలూకా మోపిదేవి శివారులోని రావిపాలెంలోని రావి నాగయ్య చెల్లెలు సుందరమ్మతో బుచ్చయ్య వివాహం జరిగింది. వివాహానంతరం బుచ్చయ్య దంపతులు రావివారిపాలెంలో స్థిరపడ్డారు. వారికి ఇద్దరు కుమారులు, పెద్ద కుమారుడు వీరన్న. ఆయన భార్య మహాలక్ష్మమ్మ. రెండవ కుమారుడు సుబ్బయ్య. ఆయన భార్య పేరు సుబ్బమ్మ. వీరన్నకు కోటయ్య అనే కుమారుడు, లక్ష్మీదేవి అనే కూతురు కలిగారు. బుచ్చయ్య రెండవ కుమారుడు సుబ్బయ్యకు నలుగురు కుమారులు. నాగన్న, శేషయ్య, శ్రీరాములు, వెంకట్రామయ్య. ఈ నలుగురిలో పెద్దవాడైన నాగన్నకు పిల్లలు కలగలేదు. తర్వాతివాడైన శేషయ్యకు వెంకటకృష్ణయ్య, కోదండరామయ్య, శివరామయ్య అనే ముగ్గురు కుమారులు జన్మించారు. పిల్లలు లేకపోవడం వల్ల నాగన్న తమ్ముని కుమారుల్లో రెండవవాడైన కోదండరామయ్యను దత్తత తీసుకున్నాడు. కోటయ్య కూడా సంతానం లేకపోవడం వల్ల శేషయ్య మూడవ కుమారుడైన శివరామయ్యను దత్తత తీసుకున్నారు. వీరి మధ్య ఆస్తుల పంపకం విషయం వచ్చింది. అప్పుడు నాగన్న, శేషయ్య, శ్రీరాములు, వెంకట్రామయ్య ఒక తండ్రి కుమారులు. కోటయ ఒక్కడు ఒక తండ్రి కుమారుడు. కాబట్టి లెక్క ప్రకారం ఆస్తి రెండు భాగాలు చెయ్యాలని ఒక భాగం నలుగురన్నదమ్ములం, మిగతా సగం నీవు తీసుకోవాలని నాగన్న కోటయ్యకు చెప్పాడు. అప్పుడు అందుకు కోటయ్య అంగీకరించలేదు. నేను ఒక తండ్రి కొడుకును. మీరు నలుగురూ ఒక తండ్రి కొడుకులు అయినా ఐదుగురం పంచ పాండవుల్లా కలిసిమెలసి వున్నాం. మీరు నలుగురికీ ఒక వంతు నేనొక్కణ్నీ ఒక వంతు తీసుకోవడం న్యాయం కాదు. మొత్తం ఆస్తిని ఐదుగురం సమానంగా పంచుకుందాం అని ఎంతో ప్రేమాస్పదంగా చెప్పాడు కోటయ్య. ఆనాటి వ్యక్తుల నీతికి, నిజాయితీకి ఇది ఒక దృష్టాంతం.

శ్రీరాములుకు మొదటి భార్యకు ఇద్దరు కుమారులు, రెండవ భార్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కలిగారు. కుమార్తెను రేపల్లె తాలూకా మోర్తోటకు చెందిన ఉప్పల బుల్లికోటయ్యకిచ్చి వివాహం జరిపించారు. శ్రీరాములు మొదటి భార్య రత్నమ్మ

ద్వారా కలిగిన కుమారులు రామకృష్ణయ్య, సూరయ్యలకు, రెండవ భార్య ద్వారా కలిగిన కుమారులు సుబ్బయ్య, వెంకటరత్నం, సత్యనారాయణలకు ఇళ్లను పంచి ఇచ్చారు. కోటయ్య దత్తత చేసుకున్న శివరామయ్య మరో పెంకుటింట్లో ఉండేవారు. దానికి ఉత్తరాన వున్న పెంకుటింట్లో కోదండరామయ్య ఉండేవారు. ఉత్తరాన చిన్న మూడవ ఇల్లు నిర్మించి చిన్న సోదరుడైన వెంకట్రామయ్యకు ఇచ్చారు. ఆయనకు సీతారామయ్య, రామచంద్రయ్య అనే కుమారులు, సుబ్బమ్మ, పార్వతమ్మ, రాఘవమ్మ, నాంచారమ్మ అనే కుమార్తెలు జన్మించారు. పెద్దవాడైన సీతారామయ్య ఒక కుమారుడు పుట్టిన తర్వాత ఆకస్మికంగా మరణించాడు. కుమారునికి చినరామకృష్ణయ్య అని పేరు పెట్టారు. వెంకట్రామయ్య తన పెద్దకుమార్తె సుబ్బమ్మను మోర్తోటలోని ఉప్పల అచ్చయ్య అనే వృద్ధునికి ఇచ్చి పెళ్లి చేశారు. మూడవ కుమార్తె రాఘవమ్మను అదే గ్రామానికి చెందిన ఉప్పల వెంకట్రా మయ్యకిచ్చి వివాహం చేశారు.

నాగన్న, కోటయ్యలకు పిల్లలు లేరు. కోటయ్య సోదరి లక్ష్మీదేవిని రావివారిపాలెం లోనే రావి జానకిరామయ్యకిచ్చి వివాహం జరిపించారు. శేషయ్యకొక కూతురుండేదని నందిగామ తాలూకాకు మనువు వెళ్లి పెళ్లయిన కొంత కాలానికే మరణించిందని చెప్పేవారు. నాగన్నకు రావివారిపాలేనికి చెందిన రావి రామన్న సోదరి రత్నమ్మతో, శేషయ్యకు తెనాలి తాలూకా జంపని గ్రామస్తుడు గవిని రామయ్య సోదరి నరసమ్మతో, కోటయ్యకు మోపిదేవి గ్రామస్తుడైన గద్దె నాగయ్య సోదరి కుటుంబమ్మతో, చిన్నవాడైన వెంకట్రామయ్యకు కోటయ్య సోదరి లక్ష్మీదేవి, జానకిరామయ్యల కుమార్తె శేషమ్మతో పెళ్లి చేశారు.

నాగన్న మొదటి భార్య చనిపోవడంవల్ల పెద్ద కుమార్తె సీతారావమ్మను కోటయ్యనే పెంచి పెద్ద చేసి తన దత్తపుత్రుడైన శివరామయ్యతో పెళ్లి చేశాడు. ఆ తర్వాత శివరామయ్య, సీతారావమ్మ దంపతులకు వెంకాయమ్మ అనే కుమార్తె, వెంకట కుటుంబరావు, వెంకటేశ్వర రావు, కోటయ్య, వీరరాఘవరావు అనే నలుగురు కుమారులు కలిగారు. ఆ నలుగురిలో పెద్ద కుమారుడే మన కావూరి కుటుంబరావు. 1918 మే 5న కుటుంబరావు జన్మించాడు. కుటుంబరావు తోబుట్టువులైన వెంకాయమ్మను ఆ వూళ్లోనే అంటే రావివారిపాలెంలోనే వున్న రావిరామయ్య, సీతామహలక్ష్మమ్మల మూడవ కుమారుడైన గోపాలానికిచ్చి పెళ్లి చేశారు. కాని ఆమె పిల్లలు కలగక ముందే 1938లో అకాల మరణం పాలైంది.

కావూరి శివరామయ్య ఆ రోజుల్లో అనేక కష్టాలెదుర్కున్నారు. ముఖ్యంగా దాయాదులైన శ్రీరాములు కుమారులతో సరిహద్దు తగాదా ఏర్పడి న్యాయస్థానం ఎక్కవలసి వచ్చింది. ఇందుకు ఆయనకు తమ అన్నగారైన కావూరి కోదండరామయ్య సలహా సంప్రదింపులు లభించేవి. పినతండ్రి కుమారుడైన రామకృష్ణయ్యకు 10 సెంట్ల దొడ్డి వుండేది. దానికి తూర్పు వైపు సరిహద్దులో నడుమ వేరేవారి భూమి రెండు సెంట్లు వుండింది. ఆ భూమిని

శివరామయ్య అన్న కోదండరామయ్య సలహాపై కొనుగోలు చేశారు. ఇలా ఉండగా ఒకనాడు పినతండ్రి కుమారుడైన రామకృష్ణయ్య ఆ స్థలంలో వున్న రెండు తాటిచెట్లకు మట్టల్ని కొట్టుకుంటున్నాడు. దాంతో 'ఈ దొడ్డి నేను కొన్నాను. మీరెలా తాటిమట్టలు కొట్టుకుంటార' ని శివరామయ్య నిలదీశాడు. నీవు తాటిచెట్లను కొన్నట్లు దస్తావేజులో లేదు కదా అని రామకృష్ణయ్య లా పాయింటు లేవదీశాడు. దీనిపై శివరామయ్య రామకృష్ణయ్యపై న్యాయస్థానంలో దావా వేశాడు.

పూర్వీకులు కొన్న మూడు ఇళ్లకు తూర్పున కోదండరామయ్యకు ఒక పెద్ద దొడ్డి వుండేది. దాని చుట్టూ ప్రహరీ నిర్మించి కొంత స్థలంలో పశువుల పాక వేసి దక్షిణంగా రెండు గదుల ఇల్లు, పెద్ద వసారా కట్టుకున్నారు. దాన్ని బంగళా అని పిలిచేవారు. అందులో ఒక గదిని గ్రంథాలయంగా మార్చారు. ఆ రోజుల్లోనే హిందూ, మెయిల్, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, భారతి, శారదవంటి చాలా పత్రికలు వచ్చేవి. రావివారిపాలెంలో అప్పట్లో పాఠశాల లేదు. దాంతో కోదండరామయ్య బందరు హైస్కూల్లోనూ, శివరామయ్య (కుటుంబరావు తండ్రి) మోపిదేవి ఎలిమెంటరీ స్కూల్లోనూ 5వ తరగతి వరకూ చదివారు. అలా బందరు, మోపిదేవి వెళ్లి చదువుకోలేనివారికి కోదండరామయ్య బంగళాలోని వసారాలో రాత్రి పాఠశాల పెట్టి చదువు చెప్పేవారు.

స్కూల్లో రాత్రిపూట లస్టర్ అనే పెద్ద అద్దంలో దీపం వెలిగించేవారు. లస్టరుకు కింది భాగంలో ఒక సీసా కిరోసిన్ పట్టే బుడ్డి, దాని మీద ఒక అడుగు ఎత్తు వుండే అద్దం, దాన్ని వెలిగిస్తే వెలుతురు కిందకు రావడానికి వీలుగా పైన గుండ్రటి డోములుండేవి. కావూరి కోదండరామయ్య శివరామయ్య సోదరులు, రావివారిపాలెం పక్కనున్న చిరువోలుకు చెందిన కుటుంబరావు ఉపాధ్యాయులుగా వుంటూ రాత్రి బడి నడిపేవారు. ఆ బడి గ్రామంలోని వయోజనులకు చదువు నేర్పడంలో ఎంతో మేలు చేసింది.

అంతలో తాలూకా బోర్డు, జిల్లా బోర్డు ఎన్నికలు వచ్చాయి. తాలూకా బోర్డు ఎన్నికల్లో ఆనాటి జస్టిస్ పార్టీ నాయకుడైన చల్లపల్లి జమీందారు యార్లగడ్డ అంకినీడు ప్రసాదు నాయకత్వంలో కింద కొంత మంది పోటీ చేశారు. వారికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌వాదులైన కావూరి కోదండరామయ్య వర్గం పోటీకి దిగింది. జమీందారు వర్గం జస్టిస్ పార్టీ అభ్యర్థులపై కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. కావూరి కోదండ రామయ్య మోపిదేవి నుంచీ, వేములపల్లి గోపాలరావు నాగాయితిప్ప నుంచీ, రేపల్లె వెంకటకృష్ణయ్య కోసూరిపాలెం నుంచీ, గద్దే నారయ్య అవనిగడ్డ నుంచి, కొల్లి శేషయ్య కిష్కింధపాలెం నుంచీ, మండవ వెంకటరత్నం నరసన్నపాలెం నుంచీ, చలసాని వీరయ్య భట్లపెనుమర్రు నుంచి, గొట్టిపాటి బ్రహ్మయ్య ఘంటసాల నుంచీ గెలుపొందారు.

అప్పటివరకు తాలూకా, జిల్లా బోర్డులకు ప్లీడర్లే ప్రజల నుంచి ఎన్నికయ్యేవారు. మొదటిసారి రైతు ప్రతినిధులుగా వీరంతా ఎన్నికయ్యారు. వారిలో కావూరి కోదండరామయ్య 1923లో జిల్లా బోర్డు ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అప్పట్లో కాంగ్రెస్‌వాదులు జస్టిస్ పార్టీవారిని మరీ ముఖ్యంగా చల్లపల్లి జమీందారు నిలబెట్టిన అభ్యర్థులను ఓడించడం చారిత్రాత్మక విజయమేనని చెప్పవచ్చు. అంతకు మూడేళ్ల కిందట జరిగిన మహాత్మా గాంధీ, మోతీలాల్ నెహ్రూ, షౌకత్ అలీ వంటి నాయకులు పాల్గొన్న కాంగ్రెస్ మహాసభ ఈ పరిణామాలకు ప్రేరణగా నిలిచింది.

అప్పుడు దివి, బందరు తాలూకాలకు కలిపి ఒకే తాలూకా బోర్డు ఉండేది. ఈ తాలూకా బోర్డులో 18 మంది సభ్యులుండేవారు. గెలుపొందినవారిలో కావూరి కోదండరామయ్య , గొట్టిపాటి బ్రహ్మయ్య ప్రభృతులే కాక షిడింబి హనుమంతరావు, ఎర్రమిల్లి సత్యనారాయణ కూడా వున్నారు. జస్టిస్ పార్టీ తరపున 8 మందే గెలవడం వల్లనూ, రెండు తాలూకాల్లోనూ కాంగ్రెస్‌వారిదే మెజారిటీ కావడం వల్లనూ అధ్యక్ష ఎన్నికల్లోనూ వారే గెలుపొందారు.

నాటి పరిస్థితులు

1920 ప్రాంతాలనాటి విషయాల్ని ఈనాడు గుర్తు చేసుకుంటే అపురూపంగానే కాక ఆశ్చర్యకరంగానూ అనిపిస్తాయి. ఆ రోజుల్లో పురుషులు ఎక్కువమంది చొక్కా ధరించేవారే కాదు. కట్టుకొనే పంచ కాకుండా పైపంచ మాత్రమే ధరించేవారు. జుట్టు కూడా ఈనాటిలా కాకుండా తలపై ముందువైపున మాత్రం కొద్దిగా జుట్టు తీసివేసి మిగతా అంతా అలా ఉంచేవారు. వెనుకవైపు ముడివేసుకునేవారు. ముసలివారికి జుట్టు రాలిపోయేది పోను మిగిలినదాన్ని పిలకలా ఉంచుకునేవారు. అక్కడ కూడా క్రైస్తవ మతం పుచ్చుకున్న మాదిగవారు ముఖ్యంగా యువకులు మాత్రం క్రాఫు చేయించుకునేవారు. క్రాఫు చేయడం మంగలివారికి కూడా తెలిసేది కాదు. ఎవరైనా క్రాఫు చేయించుకున్నా అలా తయారయ్యావేమిటి గోసంగి (మాదిగ) వాడిలా అని కోప్పడేవారు. మగపిల్లలకు ఐదేళ్లు వచ్చేదాకా నిక్కర్లు గట్రా ఉండేవి కాదు. తర్వాత లాగులు తొడిగినా అవి మామూలువి కావు , బొందులాగులని అనేవారు. తాడుతో కట్టేవారు. ఆడపిల్లలకు ఐదారేళ్లు వచ్చే వరకూ పరికిణీలు వేసేవారు కాదు. లోపల బంగారంతో గానీ, వెండితో గానీ చేయించిన (సిగ్గు) బిళ్లను తాడుతో కట్టేవారు. పెద్దవాళ్లయ్యాక కూడా ఆడవారికి చీర, రవిక తప్ప ఇతర లోదుస్తులు ఉండేవి కావు. చీరకుచ్చిళ్లు కిందివరకూ వదిలితే తప్పుగా భావించేవారు. కాళ్లకు కడియాలు, పట్టాగొలుసులు, వంకరకడియాలు, కాలివేళ్లకు మట్టెలు ఉండేవి. ఆర్థిక పరిస్థితి బావున్నవారు బంగారు చెవిపోగులు, ముక్కుపుడక, బంగారు గాజులు, ఉంగరాలు మొదలైనవి చేయించుకునేవారు. ఈనాడు పనిమనుషుల్ని పెట్టుకుంటున్నారు. సంపన్నులైనా ఇంటి పనంతా ఆడవారు తామే చేసుకునేవారు.

1936 సంవత్సరం వరకు దివిసీమ మెట్టప్రాంతం కావడంవల్ల మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు, వరిగలు, కంది వంటి మెట్టపంటలే పండేవి. మొక్కజొన్న గింజల్ని రాల్చడానికి కండెలను బడితెలతో కొట్టేవారు. రాలగా మిగిలిన గింజలను వొలిచేవారు. వేరుశనగ కాయ ఎండబెట్టిన తర్వాత మూడు విత్తులున్న కాయలను వేరుచేసి మరుసటి సంవత్సరం విత్తనాలుగా వాడేందుకు దాచుకునేవారు. ఆ రోజుల్లో ఇప్పట్లా వరి అన్నం లేదు. రైతుల్లో ఎక్కువమంది మొక్కజొన్న, తైద (రాగులు), వరిగల్ని పండించి ఆహారంగా ఉపయోగించేవారు. మొక్కజొన్నల్ని రోటిలో వేసి రోకలితో దంచి ఉడకబెట్టుకొని కూర, పచ్చడి కలుపుకొని తినేవారు. తైదల్ని విసుర్రాయిలో వేసి మెత్తగా నూరి ఆ పిండితో తైదతోప చేసుకొనేవారు. తైదతోపను నీళ్లలో వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే దాన్ని నీళ్ల నుంచి తీసి దాన్ని పెరుగులో కలుపుకొని మాగాయతో నంజుకొని తినేవారు. వీటికంటే వరిగల్ని తినడం చాలా ఇబ్బందిగా వుండేది.

వడ్లు దంచినట్లు వరిగలను రోట్లో వేసి దంచి పొట్టు ఊడిన తర్వాత అన్నంలా వండుకొని తినేవారు. కాని వరిగలను పొట్టు ఊడేలా దంచడమే చాలా ఇబ్బంది. రోట్లో వరిగలు వేసి రోకలితో మెల్లగా దంచినా గింజలన్నీ ఎగిరి ఇల్లంతా పడేవి. అలా ఎగిరి పోకుండా ఉండటానికి గింజలపైన ఈత ఆకులను రోట్లో వేసి దంచేవారు. కష్టపడి దంచినా పొట్టు ఊడేది అంతంత మాత్రమే. పొట్టు ఊడినవాటిని వేరు చేసి వండుకొని కూరలను, పచ్చళ్లను కలుపుకొని తినేవారు. పెద్దలు తప్పనిసరి పరిస్థితిలో తినేవారు. కాని పిల్లలు మాత్రం వరిగన్నం తినడానికి చాలా కష్టపడేవారు.

కృష్ణానదికి దక్షిణ దిక్కున వుండేది దివిసీమ. ఆ ప్రాంతంలో పులిగడ్డ ప్రాజెక్టు నీటితో కొంతమేర మాగాణి సాగయ్యేది. ఆ మాగాణిలో పండిన వడ్లను ఇతర గ్రామాల్లో అమ్మేవారు. తూమెడు ధాన్యం అంటే 13 మరకలు. అంటే 38 కిలోలన్న మాట. ధనిక రైతులు అలా ఇళ్ల వద్దకు వచ్చే వ్యాపారుల నుంచి వడ్లను కొనేవారు. పేదలయితే శక్తి మేరకు తక్కువ వడ్లను కొని దంచుకొని బియ్యాన్ని ఎప్పుడో ఏ పండుగకో తినేవారు. ఈనాడిది చెప్పుకోవడం అపురూపంగా అనిపిస్తుంది. ధాన్యం తూము రెండు రెండున్నర రూపాయలుండేది. ధనికులైనా కూడా వరి అన్నాన్ని అప్పుడప్పుడు తినడమే.

ఆనాడు మిల్లులు లేకపోవడం వల్ల ఉన్నవాళ్లు సైతం వడ్లు దంచుకొని వండుకు తినడమే. అలా దంచవలసి రావడం వల్ల బియ్యంలో నూకలు ఎక్కువగా వుండడం, బియ్యపు గింజ ఇప్పటిలా తెల్లగా వుండకపోవడం జరిగేది. ఇక కూరగాయల విషయానికి వస్తే రైతులు తమ పొలాల్లో వంకాయ, బెండకాయ, బీరకాయ, గుమ్మడికాయ, కాకరకాయ, తోటకూర, మెంతికూర, బచ్చలి, పాలకూర వంటి కూరగాయలను పండించుకొనేవారు. లేనివారికి

ఉచితంగా ఇచ్చేవారు. ఇప్పుడంటే పండించేవారు అమ్మడం, ఇతరులు ప్రతిదీ కొనడం వుంది. పైగా డబ్బులుంటేనే జీవనం. ఆనాడు పల్లెల్లో వస్తుమార్పిడి విధానంలో వెసులుబాటు వల్ల నిత్యజీవితావసరాలు చాలావరకు డబ్బు అవసరం లేకుండానే తీరేవి.

దివిసీమ ప్రాంతంలోనే కాకుండా కృష్ణాజిల్లాలో ఆ రోజుల్లో పెద్ద రైతులు, చిన్న రైతులు అన్న తేడా లేకుండా కూలీలను పెట్టకుండా ఎవరికి వారే వ్యవసాయ పనులు చేసుకొనేవారు. పురుషులు పూర్తిగా వ్యవసాయం పనుల్లో నిమగ్నమై వుంటే స్త్రీలు ఒకవైపు పురుషులతో పాటే పొలం పనుల్లో పాలుపంచుకుంటూనే ఇంటి పనుల్ని ప్రారంభించి వంటావార్పూ చేసేవారు. రాత్రి తిరిగి రోకళ్లతో ధాన్యాన్ని దంచడం, వండడం, పిన్నలకూ పెద్దలకూ వడ్డించడం, పాత్రలను శుభ్రపరచడం వంటివి పూర్తిచేసి ఆలస్యంగా నిద్రపోయేవారు. పశువుల పేడను పోగుచేసి పిడకలు చేసి చేతులతో గోడలకు కొట్టడమో లేక నేలపై పరవడమో చేసేవారు. ఎండిన తర్వాత ఒకచోట రాశిగా పేర్చేవారు. పాలను వేడి చేసి చల్లార్చి తోడువేసి పెట్టడం, పెరుగును కవ్వంతో చిలికి వెన్న తీయడం, మజ్జిగ వాడుకోవడం, వెన్నకాచి నెయ్యి చేసుకోవడం ఇవన్నీ స్త్రీలు చేసేపనులే. పండగలు పబ్బాలు వచ్చినప్పుడు, ఇంట్లో ప్రసవాలు, బారసాలలు జరిగినప్పుడు, పెళ్లిళ్ల సందర్భాల్లో స్త్రీలు చాలా శ్రమచేయడమే గాక ప్రతీదీ పెద్దలు చూపిన మార్గంలో పద్ధతి ప్రకారం చేసేవారు.

వివాహ పద్ధతులు

అప్పట్లో ప్రజలు సాధ్యమైనంతవరకు సమీప గ్రామాల్లో వున్న బంధువర్గంలోనే పిల్లల్ని ఇవ్వడం, చేసుకోవడం జరిగేది. పెళ్లిళ్లకు కూడా ఇప్పటివలె అందరూ వెళ్లేవారు కారు. వివాహం చేసేవారి బంధువులే హాజరయ్యేవారు. పెళ్లిళ్లు మూడు రోజుల పాటు వేడుకగా జరిగేవి. మొదటిరోజు వరుని బంధువులందరినీ ఉదయం భోజనానికి పిలిచేవారు. సాయంత్రం పెళ్లి కుమార్తె వాళ్ల ఊరికి వెళ్లేందుకు రమ్మని ఆహ్వానించేవారు. మగపెళ్లి వారు బండ్లు కట్టుకొని వధువు గ్రామానికి తరలివెళ్లేవారు. స్త్రీలు ఎక్కువగా వెళ్లేవారు కారు. పెండ్లికి సన్నాయి, బ్యాండు మేళాలతో పాటు ధనవంతులైనవారు భోగం మేళాకి కళావంతుల్ని కూడా ఏర్పాటు చేసేవారు. మొదటిరోజు రాత్రికల్లా వధువు గ్రామానికి చేరుకొని భోజనాలు చేసి అక్కడే విడిచేవారు. తెల్లవారిన తర్వాత ఉదయం పదిగంటల కల్లా రకరకాల పిండివంటలతో భోజనం పెట్టేవారు. సాయంత్రం నాలుగు గంటలకు మళ్లీ అల్పాహారం పెట్టేవారు. దేవాలయం వద్దనో, వరుని వుంచిన విడిది వద్దనో కళావంతులతో నృత్యగానాదులు చేయించేవారు. కళావంతులు ఆనాటి సామాజిక పరిస్థితుల ప్రభావం వల్ల వివాహాలకు నోచుకోక దురాచారానికి బలయ్యేవారు. బ్రిటిష ప్రభుత్వం భోగంమేళాను నిషేధించింది. ఆ రోజుల్లో వరుని పల్లకీలో ఎక్కించి వధువు గ్రామానికి తీసుకెళ్లేవారు. పల్లకీని రంగురంగుల

వస్త్రాలతో అలంకరించేవారు. వధువును కూడా మేనాలోనే వరుని వద్దకు తీసుకొచ్చేవారు. మేనాకు ఇరువైపులా తలుపు తీసి దిగేలా ఉండేది. మేనాను కూడా ఎంతో అందంగా అలంకరించేవారు. పెళ్లి అయ్యాక పురవీధుల్లో నూతన వధూవరులను ఊరేగించేవారు. పెళ్లి ఊరేగింపులో కూడా మలుపు మలుపులో కళావంతుల నృత్యాలుండేవి. నృత్యాలు లేకపోతే బ్యాండు, సన్నాయిమేళం వాయిస్తూ ఊరేగింపు వేడుకగా సాగేది. ఆ మరునాడు ఉదయం వధూవరులు బంధువర్గం వెంటరాగా వరుని గ్రామానికి వెళ్లేవారు. వరుని గ్రామానికి చేరిన తర్వాత అక్కడ కూడా వధూవరులను పల్లకీలో ఊరేగించి వరుని ఇంటికి చేరేవారు. వివాహానికి వచ్చిన గ్రామస్తులందరికీ భోజనాలు పెట్టేవారు. దాంతో పెళ్లి వేడుక ముగిసినట్లు.

ఆనాడు బాల్యవివాహాలు ఎక్కువగానే జరిగేవి. చిన్నప్పుడే పెళ్లిళ్లు చేసినా భార్యాభర్తలను యవ్వనంలో అడుగిడేవరకూ ఒకరినొకరు కలవకుండా చూసేవారు. అమ్మాయిని భర్తకు కనపడకుండా చూసేవారు. తగిన వయసు వచ్చి కార్యం జరిపే వరకూ దూరంగానే వుంచేవారు. బాల్యవివాహాల దురాచారం వల్ల ముఖ్యంగా ఆడపిల్లలు ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ పరిస్థితిని గమనించి 1934లో బ్రిటిషు ప్రభుత్వం బాల్యవివాహాల్ని నిషేధిస్తూ చట్టం చేసింది. అయినప్పటికీ ప్రజల ఆలోచనా విధానంలో మాత్రం పరివర్తన రాలేదు. అమ్మాయి పెద్దమనిషి కాకముందే పెళ్లి చేయకపోతే ఏదో అరిష్టం కలుగుతుందనే పాపభీతితో తల్లడిల్లేవారు. పెళ్లి చేస్తే చట్టప్రకారం శిక్ష పడుతుందని మరో వైపు భయం. ఈ పరిస్థితిలో మచిలీపట్నంలోని ఫ్రెంచిపేట వాళ్లకు ఆశాదీపంగా కనిపించింది. ఫ్రెంచిపేటలో బ్రిటిషువారి చట్టం చెల్లుబాటు కాకపోవడంతో ప్రజలు అక్కడ సామూహిక బాల్యవివాహాలు చేసేవారు. బ్రాహ్మణులు, కమ్మవారు ఒక్కరేమిటి అందరూ ఒక్కసారిగా బందర్లోని ఫ్రెంచిపేటకు వెళ్లి వందల సంఖ్యలో బాల్యవివాహాలు చేసేవారు. ఈ విధంగా ఫ్రెంచిపేట కాస్తా పెళ్లిళ్లపేటగా మారడంతో అన్ని పెళ్లిళ్లకూ బాజాభజంత్రీలు, మేళతాళాలు దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో కొందరైతే గ్రామఫోన్ రికార్డులు పెట్టుకొని రికార్డింగ్ మేళంతో పెళ్లిళ్లు జరిపించారు. 17,18 శతాబ్దాల్లో బ్రిటిషువారు, ఫ్రెంచివారు, హాలెండువారు వ్యాపారం నిమిత్తం బందరు వచ్చి స్థిరపడ్డారు. ఆ విధంగా ఫ్రెంచివారు స్థిరపడిన ప్రాంతానికి ఫ్రెంచిపేట, హాలెండువారు స్థిరపడిన ప్రాంతానికి వలందపాలెం ఇలా ఏర్పడ్డాయి. వలందపాలేన్ని బ్రిటిషువారు ఆక్రమించు కొన్నారు. ఫ్రెంచిపేట మాత్రం స్వాతంత్ర్యం వచ్చేవరకూ ఫ్రెంచివారి ఆధీనంలోనే ఉండేది. బందరులో ఇప్పటికీ వలందపాలెం, ఫ్రెంచ్‌పేట వున్నాయి.

కుటుంబరావు విద్యాభ్యాసం

1923వ సంవత్సరంలో కుటుంబరావును మోపిదేవి గ్రామంలోని ఎలిమెంటరీ స్కూల్లో చేర్పించారు. కుటుంబరావు తండ్రి కావూరి శివరామయ్య ఆర్థిక పరిస్థితి అప్పుడేమంత బాగా లేదు. లోయర్ గ్రేడ్ ట్రయినింగ్ చదివి ఉపాధ్యాయునిగా పనిచేయాలని శివరామయ్య

నిర్ణయించుకొన్నారు. బందరు ట్రైనింగ్ స్కూలుకు వెళ్లారు. అప్పటికి ఆయన వయస్సు 38 సంవత్సరాలు. అన్న కావూరి కోదండరామయ్య రాజకీయంగా పైస్థాయిలో వున్నారు. కృష్ణాజిల్లా బోర్డు ఉపాధ్యక్షునిగా వుండి బందరులోని గొడుగుపేటలో అద్దెకు తీసుకున్న మేడలో నివాసముండేవారు. కోదండరామయ్య, శివరామయ్య, వెంకటకృష్ణ సోదరులు ఖద్దరు ధరించి పైనుంచి నల్లని పొడవాటి కోటు వేసుకొని తలపాగాలు చుట్టుకునేవారు. తొమ్మిది అంగుళాల వెడల్పు, ఎనిమిది గజాల పొడవు ఉండేదది. దాన్ని ఆ రోజుల్లో ముట్నూరి కృష్ణారావు తలగుడ్డ అనేవారు. శివరామయ్య అదే వేషంతో ట్రైనింగ్ స్కూలుకు వెళ్లగా ఎవరో పెద్ద మనిషి వచ్చాడని భావించిన హెడ్మాష్టరు కుర్చీలోంచి లేచి నమస్కరించి కూర్చోమని ఆహ్వానించారు. శివరామయ్య కుర్చీలో కూర్చోకుండా ఆయనకు నమస్కారంచేసి తనకు ట్రైనింగ్ సీటు వచ్చిందనీ, చేరడానికి వచ్చానని చెప్పారు. అసలు విషయం తెలుసుకున్న హెడ్మాష్టరు తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో నేను చేర్చుకోను వెళ్లు అన్నారు. ఏమీ మాట్లాడని శివరామయ్య వెనక్కి తిరిగి గొడుగుపేటకు వచ్చి అన్నగారైన కోదండరామయ్యకు జరిగిందంతా చెప్పారు. అదివిన్న కోదండరామయ్య జిల్లా విద్యాశాఖాధికారి (డి.ఇ.ఓ.)కి ఫోన్ చేసి హెడ్మాష్టరు శివరామయ్యను చేర్చుకోనన్న విషయం చెప్పారు. దానికి డి.ఇ.ఓ. హెడ్మాష్టరును ఏమన్నారో తెలీదు గానీ హెడ్మాష్టరు మరునాడు ఉదయమే కోదండరామయ్య బంగళాకు వచ్చి జరిగిందంతా మరచిపొమ్మని చెప్పి శివరామయ్యను స్కూలుకు తీసుకెళ్లారు. ఆ రోజుల్లో లోయర్ గ్రేడ్ ట్రైనింగ్ స్కూలు టీచర్లు కూడా గొప్పవారై వుండేవారు. తెలుగు సాహిత్యంలో తనదైన స్థానాన్ని పొందిన గుడిపాటి వెంకటచలం, మంచి శాస్త్రవేత్త అయ్యగారి రామమూర్తి వంటివారు ఆనాడు ఉపాధ్యాయులుగా వుండేవారు. అయ్యవారి రామమూర్తి తొలుత నేషనల్ సైంటిఫిక్ కంపెనీని స్థాపించారు. అది తర్వాత కాలంలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బి.ఇ.ఎల్.)గా ఎదిగింది. ఇప్పుడది కేంద్ర ప్రభుత్వ రంగసంస్థగా వుంది.

కావూరి కుటుంబరావును స్వగ్రామం రావివారిపాలెంలో ఇంటి ముందు బంగళాలో వున్న స్కూల్లో చిరువోలు కుటుంబరావు అనే ఉపాధ్యాయుని వద్ద చేర్చారు. ఉపాధ్యాయుడు పిల్లలకు శిక్షణ ఇవ్వడంలో అటుంచి శిక్షించడంలో పేరు పొందారు. ఆయన శిక్షకు భయపడి కుటుంబరావు ఇతర విద్యార్థులు బడికి సరిగా వెళ్లేవారు కారు. స్కూలును ఆనుకొని ఒక గదిలో పెద్ద గ్రంథాలయం వుండేది. కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక, హిందూ, మెయిల్, భారతివంటి పత్రికల్ని తెప్పించేవారు. కృష్ణాపత్రిక ప్రతులను ఉపాధ్యాయుడు ప్రతి మూడు నెలలకొకసారి బైండ్ చేయిస్తుండేవారు. ఇదిలావుండగా మీ అబ్బాయి బడికి సరిగా రావడం లేదని ఆయన కటుంబరావు తండ్రిగారైన శివరామయ్యకు ఫిర్యాదు చేశాడు. దాంతో కుటుంబరావును తండ్రి బందరు తీసుకెళ్లిపోయారు.

కుటుంబరావు చదువు బందరుకు మారింది. ఆ రోజుల్లో కమ్మవారు తమ పిల్లల్ని

చదివించే ప్రయత్నాల్లో పడ్డారు. బందరులోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న కమ్మవారి పిల్లల కోసం ఒక హాస్టలు ప్రారంభించి భోజనం వండిపెట్టే ఏర్పాట్లు జరిగాయి. దానికి శివరామయ్య సహకారం ఎంతో వుంది. బందరులో చల్లపల్లి జమీందారు అల్లుడైన కొమ్మారెడ్డి పట్టాభిరామయ్య అధ్యక్షునిగా, కావూరి శివరామయ్య కార్యదర్శిగా కమ్మ సంఘం ఏర్పడింది. ట్రెనింగ్ స్కూలు ఉపాధ్యాయునిగా వున్న చలం వద్ద చదువుకునేవారు. చలంగారు తన ట్రెనింగ్ క్లాసులు అయ్యాక కుటుంబరావును సైకిల్ మీద కూర్చుండ బెట్టుకొని వాళ్ల ఇంటికి తీసుకెళ్లేవారు. ఇంటి వద్ద చదువు చెప్పేవారు.

1926 మార్చినాటికి శివరామయ్య ట్రెనింగ్ చదువు పూర్తయ్యింది. పరీక్షా ఫలితాలు వచ్చాయి. రావివారిపాలెం గ్రామానికి నాలుగు మైళ్ల దూరంలో వున్న పెద్దకళ్లేపల్లి లోని ప్రాథమిక పాఠశాలలో శివరామయ్యను ఉపాధ్యాయునిగా నియమిస్తూ బందరు తాలూకా బోర్డు ఆర్డర్స్ ఇచ్చింది. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలను తాలూకా బోర్డు అధ్యక్షులే చేసేవారు.

అప్పట్లో దివి, బందరు తాలూకాలకు కలిపి ఒకే తాలూకా బోర్డు ఉండేది. రోజూ ఉదయం ఆరు గంటలకే శివరామయ్య కొడుకు కుటుంబరావును, తన వద్ద చదువుకునేందుకు వచ్చిన లక్ష్మీనారాయణను వెంటబెట్టుకొని మధ్యాహ్న భోజనం చద్ది కట్టుకొని మెరకనపల్లి, టేకుపల్లి (ఘంటసాల వెంకటేశ్వరరావు గ్రామం)ల మీదుగా పెదకళ్లేపల్లి నడచివేళ్లేవారు. అప్పుడు గ్రామాల మధ్య రోడ్లు, వాహనాలు లేవు. పెదకళ్లేపల్లిలో బ్రాహ్మణులు, కాపులు వుండేవారు. బ్రాహ్మణుల్లో వేటూరి, సుసర్ల, శిష్ట్లా, బుద్దు, అడవి, దర్భ, కొడాలి మొదలైన ఇంటి పేర్లతో వుండేవారు. వారిలో గొప్ప పండితులు, కవులు, రచయితలు, నటులు వుండేవారు. తెలుగు భాషా సాహిత్యరంగంలో ఉన్నత శిఖరమైన వేటూరి ప్రభాకరశాస్త్రి, సంగీత విద్వాంసులు సుసర్ల దక్షిణామూర్తి, హంపీ క్షేత్ర కవి కొడాలి సుబ్బారావు, ఆదర్శ ఉపాధ్యాయునిగా అందరి అభిమానానికి పాత్రుడైన బుద్దు కుటుంబరావు, సినీగేయ రచయిత వేటూరి సుందరరామమూర్తి వంటి పెద్దలు పెదకళ్లేపల్లి వారే.

అక్కడ ఒక ఏడాది పనిచేసిన తర్వాత కావూరి శివరామయ్యను మోపిదేవికి బదిలీ చేశారు. మోపిదేవి పాఠశాలలో పగటిపూట పాఠాలే గాక రాత్రి బడి కూడా నడిపేవారు. అక్కడ బుద్దు కుటుంబరావు అనే ఉపాధ్యాయుడు కావూరి కుటుంబరావుకు చెప్పిన పాఠాల ఎప్పటికీ మరిచిపోలేనివి. ఆ రోజుల్లో పిల్లల్ని దండించనివారు ఉపాధ్యాయులే కారు అన్నట్లు ఉండేది. కాని బుద్దు కుటుంబరావు అలా కాదు. ఆయన పిల్లలను కోప్పడడం, కొట్టటం చేసేవారు కాదు. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ విద్యార్థుల్లో జిజ్ఞాస పెంపొందిస్తూ చదువు చెప్పేవారు. వేమన శతకం, సుమతీశతకం ఒకటికి రెండుసార్లు పద్యాలకు ప్రతి పదార్థం, భావం వివరించి చెప్పేవారు. దానితో పిల్లలు ఎంతో ఉత్సాహంగా అన్నీ కంఠతా పట్టి

ఎప్పుడు అడిగినా వల్లెవేసేవారు. 1930లో ఆయనను బందరు రాంజీరావు హైస్కూలు హెడ్మాష్టరుగా బదిలీ చేశారు. ఆయన వద్ద చదువుకున్నవారంతా ఉన్నత స్థానాలను అధిరోహించారు. 'కరుణశ్రీ' జంధ్యాల పాపయ్యశాస్త్రి అలాంటి వారిలో ఒకరు. పాపయ్య శాస్త్రి బాపట్ల తాలూకావారయినా మోపిదేవి వచ్చి వారి బంధువైన సకలేశ్వర దేవస్థానంలో పూజారి అప్పట్లో ప్రముఖ ఆయుర్వేద వైద్యునిగా పేరు పొందిన చేబ్రోలు వెంకటసుబ్బయ్య ఇంట్లో వుండి చదువుకున్నారు.

1929 ఏప్రిల్ 19వ తేదీన గాంధీజీ దివి తాలూకా పర్యటనకు వచ్చారు. అప్పుడు యువకుడైన వల్లభనేని రామబ్రహ్మం తన స్వంతకారులో గాంధీజీని ఆ ప్రాంతానికి తీసుకొచ్చాడు. ఆ పర్యటనలో కావూరి కోదండరామయ్య నాయకత్వంలో 116 రూపాయలను విరాళంగా అందజేశారు. అప్పటికి కృష్ణానదిపై వంతెన లేదు. నాగాయితిప్ప నుంచి నాలుగు జతల ఎడ్లు కట్టి గాంధీజీ ఎక్కిన కారును నదిలో తీసుకు వెళ్లి కొత్తపేట వద్ద ఒడ్డుకు చేర్చారు. అక్కడ్నుంచి గాంధీజీ దివిసీమలో పర్యటించారు.

గాడ్ సేవ్ ది కింగ్ పాడనన్న కుటుంబరావు

బుద్ధు కుటుంబరావును రాంజీరావు హైస్కూలు నుంచి బదిలీ చేశాక పింగళి వెంకట లక్ష్మీనరసింహారావును హెడ్మాష్టరుగా నియమించారు. ఆయన జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య బంధువు. కుటుంబరావుకు నరసింహారావు ఆంగ్లం కూడా బోధించారు. 1931లో చల్లపల్లిలో ఉన్నత పాఠశాలకు శంకుస్థాపన చేసేందుకు జమీందారు యార్లగడ్డ శివరామప్రసాదు ఆనాటి విద్యాశాఖ డైరెక్టర్ ఆంగ్లేయుడైన ఆర్.ఎం. స్ట్రాథమ్‌ను ఆహ్వానించారు. ఆ సంగతి తెలిసి తమ పాఠశాలకు కూడా డైరెక్టర్‌ను తీసుకు వచ్చేందుకు హెడ్మాష్టర్ నర్సింహారావు జిల్లా విద్యాధికారిని ఒప్పించారు. డైరెక్టర్ పాఠశాలను సందర్శించినప్పుడు ఆయన ముందు 'గాడ్ సేవ్ ది కింగ్', 'గాడ్ సేవ్ ది క్వీన్' అని పిల్లలంతా పాడాలి. పిల్లలకు ఈ పాట నేర్పించడం మొదలుపెట్టారు. బ్రిటిష్ చక్రవర్తి 5వ జార్జి, ఆయన భార్యను దేవుడు చల్లగా చూడాలని ప్రార్థించే పాట అది. ఇంట్లో బ్రిటిషు వ్యతిరేకత, జాతీయ భావాలు కలిగిన వాతావరణం, తండ్రులు కాంగ్రెస్‌వాదులు కావడం వల్ల విద్యార్థి అయిన కుటుంబరావు తాను ఆ పాట పాడనని తేల్చి చెప్పాడు. 'వందేమాతరం' అయితే పాడుతానని అన్నాడు. హెడ్మాష్టరు చేసేదేమీ లేక నువ్వు ఏ పాటా పాడకుండా నిలబడమని, లేకుంటే స్కూలుకు రావద్దని చెప్పాడు. మొత్తం మీద స్ట్రాథమ్ స్కూలుకు రావడం, వెళ్లడం జరిగింది.

తర్వాత కొన్నాళ్లకు నరసింహారావు బదిలీ కావడం, ఆ స్థానంలో కాజ సుబ్రహ్మణ్యం హెడ్మాష్టరుగా రావడం జరిగింది. 1930 మార్చి నెలలో గాంధీజీ నాయకత్వాన ఉప్పు

సత్యాగ్రహం ప్రారంభమైంది. అన్న సోమశేఖర ప్రసాద్‌తో కలిసి కావూరి కుటుంబరావు, మరికొందరు విద్యార్థులు రావివారిపాలేనికి 18 మైళ్ల దూరాన ఉన్న చిన్నాపురం సమీపంలో సముద్ర తీరానికి వెళ్లి ఉప్పు తయారు చేయడమే కాదు మోపిదేవి తీసుకొచ్చారు. మరునాడు మధ్యాహ్నం మువ్వన్నెల జెండా చేతబూని మరో చేత ఉప్పు పంచిపెడుతూ కుటుంబరావు ఊరేగింపులో పాల్గొన్నాడు. బ్రిటిష్ ప్రభుత్వం గోబ్యాక్, ఉప్పు మీద పన్ను రద్దు చేయాలి, మహాత్మాగాంధీకి జై అని ఆవేశంగా నినాదాలు చేస్తూ రావివారిపాలెం, మోపిదేవి మొదలైన గ్రామాల్లో ఊరేగింపు జరిపి చివర్న మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం ముందున్న అశోక వృక్షానికి త్రివర్ణ పతకాన్ని కట్టే బాధ్యత సోమశేఖర ప్రసాదుకు అప్పగించారు. ఆయన కట్టాడు. ఆ రోజుల్లో త్రివర్ణ పతాకను పట్టుకోవడం, ఉప్పు తయారు చేయడం, రాట్నంపై నూలు వడకడం పెద్ద నేరం. పోలీసులు తీవ్రంగా శిక్షించేవారు. కుటుంబరావు ప్రభృతులు ఉప్పు తయారు చేసి పంచడం, త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తూ ఊరేగించడం తెలిసిన ఉపాధ్యాయుడు పోలీసులు వచ్చి పిల్లల్ని ఎక్కడ శిక్షిస్తారోనని భయపడ్డారు. గ్రామ మునసబు రావి రామకృష్ణయ్య పోలీసులకు ఈ విషయం చెప్పినప్పటికీ జెండాను చెట్టుకు కట్టిందెవరో తనకు తెలియదని చెప్పడంతో శిక్షలు తప్పాయి. పోలీసులు జెండాను తీసుకెళ్లిపోయారు.

భగత్‌సింగ్ ఉరికంబం ఎక్కడం... కలవరపాటు

1931 మార్చిలో విప్లవకారులైన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లకు ఉరిశిక్ష పడిన వార్త కుటుంబరావుకు, అతని సహచరులను కలవరపాటుకు గురి చేసింది. కుటుంబరావుకు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లే కాకుండా చంద్రశేఖర ఆజాద్, పృథ్వీసింగ్ ఆజాద్, విజయకుమార్ సింహ మొదలైన ఇతర విప్లవకారులన్నా ఎంతో గౌరవాభిమానాలున్నాయి. గాంధీజీకి బ్రిటిష్ వైస్రాయ్ ఇర్విన్‌ల మధ్య రాజీ రాయబారాల్లో భగత్‌సింగ్ ఆయన సహచరులకు విధించిన ఉరిశిక్షను రద్దు చేయాలని గాంధీజీ షరతు పెట్టకపోవడం కుటుంబరావును బాధించింది. భగత్‌సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం సంతోషంగా ఉరికంబమెక్కడం ఎంతో ఉత్తేజాన్ని కలిగించింది.

1932లో మోపిదేవి హయ్యర్ ఎలిమెంటరీ స్కూల్లో కుటుంబరావు 8వ తరగతి పాసయ్యాడు. వరసకు సోదరుడైన చినరామకృష్ణయ్య కూడా ఎనిమిది పాసయ్యాడు. నిజానికి రామకృష్ణయ్య కుటుంబరావు కంటే రెండేళ్లు పెద్ద. అయితే తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో తల్లి రామానుజమ్మ కొంత కాలం రేపల్లె తాలూకా సింగుపాలెంలో పుట్టినింట్లో వుండడంతో రామకృష్ణయ్య ఆలస్యంగా బడిలో చేరాడు.

ఆ రోజుల్లోనూ ఉపాధ్యాయులు కావాలంటే శిక్షణ పొందవలసి వుండేది. అయితే

ఉపాధ్యాయ శిక్షణలో చేరడానికి ముందు ఏడాది కాలం గ్రాంటు స్కూల్లో పనిచేయవలసి వుండేది. ఆ రోజుల్లో ప్రాథమిక పాఠశాలలు రెండు విధాలుగా వుండేవి. కొన్ని తాలూకా బోర్డు పరిధిలో వుండేవి. కొన్ని గ్రాంటు స్కూళ్లుగా వుండేవి. ఇవి లెజిస్లేటివ్ కౌన్సిల్ పరిధిలో వుండేవి. తాలూకాబోర్డు పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు నెలవారీ వేతనాలు ఇచ్చేవారు. గ్రాంటు స్కూళ్ల వారికి ఏడాదికోసారి గ్రాంటు రూపంలో విడుదల చేసేవారు. ఆ పరిధిలోని స్కూళ్ల ఇన్‌స్పెక్టర్ ఆయా పాఠశాలలను తనిఖీ చేసి ఉపాధ్యాయుల పనితీరు సంతృప్తికరంగా వుందని నివేదిక ఇస్తే కౌన్సిల్ నుంచి 100కు 30 శాతం ఇంక్రిమెంటు ఇచ్చేవారు. పనితీరు బాగాలేదని ఇన్‌స్పెక్టర్ నివేదిక ఇస్తే 30 శాతం కోత విధించేవారు. 8వ తరగతి చదివినవారు హయ్యర్‌గ్రేడ్ ట్రైనింగ్‌లో చేరేందుకు అర్హులయ్యే వారు. శిక్షణకు వెళ్లడానికి ముందు ఏడాదిపాటు గ్రాంటు స్కూల్లో పనిచేయవలసి వచ్చేది. పనిచేసిన తర్వాత అప్పుడు ట్రైనింగ్‌కు దరఖాస్తు చేసుకోవలసి వచ్చేది. శిక్షణ కోర్సు రెండేళ్లు. ఆ కాలంలో ప్రభుత్వం నెలకు 7 రూపాయల స్టయిఫండ్ ఇచ్చేది. ఆ విధంగా కుటుంబరావు సోదరుడైన చినరామకృష్ణయ్య ట్రైనింగ్ పూర్తి చేసి తాలూకా బోర్డు స్కూల్లో ఉపాధ్యాయునిగా చేరాడు.

రావివారిపాలెంలో కుటుంబరావు ఇంటి ముందు బంగళాలోనే ఒక గ్రాంటు స్కూలు నడిచేది. దానికి కుటుంబరావు పెదనాన్న కావూరి కోదండరామయ్య మేనేజర్‌గా వుండేవారు. ఆ స్కూల్లో ట్రైనింగ్‌కు ముందు చినరామకృష్ణయ్య ఏడాది పనిచేసి వెళ్లిన స్థానంలో కుటుంబరావు ఉపాధ్యాయునిగా చేరాడు. గ్రాంటు స్కూల్లో ఏడాది పనిచేస్తే చాలు ట్రైనింగ్ కోర్సులో సీటు రావాలి. కాని కుటుంబరావుకు రెండేళ్లు పనిచేసినా సీటు రాలేదు. ఆ విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ గ్రాంటు స్కూల్లో మూడో సంవత్సరం కృపానందం అనే స్కూళ్ల ఇన్‌స్పెక్టర్ తనిఖీకి వచ్చాడు. తనిఖీ ముగిసింది. హెడ్మాష్టర్ ములుకుట్ల నారాయణమూర్తి సమీపంలోని వాళ్లూరు వెంకటాపురానికి భోజనానికి వెళ్లిపోయాడు. ఇన్‌స్పెక్టర్ భోజన బాధ్యత చూడవలసింది కావూరి కుటుంబరావు. ఇన్‌స్పెక్టర్ భోజనానికి కూర్చున్నాడు. తన జవాను సుబ్బయ్యను కాదని కుటుంబరావునే భోజనం వడ్డించమన్నాడు. ఏమేం తెచ్చారని అడిగాడు. పప్పు, వంకాయ పులుసు, బెండకాయ ఇగురు, మెంతి మజ్జిగ, ఇవే గాక చికెను కూర కూడా తెచ్చానని చెప్పాడు. అందుకు ఇన్‌స్పెక్టర్ సంతోషించి ఆ (చికెన్) కూర వడ్డించమన్నాడు. కుటుంబరావు వడ్డించాడు. ఎంతకూ ముక్క నలగలేదు. ఇమిటిలా వుంది అని ఇన్‌స్పెక్టర్ అడిగాడు. దానికి కుటుంబరావు 'మా ఇంట్లో శాకాహారమే చేస్తారు. పక్కింటివారు మాంసాహారం బాగా చేస్తారని వారికి డబ్బిచ్చి లేతకోడిని బాగా వండి ఇవ్వమని చెప్పానన్నాడు. కృపానందం కోపంతో లేచి చేతులు కడుక్కొని కోడిమాంసమేదో ఎండు మాంసమేదో నాకు తెలియదనుకున్నావా అని చురచురలాడుతూ జవానును తీసుకొని అవనిగడ్డ వెళ్లిపోయాడు. నిజానికి ఆ వూరి హోటల్లోంచి తెప్పించిన

చీకులకూరను ఇన్స్‌పెక్టర్‌కు వడ్డించడం జరిగింది. మేకమాంసాన్ని ముక్కలుగా కోసి ఎండబెట్టి తర్వాత వాటిని నీళ్లలో నానబెట్టి వండుతారు. వాటినే చీకులంటారు. మధ్యాహ్నం హెడ్మాస్టర్ స్కూలుకు వచ్చి ఇన్స్‌పెక్టర్ ఏడి అని అడిగాడు. జరిగిన సంగతి అంతా చెప్పకుండా రిమార్కుల పుస్తకాన్ని తీసుకొని అవనిగడ్డకు వెళ్లిపోయాడని మాత్రం కుటుంబరావు చెప్పాడు.

తర్వాత ఒకనాడు పెద్దనాన్న కోదండరామయ్య కుటుంబరావును పిలిచి "ఆ స్కూళ్ల ఇన్స్‌పెక్టర్ని అవమానించావట. మన స్కూలుకు 30 శాతం గ్రాంటు కోత వేయాలని కౌన్సిల్‌కు రిపోర్టు పంపాడట. రిపోర్టు చూసిన కౌన్సిల్ ఛైర్మన్ అడుసుమిల్లి హరినీడు మన స్కూలుకు 30 శాతం ఇంక్రిమెంటు పంపించారు. దానికి ఇన్స్‌పెక్టర్ ఛైర్మన్ దగ్గరికి వెళ్లి నీవు తనను అవమానపరిచిన సంగతి చెప్పుకొన్నాడట. మరిలా రిపోర్టుకు వ్యతిరేకంగా గ్రాంటు ఇస్తే మేం ఉద్యోగాలెలా చెయ్యాలి అన్నాడట. నీకు ఉద్యోగం చెయ్యాలని లేదా" అని మందలింపు ధోరణిలో అన్నారు. దానికి కుటుంబరావు మారు మాట్లాడలేదు.

అప్పటికే రెండేళ్లుగా కుటుంబరావుకు ట్రయినింగ్ సీటు రాలేదు. ఒక రోజు బందరు వెళ్లి డిఇఓ ఆఫీసులో వున్నయ్య అనే గుమస్తాను కలిసి ట్రైనింగ్ సీటు సంగతి అడిగాడు. మరునాడు తన ఇంటికి రమ్మని చెప్పాడాయన. ఆ ప్రకారం మరునాడు వెళ్లగా నీ రికార్డు చూశానని, గ్రాంటు స్కూలు మేనేజర్ ట్రైనింగ్ అనంతరం ఉద్యోగం ఇస్తానని రాయాల్సి వుండగా ఇవిల్ ప్రొవైడ్ హిమ్ ఎ పోస్ట్ ఆఫ్టర్ కంప్లిషన్ ఆఫ్ ది ట్రైనింగ్ ఇఫ్ దేర్ ఇస్ ఎనీ వేకెన్సీ అని రాయడం వల్ల నీకు ట్రైనింగ్ సీటు రాలేదు అని చెప్పాడు. దాంతో కుటుంబరావుకు పెదనాన్నపై కోపం వచ్చి తండ్రికి కూడా చెప్పకుండా స్కూలు మానివేశాడు. అంతటితో విద్యారంగంతో ముడిపడాల్సిన భవిష్యత్తు వేరే వైపు మళ్లింది.

1933 డిసెంబర్ 17న గాంధీజీ చల్లపల్లి వచ్చారు. జమీందారు హైస్కూలు (ఈనాటి జూనియర్ కళాశాల)లో రాత్రి 8 గంటలకు బహిరంగ సభలో ఉపన్యసించారు. హరిజన నిధి కోసం విరాళాలివ్వాలని గాంధీజీ ఆ సభలో అందర్నీ కోరారు. ఆయన పిలుపుకు స్పందించి చల్లపల్లి గ్రామస్తులు 150 రూపాయలు, ఘంటసాల గ్రామస్తులు 116, పురిటిగడ్డవారు 116, నాగాయితిప్పవారు 27 రూపాయల 30 పైసలు, తాడేపల్లి వారు 20, నరసంపాలెం వారు 20, పెదప్రోలువారు 10, కాజవారు 16, దాలిపర్రు వారు 15, ఇతర వసూళ్లు 400 రూపాయలు, వస్త్రాల విలువ 50 రూపాయలు వచ్చాయి. నాదెళ్ల రంగనాయకమ్మ 12.04 అణాలు, కాపూరి కోదండరామయ్య వెండి గొలుసుతో ఉన్న జేబు గడియారం ఇచ్చారు. కొర్రపాటి వెంకట శివరామకృష్ణ ప్రసాద్ హరిజనుల కోసం అర ఎకరం స్థలం ఇచ్చాడు. ఆయన సోదరి భ్రమరాంబ బంగారు గాజుల జత ఇచ్చింది. అలాగే దేవభక్తుని బసవనాగమ్మ, కొర్రపాటి లక్ష్మమ్మ, నాదెళ్ల భాస్కర హృదయాలయ

గారలు బంగారు గాజుల జత, గుత్తికొండ అచ్చయ్య, చంద్ర శ్రీనివాస రావు, కిలారి వెంకట త్రిపురాంబ, కొర్రపాటి రాజారామ్మోహనరావు, చంద్ర దుర్గా అన్నపూర్ణమ్మ బంగారు ఉంగరాలు ఇచ్చారు.

వెంకటసుబ్బయ్య సేవలు

మోపిదేవి గ్రామంలో కుటుంబరావు వెంకటసుబ్బయ్య అనే ఆయుర్వేద వైద్యుని అనుచరునిగా చేరాడు. చేబ్రోలు వెంకటసుబ్బయ్య మోపిదేవిలోని సకలేశ్వరస్వామి దేవాలయంలో పూజారిగా వుంటూనే చుట్టుపక్కల గ్రామాల్లో సైకిల్‌పై తిరుగుతూ ప్రజలకు ఉచితంగా వైద్యసేవలందించేవారు. నాలుగేళ్లకోసారి శ్రీశైలం వెళ్లి మూడు నాలుగు నెలలు అక్కడ వుండి వేర్లు, దుంపలు, ఆకులు మొదలైన వనమూలికలను సమీకరించుకొని వచ్చేవారు. కుటుంబరావు వంటి యువకుల సహాయంతో ఆ వనమూలికలతో రకరకాల మందులు భస్మాలు, బిళ్లలు, లేపనాలు తయారు చేసేవారు. 1918 సంవత్సరంలో మొదటి ప్రపంచయుద్ధం ముగిసింది. అంతకు ముందు ఎప్పుడూ లేని విషజ్వరాలు విజృంభించి ఎక్కువగా యువకులను బలి తీసుకొంటున్నది. ఆ పరిస్థితుల్లో వెంకటసుబ్బయ్య తన వైద్యంతో చాలామందిని బతికించగలిగారు. పూజారిగా కంటే ప్రాణాలు రక్షంచే దేవునిగా గ్రామస్తులు ఆయనను గౌరవించేవారు. ఆయన కొంతమంది పేద బ్రాహ్మణ బాలురను చేరదీసి ఇంట్లోనే భోజనం పెట్టి చదివించేవారు. ఆయన ఔదార్యంతో చదువుకొని పెరిగి ఉన్నత స్థితికి వచ్చినవారిలో కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి ఒకరు. అందుకు కృతజ్ఞతగా కరుణశ్రీ వెంకటసుబ్బయ్యకు ఒక పుస్తకాన్ని అంకితం చేశారు.

చేబ్రోలు వెంకటసుబ్బయ్య, కుటుంబరావు తండ్రి కావూరి శివరామయ్య మంచి స్నేహితులు. కుటుంబరావు స్కూల్లో మానివేసిన విషయం తెలుసుకున్న వెంకటసుబ్బయ్య తనకు చేదోడు వాదోడుగా వుండమని అడిగారు. వైద్యం చేయడం నేర్పుతాననీ, సమాజ సేవ చేసి గుర్తింపు తెచ్చుకోమని అన్నారు.

కుటుంబరావు అందుకు అంగీకరించాడు. వెంకటసుబ్బయ్య వద్ద వైద్యం నేర్చుకోవడమే గాక చరకము, శుశ్రుతము మొదలైన ఆయుర్వేద గ్రంథాలను పఠించాడు. వైద్యం చేయడం మొదలుపెట్టాడు. ఆ రోజుల్లో ఆ ప్రాంతంలో వైద్యులు వుండేవారు కాదు. కుటుంబరావును వెంటబెట్టుకొని రోగుల ఇళ్లకు వెళ్లి వారిని పరీక్షించి రోగ వివరాలను గురించి మాట్లాడి ఇవ్వవలసిన మందులు, పత్యాల గురించి వివరించేవారు. అలా కుటుంబరావు వైద్యం మొదలు పెట్టిన తొలిరోజుల్లో ఒక సంఘటన జరిగింది. ఒక హరిజన యువకునికి జ్వరం వచ్చింది. కుటుంబరావే వెళ్లి థర్మామీటరుతో జ్వర తీవ్రత చూసేవాడు. ఉదయం 99 డిగ్రీలు, రాత్రి 104 డిగ్రీలు జ్వరం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ విషయం వెంకటసుబ్బయ్యకు

చెప్పాడు. ఆ యువకుణ్ని చూడడానికి కుటుంబరావు వెంట వెంకటసుబ్బయ్య కూడా వచ్చారు. ఆ రోజుల్లో విద్యుద్దీపాలు లేవు. ఒక బుడ్డిలో కిరోసిన్ పోసి గుడ్డపీలికతో వత్తి చేసి దీపం వెలిగించేవారు. ఆ దీపాన్ని దగ్గరగా పట్టుకొని థర్మామీటరుతో జ్వరం ఎంత వుందా అని చూడడం మొదలుపెట్టాడు కుటుంబరావు. రాత్రిపూట జ్వరతీవ్రత ఎక్కువ వుండడానికి కారణం ఇప్పుడు తెలిసింది వెంకట సుబ్బయ్యకు. కుటుంబరావును బయటకు తీసుకెళ్లి నవ్వుతూ థర్మామీటరును దీపానికి దగ్గరగా పెట్టి చూస్తే అది వేడెక్కి ఎక్కువ చూపిస్తుంది కదా! అని చెప్పారు. ఈసారి దీపం దూరంగా పెట్టి జ్వరం చూశాడు. ఉదయంలాగే నార్మల్‌గా వుంది. అప్పటి నుంచి ప్రతిదీ జాగ్రత్తగా చేసేవాడు.

అలా కొంతకాలంలోనే కుటుంబరావు వైద్యం నేర్చుకున్నాడు. తర్వాత దివిసీమలో విశ్వనాథపల్లి (కొత్తపాలెం) కేంద్రంగా వైద్యం మొదలుపెట్టమని వెంకటసుబ్బయ్య కోరారు. అంతేకాదు కుటుంబరావును కొత్తపాలెం తీసుకువెళ్లి గ్రామ మునసబు నాగయ్య డాబాలో ముందు గదిలో మందుల బీరువా వుంచి అక్కడే వుంటూ వైద్యం కొనసాగించమని పురమాయించారు. అక్కడికి సమీపంలోని రామచంద్రాపురంలో వెంకటసుబ్బయ్య అన్నగారు లక్ష్మీనారాయణ దేవాలయ పూజారిగా వుండేవారు. కుటుంబరావుకు వాళ్లింట్లో రెండు పూటలా భోజనం పెట్టేవారు. అక్కడ భోంచేసి సైకిల్‌పై మోదుమూడి, విశ్వనాథపల్లి, కొత్తపాలెం మొదలైన గ్రామాల్లో తిరుగుతూ అందరికీ వైద్యం చేస్తూ మంచిపేరు తెచ్చుకొన్నాడు. అంతలో ఒక సంఘటన జరిగింది.

మోదుమూడిలో ఒక రైతుకు టైఫాయిడ్ వచ్చింది. కుటుంబరావు ఆ వ్యక్తికి 15 రోజుల పాటు వైద్యం చేశాడు. ఎంతకూ తగ్గకపోవడంతో గ్రామంలోని పెద్దలు కూర్చొని చర్చించి అతనికి కొద్దికొద్దిగా విషం ఇద్దామా అని కుటుంబరావును అడిగారు. తాచుపాము విషాన్ని ఎండబెట్టి సన్నని పలుకులుగా చేసి ఆ రోజుల్లో జ్వరానికి ప్రయోగించేవారు. కుటుంబరావు ఏ విషయం మరునాడు చెబుతానన్నాడు. వెళ్లి వెంకటసుబ్బయ్యకు ఈ విషయం చెప్పాడు. రెండోనాడు ఇరువురూ మోదుముడి వెళ్లి రోగిని పరీక్షించాక వెంకటసుబ్బయ్య అతనికి వేరే మందులివ్వడం, నెమ్మదిగా జ్వరం తగ్గి కోలుకోవడం జరిగింది.

1908 సంవత్సరంలో దివిసీమలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. దీనివల్ల పులిగడ్డ వద్ద కృష్ణానదిపై 500 హార్స్‌పవర్ కలిగిన ఐదు ఇంజన్లు పెట్టి మాగాణి భూములకు నీరందించాలని బ్రిటిషు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాని నవంబర్‌లో మాగాణి పంట చివరి రోజుల నాటికి సముద్రంలోని ఉప్పునీరు పులిగడ్డ వరకు వచ్చేది. ఆ నీరు పంటకు పెడితే మాగాణి చవుటబారి పంటలు పండకపోవడం జరిగేది. దీన్ని నివారించడానికి బ్రిటిష్ ప్రభుత్వం విజయవాడ బ్యారేజీ నుంచి బందరు వెళ్లే కాలువకు ఎనమలకుదురు వద్ద లాకులను

ఏర్పరచి కృష్ణానదికి తూర్పున ఉన్న ఏటికట్ట పక్కగా శ్రీకాకుళం, మోపిదేవి గ్రామాల నుంచి పులిగడ్డ కాలువకు సాగునీటిని అందించడం మొదలు పెట్టారు. దీంతో ఆ కాలువను కరవు కాలువ అని పిలువడం ప్రారంభించారు. ఆ కాలువనీటిని పులిగడ్డ వద్ద కాలువలో కలపడానికి కృష్ణానదిపై అక్విడెక్టు నిర్మించారు. 1933 నుంచి 1936 వరకు ఈ పనులు మూడేళ్ల పాటు జరిగాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి దివిసీమకు వాహనాలు వేళ్లేందుకు, పాదచారులు నడిచేందుకు అక్విడెక్టుపైన వంతెన నిర్మించారు. ఈ వంతెన నిర్మాణంలో ఆనాటి కృష్ణాజిల్లా బోర్డు అధ్యక్షుడైన శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామప్రసాద్ ముఖ్యపాత్ర వహించారు. అక్విడెక్టు నిర్మాణంలో పాలు పంచుకున్న వాళ్లలో ఇంజనీర్ల దగ్గర్నించి సాధారణ పనివాళ్ల దాకా అంతా తమిళులే వుండేవారు. వీరికి కూడా ఆ ప్రాంతంలో ఏ రకమైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. వెంకటసుబ్బయ్య, కుటుంబరావు వారికి వైద్యం చేసేవారు.

జ్వరం వచ్చిన వ్యక్తికీ విషం ఇవ్వవలసి రావడం గురించిన ఆలోచనలతో కుటుంబరావు మనసు మారింది. వెంకటసుబ్బయ్య వద్దకు వెళ్లి ఇక నేను వైద్యం చేయనని చెప్పేశాడు. దానికి ఆయన నువ్వు వైద్యం బాగానే చేస్తున్నావు కదా! ఎందుకు మానెయ్యాలనుకుంటున్నావు అన్నారు. రెండు రోజులు బాగా టెన్షన్‌కు గురయ్యాననీ, ఆ రోగికి గరళం వేస్తే చనిపోతాడో వెయకపోతే చనిపోతాడోనని దిక్కు తోచని స్థితిలో ఉండిపోయాననీ అన్నాడు మీరు వచ్చి ఆదుకోకపోతే ఏమయ్యేదో తెలీదని ప్రాణాలతో చెలగాటమాడే పని మానివెయ్యాలనుకుంటున్నానని తేల్చి చెప్పేశాడు.

కుటుంబరావు నాస్తికునిగా మారిన వైనం

1935 ప్రాంతాల్లో పండిత గోపదేవ్ రావివారిపాలెం వచ్చారు. ఆంధ్రదేశంలో ఆర్యసమాజ స్థాపకులైన ప్రముఖుల్లో గోపదేవ్‌ను చెప్పుకోవాలి. ఆయన నాలుగు వేదాలను క్షుణ్ణంగా చదివి వాటి గురించి విశ్లేషణపూర్వకంగా మాట్లాడగలిగిన అధికారం వున్న వ్యక్తి. వారిది తెనాలి వద్దనున్న కూచిపూడి గ్రామం. చిన్నతనంలో వేదాల్ని బోధించేందుకు బ్రాహ్మణులు అంగీకరించలేదని ఉత్తర భారతానికి వెళ్లి సంస్కృతాన్నీ, వేదవేదాంగాలను చదివారు. ఆర్యసమాజ కార్యక్రమాల్లో పాల్గొని ఆంధ్రదేశానికి తిరిగి వచ్చారు. హైందవ మతంలోని మూఢాచారాలను, విగ్రహారాధనను, వైదిక కర్మలను వ్యతిరేకిస్తూ ప్రచారం చేశారు. కావూరి శివరామయ్య గోపదేవ్‌ను రావివారిపాలెం తీసుకొచ్చారు. ఎనిమిది రోజుల పాటు గ్రామంలో ఆయన అనేక అంశాలపై సుదీర్ఘ ఉపన్యాసాలు చేశారు. హైందవ మతంలోని దురాచారాలను గురించి తన ఉపన్యాసాల్లో దునుమాడారు. గోపదేవ్ ఉపన్యాసాల ప్రేరణతో

కుటుంబరావు నాస్తికుడయ్యారు. గోపదేవ్ లేవదీసిన వాదాన్ని సభకు హాజరైన బ్రాహ్మణులు సైతం అంగీకరించారు. తర్వాత 10 సంవత్సరాల పాటు రావివారిపాలెం జనం దినకర్మలు, తద్దినాలు పెట్టడం చేయలేదు.

పోస్టమాస్టరుగిరీ కొన్నాళ్లు

మద్రాసు శాసనసభకు ఎన్నికలు వచ్చాయి. అప్పటికి కావూరి శివరామయ్య మోపిదేవి ఎలిమెంటరీ స్కూల్లో టీచర్‌గానూ గ్రామ పోస్టుమాస్టర్‌గానూ ఉండేవారు. చిరువోలు గ్రామస్థుడు శేషగిరిరావు సమీపంలోని కోసూరువారిపాలెంలో టీచర్‌గా ఉండేవారు. ఆ రోజుల్లో బ్రిటిష్‌వారికి అనుకూలంగా వున్న జస్టిస్ పార్టీ చల్లపల్లి జమీందారు యార్లగడ్డ శివరామప్రసాద్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ అభ్యర్థి గొట్టిపాటి బ్రహ్మయ్య తరఫున ప్రచారం చేశారనే కక్ష సాధింపుతో కావూరి శివరామయ్య, చిరువోలు శేషగిరిరావు, మండలి వెంకట్రామయ్య (మండలి వెంకటకృష్ణారావు తండ్రి, బుద్ధప్రసాద్ తాత)లను కైకలూరు తాలూకాలోని మత్స్యకారుల గ్రామాలకు బదిలీ చేశారు. ఆ గ్రామాలు జమీందారు అనుచరుడు ప్రసంగి వెంకటనారాయణ నాయకత్వంలో వుండేవి. ఈ ఉపాధ్యాయులు ఆ గ్రామాల్లో చేరారు. పగలు పాఠశాలల్లో పిల్లలకు విద్య నేర్పుతూనే రాత్రివేళల్లో వయోజనులకు విద్య నేర్పారు. కావూరి శివరామయ్య బదిలీతో ఆయన స్థానంలో మోపిదేవిలో కావూరి కుటుంబరావు గ్రామ పోస్టు మాస్టర్ అయ్యారు.

కావూరి శివరామయ్య, శేషగిరిరావు, వెంకట్రామయ్య తాము పనిచేస్తున్న గ్రామాల్లో ఆనాటి రాజకీయాలను గురించి, గాంధీ నెహ్రూ వంటి జాతీయ నాయకుల గురించి ప్రజలకు వివరిస్తూ వారిని కాంగ్రెస్ సభ్యులుగా చేర్చడం మొదలుపెట్టారు. ఇది తెలుసుకున్న ఆ ప్రాంత జస్టిస్ పార్టీ నాయకులు బందరు వెళ్లి తమ నాయకుడైన ప్రసంగి వెంకటనారాయణ ఈ విషయాన్ని నాటి జిల్లా బోర్డు అధ్యక్షుడు చల్లపల్లి రాజా దృష్టికి తెచ్చి ఉపాధ్యాయులను లోగడ వారు పనిచేసిన స్థానాలకు తిరిగి బదిలీ చేశారు.

చిరువోలు శేషగిరిరావు గురించి రెండు మాటలు చెప్పాలి. ఆయనది కుటుంబ రావు స్వగ్రామం రావివారిపాలేనికి దక్షిణంగా వున్న చిరువోలు గ్రామం. ఆ గ్రామంలో నియోగులైన బ్రాహ్మణ కుటుంబాలు పది పదిహేను ఉండేవి. అందరూ చదువుకున్నవారే కాకుండా ఉపాధ్యాయులుగా పనిచేసేవారు. జాతీయోద్యమం పట్ల ఆకర్షితులై ఖద్దరు ధరించేవారు. అందులో శేషగిరిరావుది ముక్కుసూటిగా, నిర్మొహ మాటంగా మాట్లాడే స్వభావం. అప్పట్లో దివి తాలూకా ఉపాధ్యాయుల మహాసభ పెదకళ్లేపల్లిలో జరిగింది. సభలో తాలూకా బోర్డు అధ్యక్షుడు కొల్లిపర వెంకటరమణయ్య నాయుడు, జిల్లా విద్యాధికారి శ్రీహరి, స్కూళ్ల ఇన్స్‌పెక్టర్ కృపానందం మొదలైనవారు పాల్గొన్నారు. ఏదో సందర్భం వచ్చి కృపానందం ప్రసంగవశాత్తు

ఈ ఉపాధ్యాయులు 5వ తరగతి చదువుకున్నవారే. వీరికి పెద్ద విద్య లేనందువల్ల విద్యార్థులకు చెప్పేది అంతంత మాత్రమేనని అన్నారు. ఈ అవహేళనా వ్యాఖ్యలను శేషగిరిరావు తిప్పకొడుతూ ఇన్స్పెక్టర్ గారు చెప్పింది నిజమే. మేం నాలుగో క్లాసో, ఐదో క్లాసో చదివి ఆ తర్వాత రెండు సంవత్సరాల లోయర్ గ్రేడ్ ట్రైనింగ్ చదివి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నాం. మేం చెప్పే పుస్తకాల్ని మేం రాయలేదు. ఈ ఇన్స్పెక్టర్ లాంటి పండితులే రాశారు. మూడవ తరగతి పాఠ్యపుస్తకంలో రాసిన కథ ఎలా వుందో వినండి అంటూ ఆ కథ చెప్పడం ప్రారంభించారు. "అనగనగా ఒక పేదరాలు. ఆమె వద్ద చాలా ధనం వున్నది. ఒకనాటి రాత్రి నలుగురు దొంగలు ఆమె ఇంటికి వచ్చి భోజనం వండి పెట్టమని అడిగారు. దానిపై ఆమె భోజనం తయారుచేసి వారికి వడ్డించింది. చేతిలో ఉప్పు తీసుకువచ్చి దీపం వద్దకు వెళ్లి చూసి వాళ్లకు వడ్డించింది. దానికి వారు అవ్వా! ఉప్పును ఎందుకలా దీపానికి చూశావు అని అడిగారు. ఆమె నాయనా! అన్నం తినేప్పుడు దీపం వద్ద ఉప్పు చూసి వడ్డిస్తే భోజనం చేసినవారికి ఆయువు పెరుగుతుందని పెద్దలు చెప్పారని అన్నది. దానికి దొంగలు సిగ్గుపడి తాము ఆమె ఇంటికి దొంగతనానికి వస్తే ఆమె మాత్రం తమ ఆయువు పెరగాలని కోరుకున్నదని దొంగతనం చేయకుండానే వెనుదిరిగిపోయారట.

రాసే మేధావులు ఇలా రాస్తే చెప్పేవాళ్లను తప్పు పట్టడం విడ్డూరం అని ఇన్స్పెక్టర్ను దులిపేశారు శేషగిరిరావు.

వ్యాపార ప్రయత్నాలు

కుటుంబరావుకు జీవితం నల్లేరు మీద బండి నడకలా సాగలేదు. చిన్ననాడు సరైన విద్యాసదుపాయాలు లేకున్నా మొత్తం మీద చదువుకొన్నాడు. గ్రాంటు స్కూల్లో ఉపాధ్యాయునిగా రెండేళ్లు పనిచేసినా ట్రైనింగ్ సీటు దొరకలేదు. స్కూల్లో మానేసిన తర్వాత వైద్యం అంటూ కొంతకాలం తిరిగాడు. జీవితంలో స్థిరత్వం ఏర్పడకపోయినా సమాజం పట్ల అవగాహన, సంస్కరణ దృక్పథం, జాతీయవాద చైతన్యం వున్నాయి. అవి తర్వాతి కాలంలో మరింత స్పష్టతను సంతరించుకున్నాయి.

మోపిదేవిలో కుటుంబరావు ఇంటి ఎదురుగా వున్న భూమి పెదప్రోలు గ్రామస్తురాలైన నాదేళ్ల పిచ్చమ్మది. ఆమెకు తోబుట్టువులు లేరు. కన్నవారికి నూరెకరాల భూమి వుండేది. అత్తవారిది రేపల్లె తాలూకా ఓలేరయినా భర్త ఇల్లరికం వచ్చాడు. నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలిగారు. పిల్లలతో పనులన్నీ చేయిస్తున్నా యాజమాన్య మంతా ఆమెదే.

ఒక రోజు పిచ్చమ్మ కుటుంబరావును పిలిపించి తనకు బయట రావలసిన అప్పులకు సంబంధించిన బాకీలు, వాయిదాలు, వాటికి ప్రామిసరీ నోట్లు (ఈ విషయాలపై తన కొడుకులతో చేప్పేది కాదు. కుటుంబరావే రాతకోతలు చేసేవాడు) గురించి మాట్లాడింది.

60 ఏళ్ల వయసులో కూడా ఆనాటి సామాజిక పరిస్థితుల వల్ల ఆమె ఘోషా పాటించేది. తలుపు చాటు నుంచే కుటుంబరావుతో మాట్లాడేది. తన కుమారులు, మనుమలకు (చనిపోయిన కొడుకు, కుమార్తె, కుమారులకు) ఇవ్వవలసిన ఆస్తుల గురించి లెక్కలు చేయించేది.

కుటుంబరావు స్వవిషయం మాట్లాడుతూ ఖాళీగా ఉండక ఏదైనా ఉద్యోగం చేయమని చెప్పింది. వేరొకరి వద్ద పనిచేయడం ఇష్టం లేక నేను ఉద్యోగం చేయడం లేదని కుటుంబరావు చెప్పాడు. పోనీ ఏదైనా వ్యాపారమైనా చేయమని వత్తిడి చేసి ఒప్పించింది. అప్పటికి ఆ ప్రాంతం మాగాణి కాలేదు. వర్షాధార పంటలైన మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు, తైదలు, వరిగలు వంటి పంటలు పండేవి. ముఖ్యంగా వేరుశనగ రైతులు కూలీలకు వేరుశనగలే ఇచ్చేవారు. ఎనిమిది మకరలు కోసినవారికి ఒక మరకం కూలీ కింద ఇచ్చేవారు. అలా తెచ్చిన వేరుశనగల్ని గ్రామంలో వర్తకులకు అమ్మి డబ్బు తీసుకెళ్లేవారు. మరకం అణా వచ్చేది. ఒక్కో కూలీ రోజుకు మూడు నాలుగు మరకలు తెచ్చుకునేవారు. పిచ్చమ్మ సలహాతో ఈ విధంగా వేరుశనగల్ని కొనే వ్యాపారం ప్రారంభించాడు కుటుంబరావు. పెట్టుబడి ఆమే ఇచ్చేది. వేరుశనగల్ని కొనడానికి చిల్లర కావాలి. కొంత డబ్బు తీసుకొని 20 మైళ్ల దూరంలోని బందరు వెళ్లి మినర్వా సినిమా హాలు వద్ద చిల్లర తెచ్చుకొనేవాడు. సినిమా చూడాలంటే ఆ రోజుల్లో రిజర్వు సీట్లు నాలుగణాలు, నేల టికెట్లు ఒక అణా. దీనివల్ల సినిమా హాలువారి వద్ద చిల్లర దొరికేది. ఆ విధంగా 3000 రూపాయల వేరుశనగలు కొని కొంత కాలానికి తిరిగి అమ్మగా 4000 రూపాయలు వచ్చాయి. ఆ మొత్తాన్ని పిచ్చమ్మకు ఇచ్చాడు కుటుంబరావు. లాభం 1000 రూపాయలు తీసుకొమ్మని చాలా వత్తిడి చేసింది. ఆమె బలవంతాన ఐదో ఆరో వందలు తీసుకున్నా తర్వాత ఆ వ్యాపారాన్ని కొనసాగించలేకపోయాడు.

పెదప్రోలు గ్రామంలో కొల్లి రంగయ్య అనే ఉపాధ్యాయుడు తమ గ్రామంలో బట్టల దుకాణం పెడదామని కుటుంబరావును ప్రోత్సహించాడు. దానికి అంగీకరించాడు. ఇరువురూ విజయవాడకు వెళ్లి తమ వద్దనున్న డబ్బులకు సరిపడా బట్టలు, బీరువాలు కొన్నారు. విజయవాడ నుంచి అప్పుడప్పుడే వచ్చిన పడవ (కరువు కాలువ)పై వాటిని వేసుకొని కొక్కిలిగడ్డకు వచ్చి అక్కడ సరుకులను దింపి బండిపై పెదప్రోలుకు తెచ్చుకొన్నారు. ఆ బట్టలను బీరువాలో ఊళ్లోని రామాలయంలో వుంచి వ్యాపారం మొదలుపెట్టారు. అప్పుడు చొక్కా గుడ్డ గజం అణా వుండేది. ఫ్రెంచి సిల్కు గజం నాలుగణాలు. గ్రామంలోని యువకులు పెద్ద సంఖ్యలో వారివద్ద గుడ్డలు కొనుక్కున్నారు. అతి పరిచయం వల్ల, అనుభవ రాహిత్యం వల్ల క్రెడిట్ ఇచ్చారు. డబ్బులు వసూలు చేయలేక పోయారు. లాభాల సంగతలా వుంచి బీరువాలు మాత్రం మిగిలాయి.

పిచ్చమ్మ బలవంతంతో పెళ్లి

కుటుంబరావు తన మంచితనం వ్యాపారానికి పనికిరాదని తీర్మానించుకొని వ్యాపారానికి స్వస్తి చెప్పాడు. ఒకనాడు పిచ్చమ్మ కుటుంబరావును పిలిపించింది. నిన్న ఒక వివాహానికి వెళ్లానని, అక్కడ ఒకమ్మాయిని చూశానని చెప్పింది. అమ్మాయిని నాకు తెలిసిన అబ్బాయికి ఇవ్వమని అడిగి ఒప్పించానని కాబట్టి నీవు ఆమెను వివాహం చేసుకోవాలని కోరింది. పిచ్చమ్మ మంచితనమూ, వ్యవహారానుభవం, ధనవంతురాలు కావడమో ఆమె ఏదైనా చెబితే ఎదురాడేవారు లేరు. కాని తనకు అప్పటికి 18 ఏళ్లే. చిన్నతనంలో పెళ్లి చేసుకోవడం కుటుంబరావుకు ఇష్టం లేదు. చేసుకోనని చెప్పాడు. దానికామె ఇంత బ్రతుకు బ్రతికి నేను చెబితే వింటావనే నమ్మకంతో అవతలివారికి మాట చెప్పి వచ్చాను. ఇప్పుడు నీవు ఒప్పుకోకపోతే పదిమందిలో నా పరువేం గాను. గతంలో ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ ఎదుర్కోలేదు అంటూ ఏడ్చేసింది. కుటుంబరావు ఆమెను ఓదారుస్తూ నీవు బాధపడితే నేను చూడలేనమ్మా! నీవు చెప్పినట్లే నేను ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాను అనడంతో ఆమె సంతోషించింది. బండి కట్టించుకొని పెద్దలతో మాట్లాడేందుకు కుటుంబరావు ఇంటికి బయలుదేరింది.

ఆ రోజుల్లో స్త్రీలు ఏ వయసువారైనా ఎద్దుల బండ్లలో ప్రయాణించడానికి ఎవరికీ కనిపించకుండా గూడు (గుడిసె) వేసి ఇరువైపులా తెరలు కట్టేవారు. పిచ్చమ్మ కుటుంబరావు తల్లిదండ్రులైన శివరామయ్య, సీతారామమ్మలతో ఈ విషయం మాట్లాడింది. తాము ఎంత చెప్పినా లొంగని వాడ్ని ఒప్పించిందని వారు సంతోషించారు. వివాహం సంస్కరణ పద్ధతిలో జరగాలని కుటుంబరావు తల్లిదండ్రులతో గట్టిగా చెప్పాడు. అందుకు వారూ అంగీకరించారు. నాన్న కొంత డబ్బిచ్చి బందరు వెళ్లి బట్టలు కుట్టించుకు రమ్మని చెప్పారు. 1937 నవంబర్‌లో పెళ్లి. పెళ్లి రేపనగా కుటుంబరావు బందరు వెళ్లి రాత్రి రావివారిపాలెం తిరిగి వచ్చి పడుకొన్నాడు. తెల్లవారి లేచేసరికి ఇంటివద్ద చిన్నకారు. బ్యాండు మేళం, పురోహితుల సందడి. కుటుంబరావు ఇలా చేశారేమిటని అడిగాడు. పెద్దనాన్న కోదండరామయ్య కల్పించుకొని "సంస్కరణ వివాహం ఎలా చేయాలో తెలియక ఇలా మేళతాళాలు తెప్పించాం. నీవిప్పుడు కాదంటే మా పరువు పోతుంది" అని సర్ది చెప్పాడు. అదే రోజు మేళతాళాలతో పెదప్రోలు వెళ్లారు. వధువు మేనమామ ఇంటివద్ద పెళ్లి జరిగింది. పెదప్రోలు, మోపిదేవి, రావివారిపాలెం గ్రామాల్లో పెళ్లి ఊరేగింపు చేశారు. కుటుంబరావు ఇంట్లో అదే ఆఖరు సంప్రదాయ వివాహం. తన ముగ్గురు తమ్ముళ్ళ పెళ్లిళ్లను కుటుంబరావు సంస్కరణ పద్ధతిలోనే జరిపించాడు. చిన్న తమ్ముడు వీరరాఘవరావు వివాహాన్ని కూడా పెదనాన్న కోదండరామయ్య ఇదే పద్ధతిలో జరిపి కుటుంబరావు భావాలకు మద్దతు పలికారు.

1938 జులై నెలలో బందరులో గవర్నమెంటు ట్రెనింగ్ స్కూల్లో కుటుంబరావు హయ్యర్

గ్రేడ్ ట్రైనింగ్ కోసం చేరాడు. అది 9 నెలల కోర్సు. నెలకు 7 రూపాయలు స్టయిఫెండ్ ఇచ్చేవారు. ఐదవ తరగతి పూర్తిచేసినవారికి లోయర్ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్‌కి అర్హత వుండేది. అలాగే 8వ తరగతి లేదా హైస్కూల్లో థర్డ్ ఫారమ్ చదివినవారికి హయ్యర్ గ్రేడ్, ఎస్.ఎస్.ఎల్.సి. గానీ ఎఫ్.ఎ. గానీ చదివినవారికి సెకండరీ గ్రేడ్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారికి ఇప్పటిలాగా బి.ఇడి కోర్సులుండేవి. తర్వాత లోయర్ గ్రేడ్ ట్రైనింగ్ తీసివేశారు. కుటుంబరావు ట్రైనింగ్ చదివినప్పుడు స్కూలు హెడ్మాష్టర్‌గా దేవరకొండ సత్యనారాయణమూర్తి, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయునిగా శ్రీరాములు, వ్యాయామ ఉపాధ్యాయునిగా గోవిందు వుండేవారు. కుటుంబరావు తండ్రి శివరామయ్యకు కూడా లోయర్ గ్రేడ్ ట్రైనింగ్ స్కూల్లో గోవిందు మాష్టారుగా వుండేవారు.

బందరులో ఎందరు తెలుగుపెద్దలని..

కుటుంబరావు అదృష్టవంతుడు. ఆ రోజుల్లో ఎంతో మంది పెద్దలతో పరిచయాలు, వారి గొప్పతనాన్ని సన్నిహితంగా పరిశీలించే అవకాశం కలిగింది. పెద్దల నుంచి లభించిన స్ఫూర్తి తర్వాతి కాలంలో వ్యక్తిత్వ నిర్మాణానికి అవి ఎంతో దోహదం చేశాయి. ఆనాడు బందరు ఎంతో మంది తెలుగు పెద్దలకు కార్యరంగమై భాసిల్లింది. అఖిల భారత కాంగ్రెస్ రాజకీయాల్లో ముఖ్యనేతగా పాల్గొని తర్వాతి కాలంలో ఆంధ్రా బ్యాంకును నెలకొల్పిన భోగరాజు పట్టాభిసీతారామయ్య, తెలుగు పత్రికల్లో మహోన్నతంగా భాసించి తెలుగువారి సాంఘిక, సాంస్కృతిక వికాసంలో తనవంతు పాత్ర నిర్వహించిన కృష్ణా పత్రిక సంపాదకులు ముట్నూరి కృష్ణారావు, జాతీయ నాయకులు స్థాపించిన జాతీయ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కవి, రచయిత, చిత్రకారుడు అడివి బాపిరాజు, స్వయంగా నాటక సమాజాన్ని ఉజ్వలంగా నడిపి గొప్ప రంగస్థల కళాకారునిగా మన్ననలందుకొన్న ముఖ్యంగా హరిశ్చంద్ర పాత్ర పోషణకు ప్రసిద్ధి పొందిన డి.వి. సుబ్బారావు, స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలను ఉత్తేజపరిచిన కాంగ్రెస్ నాయకుడు చెరకువాడ నరసింహం, హంపీ క్షేత్ర కవి కొడాలి ఆంజనేయులు, 'కాంతం కథల' రచయిత, హాస్యరచనకు పెట్టినపేరైన మునిమాణిక్యం నరసింహారావు, పద్యాన్ని హృద్యంగా చెప్పిన కవి పాదుషా పువ్వాడ శేషగిరిరావు... ఇలా ఎంతో మంది పెద్దలు నడయాడిన నేలపై కుటుంబరావు సంచరించాడు. తీరిక సమయాల్లో ఆ మహనీయులతో కాలక్షేపం చేస్తూ వారి ప్రతిభా విశేషాలను కళ్లారా చూశాడు. అనేక విషయాలను వారి నుంచి నేర్చుకున్నాడు.

ఆ రోజుల్లో మహీధర సోదరుల సంగతి ఇంకోలా వుంది. మహీధర జగన్మోహన రావు, రామమోహనరావు అప్పటికి ప్రగతిశీల సాహిత్య ప్రచురణలో నిమగ్నమై వున్నారు. అతివాద సాహిత్యాన్ని అచ్చువేసి పంచిపెట్టేవారు. బందరులో వారు ఈ విధంగా పుస్తకాలు అమ్ముతుండగా కావూరి కుటుంబరావు కూడా కొన్ని పుస్తకాల్ని కొన్నాడు. మహీధర సోదరులది గోదావరి జిల్లా

ముంగండ. జాతీయ కళాశాల విద్యార్థులకు వారి పుస్తకాలు కొనాలని వున్నా డబ్బులు లేకపోయేసరికి అక్కడ అంతకు ముందెప్పుడో వేసిన పందిరిని తామే తీసేందుకు ప్రిన్సిపాల్ బాపిరాజుతో మాట్లాడారు. అది కూలీవారితో తీయిస్తే ఇచ్చినట్లుగానే తమకూ అంతే మొత్తం ఇప్పించమని ఒప్పించారు. ఆ విధంగా పందిరిని ఊడదీసి తీసుకున్న డబ్బులతో కుటుంబరావు మహీధర సోదరుల వద్ద పుస్తకాలను కొన్నాడు.

సహపంక్తి భోజనం – సంస్కరణ దృక్పథం

కుటుంబరావుకు మొదటి నుంచీ అభ్యుదయభావాలు మెండు. బందరులో కువ్వం జమీందారు, తన మిత్రుడైన నరసింహారావు ఇంట్లో వుండి ట్రైనింగ్ స్కూల్లో చదువుతుండేవాడు. అక్కడికి సమీపంలోనే చల్లపల్లి జమీందారు అల్లుడైన కొమ్మారెడ్డి పట్టాభిరామయ్యకు చెందిన కేకిని మహల్ అనే భవనం వుండేది. ఒకసారి కుటుంబరావు చదువుతున్న స్కూల్లోని బ్రాహ్మణ విద్యార్థులంతా వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. మిగతా కులాలు ముఖ్యంగా హరిజన విద్యార్థులను కలుపుకొని బ్రాహ్మణేతర విద్యార్థుల కోసం కుటుంబరావు పెద్ద ఎత్తున మరొక వనభోజనం ఏర్పాటు చేశాడు. మొత్తం 400 మంది అయ్యారు. నిజానికి అంతమందికి భోజనం వండించి పెట్టేందుకయ్యే డబ్బు, పాత్రలు అవీ లేవు. అయినా కూడా కుటుంబరావు పట్టుదలతో ప్రయత్నాలు చేశాడు. హెడ్మాస్టరు దేవరకొండ సత్యనారాయణమూర్తికి కుటుంబరావంటే వాత్సల్యం వుంది. ఆయన వద్దకు వెళ్లి తన వనభోజనాల గురించి చెప్పి వంద రూపాయలు కావాలన్నాడు. ఎందుకు ఏమిటని అడిగితే కుటుంబరావు విషయం ఆయనకు వివరించాడు. 'ఆ మాల మాదిగ విద్యార్థులతో భోజనం చేయడమేమిటి. నీవు కూడా బ్రాహ్మణ విద్యార్థుల వనభోజనానికి రమ్మ'ని నచ్చజెప్ప బోయాడు. అందరికీ భోజనం పెడతానని మాటిచ్చాను. చేయలేకపోతే మాట తప్పినట్లవుతుందని చెప్పడంతో ఆయన డబ్బిచ్చారు. వంట పాత్రలను పట్టాభిరామయ్య వద్ద నుంచి తీసుకువచ్చాడు. మిత్రుడు వేములపల్లి రాజగోపాలరావు, మరికొందరు బ్రాహ్మణ విద్యార్థులు కూడా కుటుంబరావుకు సహాయం చేశారు. ముఖ్యంగా హరిజన విద్యార్థులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేయడం ఆ రోజుల్లో ఒక విప్లవమే. అభ్యుదయ వాదులు మాత్రం ఎంతో సంతోషించి కుటుంబరావును వెన్నుతట్టి అభినందించారు.

పోలెండ్‌పై హిట్లర్ దాడి – పరిణామాలు

1939 సెప్టెంబర్ 1న జర్మనీ నియంత హిట్లర్ పోలెండ్‌పై దాడికి దిగాడు. అప్పటివరకు బ్రిటిషు, అమెరికా సామ్రాజ్యవాదుల రష్యాకు వ్యతిరేకంగా హిట్లర్‌ను ప్రోత్సహించేవారు. ఆ కారణంగానే హిట్లరు ఆస్ట్రియా, చెకొస్లవేకియాలను ఆక్రమించినా చూస్తూ ఊరుకున్నారు. పోలెండ్ విషయం వచ్చేసరికి హిట్లరు తమ మాట లెక్కచేయడేమో నని భావించి జర్మనీకి

వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొన్నారు. ఇక్కడ మన దేశంలో అంతకు రెండేళ్ల కిందట కాంగ్రెస్ నాయకత్వం బ్రిటిష్‌వారితో రాజీ పడింది. కాంగ్రెస్ నాయకులు కొన్ని రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి మంత్రివర్గాలనేర్పరిచారు. మద్రాసు రాష్ట్రంలో చక్రవర్తుల రాజగోపాలచారి ముఖ్యమంత్రిగా వున్నారు. అప్పుడు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తమిళనాడు పూర్తిగానూ, విశాఖ నుంచి నెల్లూరు వరకు సర్కారు జిల్లాలు, ఆనాడు దత్తమండలాలుగా పిలువబడిన రాయలసీమ జిల్లాలు, ఇప్పుడు కర్ణాటకలో భాగమై వున్న బళ్లారి, కేరళలో వున్న పాల్ఘాటు, మలబారు జిల్లాలు వుండేవి. టంగుటూరి ప్రకాశం, బెజవాడ గోపాలరెడ్డి వంటివారు మద్రాసు రాష్ట్రంలో మంత్రులుగా వుండేవారు. ఆ పరిస్థితుల్లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలను గానీ, కాంగ్రెస్ నాయకులను గానీ సంప్రదించకుండానే బ్రిటిష్‌వారు జర్మనీపై యుద్ధం ప్రకటించడంతో కినుక వహించి మంత్రివర్గాలకు రాజీనామాలు చేసి బయటికి వచ్చారు.

జిల్లా బోర్డు ఎన్నికలు

ఈ వాతావరణంలో 1940 జనవరి ప్రాంతంలో ఇక్కడ జిల్లా బోర్డు ఎన్నికలు జరిగాయి. అంతకు పూర్వం జరిగిన రెండు పర్యాయాల జిల్లా బోర్డు ఎన్నికల్లో కాంగ్రెస్‌వారు పాల్గొనలేదు. దాంతో కాంగ్రెస్ కొంత బలహీనపడింది. జస్టిస్ పార్టీకి చెందిన బందరు న్యాయవాది కొల్లిపర రమణయ్యనాయుడు వర్గంతో కలిసి కమ్మ జస్టిస్ పార్టీ నాయకుడు చల్లపల్లి రాజా యార్లగడ్డ శివరామప్రసాద్ వర్గంపై గెలిచారు. ఆ తర్వాత రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ జిల్లా బోర్డు అధ్యక్షునిగా జయంతిపురం రాజా వాసిరెడ్డి సదాశివప్రసాద్‌ను ఎంపిక చేసింది. ఆయన 1936లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జస్టిస్‌పార్టీపై కాంగ్రెస్ తరఫున పోటీచేసి పశ్చిమ కృష్ణా నుంచి శాసనసభ్యునిగా గెలుపొందారు. వాసిరెడ్డి సదాశివప్రసాద్‌ను జిల్లా బోర్డు అధ్యక్ష పదవికి ఎంపిక చేసిన తర్వాత కాంగ్రెస్‌కు మద్దతిచ్చిన కమ్మ వ్యతిరేక జస్టిస్ పార్టీ నాయకుడైన కొల్లిపర రమణయ్యనాయుడు అదే రాత్రి టంగుటూరి ప్రకాశం పంతులును కలుసుకుని తన అభ్యర్థి కొల్లిపర లక్ష్మయ్యనాయుడ్ని జిల్లా బోర్డు అధ్యక్షునిగా నిలపాలని, లేనిపక్షంలో తమ వర్గం చల్లపల్లి వర్గంవారితో కలిసిపోతామని బెదిరించాడు. దాంతో ఆ స్థానానికి అంతకు ముందు రాసిన వాసిరెడ్డి సదాశివప్రసాద్ పేరు కొట్టివేసి ఆ స్థానంలో లక్ష్మయ్యనాయుడి పేరు రాశారు.

మరునాడు సాయంత్రం బందరులో గంధం అమ్మన్నరాజా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ప్రకాశం పంతులు, డా. పట్టాభిసీతారామయ్య, చెరకువాడ నరసింహం వంటి ప్రముఖులు పాల్గొన్నారు. అక్కడ ఆ సభకు ముందు జరిగిన సభలో ప్రముఖ విప్లవకారుడు స్వామి సత్యదేవ్ పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ప్రసంగించారు.

కుటుంబరావు ఇతర యువకులు ఈ ప్రసంగం విని ఎంతో ఉత్తేజితులయ్యారు. ఆ తర్వాత అక్కడ కాంగ్రెస్ నాయకుల సభ జరిగింది. మొదట ప్రకాశం పంతులు మాట్లాడుతూ తాము స్వాతంత్ర్యం కోసం జైళ్లకు వెళ్లామనీ, తర్వాత కొంత కాలం మంత్రులుగా వుండి తిరిగి మంత్రి పదవులకు రాజీనామా ఇచ్చేసి వచ్చామని చెప్పారు. ఆయన ప్రసంగానికి కుటుంబరావు తదితర యువకులు అడ్డుతగులుతూ నిన్న రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ జిల్లా బోర్డు అధ్యక్ష పదవికి సదాశివప్రసాద్‌ను ఎంపిక చేయగా ఆ పేరు కొట్టివేసి మరోపేరు ఎందుకు రాశారని ప్రశ్నించారు. దానికి ప్రకాశం తీవ్ర ఆగ్రహంతో 'నా ఇష్టంరా మీకు ఇష్టం లేకపోతే కాగితం తీసుకురండి రాజీనామా చేస్తా' అంటూ కుర్చీలో కూర్చున్నారు. దానికి పట్టాభిసీతారామయ్య లౌక్యంతో కుటుంబరావు, ఇతర యువకులను బుజ్జగిస్తూ "అబ్బాయిలూ! నేనొక మాట చెబుతాను. ఇంట్లో అమ్మానాన్న పోట్లాడుకున్నారు నిజమే. ఆ విషయం అమ్మను గానీ నాన్నను గానీ ఇంట్లో అడగాలి కానీ ఇలా బజారులో అల్లరి చేయవచ్చునా! ఇది కుటుంబ గౌరవాన్ని రచ్చకీడ్చడమే కదా!" అని అన్నారు. దాంతో యువకులు చల్లబడ్డారు. యధాస్థానంలో కూర్చున్నారు. ఆ విధంగా జిల్లా బోర్డు అధ్యక్షునిగా నిలబెట్టిన లక్ష్మయ్యనాయుడు తర్వాత చల్లపల్లి రాజాతో కలిశాడు.

సుభాష్‌చంద్రబోస్ పర్యటన

1939 చివర్లో అఖిల భారత కాంగ్రెస్ సంఘానికి ఎన్నికలు జరిగాయి. అప్పుడు కాంగ్రెస్ అధ్యక్ష పదవికి గాంధీజీ తన ముఖ్య అనుచరుడైన భోగరాజు పట్టాభిసీతా రామయ్యను నేతాజీ సుభాష్ చంద్రబోస్‌పై పోటీకి నిలబెట్టారు. ఆ ఎన్నికల్లో సుభాష్ చంద్రబోస్ విజయం సాధించారు. గాంధీజీ కోపంతో 'ఈ ఓటమి నాదే కాని పట్టాభిది కాదు' అన్నారు. అంతటితో ఆగక జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభభాయ్ పటేల్ వంటి అగ్రనేతలచేత కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి రాజీనామా చేయించారు. దాంతో విసిగిపోయిన నేతాజీ కాంగ్రెస్‌ను వదిలివచ్చి ఫార్వర్డ్ బ్లాక్‌ను స్థాపించారు. ఆ సందర్భంలో ఆఖరిసారిగా ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చారు. ఏలూరుకు వస్తున్న విషయం తెలుసుకున్న కావూరి కుటుంబరావు బందరులో చదువుకుంటున్న తన మిత్రుడు వేములపల్లి రాజగోపాలరావును, చిన్న తమ్ముడు వీరరాఘవ రావును నేతాజీని చూడడానికి ఏలూరుకు పంపారు. బోసు పర్యటనలో మద్దూరి అన్నపూర్ణయ్య నాయకత్వాన వాలంటీర్లు ప్రత్యేక దుస్తులు ధరించి పాల్గొన్నారు. వీరరాఘవరావు దుస్తులు అటువంటివే కావడం వల్ల అతను కూడా వాలంటీర్లతో కలిసి సుభాష్‌చంద్రబోస్‌కు దగ్గరి నుంచి వందనం సమర్పించాడు.

1940 ప్రాంతంలో కుటుంబరావు ఉపాధ్యాయ శిక్షణ పూర్తయ్యింది. 1939 ప్రాంతంలో ఆ ప్రాంతానికి తెలుగు టైపు వచ్చింది. పిఠాపురం జమీందారు టైపు తెప్పించాడని చెప్పుకొన్నారు. కుటుంబరావు శిక్షణలో వుండగానే తెలుగు టైపు నేర్చుకున్నాడు.

ప్రధానోపాధ్యాయుడైన సత్యనారాయణమూర్తి కుటుంబరావు హయ్యర్‌గ్రేడ్ ట్రెనింగ్ సర్టిఫికెట్‌పై అతని గుణగణాలను ప్రశంసించారు. ఆయన 'కుటుంబరావు పరిశ్రమ, ప్రతిభ కలిగిన ఉపాధ్యాయుడు. క్రమం తప్పక తనకు అప్పగించిన పనిని పూర్తి చేసేవాడు, సమర్థుడు, అందరినీ ఆకట్టుకునే వ్యక్తిత్వం కలవాడు. ఎప్పుడూ ఉల్లాసంగా ఉంటూ ఉత్సాహంగా ఏ పనైనా నేరవేర్చేవాడు. ఎంతో అణకువ కలిగినవాడు. తెలుగు టైపు కూడా తెలుసు. సత్ప్రవర్తన కలిగినవాడు. బాడ్మింటన్ క్రీడనే కాకుండా క్రీడల పట్ల ఆసక్తి కలిగిన వ్యక్తి' అని ఆంగ్లంలో ప్రశంసావాక్యాలు రాశారు. పరీక్షలు అయ్యాక కుటుంబరావు తిరిగి స్వగ్రామమైన రావివారిపాలెం వచ్చాడు. మేలో ఫలితాలు వచ్చాయి. మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు.

పెదతండ్రి కావూరి కోదండరామయ్య వద్దకు వెళ్లి తన ట్రెనింగ్ పూర్తయి మంచి మార్కులతో పాసయిన విషయం చెప్పాడు. పెదతండ్రి తనను అంతగా ఆదరించని సంగతిని కుటుంబరావు గ్రహించాడు. ఆయన కుటుంబరావును చూసి ట్రెనింగ్ పాసయ్యావా? అని అడిగారు. ఆ మాటల్లో కుటుంబరావుకు వ్యంగ్యం ధ్వనించింది. వెంకటాపురంలో స్కూల్లో చేరుతావా! అని అడిగారు. వెంకటాపురం గ్రాంటు స్కూలు రావివారిపాలేనికి రెండో కిలోమీటర్ల దూరం. రావివారిపాలెంలోనే పెదనాన్నకు మరో గ్రాంటు స్కూలు వుంది. అందులో తాను లోయర్ గ్రేడ్ టీచర్ ట్రెనింగ్ కూడా చేశాడు. తనను ఆ స్కూల్లోనే చేరమనవచ్చుగా! అని మనసులో అనుకున్నాడు కుటుంబరావు.

ఆ రోజుల్లో గ్రాంటు స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులకు నెలనెలా జీతాలిచ్చేవారు కారు. ఏడాదికోసారి గ్రాంటు విడుదల చేస్తే జీతాలు వచ్చేవి. ఇతర పాఠశాలల ఉపాధ్యాయులకు నెల జీతాలు ఉండేవి. గ్రాంటు స్కూళ్లలో ఉపాధ్యాయుల జీతాలకయ్యే మొత్తానికి 15 శాతం అదనంగా మేనేజర్‌కు చెల్లించేవారు. ఆ మొత్తం బెంచీలు, బల్లలు, అటెండన్స్ రిజిష్టరు వంటి వాటి కోసం ఇచ్చేవారు. అయితే ఆ మొత్తాలు మేనేజరు జేబుల్లోకి వెళ్లేవి. కుటుంబరావును టీచర్‌గా చేరమన్న వెంకటాపురం స్కూలు మేనేజర్ కోదండరామయ్యకు కొంత బాకీ పడి బాకీ కింద స్కూలును ఆయనకిచ్చేశాడు. రావివారిపాలెంలోని స్కూల్లోనే చేరమనవచ్చు గదా, దూరంలో వున్న వెంకటాపురంలో ఎందుకని అక్కడ్నుంచి వెళ్లిపోయాడు.

ఎడ్లలంకలో ఉపాధ్యాయ వృత్తి

కుటుంబరావు సహాధ్యాయి వేములపల్లి రాజగోపాలరావు కుటుంబం అవనిగడ్డలో నివసించేది. అతను కూడా అతివాద భావాలున్నవాడే. 1939 సెప్టెంబర్ 1న రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. అప్పటికే కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురైంది. పార్టీ నాయకులపై బ్రిటిషు ప్రభుత్వం అరెస్టు వారెంట్లు జారీ చేసింది. కుటుంబరావు, రాజగోపాల

రావు ఇద్దరూ కలిసి పాఠశాల లేని వూరేదైనా వుందేమోనని వెతకటం ప్రారంభించారు. అవనిగడ్డకు కిలోమీటరున్నర దూరాన కృష్ణానది మధ్య ఎడ్లలంక అని వుంది. అక్కడ పాఠశాల లేదు. ఎవరైనా అక్కడి గ్రాంటు స్కూల్లో పనిచేయడానికి వస్తే గ్రామస్తులు నాలుగైదు మాసాల్లోనే ఆ ఉపాధ్యాయుడ్ని వెళ్లగొడతారు. అందువల్ల గ్రామంలోని పిల్లలకు పెద్దగా చదువు అబ్బేది కాదు. కుటుంబరావు మొత్తం మీద ఎడ్లలంకలో ఎలాగైనా పాఠశాల పెట్టి నడపాలనుకున్నాడు. పాఠశాల భవనం వంటిదేమీ లేదక్కడ. దేవాలయం ముందు వేపచెట్టు కింద కూర్చున్న కుటుంబరావును జనం 'ఎవరు మీరు?' అని అడగడం ప్రారంభించారు. "నేను ఇక్కడి పిల్లలకు చదువు చెప్పవచ్చిన టీచర్‌నని చెప్పాడు. మెలమెల్లగా పిల్లలు రావడం మొదలైంది. ఎండలోనే పిల్లలకు చదువు చెప్పడం చూసి కొంతమంది యువకులు రెండు నిట్టాళ్ల పాక వేసే ప్రయత్నాల్లో పడ్డారు. బంకమట్టితో గోడలు కట్టి అక్కడ దొరికే రెల్లుగడ్డితో కప్పు వేశారు. ఉండటానికి అక్కడ ఇంటివసతి లేక కుటుంబరావు రోజూ అవనిగడ్డలో తన మిత్రుడు రాజగోపాలరావు ఇంట్లో భోంచేసి ఎడ్లలంక వచ్చేవాడు. పరిస్థితికి జాలి పడి ఆ వూరి యువకులు కుటుంబరావు కోసం స్కూలు పక్కనే నిట్టాడి పాక నిర్మించి రెల్లుగడ్డి కప్పారు. దాంతో కుటుంబరావు తన శ్రీమతి వరలక్ష్మితో సహా ఆ పాకలో నివాసం ఏర్పరచుకొని పాఠశాలలో పనిచేశాడు.

గ్రామాభ్యుదయ దృష్టి

కుటుంబరావు ఎక్కడున్నా సామాజిక సేవ పట్ల ఆసక్తి చూపేవాడు. తన మంచితనంతో అందరితో సన్నిహితంగా మెలగుతూ సమస్యల పరిష్కారం కోసం పాటు పడేవాడు. ఎడ్లలంకలో పగటిపూట చిన్న పిల్లలకు పాఠాలు చెబుతూనే వయోజనుల కోసం రాత్రి బడి నడిపాడు. అనతి కాలంలో పిల్లలు, పెద్దల అభిమానం చూరగొన్నాడు.

గ్రామ రైతుల్లో ఇద్దరు ధనికులైనవారు ఉండేవారు. వారిలో కాట్రగడ్డ రామకృష్ణయ్య ఒకరు. ఆయన స్వగ్రామం పోతర్లంక శివారు గ్రామం. అక్క భర్త అయిన ఎడ్లలంక మునసబు చనిపోవడం వల్ల ఆ ఇంటి బాధ్యతల్ని స్వీకరించి అక్కడే వుంటున్నారు. వారి బావగారికి గుంటూరు జిల్లా మైనేనివారి పాలెంలో 100 ఎకరాల మాగాణి, దివి తాలూకాలోని ఎడ్లలంక, మరికొన్ని చోట్ల 200 ఎకరాల మాగాణి, మెట్టభూములు ఉండేవి. వీరి దగ్గరి బంధువులైన మైనేని కృష్ణయ్యకు 100 ఎకరాల భూమి ఉండేది. వీరిద్దరి మధ్య సఖ్యత ఉండేది కాదు. దానివల్ల అక్కడి రైతులను రెండు వర్గాలుగా చీల్చారు. అమాయక రైతులు భూస్వాముల స్వార్థానికి బలై పరస్పరం దాడులు చేసుకొంటూ ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుంటూ కోర్టుల చుట్టూ తిరిగేవారు. గ్రామంలోని చాలావరకు భూమి ప్రభుత్వాధీనంలోనే వుండేది. కొంత సాగుభూమి కొంత రెల్లుగడ్డి భూమి వుండేది. ఏటా ఈ భూముల వేలం ప్రకటిస్తే రైతులు అకారణ వైరంతో పోటీ పడి వేలం ఎక్కువ పాడి నష్టపోయేవారు. కుటుంబరావు

ఒకవైపు పగలు రాత్రి పాఠాలు చెబుతూనే మరోవైపు గ్రామంలో రైతుల స్థితిగతులను అధ్యయనం చేసి వారిలో అనవసర కక్షలను దూరం చేసే ప్రయత్నాలు ప్రారంభించాడు.

ఈ ప్రయత్నాల్లో మొట్టమొదట తన వద్దకు రాత్రి బడికి వచ్చే రెండు వర్గాల యువకుల అభిమానాన్ని చూరగొన్నాడు. అటు తర్వాత వారి మంచి మాటలు చెప్పి తన వైపు తిప్పుకున్నాడు. 'మనం పేదవారమని, మనలో మనం తగవులాడుకుంటే భవిష్యత్తు ఉండదని, మన తర్వాతి తరం కూడా దరిద్రం అనుభవించవలసి వస్తుందని నచ్చజెప్పాడు. కుటుంబరావు ప్రయత్నాలు ఫలించాయి. రెండు వర్గాలు ఏకమయ్యాయి. అంతలోనే లంకభూములు, రెల్లుగడ్డి భూములు వేలం పాటకు వచ్చాయి. కక్షలు అంతరించడం వల్ల పోటీ లేకుండా వేలంలో పాల్గొనమని గ్రామ యువకులు కుటుంబరావును కోరారు. తన పేరు మీద వేలంలో పాల్గొనడం బాగుండదని ఇరు వర్గాలకు శ్రేయోభిలాషి అయిన మైనేని చంద్రయ్య పేర వేలం పాట పాడించాడు. ఎప్పుడూ 25,000 రూపాయలకు పాడేది ఈసారి రెండు వేల రూపాయలకే పాడారు. ఈసారి లంకభూములకు ఎడ్లున్న రైతులకు ఒక వాటా, ఎడ్లు లేని రైతులకు సగం వాటా చేసుకొమ్మని కుటుంబరావు ఇచ్చిన సలహా పాటించారు.

కుటుంబరావు ఎడ్లలంకకు వెళ్లిన నెలరోజుల్లోనే విద్యార్థుల సంఖ్య 30కి పెరిగింది. మొదట్లో బడికి ఎక్కువ మంది రాకపోవడానికి పేదరికం ప్రధాన కారణంగా వుండేది. పిల్లలు బడికి వచ్చే బదులు పశువుల కాడికి పోతే భుక్తి గడిచే పరిస్థితి వుండేది. పెద్దలు తమ పిల్లల్ని బడికి కాక పశువులకాడికి పంపడానికే మొగ్గు చూపేవారు. యలమంచిలి వెంకట్రామయ్య అనే రైతు బడికి పోతున్న కుమారుడు సుబ్బారావును కోప్పడి పశువుల కాడికి బలవంతంగా పంపించాడు. కుటుంబరావు వెంకట్రామయ్యకు నచ్చజెప్పి అతని భవిష్యత్తును నాశనం చేయవద్దని, బడికి పంపమని కోరాడు. శంకరరావు అనే మరో కుర్రవానికి తండ్రి లేడు. గేదెల్ని మేపి పాలు అమ్ముకుంటే తప్ప కుటుంబ పోషణ సాధ్యమయ్యేది కాదు. ఆ కుర్రవాడు తన గేదెల్ని మేపుకుంటూ స్కూలుకు దగ్గరగా రావడమే కాక చదువుకుంటున్న పిల్లల్ని తిడుతుండేవాడు. 'నీ యమ్మ' అనే మాట లేకుండా మాట్లాడేవాడు కాదు. ఒకనాడు కుటుంబరావు ఆ బాలుడ్ని పిలిచి మాట్లాడబోగా ఆయనతో కూడా వాడు అదే భాషలో మాట్లాడబోయాడు. వానికి అన్ని విధాలా నచ్చజెప్పి చదువుకుంటే జీవితంలో పైకి వస్తావని హితవు పలికాడు. దాంతో బడికి రావడానికి శంకరరావు సమ్మతించాడు. వాడు బడికి వస్తుండడంతో తల్లి లబోదిబోమంటూ కుటుంబరావు దగ్గరకు వచ్చి 'అయ్యా! మాకు పొలం లేదు. సంపాదించి పెట్టే దిక్కు లేదు. గేదెల్ని మేపుకుని పాలు అమ్ముకుంటే తప్ప గడిచే పరిస్థితి లేదని కుర్రవాడ్ని పంపించి వెయ్యమని అడిగింది. పదిగంటలకల్లా బడి నుంచి వదిలేస్తానని చెప్పడంతో ఆమె ఒప్పుకుంది. పది తర్వాత గేదెల్ని మేపడానికి వెళ్లేవాడు. ఆ స్కూల్లో ముగ్గురు హరిజన కుర్రాళ్లు చేరారు. దానికి అగ్రకులస్తులు అభ్యంతరం చెప్పారు. వాళ్లను తమ పిల్లలతో పాటే కూర్చోబెట్టవద్దని, వాళ్లను బడి నుంచి

పంపివెయ్యమని అన్నారు. కుటుంబరావు చొరవ తీసుకుని ఆ పిల్లల్ని బడి మాన్పవద్దని, కావాలంటే వారిని దూరంగా కూర్చోబెడతానని వారికి నచ్చజెప్పి ఒప్పించాడు.

కమ్యూనిస్టు సమావేశాలు

అప్పటికే కుటుంబరావు కమ్యూనిస్టు పార్టీలో వున్నాడు. పార్టీపై నిషేధం వుండడంతో చాలామంది నాయకులపై అరెస్టు వారెంటు వుంది. అజ్ఞాతంలో వున్న నాయకులు అప్పుడప్పుడూ రహస్యంగా కుటుంబరావును కలుసుకునేవారు. దివిసీమలో కుటుంబరావు, మందపాకల వెంకటరత్నం, సనకా బుచ్చికోటయ్య, మోదుమూడి శ్రీహరిలతో కలిసి ఒక యూనిట్ వుండేది. ఈ యూనిట్ సమావేశం కావాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవారు. పులిగడ్డ, కొత్తపేట గ్రామాల మధ్య కృష్ణానదిని ఆనుకొని సెటిల్‌మెంట్ బంగళా అని ఒక భవనం వుండేది. ఆ భవనాన్ని పూర్వం దివిసీమలో భూముల సెటిల్‌మెంట్ చేసినప్పుడు కట్టారట. ఆ యూనిట్ సభ్యులు వేరువేరు వైపుల నుంచి బంగళా దగ్గరికి వెళ్లి తలుపులు తెరచి లోపల లాంతరు వెలిగించి పాములు తేళ్లు లేకుండా చూసుకొని సమావేశం ప్రారంభించేవారు. పార్టీ రహస్య పత్రిక 'స్వతంత్ర భారత్'లోని వార్తల్ని, విశేషాల్ని తెలియజేసుకొని పార్టీ తరపున చేయవలసిన రహస్య కార్యక్రమాల గురించి చర్చించుకునేవారు. ఆ రోజుల్లో ప్రభుత్వం ఆస్తుల దొంగతనాలు లేవు. అందువల్లనే అంతకు పూర్వం 30 ఏళ్ల కిందట కట్టిన సెటిల్మెంటు బంగళాకు తలుపులు, కిటికీలు చెక్కుచెదరకుండా ఉన్నాయి.

1942 ఆగస్టు 22న ప్రముఖ విప్లవకారుడైన పృథ్వీసింగ్ గుంటూరు జిల్లాలోని వినయాశ్రమానికి వస్తాడని పత్రికల్లో వార్త ప్రచురితమైంది. కుటుంబరావు, వేములపల్లి రాజగోపాలరావు కలిసి అక్కడికి వెళ్లారు. కాని పృథ్వీసింగ్ రాలేదు. గాంధీజీ శిష్యుడైన కుమారప్ప, రామేశ్వర నెహ్రూ, వీరయ్య (గాయకుడు) వంటివారు మాత్రమే వున్నారు. దాంతో కుటుంబరావు, రాజగోపాలరావు నిరుత్సాహపడి ఎడ్లలంకకు తిరుగు ప్రయాణమయ్యారు. ఆ రాత్రి రేపల్లె చేరుకొని తెల్లవారు జాముకల్లా పెనుమూడికి నడచి వచ్చారు.

స్కూళ్ల ఇన్స్‌పెక్టర్లతో తిప్పలు

తెల్లవారింది. కుటుంబరావు, రాజగోపాలరావు పెనుమూడి చేరుకునేసరికి అవనిగడ్డ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఒంటెద్దుల బండిలోంచి దిగాడు. అవనిగడ్డ వెళ్లాలంటే పెనుమూడి నుంచి కృష్ణానదిలో పడవలో ఎడ్లలంక వరకు వెళ్లి అక్కడ పడవ దిగి నడుస్తూ అవనిగడ్డ చేరుకోవాలి. ఆయన ఎడ్లలంక వద్ద పడవ దిగి స్కూలు చూసి గాని అవనిగడ్డ వెళ్లడు కాబట్టి ఇప్పుడే మంచి చేసుకునే ప్రయత్నాల్లో పడ్డారు ఇద్దరు మిత్రులు. గోపాలరావు పెనుమూడి నుంచి ఎడ్లలంక వెళ్లేందుకు పడవనొకదాన్ని కుదుర్చుకు వచ్చాడు. ఇన్స్‌పెక్టర్‌ను

ఎక్కమన్నాడు. ఆ ఇన్‌స్పెక్టర్‌కు వీళ్లెవరో తెలీదు. ఆయనది రాజమండ్రి అనే విషయం మాత్రం కుటుంబరావుకు, రాజగోపాలరావుకు తెలుసు. వీరు ఇన్‌స్పెక్టర్‌ను మాటల్లోకి దింపి పొగడ్తలతో ముంచెత్తనారంభించారు. వాటికి ఆయన ఉబ్బితబ్బిబ్బయి తాను రాజమండ్రి గోదావరిలో ఈత కొట్టేవాడినని, అదనీ ఇదనీ ఘనకార్యాలు వల్లించాడు. అంతలో పడవ ఎడ్లలంక చేరింది. ఆయన పడవ దిగి ఇక్కడ స్కూలు వుంది చూసి వస్తానని చెప్పాడు. తామే ఆ స్కూలు టీచర్లమనీ, నిన్న ఆదివారం కాబట్టి పనుండి రేపల్లె వెళ్లి వస్తున్నామని చెప్పి ఇన్స్‌పెక్టర్‌ను స్కూలుకు తోడుకొని వెళ్లారు. అక్కడ ఆయనకు కుర్చీవేసి కూర్చోబెట్టి ఇంటి నుంచి కాఫీ, టిఫిన్ తెచ్చి అందించారు. అంతలో విద్యార్థులు రావడం మొదలైంది. పిల్లల అల్లరి చూసి వాళ్లను ఇళ్లకు పంపివేయమని ఇన్స్‌పెక్టర్ టీచర్లను కోరారు. పిల్లల్ని పంపివేశారు. తర్వాత ఇన్స్‌పెక్టర్ కుటుంబరావుతో, రాజగోపాలరావుతో మాట్లాడి అటెండెన్స్ రిజిస్టరు తెప్పించి 30 మంది విద్యార్థులు బడికి వచ్చినట్లు తానే పూర్తి చేశాడు. ఆ రోజుల్లో ట్రైనింగ్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు 18 నెలల పాటు గ్రాంటు స్కూళ్లలో పనిచేయాల్సి వుండేది. ఆ కాలంలో వారి పనితీరు బావుందని తనిఖీకి వచ్చిన ఇన్స్‌పెక్టర్లు రాసిన తర్వాత ఆ సర్టిఫికెట్‌ను పై అధికారులకు పంపితేనే అప్పుడు అధికారికంగా వేలిడ్ సర్టిఫికెట్‌ను జారీ చేసేవారు. అలా చేయకపోతే ట్రైనింగ్ సర్టిఫికెట్ చెల్లేది కాదు. అలా కుటుంబరావు తన సర్టిఫికెట్‌ను పూర్తి చేయమని కోరగా తర్వాత చేస్తానని చెప్పి ఇన్స్‌పెక్టర్ వెళ్లిపోయాడు.

తర్వాత తిరిగి 1940 డిసెంబర్ 23న పాఠశాలను సందర్శించాడు. అప్పుడు కూడా సర్టిఫికెట్ పూర్తి చేయలేదు. తర్వాత బదిలీ అయింది. అప్పుడు సర్టిఫికెట్‌ను తెప్పించుకొని పూర్తి చేశాడు. 1941 ఏప్రిల్ 14న చామర్తి వెంకటరామయ్య అనే ఇన్స్‌పెక్టర్ ఎడ్లలంక పాఠశాలకు వచ్చాడు. కుటుంబరావు సమయానికి పాఠశాలలో లేడు. ఆయనకు సహాయకునిగా వున్న ఉపాధ్యాయుడు రాజగోపాలరావు వాలు కుర్చీ (నర్సారావుపేట కుర్చీ అని పిలిచేవారు)లో కూర్చుని ఉన్నాడు. ఇన్స్‌పెక్టర్ నువ్వెవరు? అని ప్రశ్నించాడు. పాఠశాల పనివేళల్ని గురించి అడిగాడు. పాఠశాల ఉదయం 7.30 గంటలకు అని బదులిచ్చాడు. పక్కనే ఇంట్లోంచి కుటుంబరావు బిగ్‌బెన్ గడియారాన్ని పుచ్చుకొని పాఠశాలలోకి వచ్చి ఇన్స్‌పెక్టర్‌కు నమస్కరించాడు. 'నీవెవరవు?' అనడిగాడు. 'నేను ప్రధానోపాధ్యాయుడిని' అని చెప్పాడు. పాఠశాల ఎన్ని గంటలకు ప్రారంభమవుతుందని ఇన్స్‌పెక్టర్ కుటుంబరావును ప్రశ్నించాడు. ఉదయం ఏడుగంటలకని బదులిచ్చాడు. 'నీ సహాయకుడు ఏడున్నరకని అన్నాడేమిటి?' అన్నాడు. మిమ్మల్ని చూసి భయపడి అలా చెప్పి వుంటాడన్నాడు కుటుంబరావు. దాంతో నేనతడ్ని ఉపాధ్యాయునిగా గుర్తించనని అన్నాడు. ఆ మాటతో రెచ్చిపోయిన గోపాలరావు రెండు కాళ్లను తన ముందున్న బల్లపై పెట్టాడు నన్ను ఉపాధ్యాయునిగా గుర్తించనప్పుడు నిన్ను గౌరవించేదేమిటన్నట్లు.

ఆనాడు ఉపాధ్యాయుల పరిస్థితి ఎలా వుండేదో చెప్పడానికి ఈ సంఘటనలు చెప్పవలసి వస్తోంది. ముఖ్యంగా ఇన్స్‌పెక్టర్ల హడావుడి, వాళ్లు ఉపాధ్యాయుల పట్ల వ్యవహరించే పద్ధతి దారుణంగా వుండేది.

ఇన్స్‌పెక్టర్ కుటుంబరావుతో సర్టిఫికెట్ తీసుకుని అవనిగడ్డ రమ్మని చెప్పాడు. కుటుంబరావు అవనిగడ్డకు వెళ్లి సర్టిఫికెట్ చూపించాడు. 'ఇదేమిటి? ఫోర్జరీ సర్టిఫికెట్‌లా వుంది!' అంటూ అంతకు ముందు ఇన్స్‌పెక్టర్ సంతకం చేసిన చోట ఓ గీత గీశాడు. కుటుంబరావు ఇన్స్‌పెక్టర్ చేతిలో నుంచి సర్టిఫికెట్ లాక్కున్నాడు. సర్టిఫికెట్ లాక్కుంటా వేమిటని ఇన్స్‌పెక్టర్ కుటుంబరావును ప్రశ్నించాడు. 'ఆ సర్టిఫికెట్ సరైంది అయితేనే మీరు ఇన్స్‌పెక్టర్. నేను టీచర్‌ను. అది ఫోర్జరీదైతే మీరెవరో నేనెవరో' అంటూ కుటుంబరావు వెనుదిరిగాడు. విసవిసా నడచి ఇవతలికి వస్తున్న కుటుంబరావుకు కంఠంనేని వెంకట రంగయ్య ఎదురుపడ్డాడు. మాటామాటా అనుకోవడం గమనించిన రంగయ్య వెళ్లిపోతున్న కుటుంబరావును రెండు చేతులు చాచి కావలించుకున్నాడు. 'ఏమిటి నాయనా కేకలేస్తూ వెళుతున్నావు' అని అనునయంగా అడిగారు. కుటుంబరావు ఆవేశం ఎంత మాత్రం తగ్గలేదు. అది ఆవేదనగా మారింది. "నేను హాయిగా వ్యవసాయం చేసుకోక ఈ అణా కానీ ఉద్యోగాలు చేస్తూ అడ్డమైనవాడి మాటలు పడవలసి వస్తోంది" అన్నాడు.

కంఠంనేని వెంకటరంగయ్యవందల ఎకరాల భూస్వామి. 1890 ప్రాంతాల్లోనే మద్రాసులో ఇంగ్లీషు హైస్కూళ్లలో చదువుకున్నారు. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ పాండిత్యం సంపాదించారు. ఆ రోజుల్లో బ్రిటిషువారే కలెక్టర్లుగా వుండేవారు. వెంకటరంగయ్య కృష్ణా జిల్లా బోర్డు, బందరు తాలూకా బోర్డుల్లో సభ్యులుగా వుండేవారు. నాగాయితిప్ప గ్రామ మునసబుగా వున్నప్పటికీ ఏనాడూ జమాబందీలకు వెళ్లేవారు కాదు. తాలూకా కేంద్రమైన అవనిగడ్డ పంచాయితీకి అధ్యక్షునిగా కూడా ఉండేవారు. ఆయనకున్న పేరు ప్రఖ్యాతులను గ్రహించిన ఆనాటి ప్రభుత్వం బంగారు చేతికర్రను బహూకరించింది. రావు సాహెబ్ అనే బిరుదుతో సత్కరించింది. అప్పటికే కంఠంనేనికి 70 ఏళ్ల వయసుంటుంది.

తర్వాతేం జరిగిందంటే, కుటుంబరావు విషయంలో వెంకటరంగయ్య ఇన్స్‌పెక్టర్‌ను ఏమైనా అన్నాడో లేక కుటుంబరావు ఇన్స్‌పెక్టర్‌పై కోపగించుకుని వెళుతున్నప్పుడు రంగయ్యా అనునయంగా కావలించుకున్నది చూశాడో మొత్తానికి తనను సర్టిఫికెట్ తీసుకు రమ్మని తన జవాను సుబ్బయ్య ద్వారా కబురు పంపాడు. దానికి కుటుంబరావు నా సర్టిఫికెట్, నా సహాయకుడైన గోపాలరావు సర్టిఫికెట్ సక్రమంగా పూర్తి చేస్తే తప్ప రానని చెప్పాడు. ఇన్స్‌పెక్టర్ అందుకు అంగీకరించి రెండు సర్టిఫికెట్లను సక్రమంగా పూర్తి చేశాడు.

1941 జూలై 27న అవనిగడ్డలో ఉపాధ్యాయుల సెంటర్ క్లాస్ జరిగింది. ఆ క్లాస్‌లో జవహర్‌లాల్ నెహ్రూను గురించి ఉపన్యాసం చెప్పమన్నారు. మిగతా ఉపాధ్యాయులు నెహ్రూ

కాశ్మీరు బ్రాహ్మణుడని, ఆయన తండ్రి మోతీలాల్ నెహ్రూ అని.. ఈ విధంగా ఏవేవో చెప్పడం ప్రారంభించారు. తర్వాత కుటుంబరావు వంతు వచ్చింది. 'పండిట్ నెహ్రూ ఆయన తండ్రి మోతీలాల్ కలిసి కమ్యూనిస్టు పాలనలో వున్న రష్యాను చూసి వచ్చారు. ఆయన బ్రిటిషు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకి. అంతేగాక జర్మనీలోని నాజీజానికి, దాని నాయకుడైన హిట్లరుకు, అలాగే ఇటలీ ఫాసిస్టు నాయకుడైన ముస్సోలినీ మొదలైనవారందరికీ వ్యతిరేకంగా వుండేవారు. భార్య కమలాదేవి మరణించిన కొద్ది రోజులకు నెహ్రూ రోమ్‌లో ఒక హోటల్‌లో విడిది చేసి వున్నారు. అప్పుడు ఇటలీ దేశాధ్యక్షుడు ఫాసిస్టు నియంత ముస్సోలినీ నెహ్రూకు ఒక సందేశం పంపుతూ 'ప్రోటోకాల్ కారణాల వల్ల మీరున్న హోటల్‌కు రాలేకపోతున్నాను. మీరే నా అధికార నివాసానికి రండి!' అన్నారు. ఆ ఆహ్వానాన్ని నెహ్రూ తిరస్కరించాడు. దానికి ముస్సోలినీ స్పందించి తానే హోటలుకు వస్తున్నానని తిరిగి కబురు పంపాడు. 'మీరు వచ్చినా నేను ఇంటర్వ్యూ ఇవ్వను' అని ముస్సోలినీకి సమాధానం చెప్పారని... ఈ విధంగా కుటుంబరావు నెహ్రూను గురించి ప్రసంగించాడు.

ఆ తర్వాత రెండు రోజులకు స్కూళ్ల ఇన్స్‌పెక్టర్ నారాయణ నాయుడు ఎడ్లలంక పాఠశాలకు వచ్చాడు. నిజానికి హాజరు పట్టికను ఉదయం ఏడున్నరకల్లా పూర్తి చేయాలి. కాని ఆ రోజు కుటుంబరావు, గోపాలరావు పట్టిక పూర్తి చేయలేదు. ఇన్స్‌పెక్టర్ కిటికీలో నుంచి చూడనే చూశారు. ఆయన వచ్చి ఈ విషయం బయటపడితే బావుండదని కుటుంబరావు పిల్లలకు సైగ చేసి అందరినీ నిలబడమని చెప్పాడు. ఒక పద్యం చదువుతాను వినమన్నాడు. 'భూషలు కావు మర్త్యులకు' అంటూ పద్యం ప్రారంభించాడు. ఇన్స్‌పెక్టర్ కిటికీ అవతలే నిలబడి ఇది వినసాగాడు. కుటుంబరావు పద్యం చదువుతూనే రాజగోపాల రావుతో కలిసి ఇంకోవైపు హాజరు పట్టిక పూర్తి చేశాడు. లోపలికి వచ్చిన ఇన్స్‌పెక్టర్‌ను అప్పుడే చూస్తున్నట్లు లేచి నమస్కారం చేశారు. ఇన్స్‌పెక్టర్ కూర్చుంటూ 'ఇప్పుడు నీవు చెప్పిన పద్యం పాఠ్యాంశాల్లో వున్నదేనా?' అని ప్రశ్నించాడు. లేదని బదులిచ్చాడు కుటుంబరావు. పిల్లలకు భాషపై పట్టు వచ్చేలా ఇటువంటి పద్యాలు చెబుతానన్నాడు. ఇంకా ఏమేం చెప్పావని అడిగాడు. 'మనుచరిత్ర'లో నుంచి కూడా చెబుతున్నానని కుటుంబరావు చెప్పాడు. అది కూడా పిల్లలతో చెప్పించమన్నాడు ఇన్స్‌పెక్టర్. కుటుంబరావు ఆదేశంపై ఒక విద్యార్థి లేచి చదివాడు. అది విన్న ఇన్స్‌పెక్టర్ విద్యార్థులను వదిలి వేయమని చెప్పాడు. తర్వాత ఇన్స్‌పెక్టర్ సోషలిస్టులు అంటే ఏమిటి? అని కుటుంబరావును అడిగాడు.

ఆ రోజుల్లో కమ్యూనిస్టులన్నా, సోషలిస్టులన్నా ప్రభుత్వాధికారులు ఎంతో భయపడేవారు. తన ఆధీనంలో పనిచేస్తున్న ఉద్యోగులు సోషలిస్టులో కమ్యూనిస్టులో అయినా వారితో ఏదో విధంగా సంబంధాలు కలిగినవారైనా ఆ విషయాన్ని పై అధికారులకు తెలియజేయాల్సి వుండేది. ముఖ్యంగా బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూనిస్టులంటే భయపడేది.

తన గురించి ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చి వుంటారని కుటుంబరావుకు అర్థమైంది. 'అయ్యా! ఇన్స్పెక్టర్‌గారూ! నేను కమ్యూనిస్టునని మీకెవరైనా చెప్పారా? బ్రాహ్మణేతరులు టీచరు ఉద్యోగాలు చేయడం బ్రాహ్మణులకు గిట్టదు. కాబట్టి కచ్చితంగా నా గురించి మీకు అలా చెప్పి వుంటారు' అన్నాడు. ఇన్స్పెక్టర్ నారాయణనాయుడు వెంటనే స్పందించి 'నిజమేనయ్యా! శనివారంనాడు నీవు జవహర్‌లాల్ నెహ్రూ గురించి చెప్పిన ఉపన్యాసంలో ఆయన సోషలిస్టు, కమ్యూనిస్టు అభిమాని అన్న విషయం నాకు అర్థం కాక నీవు వెళ్లిన తర్వాత మిగతా ఉపాధ్యాయులను నీ గురించి అడగ్గా నీవు సోషలిస్టువని చెప్పారు. నీవు నిజంగా సోషలిస్టువే అయితే ఆ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలి. లేకపోతే నా ఉద్యోగం ఊడుతుంది' అని అన్నాడు. 'అయ్యా! జవహర్‌లాల్ గురించి నేను చెప్పిన ఉపన్యాసంలో నేను కమ్యూనిస్టునని, సోషలిస్టునని ఎక్కడా చెప్పలేదు. నెహ్రూ గురించిన వివరాలే చెప్పాను. నిజానికి ఆ పార్టీలతో నాకు సంబంధాలు కూడా లేవు' అని కుటుంబరావు చెప్పడంతో ఇన్స్పెక్టర్ నిజాన్ని తెలుసుకుని 'నిజమేనయ్యా! నీ గురించి ఇతర ఉపాధ్యాయులు ఈ విధంగా చాడీలు చెప్పారు. కాని వారు చెప్పిన మాటలపై నాకు అనుమానం వచ్చి ఉదయమే నిర్ధారణ చేసుకునేందుకే దూరంగా నిలబడి నీవు పిల్లలకు పద్యాలు చెప్పడం విన్నాను. విద్యార్థులకు తరగతిలో పుస్తకంలోని అంశాలతో పాటు ఇతర విషయాలను, పద్యాలను చెప్పడం నేనెక్కడా వినలేదు. నీ ప్రత్యేక కృషి నాకు అర్థమైంది. నేనలా చాటుగా వచ్చి అవన్నీ గమనించినందుకు ఏమీ అనుకోకు' అని అన్నారు. నీకే అవసరం వచ్చినా నా దగ్గరకు రా అని భరోసా ఇచ్చారు. అంతకు ముందు చామర్తి వెంకట్రామయ్య అనే స్కూళ్ల ఇన్స్పెక్టర్ సర్టిఫికెట్‌పైన వేసిన తప్పుడు తేదీని చూపించగా ఆ ఇన్స్పెక్టర్‌కు పంపించి దాన్ని సరి చేయించారు. ఆ తర్వాత served, verified and approved అని రాసి 1941 డిసెంబర్ 4నాటికి పూర్తయ్యిందని ధ్రువీకరించి జిల్లా విద్యాశాఖాధికారికి పంపారు. డి.ఇ.ఓ. దాన్ని పూర్తి చేసి కుటుంబరావుకు పంపించారు.

వృద్ధిలోకి వచ్చిన కుటుంబరావు శిష్యులు

ఎడ్లలంకలో పశువులు కాచుకుంటూ ప్రతి మాటకు బూతులు తిడుతూ వుండిన ఎలమంచిలి శంకరరావును కుటుంబరావు కుటుంబం చేరదీసి నచ్చజెప్పి చదువు నేర్పగా అతను వెటర్నరీ బిఎస్సి చదివి పశుసంవర్ధక శాఖలో పెద్ద ఉద్యోగం చేశాడు. తర్వాతి కాలంలో ఒకనాడు కాకాని వెంకటరత్నం కప్తాన్‌పాలెంలో సభ పెట్టి రైతు నాయకునిగా వున్న కావూరి కుటుంబరావును ఆ సభకు పిలిచారు. అక్కడ కుటుంబరావు, వెంకటరత్నం మాట్లాడుకుంటూ వుండగా ఒకతను వచ్చి కుటుంబరావు కాళ్ల మీద పడ్డాడు. ఎవరు నాయనా నువ్వు అని అడగ్గా మాష్టారూ! నేను శంకర్‌గాడినండీ! నేనిప్పుడు వెటర్నరీ డిపార్ట్‌మెంటులో ఇంత పెద్ద ఉద్యోగం చేసుకుంటూ సుఖంగా ఉన్నానంటే ఆనాడు మీరు చూపిన మార్గమే

కదా! అని అన్నాడు అప్పట్లో కుటుంబరావు వద్ద ఎడ్లలంకలో చదువుకున్న విద్యార్థి ఎలమంచిలి సుబ్బారావు ఇరిగేషన్ డిపార్ట్‌మెంటులో సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా పదవీవిరమణ చేశాడు. తిరుపతి అనే హరిజన బాలుడు తర్వాత అదే గ్రామంలో ఉపాధ్యాయునిగా పనిచేసి పదవీవిరమణ చేశాక ఇటీవలే మరణించాడు.

ఎడ్లలంకలో మైనేని రామారావు, రాజగోపాలరావు, హరిప్రసాద్ అనే మునసబు సోదరులుండేవారు. రామారావు గ్రామ మునసబుగా వుండేవాడు. రెండవవాడు రాజగోపాలరావు కృష్ణకు అవతల రేపల్లె తాలూకా మైనేనివారి పాలెంలో వున్న నూరు ఎకరాల మాగాణిలో వ్యవసాయం చేసుకుంటూ అక్కడే స్థిరపడ్డాడు. మూడోవాడు హరిప్రసాద్ అభ్యుదయ భావాలు కలిగినవాడు. ఉన్నత విద్యను అభ్యసించి అణుశక్తి రంగంలో పెద్ద పదవులు పొంది సేవ చేశాడు. భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ సత్కారం అందుకున్నాడు. ఈ ముగ్గురు సోదరులకు కుటుంబరావు అంటే ఎంతో అభిమానం. కుటుంబరావు వద్ద చదువుకున్న పేద విద్యార్థులెందరికో ఉన్నత విద్య కోసం సహాయం చేశారు.

కుటుంబరావు ఎడ్లలంకలో ఉపాధ్యాయునిగా చదువు చెప్పి 1942 జనవరిలో ఉద్యోగానికి స్వస్తి చెప్పాడు. ఉపాధ్యాయ వృత్తి విరమించి ఇప్పటికి 65 ఏళ్లు గడిచింది. తన వద్ద చదువుకున్న నాటి బాలురు ఈనాడు 75 ఏళ్ల వయసులో వున్నారు. ఎక్కడెక్కడో వుంటున్నా అలనాటి తమ గురువుగారైన కుటుంబరావును వెతుక్కుంటూ ఇప్పటికీ హైదరాబాద్ వస్తుంటారు. గురువు పాదాలకు నమస్కరించి చిన్ననాటి సంగతులను మననం చేసుకొని ఆనందభాష్పాలు రాల్చడం ఎంతో అపురూపంగా వుంటుంది.

ఇతరత్రా సేవా కార్యక్రమాలు

అది 1942 సంవత్సరం. అప్పటికి ఐరోపాలో జరుగుతున్న రెండవ ప్రపంచ యుద్ధంలో మార్పులు చోటు చేసుకున్నాయి. జర్మనీ, జపాన్, ఇటలీ ఒకవైపు, ఇంగ్లండు, అమెరికా, చైనా, రష్యా మరోవైపు నిలిచి పోరాడుతున్నాయి. అంతకుముందు యుద్ధాన్ని వ్యతిరేకించిన భారత కమ్యూనిస్టు పార్టీ యుద్ధంలో వచ్చిన తాజా మార్పులతో వైఖరిని మార్చుకుని దాన్ని ప్రజాయుద్ధంగా అభివర్ణించింది. ఆ సంవత్సరం భారత రాజకీయాల్లో కూడా పెనుమార్పులు ఏర్పడ్డాయి. 1942 ఆగస్టు 9న భారత జాతీయ కాంగ్రెస్ చారిత్రాత్మకమైన క్విట్ ఇండియా పోరాటానికి విప్లవశంఖం పూరించింది. గాంధీజీతో సహా కాంగ్రెస్ జాతీయ నాయకులందరినీ బ్రిటిషు ప్రభుత్వం అరెస్టు చేసి అహ్మద్‌నగర్ జైలుకు తరలించింది. ఆనాడు కమ్యూనిస్టు పార్టీ బెంగాలు, ఆంధ్ర, మలబారు వంటి ప్రాంతాల్లోనే వుంది.

1942లో దివి తాలూకా ప్రథమ యువజన సభను మోపిదేవిలో జరిపారు. కుటుంబరావు

బంధువైన రావి దుర్గాప్రసాద్ అధ్యక్షునిగా, కంచర్ల వెంకటేశ్వరరావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సభ పూర్తయ్యాక కుటుంబరావు, మందపాకల వెంకటరత్నం, కేమిశెట్టి కోటయ్య, రావి దుర్గాప్రసాద్ యువజన సంఘం ముందు ముందు చేపట్టవలసిన కార్యక్రమాల గురించి చర్చించారు. సంఘం పక్షాన సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. సరిగ్గా ఆ తర్వాత రెండు రోజులకే పెదకళ్లేపల్లిలో శివరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయనీ, ఆ ఉత్సవాలకు వెళ్లి ప్రజలకు ఏమైనా సేవ చేద్దామా అని వెంకటరత్నం ప్రతిపాదన తెచ్చారు. మిగతా యువకులు సరేనన్నారు. కళ్లేపల్లి వెళ్లారు. అక్కడ నాగేశ్వర దేవాలయానికి సమీపంలో వెనుక వైపు రోడ్డు పక్కన ఒక పాక వుండేది. శివరాత్రి ఉత్సవాలయ్యే వరకు తాము అక్కడ వుంటూ ఈ సేవా కార్యక్రమాలు నిర్వర్తించ దలిచామని ఇంటి యజమానిని అడిగారు. వారు ఒప్పుకున్నారు.

రావివారిపాలేనికి తూర్పున నాలుగు మైళ్ల దూరంలో పెదకళ్లేపల్లి వుంది. అది గొప్ప గొప్ప పండితులు, కళాకారులు పుట్టిన నేల. వారు వివిధ రంగాల్లో విశేషమైన కీర్తినార్జించి ఆ గ్రామానికి ఎంతో పేరు తెచ్చి పెట్టారు. వేటూరివారు, సుసర్ల వారు, శిష్ట్లావారు, కొడాలివారు, బుద్ధువారు, ప్రభలవారు పెదకళ్లేపల్లిలోని ముఖ్యులు. వేటూరి ప్రభాకరశాస్త్రి గొప్ప పరిశోధకులు, పండితులు. ఆయన తెలుగు సాహిత్య రంగంలో మహోన్నత శిఖరమై ప్రకాశించారు. ప్రభాకరుల కుమారుడు ఆనందమూర్తి కూడా తండ్రికి తగ్గ తనయుడని పేరు తెచ్చుకున్నాడు. వేటూరి సుందరరామ్మూర్తి సినీగేయ రచయితగా సముపార్జించిన ఖ్యాతి అందరికీ తెలిసిందే. ఆయన కూడా వేటూరివారి సంతతికి చెందినవాడే. సంగీత దర్శకునిగా పేరు పొందిన సుసర్ల దక్షిణామూర్తి, కవి కొడాలి సుబ్బారావు, ఆదర్శోపాధ్యాయుడు, మనస్వి బుద్ధు కుటుంబరావు వంటి ఎందరో మహనీయులు ఆ గ్రామంవారే.

కుటుంబరావు మిత్రబృందం కళ్లేపల్లి శివరాత్రి ఉత్సవాల్లో వాలంటీర్లుగా సేవ చేయడానికి వెళ్లి అక్కడ ఒక పాకలో మకాం వేశారు. మందపాకల వెంకటరత్నం (వీరి కుమార్తె ప్రముఖ రచయిత్రి రేడియో ప్రయోక్త తురగా జానకీరాణి) ఇరవై ముల్లుగర్రలు, పిన్నీసులు, గజం ఎర్రటి బట్ట తెప్పించాడు. ఆ గుడ్డను చిన్న చిన్న బాడ్జీలుగా కత్తిరించి ఒక్కో యువకునికి పిన్నీసుతో బాడ్జి పెట్టి ముల్లుగర్రనిచ్చి దేవాలయం వద్దకు తీసుకు వెళ్లాడు. ముఖద్వారం మధ్య పది మంది యువకులను నిలబెట్టారు. ఇరు వైపులా కర్రలు పట్టుకుని వాలంటీర్లుగా నిలబడి భక్తులు ఒక వైపు నుంచి లోపలికి వెళ్లి మరోవైపు నుంచి తిరిగి వచ్చేలా ఏర్పాటు చేశారు. దీంతో స్త్రీలు, పురుషులు ఎటువంటి ఆటంకం, తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా దర్శనం చేసుకున్నారు. భక్తులు ఎంతో సంతోషించారు. అంతేకాకుండా మరికొందరు యువకులు చేత కర్రలు ధరించి శివరాత్రి స్నానానికి కృష్ణలో దిగేవారిని కూడా లోపలికి

వెళ్లకుండా కట్టడి చేస్తూ ప్రశాంతంగా పర్యవేక్షించారు.

ఈ ఉత్సవాల సందర్భంలో పెదకళ్లేపల్లిలో నాటి బ్రిటిష ప్రభుత్వం పోలీసు క్యాంపు పెట్టేది. నీలి వెంకటేశ్వరనాయుడు అనే సర్కిల్ ఇన్స్‌పెక్టరు ఆధ్వర్యంలో క్యాంపు వుండేది. అతడు అంతకు ముందు చల్లపల్లి పోలీసు స్టేషనులో సబ్ ఇన్స్‌పెక్టర్‌గా వుండేవాడు. అందరి పట్ల చాలా దురుసుగా దూకుడుగా ప్రవర్తించేవాడు. పోలీస్ స్టేషన్ ముందు నుంచి వెళ్లే యువకులకు కాస్త పెద్ద జుట్టు వుంటే చాలు వాళ్లను పిలిచి గుండు గీయించి పంపేవాడు. అలాగే అతడు బస్సులో వెళుతున్నప్పుడు దారిలో రోడ్డు పక్కన వంతెనలపై ఎవరైనా కూర్చుని వుండడం కంటపడితే బస్సు ఆపించి వారిని విపరీతంగా కొట్టేవాడు. ఇలాంటి ఎన్నో దౌర్జన్యాలు చేసేవాడు. అతనంటే అందరికీ హడలే. అటువంటి వెంకటేశ్వరనాయుడు పెదకళ్లేపల్లి శివరాత్రి ఉత్సవంలో దర్శనానికి రాగా అతడ్ని ఎడమవైపు నుంచి వెళ్లమన్న పాపానికి కేమిశెట్టి కోటయ్యను రెండు దెబ్బలు కొట్టి తీసుకువెళ్లి క్యాంపులో పెట్టాడు. ఇది తెలుసుకున్న వెంకటరత్నం క్యాంపులో చేరిన యువకులను తీసుకొని పోలీసు క్యాంపు వద్దకు వెళ్లారు. 'పోలీసు జులుం నశించాలి', 'నీలి వెంకటేశ్వర నాయుడు డౌన్ డౌన్', 'కేమిశెట్టి కోటయ్యను విడుదల చేయాలి' అని నినాదాలు చేయడం మొదలు పెట్టారు. అప్పటికే వెంకటేశ్వరనాయుడంటే ప్రజల్లో వున్న వ్యతిరేకత, సేవలతో మంచి పేరు తెచ్చుకున్న యువకుడ్ని నిర్బంధించడం విని అక్కడివారు వందల సంఖ్యలో అక్కడికి వచ్చి యువకులకు అండగా నిలబడ్డారు. వారు కూడా నినాదాలివ్వడం ప్రారంభించారు. ఇదంతా చూసి బెంబేలెత్తిన వెంకటేశ్వరనాయుడు కోటయ్యను పోలీసు క్యాంపు నుంచి పంపించేశాడు. యువకులు విజయోత్సాహంతో నినాదాలు చేస్తూనే అక్కడ్నించి తిరిగి వచ్చారు.

కోసూరు పున్నయ్య, సుబ్బారావు బుర్రకథ బాగా చెప్పేవారు. ఉత్సవాల సమయంలో పగలు యువజనులతో దేవాలయం వద్ద, కృష్ణానది వద్ద ఈ స్వచ్ఛంద సేవ చేస్తూనే రాత్రిపూట ఉత్సవాల మూడు రోజులూ బుర్రకథలు చెప్పారు. ఈ ఊపు చూసి చుట్టుపక్కల గ్రామాల నుంచి కొన్ని వందల మంది యువకులు కుటుంబరావు, వెంకటరత్నం బృందం వద్దకు వచ్చారు. వారి చిరునామాలు తీసుకొని త్వరలో చల్లపల్లిలో యువజన సంఘం కార్యాలయం ప్రారంభించబోతున్నామని, మీరంతా అక్కడికి రమ్మనీ కోరారు.

కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో తొలి అడుగులు

అప్పటికి చల్లపల్లిలో కమ్యూనిస్టు పార్టీ ఆఫీసు లేదు. అప్పుడు చల్లపల్లిలో 10 వేల జనాభాకు మించదు. అయినప్పటికీ నలుగురు కమ్మ రైతులు, రెండు కరణాల కుటుంబాలు ఉండేవి. గ్రామం మధ్య జమీందారు కోట వద్ద నుంచి తూర్పు వైశ్యుల బజారు ఉండేది. ఎక్కువ నివాసాలు జమీందారుకు చెందినవే. వాటిలో జమీందారు మేనేజర్, ఇతర ఉద్యోగులు ఉండేవారు. వారంతా బ్రాహ్మణులే. పడమర వైపున దాసదాసీ జనం ఉండేవారు. దాసీలు

వివాహాలు చేసుకోవడానికి వీలు లేదు. కట్టుబాటును ఉల్లంఘించి పెళ్లి చేసుకుంటే ఇళ్ల నుంచి వెళ్లగొట్టేవారు. అవి కూడా జమీందారు ఇళ్లే. ఇంకో వైపున కొంత మంది మహమ్మదీయులు, గౌడ కులస్తులు, కాపులు ఉండేవారు. వీరిలో ఎక్కువ మంది జమీందారుపైనే ఆధారపడి వుండేవారు.

చల్లపల్లిలో తూర్పు వైపున సజ్జా రామయ్య అనే రైతు పెద్ద ఉండేవారు. ఆయనకు విశాలమైన స్థలంలో పెంకుటిల్లు, చావిళ్లు ఉండేవి. కుటుంబరావు, మరికొందరు కమ్యూనిస్టు పార్టీ పేరుతో కాకుండా ఆ ఇంట్లోనే ఉండేవారు. కొందరు కొంత అద్దె ఇస్తూ కొందరు ఉచితంగానూ ఆశ్రయం ఉండేవారు. అప్పుడప్పుడే నిషేధం సడలి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు బహిరంగంగా వస్తున్న రోజులు. ఆ గ్రామ కరణం తమ్ముడు చల్లపల్లి నారాయణరావు. కమ్యూనిస్టు పార్టీలో సభ్యునిగా చేరాడు. అప్పటికి 12 ఏళ్ల నాడే అంటే 1930లోనే నారాయణరావు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని సత్యాగ్రహం చేశాడు. ఒక సంవత్సరం జైలు శిక్షను అనుభవించాడు.

చల్లపల్లికి మూడు కిలోమీటర్ల దూరంలో మంగళాపురం అనే గ్రామం ఉంది. జమీందారీ వ్యతిరేక పోరాట కాలంలో పోలీసు కాల్పులు జరిగి రైతులు, కమ్యూనిస్టు కార్యకర్తలు నేలకొరిగిన గ్రామమది. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు చండ్ర రాజేశ్వర రావు స్వగ్రామం అది.

మంగళాపురంలో కొంతమంది పేద ముదిరాజు కులస్తులు కొంత భూమిలో వ్యవసాయం చేసుకునేవారు. వారిని భూమి ఖాళీ చేయవలసిందని జమీందారు కబురు పంపారు. రాజేశ్వరరావు పేదలకు ధైర్యం చెప్పి భూమి ఎట్టి పరిస్థితిలోనూ ఖాళీ చేయవద్దని సూచించాడు. పూర్వం ఇటువంటి సందర్భాల్లో రౌడీలను పంపి వారి మీద దౌర్జన్యం చేసి వెళ్లగొట్టేవారు. ఆ రోజులు పోయి అలా రౌడీలను పంపితే ప్రజలు తిరగబడే పరిస్థితులు రావడంతో జమీందారు పేద రైతులు భూముల్లోకి రాకుండా 144వ సెక్షన్ విధింపజేశారు. చండ్ర రాజేశ్వరరావు, చల్లపల్లి నారాయణరావు, గుంటూరు బాపనయ్య, యువజన నాయకుడు కొల్లి ప్రత్యగాత్మ మొదలైనవారి నాయకత్వాన పేదలేకమై 144వ సెక్షన్‌ను ధిక్కరించి భూమిలోకి వెళ్లారు. అప్పుడక్కడ నీలి వెంకటేశ్వరనాయుడు పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వుండేవాడు.

అతను చల్లపల్లిలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వున్నప్పుడు పోలీసుల్ని రోడ్డు మీద నిలబెట్టి డ్రిల్లు చేయించేవాడు. ఆ సమయంలో ఎవ్వరూ రోడ్డు మీద నడవటానికి వీలు లేదు. అప్పుడు బెనారస్‌లో చదువుకుంటున్న చండ్ర రాజేశ్వరరావు సెలవులకు ఊరు వచ్చాడు. చల్లపల్లి పోలీసు స్టేషన్ ముందు పోలీసులు డ్రిల్లు చేస్తుండగా వారి మధ్య నుంచి సైకిల్‌పై ముందుకు వెళ్లబోయాడు. దాంతో కోపగించిన వెంకటేశ్వరనాయుడు రాజేశ్వరరావును

కొట్టేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడ్ని నివారించి ఆ యువకుడు మంగళాపురంలోని పెద్ద జమీందారు కొడుకు అనీ, బెనారస్‌లో చదువుకుంటున్నాడనీ, అతని జోలికి వెళ్లడం మంచిది కాదని హెచ్చరించడంతో తన ప్రయత్నాన్ని మానుకున్నాడు.

ఆ విధంగా మంగళాపురంలో చంద్ర రాజేశ్వరరావు, నారాయణరావుల నాయకత్వంలో పేదలు 144వ సెక్షన్‌ను ఉల్లంఘించి భూముల్లోకి వెళ్లినప్పుడు వారిని అరెస్టు చేయడానికి వెంకటేశ్వర నాయుడు, పోలీసులు చల్లపల్లి జమీందారు వద్ద గుర్రాలు తీసుకొని ఎక్కి మంగళాపురం వెళ్లారు. అక్కడ శాంతియుతంగా సత్యాగ్రహం చేస్తున్న నాయకులను తీవ్రంగా కొట్టారు. రాజేశ్వరరావుపై మునుపటి క్రోధంతో ఆయనను తీవ్రంగా హింసించారు. గుంటూరు బాపనయ్యకు రెండు చేతివేళ్లు విరిగాయి. వారిపై 144వ సెక్షన్ ఉల్లంఘించారనే కేసు పెట్టి జైలులో వేశారు. కొంత కాలానికి బెయిలుపై విడుదలైనా కేసుల వాయిదాలకు రాజేశ్వరరావు, ఇతర నాయకులు అక్కడికి 16 మైళ్ల దూరంలోని బందరు కోర్టుకు, 8 మైళ్ల దూరంలోని అవనిగడ్డ కోర్టుకు అన్నపు మూటలు కట్టుకొని తిరిగారు. ఊరేగింపుగా గ్రామాల్లో నుంచి జమీందారీ వ్యతిరేక గీతాలు పాడుకుంటూ కోర్టులకు నడిచి వెళ్లేవారు. చివరికి 144వ సెక్షన్ ఉల్లఘించిన నేరానికి ఆరు మాసాలు శిక్ష పడి అందరినీ రాజమండ్రి జైలుకు పంపారు. ఇది తాత్కాలికంగా జమీందారుకు సంతోషాన్ని కలిగించినా రాబోయే జమీందారీ వ్యతిరేక పోరాటానికి ఊపిరులూదింది.

కమ్యూనిస్టు పార్టీ నానాటికీ బలోపేతమవుతూ వచ్చింది. పార్టీకి ఒక కార్యాలయం తప్పనిసరి అని భావించారు. కాని జమీందారు మీది భయంతో చల్లపల్లిలో కమ్యూనిస్టు కార్యాలయానికి ఇల్లు అద్దెకిచ్చేవారేరి? దాంతో చల్లపల్లి నారాయణరావు తమ ఇంటిలోనే కార్యాలయాన్ని పెట్టేందుకు వీలు కల్పించాడు. గ్రామ మధ్యలో ఊరి మధ్యలో రెండు ఎకరాల విశాలమైన స్థలంలో రెండు పెంకుటిళ్లు వుండేవి. ప్రధాన రహదారి పక్కనున్న ఇంట్లో నారాయణరావు ఉండేవారు. దాని వెనుక మరో పెంకుటిల్లుంది.

ఆ ఇంట్లో కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం ప్రారంభమైంది. ఆ విధంగా జమీందారు సర్వాధికారిగా వున్న ఆ ఊళ్లోనే కమ్యూనిస్టు పార్టీ వేళ్లూనుకుంది. తదుపరి చారిత్రాత్మక పోరాటానికి సన్నాహాలను ప్రారంభించింది. ప్రజలను చైతన్యవంతులను చేయనారంభించింది.

ఆ ఇంటి వెనుక వున్న భాగంలో ఎడమవైపున కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాన్ని, తూర్పు వైపు భాగంలో రైతు సంఘు కార్యాలయాన్ని పెట్టుకున్నారు. భూస్వాములు, మధ్యతరగతి రైతులు ఎక్కువగా కమ్యూనిస్టు పార్టీలోనూ, రైతు సంఘంలోనూ సభ్యులుగా చేరారు. వారిలో చాలామంది సైకిళ్లు కొనుక్కున్నారు. సైకిళ్లు పెట్టుకునేందుకు పార్టీ ఆఫీసు వెనుక ఖాళీ స్థలంలో రెండు నిట్టాళ్ల పాక వేశారు.

దేవరకోట ఎస్టేటు మొత్తం 60 గ్రామాలకు ఒక్క చల్లపల్లిలోనే జమీందారు కట్టించిన హైస్కూలు వుంది. ఆ స్కూల్లో చదువుకునే ఇతర గ్రామాల విద్యార్థులు, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, రైతు సంఘ సభ్యులూ పడుకునేందుకు ఒక పాక, భోజనాలు చేసేందుకు ఒక పాక నిర్మించారు. గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు రోజూ సైకిళ్ల మీద ఆఫీసుకు వచ్చేవారు. ఆ రోజుల్లో సైకిళ్లను ఇంగ్లండు నుంచి దిగుమతి చేసుకునేవారు. ఆ సైకిళ్లపై గ్రామగ్రామానికి వెళ్లి కమ్యూనిస్టు పార్టీ సభ్యులు రైతులతో మమేకమై వారి సమస్యల్ని పరిష్కరిస్తూ వుండేవారు. రాత్రింబవళ్లు రైతులతోనే వుండేవారు.

1943లో చినకళ్లేపల్లిలో మొదటిసారిగా కమ్యూనిస్టు పార్టీ మహాసభ జరిగింది. అప్పటికి తాలూకా మొత్తం మీద 60 మందికి పైగా సభ్యులుండేవారు. కమ్యూనిస్టు పార్టీలో సభ్యులుగా చేరడం అంత సులభం కాదు. పార్టీలో చేరాలని వచ్చే యువకులు ముందు కనీసం ఆరు నెలల పాటు పార్టీకి అనుబంధ సంస్థలైన రైతు, కూలీ, మహిళా సంఘాల్లో పనిచేయవలసి వుండేది. గ్రామ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి నాయకత్వంలో ఆయా ప్రజాసంఘాల్లో సమస్యలపై పోరాడి మంచి కార్యకర్తలుగా పేరు తెచ్చుకున్న మీదట వారిని పార్టీ సభ్యులుగా చేర్చుకొనేవారు. అలా ముందుగానే ఒక అవగాహన ఏర్పడి వుండడం వల్ల ఆ యువకులు పార్టీలో క్రియాశీలంగా పనిచేయగలిగేవారు.

చినకళ్లేపల్లిలో జరిగిన సభలో మాలెంపాటి సీతారామయ్యను కార్యదర్శిగానూ, కావూరి కుటుంబరావు, రావి సుబ్బారావు, దేవినేని చంద్రశేఖరరావు (చంద్రం), కొల్లి ప్రత్యగాత్మలను కార్యవర్గ సభ్యులుగానూ ఎన్నుకోవడం జరిగింది. అదే విధంగా వివిధ ప్రజా సంఘాలకు కూడా ఎన్నిక చేసుకున్నారు. రైతు సంఘంలో అంతకు ముందు కాంగ్రెస్‌వాదులు, కమ్యూనిస్టులు కలిసి పనిచేసేవారు. 1942లో రెండు పార్టీల్లో భేదాభిప్రాయాలు వచ్చి గొర్రెపాటి వెంకటసుబ్బయ్య (కిసాన్), కామినేని వెంకటప్పయ్య మొదలైనవారు రైతు సంఘం నుంచి విడిపోయారు. అప్పుడు జరిగిన రైతు సభల్లో కోనేరు సత్యనారాయణ, గుత్తికొండ కోదండరామయ్య, కాకర్ల చంద్రశేఖరరావు, కావూరి కుటుంబరావు, మందపాకల వెంకటరత్నం వంటివారు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. యువజన సంఘంలో రావి సుబ్బారావు, దేవినేని చంద్రశేఖరరావు, రావి దుర్గాప్రసాద్, కంచర్ల వెంకటేశ్వరరావు, కేమిశెట్టి కోటయ్య కార్యవర్గసభ్యులయ్యారు. అలాగే మహిళా సంఘంలో మాలెంపాటి శారదాంబ, రావి నాగరత్నమ్మ, పరుచూరి సూర్యాంబ మొదలైనవారు ఎన్నికయ్యారు. వ్యవసాయ కూలీ సంఘంలో ఎంతో ఉద్యమిత్వం కలిగిన వారు కార్యవర్గ సభ్యులుగా చల్లపల్లి నారాయణరావు, గుంటూరు బాపనయ్య, మెరుగు శ్రీరాములు, మోహన్‌రావు ఎన్నికయ్యారు. కమ్యూనిస్టు పార్టీ సెక్రటేరియట్ సభ్యులుగా మాలెంపాటి సీతారామయ్యకు పార్టీ నిర్మాణ బాధ్యతలు, కావూరి కుటుంబరావుకు రైతు సంఘ నిర్మాణ బాధ్యతలు, రావి సుబ్బారావుకు వ్యవసాయ

కూలీ ఉద్యమ నిర్మాణ బాధ్యతలు, దేవినేని చంద్రశేఖరరావుకు యువజన బాధ్యతలు, కొల్లి ప్రత్యగాత్మకు విద్యార్థి విభాగం బాధ్యతలు అప్పగించారు.

అప్పుడు విద్యార్థి సంఘం నాయకులైన చలసాని శ్రీనివాసరావు, కొల్లి రామమోహన్ రావు, రావి భీమారావు, తొట్టెంపూడి నారాయణరావు చల్లపల్లి హైస్కూల్లోని విద్యార్థులను సంఘటిత పరిచి విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో వారి సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తుండేవారు. ఆందోళనలు చేయడానికే కాదు విద్యార్థులు బాగా చదువుకొనే విషయంలో కూడా తమ వంతు కృషి చేసేవారు. కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం వెనుక వైపు పాకలో వుండి హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులు, వెలుపలి విద్యార్థులను బాగా చదువుకొమ్మని విద్యార్థి నాయకులు ప్రోత్సహించేవారు. వారు చదువుతున్నదీ లేనిదీ గమనించేందుకు తెల్లవారు జాము వేళల్లో ఆకస్మిక తనిఖీలు కూడా చేసేవారు.

విద్యార్థి సమాఖ్యలో సభ్యులుగా వుంటూ బాగా చదివి ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్ష ప్రథములుగా నిలిచి బంగారు పతకాలు సాధించినవారిలో కావూరి కోటయ్య, చల్లపల్లి మధుర మీనాక్షి, కావూరి రమేశ్ వంటివారున్నారు. ఆనాటి విద్యార్థుల్లో ఇప్పుడు ప్రముఖ వైద్య నిపుణులుగా, న్యాయవేత్తలుగా, వివిధ రంగాల్లో ఉన్నతాధికారులుగా వున్నారు. చల్లపల్లి హైస్కూల్లో చదువుకున్న విద్యార్థులైన ఈనాటి ప్రముఖుల్లో ప్రపంచ ప్రసిద్ధమైన ప్రగతి ప్రింటర్స్ అధినేత పరుచూరి హనుమంతరావు, పశుసంవర్ధక శాఖలో అదనపు సంచాలకుడైన డా. కావూరి కోటయ్య, ఢిల్లీలో ప్రముఖ వైద్య నిపుణునిగా పేరొందిన డా. కావూరి రమేశ్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వంలో సంయుక్త కార్యదర్శిగా పనిచేసిన శ్రీమతి మధుర మీనాక్షి, ఆమె సోదరుడు, ఆదాయపు పన్ను శాఖ అధికారిగా పనిచేసిన చసుపల్లి రాధాకృష్ణ, నిమ్స్ డైరెక్టర్‌గా పనిచేసిన ప్రపంచ ప్రసిద్ధ రేడియోలజీ వైద్య నిపుణుడు డా. కాకర్ల సుబ్బారావు, ప్రముఖ న్యాయవాదులు రావి సుబ్బారావు, చల్లపల్లి రామచంద్రరావు వంటివారు ఎందరో వున్నారు.

పార్టీకి అనుబంధంగా వున్న మహిళా సంఘంలోని కార్యకర్తలు కూడా ఎంతో ఉద్యమిత్వంతో పనిచేసేవారు. గ్రామాలకు వెళ్లి అక్కడి మహిళల్ని సమావేశపరచి వారిని బాగా చదువుకోమని ప్రోత్సహించేవారు. వివాహాల్లో అనవసరపు ఖర్చులు పెట్టకుండా సంస్కరణ పద్ధతుల్లో పెళ్లిల్లు చేసుకోవాలని యువతులను చైతన్యపరిచేవారు. భర్త చనిపోగానే జీవితం అంధకారమయం కాఠాదని చెప్పేవారు. ఆడపిల్లలకు బాల్యవివాహాలు చేయక 18 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లిల్లు చేయాలని, కట్నకానుకలు ఇవ్వడం, పుచ్చుకోవడం చేయవద్దని వివరించేవారు. ఇది 65 ఏళ్లనాటి మాట. ఈ విధంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు ఈనాడు చేస్తున్నాయా అన్నది ప్రశ్నే. కమ్యూనిస్టు వ్యతిరేకులైన భూస్వాములు కూడా ఇటువంటి సామాజిక కార్యక్రమాలను చూసి మెచ్చుకొనేవారు.

వార్తలు చదివి వినిపించడం...

కమ్యూనిస్టు పార్టీ శాఖలు ఆ రోజుల్లో గ్రామాల్లో ప్రతి రోజు సాయంత్రం 5 గంటల ప్రాంతంలో పత్రికలను క్షుణ్ణంగా చదివి వినిపించడం వుండేది. పార్టీ ఆధ్వర్యంలో యువకులు గ్రామ కేంద్రాల్లో పది పన్నెండు అడుగుల ఎత్తులో మంచె నిర్మించేవారు. సాయంత్రం మంచెపైకెక్కి పత్రికల్లో వచ్చిన వార్తల్ని మెగాఫోన్‌లో చదివి వినిపించేవారు. ముఖ్యంగా రెండవ ప్రపంచయుద్ధ కాలంలో నాజీ జర్మనీ, ఫాసిస్టు ఇటలీ, జపాన్‌లకు వ్యతిరేకంగా సోవియట్ రష్యా, ఐరోపా, అమెరికా, చైనా దేశాలు చేసిన పోరాటాల గురించిన వార్తల్ని చదివి వినిపించేవారు. జైళ్లలో వున్న కాంగ్రెస్ నాయకులను విడుదల చేయాలని, గాంధీ – జిన్నా కలిసి మాట్లాడుకొని ఒక నిర్ణయానికి రావాలని, ఇలా అనేక స్థానిక విషయాలను కూడా చెప్పేవారు. ఆ రోజుల్లో విద్యావంతులు తక్కువగా వుండడం, పత్రికలు తెప్పించుకొని చదివేవారు కూడా చాలా తక్కువగా వుండడం వల్ల ప్రజలు ముఖ్యంగా రైతులు పెద్ద సంఖ్యలో ఈ వార్తలు వినేందుకు వచ్చేవారు.

అంతేగాక గ్రామాల్లో ఎక్కువగా వ్యవసాయ కూలీలున్న చోట్లా, గూడాల్లో చదువురాని వారికి చదువు చెప్పేవారు. గ్రామాల్లోని చదువురాని యువకులు, పెద్దలు తాము చదువుకోవడమే గాక తమ పిల్లల్ని కూడా బడికి పంపేవారు. ఈ వాతావరణంలో యువకులకు విద్యతోపాటుగా రాజకీయ చైతన్యం కూడా ఒంటబట్టేది.

గ్రామాల్లో యువకులు సాయంత్రమైతే ఆనందంగా వీధుల్లో చేరి చెడుగుడు, కర్రబంతి (క్రికెట్ ఆటలాంటిది), పరుగు పందేలు, బిళ్లంగోడు మొదలైన ఆటలు ఆడేవారు.

కమ్యూనిస్టు పార్టీ నిధి వసూలు

కమ్యూనిస్టు పార్టీ తాలూకా, జిల్లా, రాష్ట్ర విభాగాల ఏర్పాటుకు, వాటి కార్యక్రమాల నిర్వహణకు, అలాగే కమ్యూనిస్టు పత్రిక ప్రజాశక్తి నడిపేందుకు కావలసిన నిధులకు విరివిగా విరాళాలివ్వమని పార్టీ పిలుపునిచ్చింది. పార్టీ పిలుపునందుకొని రావి దుర్గాప్రసాద్, మాలెంపాటి సీతారామయ్య, కోనేరు సత్యనారాయణ, గుత్తికొండ కోదండరామయ్య వంటి వారెందరో వేల కొలది రూపాయల విరాళం ఇచ్చారు. ప్రజాశక్తి పత్రికకు ఎక్కువ మొత్తాన్ని విరాళం ఇచ్చినవారిలో చల్లపల్లి జమీందారు సోదరుడైన యార్లగడ్డ రామకృష్ణప్రసాద్‌ను ముఖ్యంగా చెప్పుకోవాలి. రామకృష్ణప్రసాద్ సోదరి శ్రీమతి విశాలాక్షి గారి వివాహ సందర్భంలో కావూరి కుటుంబరావు, పుచ్చలపల్లి సుందరయ్య సోదరుడైన డా॥ రామచంద్రారెడ్డి వెళ్లి అడగ్గా కొన్ని వేల రూపాయలను పార్టీ నిధికి అందజేసిన సంఘటన మరువలేనిది. భూస్వామ్య కుటుంబాలు ఈ విధంగా పార్టీకి నగదు రూపంలో విరాళాలు ఇస్తుంటే గ్రామీణ పేదలు శ్రమజీవులు తాము కష్టించి సంపాదించిన ధాన్యాన్ని పార్టీ నిధికి అందజేసేవారు. దాన్ని

'వరికోత నిధి' అని పిలిచేవారు. రైతు యువకులు, కూలీలు వరి పంట కోసేందుకు వెళ్లి వారికి ప్రతిఫలంగా లభించే ధాన్యాన్ని పార్టీ నిధికి సమర్పించేవారు. ఏనాడూ పొలం పనులకు వెళ్లని భూస్వాముల కుటుంబాలకు చెందిన మహిళలు కూడా వ్యవసాయ పనులు చేసి ధాన్యాన్ని తెచ్చి పార్టీ నిధికి ఇచ్చేవారు. ఇది ఆశ్చర్యం కలిగించే విషయమైనా నిజం. కమ్యూనిస్టు పార్టీ ఆనాడు ప్రజలతో మమేకమై పనిచేయడం, ప్రజలు తామే పార్టీని నిలబెట్టుకోవడం వుండేదనడానికి ఇటువంటి సంఘటనలు నిదర్శనంగా వున్నాయి.

ప్రజానాట్య మండలి కార్యక్రమాలు

గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజల్లో రాజకీయ చైతన్యం కలిగిం చేందుకు సభలు ఏర్పాటయ్యేవి. ముందుగా నాయకుల ఉపన్యాసాలు తర్వాత ప్రజానాట్య మండలి బుర్రకథలు జరిగేవి. ముఖ్యంగా దివి తాలూకాలో ఏర్పడ్డ మొట్టమొదటి దళంలో సుబ్బారావు కథకునిగా, కోసూరు పున్నయ్య వంతగా వుండేవారు. వీరి కథలు వినడానికి దూరదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో జనం వచ్చేవారు. కమ్యూనిస్టు పార్టీ పెట్టిన కొత్తలో ఒకసారి బహిరంగ సభ జరిగింది. చల్లపల్లి నారాయణరావు ప్రసంగించారు. తర్వాత పున్నయ్య బుర్రకథ ప్రారంభమైంది. కథలో పున్నయ్య యువకులు తాగుడు, పేకాట వంటి చెడు వ్యసనాలను మానుకోవాలని, చదువు నేర్చిన యువకులు రాత్రి పాఠశాలలు పెట్టి చదువురాని వారికి చదువు చెప్పాలని హితవు చెప్పడం ప్రారంభించారు. అంతలో జనంలోంచి కొంతమంది జమీందారు రౌడీలు లేచి 'మేం తాగితే నీకెందుకు, తందనాలాడితే నీకెందుకు?' అంటూ పున్నయ్యను కొట్టబోయారు. దానికి ఆగ్రహించిన కమ్యూనిస్టు యువకులు ఆ రౌడీలను చితకబాదారు. వారు పారిపోయి సినిమా హాల్లో వున్న గ్రామ మునసబు పిచ్చయ్యకు ఫిర్యాదు చేసి ఆయనను తీసుకొచ్చారు. అప్పటికే తాగి వున్న పిచ్చయ్య సమస్యను అర్థం చేసుకోక తొందరపాటుతో సభ జరుగుతున్న చోటికి చేరుకున్నాడు. చల్లపల్లి నారాయణరావు జోక్యం చేసుకొని 'పిచ్చయ్యా! ఈ రాత్రి ఇంటికి వెళ్లు, రేపు మాట్లాడుకుందాం' అని నచ్చజెప్పబోయారు. అది వినిపించుకోని పిచ్చయ్య కోపంతో నారాయణరావును కొట్టేందుకు చెయ్యెత్తాడు. కమ్యూనిస్టు కార్యకర్త ఒకడు ఆలస్యం చేయకుండా ఎత్తిన పిచ్చయ్య చేయిపై కర్రతో రెండు దెబ్బలు గట్టిగా వేయడంతో రెండు వేళ్లు తెగిపడ్డాయి. దాంతో పిచ్చయ్యను రెచ్చగొట్టి తీసుకొచ్చిన రౌడీలు తలో దిక్కు పారిపోయారు. అంతటితో ఆగక యువకులు పిచ్చయ్యను కొట్టుకుంటూ అతని ఇంటి దాకా తీసుకెళ్లారు. పారిపోయిన రౌడీలు కోటలోకి వెళ్లి రాజాగారి పినతల్లి భర్త చిరుమామిళ్ల నాయుడమ్మకు ఏమి నూరిపోశారో ఏమో గాని ఆయన అగ్గి మీద గుగ్గిలమై లారీ తీసుకొని బయల్దేరాడు. వక్కలగడ్డ మాలపల్లెకు పోనిచ్చి అక్కడున్న తమ పాలేళ్లను ఎక్కించుకొని కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంపై దాడికి వెళ్లారు.

పార్టీ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు నిలబడి వుండడం చూసిన

లారీ డ్రైవర్ భయపడి లారీని ఆపకుండా ముందుకు ఉరికించి వైశ్యుల బజారు మీదుగా కోటలోకి తీసుకెళ్లాడు. పార్టీ యువకులు కోటలోపలికి వచ్చి దౌర్జన్యం చేస్తారనే భయంతో జమీందారు రావివారిపాలెం వద్దనున్న బోడగుంట రౌడీలుగా పేరుపడిన 50 మంది కూలీలను తెచ్చి కోట చుట్టూ కాపలా పెట్టుకున్నారు. ఇది తెలియని కమ్యూనిస్టు యువకులు తమ మీద దాడి చేయించేందుకు వాళ్లను సిద్ధం చేశాడనే అనుమానంతో పార్టీ కార్యాలయం వద్ద వారు కూడా సుమారు 100 మంది రాత్రింబవళ్లు కాపలా ఉండడం ప్రారంభించారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితి 15 రోజుల పాటు కొనసాగింది.

తర్వాత యువకులు జమీందారుకు ఒక హెచ్చరిక సందేశాన్ని పంపారు. "మీ రౌడీల చేత మా యువకులను ఎవరినైనా కొట్టించినా, తిట్టించినా సహించం. ప్రాణాలొదలడానికి కూడా సిద్ధంగా వున్నాం. మా వాళ్లకేమైనా అపకారం తలపెట్టారో మీరు విజయవాడ వెళ్లి చల్లపల్లి రాక తప్పదు. అప్పుడు మీపై తగిన ప్రతీకారం తీర్చుకొని తీరుతాం" అని సందేశం పంపారు. దానికి జమీందారు కూడా స్పందిస్తూ "మేము మీ జోలికి రాము. మీరు కూడా మా విషయం పట్టించుకోవద్దు' అని కబురు పంపాడు. ఈ విధంగా ఇరువురి మధ్య సంధి కుదరడంతో జమీందారు కోట చుట్టూ కాపలా పెట్టుకున్న బోడగుంట కూలీలను ఇళ్లకు పంపించివేశారు. కమ్యూనిస్టు కార్యకర్తలు కూడా తమవారిని ఉపసంహరించుకున్నారు. ఉద్రిక్త పరిస్థితులు తొలగిపోయి ప్రశాంతత నెలకొన్నది. అప్పటి నుంచి చల్లపల్లిలో కమ్యూనిస్టులకు, జమీందారుకు మధ్య తగాదాలు సమసిపోయాయి. ఆ గొడవల కారణంగా గ్రామం విడిచి పారిపోయి 15 రోజులు పాటు ఎక్కడో గడిపిన రౌడీలు కూడా తర్వాత రౌడీయిజం మానుకొని సాధారణ జీవితం గడపడం ప్రారంభించారు.

కమ్యూనిస్టు పార్టీ దివిసీమ ఆర్గనైజర్‌గా వున్న సనకా బుచ్చికోటయ్యను కైకలూరు తాలూకాకు పంపించారు. కావూరి కుటుంబరావు దివిసీమ ఆర్గనైజర్ అయ్యారు. అప్పుడు విశ్వనాథపల్లి కొత్తపాలెం వాస్తవ్యుడైన పట్టంశెట్టి ఉమామహేశ్వరరావు కుటుంబరావును కలుసుకొని తనను పార్టీలో చేర్చుకోవాల్సిందిగా కోరాడు. అతను గ్రామాల్లో తిరుగుతూ గాజులమ్ముతూ పార్టీ ప్రచారం చేశాడు. అతని నిజాయితీని, పట్టుదలను గుర్తించి కుటుంబరావు పార్టీలోకి తీసుకున్నాడు. ఉమామహేశ్వరరావు మంచి గాయకుడు కావడంతో పార్టీ అతని నేతృత్వంలో బుర్రకథ దళాన్ని ఏర్పాటు చేసింది. ఆ విధంగా ప్రజా నాట్య మండలి నాయకత్వాన ఉమామహేశ్వరరావు బుర్రకథ దళం కొన్ని వేల బుర్రకథలు చెప్పింది.

బెంగాల్ కరవు.. శరణార్థులకు ఇక్కడ సేవలు

1943వ సంవత్సరంలో బెంగాల్‌లో దుర్భరమైన కరవు వచ్చింది. అంతకు పూర్వం 170 సంవత్సరాల్లో అంతటి కరవు ఏనాడూ లేదు. అప్పటికే అక్కడ పరిస్థితులు చాలా అడుగంటిపోయాయి. బ్రిటిష సామ్రాజ్యవాదుల కింద బానిసత్వం, అభివృద్ధి కార్యక్రమాలేవీ

జరగకపోవడం, పంటలు సరిగా పండకపోవడంతో బర్మా నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకొంటే తప్ప ప్రజలకు తిండి లేని పరిస్థితి నెలకొని వుంది. దానికి తోడు 1939లో ప్రారంభమైన రెండవ ప్రపంచయుద్ధంలో బర్మాను జపాన్ ఆక్రమించుకొంది. మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు బెంగాల్‌కు బర్మా నుంచి బియ్యం దిగుమతి కూడా ఆగిపోయింది. ఈ దయనీయ పరిస్థితుల్లో కరవు విలయతాండవం చేసింది. 34 వేల మంది మృత్యువాత పడ్డారని ఒక అంచనా. రాష్ట్ర జనాభాలో 44 శాతం మంది 1943-44 సంవత్సరాల్లో అంటువ్యాధుల వల్ల అనేక అగచాట్లు పడ్డారు. బెంగాల్ ప్రభుత్వం సర్ జాన్ ఉడ్ హీడ్ నాయకత్వంలో ఏర్పాటు చేసిన కరవు అధ్యయన సంఘం కరవు వల్ల, అంటువ్యాధుల వల్ల 15 లక్షల మంది చనిపోయారని నివేదికలో పేర్కొంది. అక్కడి ప్రజల సహాయార్థం దివి తాలూకా కమ్యూనిస్టు పార్టీ ధన, ధాన్య, వస్త్ర రూప విరాళాల్ని సేకరించి పంపించింది. అంతేగాకుండా కరవు, అంటువ్యాధులతో సతమతమవుతున్న అక్కడి కమ్యూనిస్టు కార్యకర్తలను తీసుకువచ్చి బందరులోనూ, చల్లపల్లిలోనూ రెండు క్యాంపులు పెట్టి వారికి స్వస్థత చేకూర్చేందుకు కుటుంబరావు, ఆయన సహచరులు అనేక విధాలుగా పాటుపడ్డారు. బెంగాల్ నుంచి తీసుకొచ్చిన కార్యకర్తలను తిరిగి ఆరోగ్యవంతులను చేయడంలో బందరులోని ప్రముఖ వైద్యులు కుప్పా వెంకటరామశాస్త్రి, చల్లపల్లికి చెందిన కొల్లి గురుప్రసాద్ వంటివారు ఎంతో శ్రమించారు.

రాయలసీమలోనూ..

అదే కాలంలో ఇటు రాయలసీమలోని కర్నూలు, కడప, అనంతపురం మొదలైన జిల్లాల్లో కూడా కరవు తాండవించింది. బెంగాల్‌లో లాగా మరణాలు సంభవించకపోయినా ప్రజలు కరవుతో అల్లాడిపోయారు. వారిని ఆదుకునేందుకు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గంజి కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఆ కేంద్రాలను నిర్వహించేందుకు తాలూకాల నుండి బియ్యం ఇతర ధాన్యాల్ని, ధనాన్ని దివి తాలూకా నుంచి పంపడం జరిగింది.

ఆనాడు అంటువ్యాధులకు, ఇతరత్రా జబ్బులకు వైద్యం చేయడానికి వైద్యులు గానీ, మందులు గానీ మృగ్యం. దివి తాలూకాలో కలరా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలి ప్రజలు నానా బాధలు పడేవారు. ప్రాణనష్టం సంభవించేది. ఓక్కలగడ్డ గ్రామంలోనే ఒక సంవత్సరం మలేరియా వచ్చి 50 మంది చనిపోయారు. దివిసీమలో రైతులు, కూలీలు వ్యాధుల బారిన పడి వ్యవసాయం చేయక భూములను పాడుబెట్టారు. ఆ రకంగా దుర్భరమైన పరిస్థితులు తాండవిస్తున్నప్పుడు యువజన సంఘాల కార్యకర్తలు పల్లెలకు వెళ్లి వీధులు, పరిసరాలను పరిశుభ్రం చేసి, వ్యాధి సోకిన వారికి ఏవో మందులిచ్చి వారికి ఉపశమనం కలిగించేవారు. వారి సేవల వల్ల చాలావరకు మరణాలను నివారించగలిగారు.

కోపరేటివ్ స్టోర్స్

ఆ రోజుల్లో ప్రజలకు ముఖ్యంగా రైతులకు కోపరేటివ్ స్టోర్స్ ఎంతో మేలు చేశాయని చెప్పవచ్చు. రెండవ ప్రపంచయుద్ధం ఫలితంగా బండి పట్టాలు, ఎరువులు, బట్టలు, పంచదార మొదలైన వస్తువులు దొరకక ఎన్నో ఇబ్బందులకు గురయ్యే పరిస్థితుల్లో ప్రజల్ని ఆదుకునేందుకు సహకార రంగంలో స్టోర్స్‌ను స్థాపించడం జరిగింది. కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌వారు, జమీందారు అనుచరులు, భూస్వాములు మొదలైనవారు స్టోర్స్ నెలకొల్పడంలో, వాటిని నిర్వహించడంలో తమవంతు సేవాదృక్పథంతో పాటుపడ్డారు. వారంతా స్టోర్స్ నిర్వహణా సంఘంలో సభ్యులుగా ఉన్నారు. కమ్యూనిస్టులైన డా. కొల్లి గురుప్రసాద్ అధ్యక్షునిగా, ఈడ్పుగంటి పరమేశ్వరరావు కార్యదర్శిగా పనిచేశారు. అనేక రకాలైన సరుకులు, గృహవినియోగ వస్తువులను తెచ్చి సరసమైన ధరకు ప్రజలకు స్టోర్స్ ద్వారా అందుబాటులో వుంచేవారు. ఈ రకమైన సేవా కార్యక్రమాలతో కమ్యూనిస్టులు చాలా మంచిపని చేస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది. బ్లాక్ మార్కెటీర్లు, భూస్వాములు, జమీందార్లు ఇది చూసి సహించలేకపోయారు. ఒకనాడు సర్వసభ్య సమావేశం జరుగుతుండగా స్టోర్స్ సభ్యులందరి సమక్షంలో కార్యదర్శి ఈడ్పుగంటి పరమేశ్వర రావు ఆ ఏడాది జమాఖర్చుల వివరాలను వివరిస్తున్నారు. అంతలో భూస్వామ్య కుటుంబానికి చెందిన కంఠంనేని రాజగోపాల ప్రసాద్ అధ్యక్షుని ముందున్న మినిట్స్ పుస్తకాన్ని లాక్కొని తన అనుచరులకు ఇవ్వడానికి ప్రయత్నం చేయగా కమ్యూనిస్టు కార్యకర్తలు కంఠంనేని గోపాలరావు, కంఠంనేని పార్థసారథి దాన్ని లాక్కున్నారు. ఫలితంగా వారి మధ్య చిన్న ఘర్షణ తలెత్తింది. జమీందారు మేనేజరు, చంద్ర సాగరయ్య, కె. రాజగోపాలప్రసాద్, పాలెంపాటి వెంకటకృష్ణయ్య మొదలైనవారు పారిపోయారు. తర్వాత నెల రోజులకు చల్లపల్లి జమీందారుగారి హైస్కూల్లో సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. ఉభయ వర్గాల నుంచి చాలా మంది సమావేశంలో పాల్గొన్నారు. ఒకరిపైనొకరు దాడి చేసుకొంటారా అనే వాతావరణం, ఉద్రిక్తత నెలకొంది. ఏదైనా జరగవచ్చునని పోలీసులు కూడా వచ్చారు. బందరు నుంచి వచ్చిన జిల్లా సహకార సంఘాల రిజిస్ట్రారు మాట్లాడుతూ మీ ఉభయవర్గాలూ స్టోర్స్ నడుపుతామంటే కమిటీని నామినేట్ చేస్తాను అన్నారు. రిజిస్ట్రారును ఏదో విధంగా తమ వైపుకు తిప్పకోగలమన్న ధీమాతో జమీందారీవర్గం అంగీకరించింది. సహకార సంఘాల చట్టంపై పూర్తి అవగాహన కలిగిన కమ్యూనిస్టు కార్యకర్తలు కూడా రిజిస్ట్రారు చెప్పినదానికి తమ సమ్మతి తెలియజేశారు. ఇరువురూ అంగీకారం తెలపడంతో ఏదో జరగవచ్చుననే ఉద్రిక్తత సడలిపోయింది. అంతా ఎక్కడి వారక్కడ వెళ్లిపోయారు. తర్వాత సహకార సంఘాల రిజిస్ట్రారు కోపరేటివ్ స్టోర్స్‌కు ఒక కమిటీని నామినేట్ చేశారు. అయితే అలా నామినేట్ చేసే అధికారం రిజిస్ట్రార్‌కు లేదని కమ్యూనిస్టులు దావా వేసి గెలిచారు. దానిపై నిమ్మగడ్డ గ్రామంలో సర్వసభ్య సమావేశం జరగ్గా జమీందారీ వర్గానికి చెందిన భూస్వామ్య సభ్యులెవరూ సమావేశానికి రాలేదు.

అంతకు ముందు అధ్యక్షునిగా ఉన్న డా. కొల్లి గురుప్రసాద్‌ను, కార్యదర్శిగా వున్న పరమేశ్వర రావును తిరిగి అధ్యక్షకార్యదర్శులుగా ఎన్నుకున్నారు. వారి నిర్వహణలో స్టోర్స్ విజయవంతంగా నడిచి ప్రజలకు సేవలందించాయి.

సహకార సంఘాలు

దివి తాలూకాలోని గ్రామాల్లో సహకార సంఘాలు తక్కువగా ఉండేవి. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో దివి తాలూకాలో దేవరకోటసీమ నుంచి ఒకరు, దివిసీమ నుంచి ఒకరు డైరెక్టరుగా వుండేవారు. వీరిలో చల్లపల్లి ప్రాంతం నుంచి ఈడ్పుగంటి పరమేశ్వరరావు కొంత కాలం, చంద్ర రామలింగయ్య కొంతకాలం డైరెక్టరుగా ఎన్నికయ్యారు. ఆనాడు కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షునిగా వున్న కొల్లిపర వెంకటరమణయ్య నాయుడు వీరికి సహకారాన్ని అందించారు. వీరు ఎస్టేటులోని మంగళాపురం, పెదప్రోలు, నాదెళ్ల పాలెం, మెరకనపల్లి వంటి అనేక గ్రామాల్లో సహకార సంఘాలను స్థాపించి వాటి ద్వారా ప్రజలకు సేవలు అందించారు.

ఘంటసాలలో సమావేశం

ఎస్టేటు ఏరియాలోకెల్లా ఘంటసాల గ్రామం పెద్దదే కాక రెండువేల ఏళ్ల చరిత్ర కలిగిన బౌద్ధ క్షేత్రం. ఘంటసాల కాంగ్రెసువాదులకు కంచుకోట. కమ్యూనిస్టులు లేరు. గొట్టిపాటి బ్రహ్మయ్య ఘంటసాల వారే. కమ్యూనిస్టులు గ్రామంలో ఎవరూ లేకపోగా పార్టీపైన అక్కడ పెద్ద యెత్తున దుష్ప్రచారం జరుగుతోంది. స్త్రీపురుషుల్లో నైతిక విలువలు ఉండవని, భార్యాభర్తలు సైతం విచ్చలవిడి ప్రవర్తన కలిగినవారని ఏవేవో చిలవలు పలవలు ప్రచారంలో వుండేవి. ఇలా వుండగా ఒకనాడు గ్రామ యువకుడు కుటుంబరావు వద్దకు వచ్చి తమ గ్రామంలో ఒక బహిరంగ సభ పెట్టమని కోరాడు. పార్టీ దీనిపై చర్చించి సభకు ఒక తేదీని నిర్ణయించింది. మాకినేని బసవపున్నయ్య, మాలెంపాటి సీతారామయ్య, కావూరి కుటుంబరావు కలిసి కోసూరు పున్నయ్య బుర్రకథా దళాన్ని వెంట తీసుకొని ఘంటసాల వెళ్లారు. పార్టీ యువజన సంఘం కార్యకర్తలు మెగాఫోన్లలో గ్రామంలో తిరుగుతూ బహిరంగ సభ గురించి ప్రకటించారు. గ్రామంలోని కొందరు పెద్దలు మెగాఫోన్లలో దుమ్ము వేయమని, అల్లరి చేయమని గ్రామ యువకులను ఉసిగొల్పారు. ప్రచారం చేస్తున్న యువకులు దీన్ని ఏ మాత్రం లెక్క పెట్టక పట్టుదలగా ప్రచారం చేశారు. మెగాఫోన్ల నుంచి నోటిలోకి మట్టి పడుతున్నా బయటికి ఉమ్మివేస్తూ ప్రచారం పూర్తి చేశారు.

బహిరంగ సభ ప్రారంభమైంది. మాలెంపాటి సీతారామయ్య అధ్యక్షత వహించారు. కుటుంబరావు మొదట మాట్లాడారు. దివిసీమ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ చేస్తున్న పోరాటాల గురించి, ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించడం గురించి వివరించారు.

తర్వాత మాకినేని బసవపున్నయ్య ఉపన్యాసం ప్రారంభించారు. పున్నయ్య ఎంతో నమ్రతగా ప్రజలందరికీ అర్థమయ్యే భాషలో మాట్లాడేవారు. పది నిమిషాల పాటు ఆయన ప్రసంగం జరిగాక కొందరు గ్రామస్తులు లేచి బుర్రకథ చెబుతామని ప్రచారం చేసి ఈ ఉపన్యాసాలు ఏమిటని గోల చేశారు. బుర్రకథ మొదలవుతుందని చెప్పి బసవ పున్నయ్య కూర్చున్నారు. కోసూరు పున్నయ్య దళం బుర్రకథ మొదలు పెట్టింది. వేల మంది ప్రేక్షకులున్నా అలరించి ఆకట్టుకోగల దళం వారిది. కథ మొదలై 15 నిమిషాలు అయ్యాక సభలోంచి మరికొందరు లేచి మీటింగు పూర్తి కాకుండా బుర్రకథ చెప్పడమేమిటి ఉపన్యాసాలు ముందు చెప్పించండి అన్నారు. దానికి బసవపున్నయ్య ఉపన్యాసం గంట పడుతుందనీ, దానికి ఒప్పుకుంటే మాట్లాడుతానని అన్నారు. అందుకు వారు ఒప్పుకోవడంతో ఉపన్యాసం ప్రారంభమైంది.

ముందు ఘంటసాల చారిత్రక ప్రాధాన్యతను వివరించారు. గ్రామంలో పూర్వీకులు చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా పోరాడి ధర్మఖోటకాన్ని కాపాడుకున్నారని అన్నారు. జాతీయోద్యమంలో ఆ ఊరిపెద్దలు చేసిన ఉద్యమాన్ని గురించి చెబుతూ గొట్టిపాటి బ్రహ్మయ్య, గొర్రెపాటి వెంకటసుబ్బయ్య (పండిత), గొర్రెపాటి వెంకటసుబ్బయ్య (కిసాన్) వంటి ప్రముఖులెందరో జైళ్లకు వెళ్లి శిక్షలనుభవించారని వివరించారు. ఆనాటి దేశ, ప్రాంత రాజకీయాల గురించి మాట్లాడారు. బ్రిటిషు సామ్రాజ్యవాదులకు, ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరం వుందని మాకినేని తన ప్రసంగంలో విపులీకరించారు. ఆ తర్వాత కోసూరు పున్నయ్య దళంవారి బుర్రకథ రెండు గంటల పాటు సాగి ప్రజల్ని ఉర్రూతలూగించింది. సభ మొత్తం మీద ఫలవంతంగా ప్రశాంతంగా ముగిసింది.

ఇది జరిగిన కొన్నాళ్లకు ఘంటసాల గ్రామ పెద్దలైన గొర్రెపాటి వెంకట్రామయ్య (మేడ), కొండయ్య వంటివారు చల్లపల్లిలో వున్న కమ్యూనిస్టు పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఘంటసాలలో ఇటీవల మీరు నిర్వహించిన సభ, అందులో చెప్పిన విషయాలు తమకు బాగా నచ్చాయని ఈసారి మూడు నాలుగు రోజుల పాటు సభలు నిర్వహించాలని కుటుంబరావును, ఇతర నాయకులను కోరారు. సభలకయ్యే ఖర్చును తమే భరిస్తామని కూడా చెప్పారు. ఘంటసాలలో సభలు జరిపేందుకు నాయకులు ఒప్పుకున్నారు.

ఆ విధంగా 1944 సంవత్సరంలో ఘంటసాలలో 4 రోజుల పాటు కృష్ణా జిల్లా యువజన మహాసభలు జరిగాయి. జిల్లాలోని అనేక ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో యువకులు ప్రతినిధులుగా హాజరయ్యారు. పగలు వివిధ అంశాలపై యువజన ప్రతినిధులు చర్చలు జరిపి తీర్మానాలు ఆమోదించారు. రాత్రిపూట ప్రముఖ నాయకులు ప్రసంగాలు చేసేవారు. ఆంధ్రదేశంలో తొలి సత్యాగ్రహి గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ప్రముఖ పరిశోధకులు మల్లంపల్లి

సోమశేఖర శర్మ, ఆంధ్రదేశంలోనే కాదు బర్మా వరకూ తన అసమాన నటనా చాతుర్యంతో అలరించిన నటకావతంస స్థానం నరసింహారావు స్వాతంత్ర్య సమరయోధులు వావిలాల గోపాలకృష్ణయ్య వంటివారు ఆనాటి సభల్లో ఉపన్యసించారు. నాటి సభల నిర్వాహకులైన యువజన నాయకుల్లో కావూరి కుటుంబరావు, తాతినేని ప్రకాశరావు, రావి దుర్గాప్రసాద్ మొదలైనవారు ఉన్నారు.

స్థానం నరసింహారావు ప్రసంగిస్తూ "ఈ గ్రామ యువకులు నా దగ్గరకు వచ్చి తాము నాలుగు రోజుల పాటు నాటకాలు వేస్తున్నామనీ, మీరు వచ్చి ఆశీర్వదించమని అడిగారు. ఆ తర్వాత నాలుగు రోజులకు గ్రామంలోని పెద్దలు నా వద్దకు వచ్చి మీరు ఘంటసాల వస్తామని మా వూరి యువకులకు చెప్పారా? అని అడిగారు. అవునని చెప్పాను. దానికి ఆ పెద్దలు నాతో ఏమన్నారంటే, మీ దగ్గరికి వచ్చిన ఆ యువకులు రౌడీలు, తాగుబోతులు, వ్యభిచారులని ఏవేవో చెప్పారు. మీరు చెప్పింది ఆలోచిస్తానని చెప్పి వాళ్లను పంపించాను. ఒకవేళ వాళ్లు చెప్పింది నిజమే అయితే వాళ్లను విమర్శించి నాటకరంగానికి అప్రతిష్ట రాకుండా చూడడానికైనా నేను ఘంటసాల వెళ్లాలని నిర్ణయించుకున్నాను. ఇవాళ ఇక్కడికి వచ్చాను" అన్నారు.

"ప్రతి రోజు ఆ యువకులు జరుపుకునే ప్రతినిధుల సమావేశంలో వెనుక కూర్చుని వారు జరిపే చర్చలను విన్నాను. విద్యావంతులైన యువకులు రాత్రి పాఠశాలలు నడుపుతూ చదువురానివారికి చదువు చెప్పాలని, తాగుడు, జూదం, పేకాట వంటి దురలవాట్ల నుంచి యువకులను దూరంగా ఉంచాలని, వివాహాలను సంస్కరణ పద్ధతిలో జరుపుకోవాలని, కట్నాలు తీసుకోవద్దని, స్త్రీలను పురుషులతో సమానంగా పరిగణించి గౌరవించాలని అనేక తీర్మానాలు చేశారు. ఇవన్నీ స్వయంగా చూసి విన్న నేను భావి భారత సమాజానికి అభ్యుదయాన్ని చేకూర్చే చర్చలు, తీర్మానాలు చేసిన ఈ యువకులను మనసారా అభినందిస్తున్నాను. ఇక్కడ ఒక్క మాట చెప్పదలచుకున్నాను. ఈ యువకులు రౌడీలని చెప్పి నన్నీ సభకు రావద్దని చెప్పిన పెద్దలు తప్పకుండా ఈ సభలో ఉండి ఉంటారు. వారిని ఒక ప్రశ్న అడుగుతున్నాను. యువకులు ఇలా ఆదర్శ సమాజ నిర్మాణానికి పాటు పడటం మీకిష్టం లేదా? ఇలాంటివారినా మీరు చెడిపోయినవారని చెప్పారు? అలా ఎందుకు చెప్పారు? అని మిమ్మల్ని అడుగుతున్నాను" అంటూ స్థానంవారు తీవ్రంగా విమర్శించారు.

ఈ రకంగా ఆ నాలుగు రోజులు ఒకవైపు పెద్దల ఉపన్యాసాలు, రాత్రి పూట ప్రజానాట్య మండలి కళాకారుల బుర్రకథలు, హాస్యకథలు వంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కోడూరు అచ్చియ్య నాయకత్వంలో మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి చదలవాడ కుటుంబరావు, సూరపనేని లక్ష్మీపెరుమాళ్లు, కోసూరు పున్నయ్య, ఆయన అనుచరుడు

సుబ్బారావు, సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు వంటి కళాకారులు ఎందరో బుర్రకథలు, నాటకాలు ప్రదర్శించి సభకు వచ్చినవారిని ఉర్రూతలూగించారు. ఉత్తేజితుల్ని చేశారు. మొత్తం మీద ఘంటసాలలో జరిగిన జిల్లా యువజన సభలు చిరస్మరణీయంగా నిలిచాయి. ఈ సభలు కలిగించిన స్ఫూర్తితో ఘంటసాలలో అనేక మంది యువకులు కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులయ్యారు. కమ్యూనిస్టు ఉద్యమ స్థిరత్వంలో వాళ్ల ముద్ర చెరిగిపోలేదు.

కాజ గ్రామ యువజన సభ

చల్లపల్లి ఎస్టేటులో పెద్ద గ్రామాల్లో కాజ ఒకటి. రెడ్డి కులస్తులు ఆ గ్రామంలోనే వుండేవారు. వీరిలో భూస్వాములు, జాతీయోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లినవారూ ఉన్నారు. కాని గ్రామంలో అప్పటికి కమ్యూనిస్టు ఉద్యమం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఒక రోజు ఆ గ్రామయువకుడు ఒకరు చల్లపల్లిలోని పార్టీ కార్యాలయానికి వచ్చి తమ గ్రామంలో కాంగ్రెస్‌వాదులు యువకుల కోసం రాజకీయ పాఠశాల నడుపుతున్నారనీ, బహిరంగ సభ పెట్టి కమ్యూనిస్టులను విమర్శిస్తున్నారనీ, దమ్ముంటే గ్రామానికి వచ్చి సభ నిర్వహించమని కొంతమంది పెద్దలు కోరుతున్నారని అన్నాడు. ఆ సవాలు స్వీకరించి ఏదైనా చేసి తీరాలని కుటుంబరావు, చల్లపల్లి నారాయణరావు నిర్ణయించుకున్నారు. ఆ సాయంత్రమే ఇరువురూ తూర్పులంకపల్లి నుంచి కాజకు నడిచివెళ్లారు. ఆ రోజుల్లో రహదారులు, బస్సులు లేవు. మాగాణి చేలగట్ల మీదుగా నడుచుకుంటూ గుండేరు వంటి మురుగు కాలువలో లోతైన నీటిలో తుండుగుడ్డలు కట్టుకొని వెళ్లేవారు. కుటుంబరావు, నారాయణరావు అలా నడచి, కాలవ దాటి రాత్రి 7 గంటలకు కాజ చేరుకొని అక్కడ వీరారెడ్డి అనే కాంగ్రెస్ నాయకుని ఇంటికి చేరారు. ఈ వీరారెడ్డి కాంగ్రెసు ఉద్యమంలో నారాయణరావుతో పాటు పాల్గొని జైలుకు వెళ్లాడు. ఇరువురిని చూసి వీరారెడ్డి ఆశ్చర్యంతో ఈ వేళప్పుడు ఎక్కడ్నుంచి వచ్చారు?' అని అడిగారు.

ఈ ఊళ్లో మీటింగ్ ఏర్పాటు చేసి మమ్మల్ని రమ్మని మీరే చెప్పారని వచ్చామని నారాయణరావు చెప్పారు. దానికి ఆయన 'అలాంటిదేమీ లేదే!' అన్నారు వీరారెడ్డి. ఇక ఆ రాత్రి వారింట్లోనే భోంచేసి పడుకున్నారు. మరునాటి ఉదయం జరిగిన సంఘటన కుటుంబరావును, నారాయణరావును ఒక రకంగా రెచ్చగొట్టిందనే చెప్పాలి. కాజలో అప్పటికే కాంగ్రెస్‌వారు యువకుల కోసం రాజకీయ పాఠశాల నడుపుతున్నారు. ఆ పాఠశాల యువకులు, వాళ్లకు పాఠాలు చెప్పడానికి వచ్చిన నాయకులు 'మనం కూడా పంటికి పన్ను కంటికి కన్ను' ఇవ్వడానికి సిద్ధంగా వుండాలంటూ వెళ్లిపోయారు. ఆ సాయంత్రం కుటుంబరావు, చల్లపల్లి నారాయణరావు కాజలో బహిరంగసభ ఏర్పాటు చేసి కమ్యూనిస్టు

రాజకీయాలను గురించి వివరించారు. ఆ తర్వాత వట్రపు కృష్ణారెడ్డి, రామిరెడ్డి, కొనకళ్ల గణపతి, ధర్మారావు, శెట్టిభక్తుని నాగయ్య మొదలైనవారు కమ్యూనిస్టు పార్టీవైపు ఆకర్షితులయ్యారు. పార్టీలో సానుభూతిపరులుగా వచ్చి చేరారు.

1944లో ప్రఖ్యాత విప్లవకారుడు సర్దార్ పృథ్వీసింగ్ బెజవాడలో జరిగిన బహిరంగ సభకు వచ్చారు. కుటుంబరావు, ఇతర నాయకుల ఆహ్వానం మేరకు చల్లపల్లిలో బహిరంగసభలో కూడా పాల్గొని ప్రసంగించేందుకు వచ్చారు. ఆ సభకు వేలాది మంది జనం వచ్చారు. సభలో ప్రసంగించిన తర్వాత ఆయన మాలెంపాటి సీతారామయ్య ఇంట రెండు రోజులు విశ్రాంతి తీసుకున్నారు. సీతారామయ్య తన రెండేళ్ల కుమార్తెకు పేరు పెట్టమని పృథ్వీసింగ్‌ను కోరగా ఆయన క్రాంతికుమారి అని పేరు పెట్టారు. ఆమె తర్వాతి కాలంలో గుంటూరులో ఎం.బి.బి.యస్. చదివింది. డా. ఎం.సీతారామయ్యతో ఆమె వివాహాన్ని కావూరి కుటుంబరావు జరిపించారు. వారిరువురూ ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో ఆస్పత్రి పెట్టి మంచి పేరు సంపాదించారు.

1946 అసెంబ్లీ ఎన్నికలు

1946లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు వచ్చాయి. తూర్పు కృష్ణాజిల్లాలోని గుడివాడ, బందరు, కైకలూరు, దివి తాలూకాలకు కలిపి రెండు స్థానాలు ఉండేవి. ఒకటి జనరల్ స్థానం, ఒకటి రిజర్వుడు స్థానం. కాంగ్రెస్ తరఫున శ్రీమతి వల్లభనేని సతీమహాలక్ష్మమ్మ జనరల్ స్థానానికి, వేముల కూర్మయ్య రిజర్వుడు స్థానానికి పోటీ చేశారు. కమ్యూనిస్టు పార్టీ తరఫున రాష్ట్ర రైతు నాయకుడైన చలసాని వాసుదేవ రావు జనరల్ స్థానానికి, గుంటూరు బాపనయ్య రిజర్వుడు స్థానానికి పోటీ చేశారు. ఇవి గాక కృష్ణా జిల్లాలో క్రైస్తవులకు ఒక రిజర్వు స్థానం ఉండేది. భట్లపెనుమర్రు వాస్తవ్యుడైన టి.జె.ఎం. విల్సన్ అనే యువ న్యాయవాదిని కమ్యూనిస్టు పార్టీ తరఫున నిలబెట్టారు. అతడ్ని కమ్యూనిస్టులే న్యాయశాస్త్రం చదివించారు. ఈ ఎన్నికల సందర్భంగా చల్లపల్లిలో లక్ష మందితో బ్రహ్మాండమైన బహిరంగసభ జరిగింది. ఆ సభలో నాటి భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి పి.సి. జోషి, రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో చల్లపల్లి జమీందారు, భూస్వాములంతా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశారు. ఫలితంగా కాంగ్రెస్ పక్షాన పోటీ చేసిన వల్లభనేని మహాలక్ష్మమ్మ, కూర్మయ్య గెలుపొందారు. క్రైస్తవ స్థానం నుంచి కమ్యూనిస్టులు నిలబెట్టిన టిజెఎం విల్సన్ గెలిచాడు. పేదప్రజల్లో కమ్యూనిస్టు పార్టీకున్న ఆదరణను, పలుకుబడిని ఈ విజయం చాటి చెప్పింది.

ఈ ఎన్నికలకు ముందూ, ఎన్నికల సందర్భంలోనూ జరిగిన పరిణామాలను కొంత వివరించవలసిన అవసరం ఉంది.

1944లో జైలు నుంచి వచ్చిన నీలం రాజశేఖర రెడ్డి, కల్లూరి చంద్రమౌళి, గొట్టిపాటి బ్రహ్మయ్య వంటి నాయకులు పెదప్రోలు గ్రామంలో సభ ఏర్పాటు చేసి కమ్యూనిస్టులను విమర్శించారు. ఉగ్రులైన కమ్యూనిస్టులు నాయకుల ఉపన్యాసాలను అడ్డుకున్నారు. తమ సభ పూర్తయిన తర్వాత కమ్యూనిస్టులు కూడా తమ అభిప్రాయాల్ని చెప్పుకోవచ్చునని కాంగ్రెస్ నాయకులు అనడంతో పరిస్థితి సద్దుమణిగింది. కాంగ్రెస్‌వారి సభ పూర్తయింది. ఆ సభలో గ్రామస్తుడైన ఏలేశ్వరపు కృష్ణమూర్తి పెట్టిన పెట్రోమాక్స్ లైట్లు విప్పుతుండగా గొడవ మొదలైంది. తమ సభ పూర్తయ్యేవరకు లైట్లు ఉండాలని కమ్యూనిస్టులు పట్టుబట్టారు. కృష్ణమూర్తి దానికి అంగీకరించలేదు. దీంతో పెనుగులాట జరిగి లైట్లు పగిలిపోయాయి. తర్వాత కృష్ణమూర్తి మండవ శివరామకృష్ణయ్య, పరుచూరి కృష్ణ, చావా శంకరగోపాల కృష్ణమూర్తి మొదలైన కమ్యూనిస్టులపై అవనిగడ్డ మెజిస్ట్రేటు కోర్టులో కేసు పెట్టాడు. ఆ కేసులో సాక్షిగా వచ్చిన గొట్టిపాటి బ్రహ్మయ్యను ముద్దాయి తరఫు న్యాయవాది క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తూ 'మీరు చల్లపల్లి రాజావంటి వారి దగ్గర డబ్బు తీసుకుంటారా?' అని అడిగారు. 'నేను తీసుకుంటాను. అయితే ఏం?' అని బ్రహ్మయ్య సమాధానమిచ్చారు.

1946 ఎన్నికల్లో జనరల్ స్థానానికి గొట్టిపాటి బ్రహ్మయ్యను రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ తన అభ్యర్థిగా నిర్ణయించి అధిష్ఠానానికి పంపింది. అప్పట్లో జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడైన డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య బ్రహ్మయ్య అంటే ఇష్టం లేకపోవడం వల్ల ఏనాడూ కాంగ్రెస్‌వాది కాని జస్టిస్‌పార్టీకి చెందిన న్యాయవాది కొల్లిపర వెంకటరమణయ్య నాయుడ్ని ఢిల్లీకి తీసుకువెళ్లారు. ఖద్దరు బట్టలు, టోపీ వేయించి కేంద్ర ఎన్నికల సంఘం నాయకులైన పండిత జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్‌ల వద్దకు తీసుకువెళ్లి రమణయ్యనాయుడ్ని పరిచయం చేస్తూ ఈయన ప్రముఖ కాంగ్రెస్ నాయకుడని, తన అభిప్రాయాలను మీకు తెలియజేసేందుకు వచ్చాడని అన్నారు. అప్పుడు రమణయ్య నెహ్రూ, పటేల్‌లతో మాట్లాడుతూ గొట్టిపాటి బ్రహ్మయ్య లంచగొండి అనీ, జమీందారు వద్ద కూడా డబ్బు తీసుకుంటారనీ కాబట్టి ఆయన్ను అభ్యర్థిగా నిలబెట్టవద్దని ఫిర్యాదు చేశాడు. అవనిగడ్డ మెజిస్ట్రేటు కోర్టులో న్యాయవాది క్రాస్ ఎగ్జామినేషన్‌లో చెప్పిన వాఙ్మూలపు పత్రాన్ని నెహ్రూ, పటేల్‌లకు అందజేశాడు. ఆయనకు బదులు ఆ స్థానంలో 1930 సంవత్సరం నుంచి స్వాతంత్ర్యోద్యమంలో వుంటూ జైలు శిక్ష కూడా అనుభవించిన వల్లభనేని సీతాలక్ష్మమ్మను నిలబెట్టమని సూచించాడు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం బ్రహ్మయ్యకు టికెట్ ఇవ్వకుండా ఆమెను నిలబెట్టింది. 1936 అసెంబ్లీ ఎన్నికల్లో చల్లపల్లి రాజా అప్పటి ఎన్నికల పద్ధతిని అనుసరించి జనరల్ సీటు, రిజర్వుడు సీటుకు వున్న రెండు ఓట్లు వేయించుకుని బ్రహ్మయ్యను ఓడించాడు. మరుసటి ఎన్నికల్లో కూడా పై పరిణామాల వల్ల బ్రహ్మయ్యకు మరోసారి సీటు దక్కకుండా పోయింది. చివరికి వల్లభనేని మహాలక్ష్మమ్మ, కూర్మయ్య జనరల్, రిజర్వుడు స్థానాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులుగా విజయం సాధించారు.

కమ్యూనిస్టు పార్టీ కలకత్తా మహాసభ

1948 మార్చిలో కమ్యూనిస్టు పార్టీ కలకత్తా మహాసభ జరిగింది. చంద్ర రామలింగయ్య, కావూరి కుటుంబరావు, రావి దుర్గాప్రసాద్, నాదెళ్ల వెంకటకృష్ణయ్య మరికొందరు నాయకులు దివి తాలూకా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులుగా మహాసభకు వెళ్లారు. అయితే సభకు వెళ్లేముందు వీళ్లను అరెస్టు చేస్తారని వదంతులు వ్యాపించాయి. దీంతో బందరు మీదుగా బెజవాడ వెళ్లి రైలెక్కి కలకత్తా వెళ్లవలసిన ఈ నాయకులు అటు వెళ్లడం మానుకున్నారు. తెనాలి వెళ్లి రైలెక్కారు. ఆ బోగీలో అప్పటికే తమిళ కమ్యూనిస్టు ప్రతినిధులు మద్రాసు నుంచి పార్టీ జెండాలు, బ్యానర్లు కట్టుకొని ఆర్భాటంగా వస్తున్నారు. కుటుంబరావు ఆయన మిత్రులు ఆ బోగీలో ఎక్కబోతే తమిళులు ఎక్కనివ్వలేదు. రైలు బయల్దేరబోతోంది. మేము కూడా కమ్యూనిస్టు ప్రతినిధులమేనని నచ్చజెప్పి అదే బోగీలో ఎక్కారు.

హౌరా స్టేషన్‌లో దిగాక ఆంధ్రా ప్రతినిధుల్లో అజ్ఞాతంగా ఉండవలసినవారిని వేరుగా, మిగతావారిని వేరుగా పెడతామని అక్కడి నాయకులు చెప్పారు. తర్వాత రెండు గ్రూపులను ఒక హోటల్‌కు తీసుకెళ్లారు. కలకత్తాలో అంతకు ముందు ఏడాది కాలంపాటు హిందూ ముస్లింల ఘర్షణలు జరిగి లక్షలాది మంది ప్రజలు హతులయ్యారు. ఆ గొడవలు తగ్గి పరిస్థితులు కుదుటపడుతున్న సమయంలో కమ్యూనిస్టు సభ జరిగింది.

హోటల్ మొదటి అంతస్తులో ఉన్నప్పుడు ఒక రోజు సిగరెట్లు కొనడానికి కుటుంబరావు కిందకు వెళ్లేందుకు నాలుగైదు మెట్లు దిగేలోపు హోటల్ యజమాని పరుగు పరుగున వచ్చి కుటుంబరావు చేయి పుచ్చుకొని ఆపాడు. మీరు కిందకు ఇలా వెళ్లి వుంటే రౌడీలు కత్తులతో దాడి చేసి చంపేవారని, నేను రాబట్టి సరిపోయిందని అన్నాడు. మాకు తెలియకుండా కిందకు వెళ్లవద్దని, ఇక్కడ ఇంకా పరిస్థితులు బాగుపడలేదని చెప్పాడు. ఆ మరునాడు ఆ హోటల్లో ఉన్న ఆంధ్ర కమ్యూనిస్టు ప్రతినిధులను అక్కడ్నించి తీసుకెళ్లి మైమన్‌సింగ్ మహారాజా ప్యాలెస్‌లో ఉంచారు. అక్కడి పరిస్థితుల దృష్ట్యా వీళ్లకు కొన్ని కట్టుబాట్లు విధించారు. చెప్పకుండా బయటకు వెళ్లవద్దని, మహాసభ జరిగే చోటుకు కూడా నిర్వాహకులు ఏర్పాటు చేసే బస్సులోనే వెళ్లి రావాలనీ ఆంక్షలు పెట్టారు. మహాసభ మహమ్మద్ అలీ పార్కులో జరిగింది. ఆ పార్కు పక్కనే చాలా రద్దీ అయిన రోడ్డు ఉంది. పార్కు చుట్టూ గ్రిల్లు తప్ప గోడల్లేవు. పార్కుల్లో వేసిన షామియానాల కింద మహాసభ జరిగింది. ఆ మహాసభల్లో ఆంధ్ర ప్రతినిధులుగా మద్దుకూరి చంద్రశేఖరరావు (చంద్రం), మాకినేని బసవపున్నయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, మోటూరి హనుమంతరావు, కావూరి కుటుంబరావు మొదలైనవారు పాల్గొన్నారు.

అప్పటికి బ్రిటిష్ చివరి వైస్రాయ్ లార్డ్ మౌంట్ బాటెన్, పండిత జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా, మంత్రివర్గంలో సర్దార్ వల్లభబాయ్ పటేల్, డా॥ బాబూ రాజేంద్రప్రసాద్, డా॥ బి.ఆర్. అంబేద్కర్, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, జగ్జీవన్ రామ్ వంటి ప్రముఖులున్నారు. చక్రవర్తుల రాజగోపాలచారి బెంగాల్ గవర్నర్‌గా వున్నారు.

మహాసభలో భారత కమ్యూనిస్టు పార్టీ చేపడుతున్న ఉద్యమాలను గురించి బి.టి. రణదివే నివేదిక చదవడం మొదలుపెట్టారు. ఈ విధంగా రిపోర్టు ఇచ్చిన నాయకులనే తర్వాత ఆయా కమిటీలకు కార్యదర్శులుగా ఎన్నుకొనేవారు. అప్పటికి పి.సి. జోషి అనేక సంవత్సరాలుగా కేంద్ర కమిటీ కార్యదర్శిగా వున్నారు. ఈ మహాసభలో రణదివే రిపోర్టు ఇవ్వడంతో అతనే కాబోయే కార్యదర్శి అనే సంకేతం ఇచ్చినట్లయింది. ఆ ఉపన్యాసంలో ఆయన మనకింకా స్వాతంత్ర్యం రాలేదని, జవహర్‌లాల్ నెహ్రూ, వలభభాయ్ పటేల్‌లను ముందుంచుకొని ఇంకా బ్రిటిష్‌వారే దేశాన్ని పాలిస్తున్నారని, నిజమైన స్వాతంత్ర్యం కోసం, సామ్యవాదం కోసం మనం విప్లవ పోరాటాలు చేయాలని నినదించారు. ఆయన ఉపన్యాసంలో తప్పులు వెదకేవారు గానీ, ఆయన చూపే పంథాకు ప్రత్యామ్నాయాన్ని చూపేవారు కానీ ఎవ్వరూ లేకపోయారు.

ఈ ఉపన్యాసాల తర్వాత కేంద్రకమిటీ ఎన్నికలు జరిగాయి. ఆనాడు కమిటీ ఎన్నికల్లో తాలూకా కమిటీ నుండి కేంద్ర కమిటీ వరకు ఒక పద్ధతి ఉండేది. కొత్తగా కమిటీ కార్యదర్శి కాబోయే వ్యక్తి రాజకీయ అంశాల నివేదిక ఇచ్చిన తర్వాత వైదొలగే కమిటీ తరఫున కొత్త కమిటీ పేర్లను సూచించేవారు. ఆ రాబోయే కమిటీనే ప్యానల్ కమిటీ అనేవారు. ఆ విధంగా రణదివే ప్రకటించిన కొత్త కమిటీలో ఆయన తన పేరుతో పాటు డా॥ అధికారి, పి.సి. జోషి, జడ్.ఎ. అహ్మద్, పుచ్చలపల్లి సుందరయ్య వంటివారి పేర్లను ప్రకటించాడు.

నిజానికి ఈ కమిటీ సభ్యులను మార్చడంగానీ, కొత్తవారిని ప్రతిపాదించడం గానీ ప్యానల్ కమిటీ సభ్యులు చేయలేదు. తర్వాత సభలో ప్రతినిధిగా పాల్గొన్న మోహన కుమార మంగళం లేచి రావి నారాయణరెడ్డిని కమిటీ సభ్యునిగా ప్రతిపాదించాడు. దానిపై కొంతసేపు చర్చ జరిగిన తర్వాత రణదివే లేచి రావి నారాయణరెడ్డిని తను కూడా బలపరుస్తున్నానని, ఇంతకు ముందు తాను ప్రకటించిన జాబితాలోని పి.సి. జోషిని ఎన్నుకోవద్దని చెప్పాడు. ఈ మార్పు జరిగినంతవరకు అక్కడే ఉన్న జోషీ చాలా బాధపడ్డారు. రణదివే వ్యవహారశైలి క్రమశిక్షణను తూట్లు పొడవడమే. కొత్త కమిటీ పేర్లు తానే ప్రతిపాదించడం, అందులో పి.సి. జోషి పేరును తానే ప్రతిపాదించి తానే మార్చడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

బర్మా, యుగోస్లావియా, ఆస్ట్రేలియా మొదలైన దేశాల నుంచి కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు ఈ మహాసభకు వచ్చారు. ఒక రోజు బర్మా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ

సభ్యులు ఏడెనిమిది మంది కుటుంబరావు ఆయన సహచరులు ఉన్న క్యాంపుకు వచ్చారు. బర్మా పార్టీ కార్యదర్శి తమ దేశ రాజకీయాలను గురించి మాట్లాడాడు. ఈయన ఎవరో కాదు. బర్మా తొలి ప్రధానిగా వుండి హత్యకు గురైన అంగ్‌సాన్ బావమరిది. రెండవ ప్రపంచయుద్ధంలో బర్మా నుంచి పారిపోతున్న బ్రిటిషు సైనికుల నుంచీ, తర్వాత మా దేశాన్ని ఆక్రమించుకొని కొంత కాలానికి ఓడిపోయిన జపాన్ సైనికుల వద్ద నుంచీ సేకరించిన ఆయుధాలతో రెండు లక్షల మంది మా యువకులు ఉన్నారని చెప్పారు. మేము తిరిగి బర్మా వెళ్లిన తర్వాత ఆ రెండు లక్షల మందితో బర్మాలో ఇప్పుడున్న పెట్టుబడిదారీ ప్రభుత్వాన్ని సాయుధ పోరాటం ద్వారా కూలదోస్తామని ఆ దేశ కార్యదర్శి చెప్పారు. మీరు ఆ వార్తలను మీ పత్రికల్లో చదువుకోండని ఉద్రేకంతోనూ, ఉత్సాహంతోనూ చెప్పారు. ఆ మాటలు విన్న మద్దుకూరి చంద్రశేఖర రావు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'ఈ బర్మా కమ్యూనిస్టులంతా 25 సంవత్సరాల లోపువారే. వీరు ఆచరణ సాధ్యం కాని ఎత్తుగడలతో ముందుకు వెళుతున్నారేమోనని అనిపిస్తోంది. వీరి పోరాటం ఎంత వరకు సాధ్యమవుతుందో భవిష్యత్తే తేల్చవలసి వుంది' అన్నారు.

బర్మా కమ్యూనిస్టులు చెప్పినట్లుగా మే 15 తర్వాత ఆ దేశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంతర్యుద్ధం తీసుకొచ్చారు అది చాలా ఉధృతంగా జరిగింది. ఒక రంగూన్ పట్టణం తప్ప మిగిలిన దేశమంతా వీరి ఆధీనంలోకి వచ్చింది. దీంతో సామ్రాజ్యవాద దేశాలు బర్మా ప్రభుత్వానికి సహాయంగా రంగంలోకి దిగి తిరుగుబాటు చేసిన యువకులను నామరూపాల్లేకుండా చేశాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు బర్మాలో ప్రజాస్వామ్య ప్రభుత్వం లేదు. నియంతృత్వ ప్రభుత్వమే రాజ్యమేలుతోంది. నాలుగేళ్ల కిందట ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరపగా మాజీ ప్రధాని అంగ్‌సాన్ కుమార్తె నోబెల్ బహుమతి గ్రహీత అంగ్‌సాన్ సూకీ నాయకత్వంలో ప్రజాస్వామ్యవాదులు మంచి మెజారిటీతో విజయం సాధించారు. అయినప్పటికీ వారిని అధికారంలోకి రాకుండా చేయడంతో పాటు సూకీని గృహ నిర్బంధంలో వుంచారు. ఆమెను విడుదల చేయాలని, ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని, అమెరికాతో సహా అన్ని ప్రపంచదేశాలు కోరుతున్నప్పటికీ నియంతృత్వ పాలకుల చెవికెక్కడం లేదు.

కుటుంబరావును కలకత్తా నుంచి మహారాష్ట్రలోని థానే జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి గోదావరి పెరులేకర్ తమ ప్రాంతాలకు తీసుకు వెళుతోందని, ఆమెతో పాటే వెళ్లాలని కేంద్రకమిటీ ఆదేశించింది. అప్పుడు కుటుంబరావు రహస్యశ్రేణిలోనే వున్నారు. థానే వెళ్లక ముందు కుటుంబరావుకు కలకత్తా కొత్త పట్టణాన్ని చూడాలనిపించింది. క్యాంపుకు కాపలాగా వున్న వాలంటీర్ల కళ్లు గప్పి, బయటపడ్డాడు. ట్రామ్ కారులో బయలు దేరాడు. దారిలో ఒకతను తారసపడి 'బాబూ! ఎప్పుడొచ్చావు?' అనడిగాడు. అతనెవరో సిఐడియే అయి

వుంటాడని, పార్టీ నాయకులు ముందుగానే బెదిరించినది నిజమేమోనని కుటుంబరావు వెంటనే తర్వాతి స్టేషన్‌లో దిగేసి క్యాంపుకు తిరిగి వచ్చేశాడు.

మరునాడు ఆంధ్ర నుంచి వచ్చిన ప్రతినిధులకు కాపలాగా వున్న గూర్ఖా వచ్చి కుటుంబరావు కోసం ఎవరో వచ్చారని కబురందించాడు. అతను అందించిన కార్డు మీద నందిగం కోటయ్య అని రాసి వుంది. ఆ కోటయ్య ఎవరో కాదు రావిపాలెంవాడే. కుటుంబరావు అతడ్ని లోపలికి పంపమన్నాడు. వచ్చాడు. అతను తన గురించి చెప్పాడు. తాను చిన్నప్పుడే బర్మా వెళ్లిపోయాననీ, భార్యాపిల్లలతో అక్కడే వున్నాననీ, జపాను బర్మాను ఆక్రమించిన తర్వాత అక్కడ్నించి కలకత్తా వచ్చి స్థిరపడ్డాననీ చెప్పాడు. 'మీరు కమ్యూనిస్టు పార్టీలో ఉన్నట్లు తెలుసు. మీరు నన్నెరగకపోయినా నేను మిమ్మల్ని ఎరుగుదును. మీ నాన్న గారి వద్ద చిన్నప్పుడు పాలేరుగా వుండేవాడ్ని' అన్నాడు కుటుంబరావును తన ఇంటికి ఆహ్వానించాడు. కొన్నాళ్లు ఉండమన్నాడు. కాని కుటుంబరావు వెళ్లలేదు. అంతకు ముందు దారిలో తారసపడి 'బాబూ! ఎప్పుడొచ్చావు?' అన్నది ఈ కోటయ్యేనని కుటుంబరావుకు అప్పుడు తెలిసింది.

ఇది జరిగిన నాలుగేళ్లకు కోటయ్య రావివారిపాలెం వచ్చాడు. కుటుంబరావు తండ్రిని కలుసుకొని కలకత్తా మహాసభకు వచ్చినప్పుడు కుటుంబరావును కలుసుకున్న సంగతి, ఇంటికి ఆహ్వానించిన సంగతి, కుటుంబరావు రాకపోవడంతో తమ కుటుంబ సభ్యులంతా బాధపడిన సంగతి వివరించాడు. తాము కలకత్తాలో కమ్యూనిస్టు పార్టీలోనే వున్నామని అన్నాడు. కుటుంబరావును శాలువాతో సత్కరించి వెళ్లాడు.

కలకత్తా మహాసభ తర్వాత పార్టీ నాయకత్వం ఆదేశం మేరకు కుటుంబరావు గోదావరి పేరులేకర్‌తో కలిసి థానే జిల్లాకు వెళ్లలేదు. తనతో కలకత్తా వచ్చిన తన బంధువు కూడా అయిన రావి దుర్గాప్రసాద్, సుబ్బారావు (మోటూరి బావమరిది)లతో కలిసి రైలెక్కి తెనాలిలో దిగి తమ ఊరికి చేరుకున్నారు. చంద్ర రామలింగయ్య మాత్రం నాయకత్వం చెప్పిన ప్రకారం ప్రయాణం చేసి 15 రోజుల తర్వాత ఇంటికి వచ్చాడు. ఆయనను కొరియర్‌కు అప్పగించగా అతను కొంత దూరం బస్సులో, కొంత దూరం రైలులో ప్రయాణించి ఇంకొంత దూరం కాలినడకన తీసుకొచ్చాడు. కుటుంబరావు ఇటువంటి విషయాల్లో కొంత స్వతంత్రంగా వ్యవహరిస్తాడు. ప్రాక్టికల్‌గా ఆలోచించే మనిషి. రామలింగయ్య మాత్రం పార్టీ క్రమశిక్షణకు లోబడి పనిచేసేవాడు. అప్పటి నుంచే కుటుంబ రావు, రామలింగయ్య మరికొందరు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్నందువల్ల రహస్య జీవితంలోకి వెళ్లారు.

రహస్య జీవితం

ఇప్పటి వరకు కమ్యూనిస్టు కార్యకలాపాల్లో క్రియాశీలంగా పాల్గొన్న కుటుంబ రావుకు రహస్య జీవితం ప్రారంభమైంది. ఇది ఎంతో కష్టతరంగా సాగింది. ఎన్నో కష్టనష్టాలకు,

అరెస్టులకు, జైలుశిక్షలకు గురి చేసింది. అయితే కుటుంబరావు మొదటి నుంచీ జీవితమే ఒక పోరాటమని భావించిన వ్యక్తి కావడంవల్ల కష్టనష్టాలన్నీ పోరాటంలో ఒక భాగంగా స్వీకరించాడు. ఈ పోరాటగమనంలో ఎంతో మంది మహా నాయకులు ఆయనకు తోడునీడగా వున్నారు.

1948 జూన్ నెల మొదటివారంలో ఉద్యోగ విషయాలను చర్చించేందుకు చల్లపల్లి నారాయణరావు, కావూరి కుటుంబరావు కలిసి తెనాలి తాలూకా చినపులివర్రు గ్రామంలోని బసవయ్య ఇంటికి వెళ్లారు. ఆరోజంతా వారు చర్చలు సాగించారు. మరునాడు పత్రికల్లో రహస్య కమ్యూనిస్టు పార్టీ నాయకులను దాచిపెట్టినవారికి సంవత్సరం శిక్ష పడుతుందనే వార్త ప్రచురితమైంది. అది చూసిన బసవయ్య భార్య భయపడి నారాయణ రావు, కుటుంబరావు వున్న గది తలుపులు తెరిచి వెళ్లింది. ఇది గమనించిన నారాయణ రావు బసవయ్య భార్య భయపడుతోందని ఇక్కడ్నించి వెళ్లిపోదామని అన్నారు. పగలు 12 గంటలకు భోజనం చేసి ఇద్దరూ గొడుగులు పుచ్చుకొని బయలుదేరారు. కృష్ణానదికి పడమర వైపున్న కాలవ పక్కన అరటి తోటలో కూర్చున్నారు. ఆ రాత్రంతా భోజనం లేదు. రాత్రి బాగా వర్షం కురిసింది. బయటికి వస్తే పోలీసుల బారిన పడవలసి వస్తుందని భావించి మరునాడంతా కూడా అక్కడే భోజనం లేకుండా గడిపారు. ఆ రాత్రి ఇద్దరూ కలిసి అక్కడికి నాలుగు మైళ్ల దూరంలో వున్న పల్లెకోనకు చేరారు. దారిలో కొంతదూరం డొంకదారిలో, మరికొంత దూరం పొలాల్లో నడిచారు. ఆ ఊరి బయట వున్న పాకలో కంఠంనేని వెంకటరత్నం (మాకినేని బసవపున్నయ్య బావమరిది) అనే పార్టీ కార్యకర్త పడుకొని వున్నాడు. కుటుంబరావు, నారాయణరావు అతడ్ని లేపి పరిస్థితిని వివరించారు. అతనిపై అప్పటికి అరెస్టు వారంటు లేదు.

వీరికి ఆశ్రయం ఇవ్వడానికి వెంకటరత్నం ఆసక్తి చూపలేదు. తన తండ్రి చూస్తే ఇందుకు ఒప్పుకోడని, మీరు వెళ్లిపోండని అన్నాడు. దాంతో ఇక నేను వెళ్లిపోతున్నానని, నీ దారి నీవు చూసుకొమ్మని చల్లపల్లి నారాయణరావు కుటుంబరావుతో చెప్పి తన దారిన వెళ్లిపోయాడు. కుటుంబరావు మాత్రం ఆ రాత్రికి అక్కడే పడుకున్నాడు. మరునాడు వెంకటరత్నం తండ్రి లక్ష్మయ్య వచ్చి కుటుంబరావును చూసి నీవెవరు? అనడిగాడు. 'పెదనాన్నా! నేను సుబ్బారావును. జంపని మామయ్యగారింటికి వెళ్లి వస్తూ అన్నయ్యను చూడాలని వచ్చానని అబద్ధమాడాడు. లక్ష్మయ్యగారిది రావివారిపాలెం పక్కనున్న నాగాయితిప్ప గ్రామం. పల్లెకోన ఇల్లరికం వచ్చాడు. కుటుంబరావు మాటలు విని నిజంగా తన బంధువేనని నమ్మి మంచి మర్యాద చేశాడు. ఆ రోజు అక్కడే భోజనం చేసి ఆ సాయంత్రం బయలుదేరి రేపల్లె మీదుగా మోపిదేవి చేరుకున్నాడు. తర్వాత వెంకటరత్నం కూడా రహస్య జీవితంలోకి వెళ్లాడు. 1950లో బాపట్లలో పోలీసు కాల్పుల్లో మరణించాడు.

కుటుంబరావు అరెస్టు

1948 జూన్ మొదటివారంలోనే కుటుంబరావు రెండవ తమ్ముడు కావూరి కోటయ్యకు రావివారిపాలేనికి చెందిన రావి నారాయణ పెద్ద కుమార్తె నాంచారమ్మతో వివాహం జరిగింది. ఆ వివాహాన్ని కూడా సంస్కరణ పద్ధతిలోనే చెయ్యాలని తండ్రి శివరామయ్య భావించాడు. అయితే వియ్యాలవారి బంధువైన నాగాయితిప్ప వాస్తవ్యులు భూస్వామి అయిన యార్లగడ్డ చలమయ్య మాత్రం ఈ వివాహం సంప్రదాయ పద్ధతిలోనే జరగాలని, సంస్కరణ పద్ధతిలో చేస్తే పోలీసులతో దాడి చేయిస్తానని బెదిరించాడు. వివాహమైనా మానుకుంటాను గానీ బ్రాహ్మణులతో మాత్రం జరిపే ప్రసక్తే లేదని శివరామయ్య పంతం పట్టారు. మొత్తానికి సంస్కరణ పద్ధతిలోనే వివాహం జరిపించారు. తర్వాత రెండు రోజులకు చిన్న కుమారుడు వీరరాఘవ రావు తప్ప శివరామయ్య కుటుంబ సభ్యులందరూ వధువు ఇంటికి వెళ్లారు. ఆ రాత్రి కుటుంబరావు కోడూరు నుంచి చల్లపల్లి వెళ్తూ మధ్యలో ఇంటి వద్ద ఆగి స్నానం చేస్తుండగా ఆకస్మికంగా పోలీసులు ఇంటిని చుట్టుముట్టారు. స్నానం పూర్తి చేసి తుండుగుడ్డతో ఒళ్లు తుడుచుకొని ఇవతలికి రాగానే పోలీసులు తారసపడ్డారు. అప్పుడు పోలీసు ఇన్‌స్పెక్టర్ కుటుంబరావునుద్దేశించి 'నీ పేరేమిటి?' అని గద్దించాడు. 'మై నేమీజ్ కోటయ్య' అని సమాధానం. 'నీవు ఏం చేస్తుంటావు?' ఇన్‌స్పెక్టర్ ప్రశ్న. 'నేను మద్రాసులో బి.వి.యస్‌సి. చదువుతున్నాను' . 'కుటుంబరావు నీకేమవుతాడు?' 'అతను మా పెద్దన్నయ్య అని సమాధానం. 'అతనెక్కడున్నాడు?' ఇన్‌స్పెక్టర్ అడిగాడు. 'నేను మద్రాసు నుంచి వచ్చి 15 రోజులైంది. అతనెక్కడున్నాడో నాకు తెలియదు.' 'నీవు ఉన్నత విద్య చదువుతున్నావు. మీ అన్నయ్యపై అరెస్టు వారంటు వుంది. అతడ్ని అరెస్టు చేసేందుకు నీవు తోడ్పడాలి' అన్నాడు ఇన్‌స్పెక్టర్ నికోదమస్. కుటుంబరావు సరేనన్నాడు. కుటుంబరావు తాను కోటయ్యనని చెప్పిన మాటల్ని నమ్మడమే కాక కుటుంబరావును అరెస్టు చేసేందుకు సహాయపడాలంటూ చెప్పి అక్కడ్నించి వెళ్లిపోయేందుకు సిద్ధమవుతుండగా అంతలో అనుకోని సంఘటన జరిగింది. దారిన వెళుతున్న పెదప్రోలు వాస్తవ్యుడు లక్ష్మీనారాయణ పోలీసుల వైపు కేకవేస్తూ 'అతనే కుటుంబరావు' అని చెప్పాడు. ఈ హఠాత్పరిణామానికి పోలీసులు అప్రమత్తమయ్యారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఒక వైపు, సబ్ ఇన్‌స్పెక్టర్ మరో చేతినీ బిగించి పట్టుకున్నారు. బట్టలు వేసుకుంటానని అనుమతివ్వమని కుటుంబరావు అడగ్గా సరేనని వదిలారు. 'నీవు మమ్మల్ని ఎంతో మోసంతో నమ్మించావు' అన్నారు కోపంగా. కుటుంబరావు లేదని ఎందుకు చెప్పారని ఇన్‌స్పెక్టర్ శివరామయ్యను అడిగారు. ఏ తండ్రీ తన కుమారుని అరెస్టు చేయమని చెప్తాడా అని సమాధానమిచ్చారు. దానికి ఆయన్ను కూడా అరెస్టు చేస్తున్నట్లు చెప్పి పోలీసులు కుటుంబరావును, శివరామయ్యను చల్లపల్లి పోలీసుల క్యాంపుకు తీసుకెళ్లారు.

కుటుంబరావు అరెస్టయిన సంగతి తెలిసిన కాంగ్రెస్ నాయకుడు గొట్టిపాటి బ్రహ్మయ్య అక్కడికి వచ్చారు. పోలీసు క్యాంపులో శివరామయ్యను చూసి ఆశ్చర్యపోయారు. ఇన్‌స్పెక్టర్‌ను

పిలిచి శివరామయ్యను ఎందుకు తీసుకొచ్చారు బుద్ధి లేదూ అని చీవాట్లు వేసి వెంటనే జీపులో ఆయనను ఇంటి వద్ద దింపిరమ్మని చెప్పారు.

బ్రహ్మయ్యగారు అలా వెళ్లగానే సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అగ్రహోదగ్రుడయ్యాడు. కర్ర తిప్పుతూ కుటుంబరావును తీక్షణంగా చూశారు. కమ్యూనిస్టు పార్టీ రహస్యాలను చెప్పమని అన్నాడు కుటుంబరావు నిరాకరించాడు. 'నీ చేత ఎలా చెప్పించాలో నాకు బాగా తెలుసు. అని దబాయించడం మొదలు పెట్టాడు. అంతటితో ఆగక కుటుంబరావుపైకి దౌర్జన్యంగా దూసుకెళ్లి రెండు దెబ్బలు కొట్టాడు. ఆ దెబ్బకు బెదరక 'తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి నిలువ దలుచుకున్న మమ్మల్ని మీ లాఠీ దెబ్బలేమీ చేయలేవు' అని కుటుంబరావు గట్టిగా సమాధాన మిచ్చాడు. అక్కడ్నించి పోలీసు స్టేషన్‌కు తరలించి లాకప్‌లో వేశారు.

అప్పటికే ఆ లాకప్‌లో కంఠంనేని చలపతిరావును నాలుగు రోజులుగా నిర్బంధించి వుంచారు. చలపతి పాగోలు భూస్వామి, కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. అతడినే కాకుండా అన్న కొడుకు కంఠంనేని చిన్నిని పోలీసులు విపరీతంగా కొట్టారు. ఎరుపు రంగు దేహఛాయతో ఎంతో అందంగా వున్న చలపతిరావు వీపు నిండా లాఠీదెబ్బల తాలూకు ఎర్రటి గుర్తులు చూసి కుటుంబరావుకు ఎంతో బాధ కలిగింది. అప్పటికి అరెస్టయిన ముఖ్యుల్లో కుటుంబరావే మొదటివాడు.

కుటుంబరావును అలా అక్రమంగా పోలీసు లాకప్‌లో నిర్బంధించవద్దని పై అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో కుటుంబరావును, చలపతిరావును, చిన్నిని అవనిగడ్డ మెజిస్ట్రేటు కోర్టులో హాజరుపరిచారు. వీళ్లను అవనిగడ్డలో వుంచవద్దని, కైకలూరు తాలూకా మెజిస్ట్రేటు కోర్టు వద్ద వున్న జైలుకు తీసుకెళ్లాలనీ మెజిస్ట్రేటు ఉత్తర్వులు జారీ చేశారు. కుటుంబరావు తదితరులను ఆ జైలుకు తరలించారు. కాపలాగా ఆంధ్రా పోలీసులను ఉంచకుండా తమిళ పోలీసులను వుంచారు. 12 రోజుల తర్వాత వారిని అవనిగడ్డ జైలుకు మార్చాలని మెజిస్ట్రేటు ఉత్తర్వులిచ్చారు. కుటుంబరావును కోర్టులోకి పిలిపించి రెండు చేతులకు సంకెళ్లు వేయమని పోలీసులను ఆదేశించారు.

సంకెళ్లు వేయవద్దంటూ కుటుంబరావు ప్రతిఘటించాడు. అప్పుడు శంకరన్ అనే తమిళ పోలీసు అధికారి కోర్టు వెలుపలికి వెళ్లగానే తీసేస్తాను. ఇక్కడ వేయనివ్వమని చెవిలో చెప్పడంతో కుటుంబరావు ఒప్పుకున్నాడు. అన్నట్లుగానే కోర్టు వెలుపలికి రాగానే మెజిస్ట్రేటు చూస్తుండగానే తమిళ పోలీసులు సంకెళ్లు తొలగించారు. రాత్రి 7 గంటలకు అవనిగడ్డ చేరుకున్నారు.

అక్కడో సమస్య ఎదురైంది. జైలులోకి పంపాలంటే మెజిస్ట్రేటు అనుమతి కావాల్సిందేనని చెప్పారు. దాంతో తమిళ పోలీసులు వెళ్లి మెజిస్ట్రేట్ అనుమతి తీసుకొని తిరిగి జైలుకు వస్తుండగా దారిలో వర్షం వచ్చింది. వర్షాన్నించి రక్షించుకునేందుకు పోలీసులు రోడ్డుకు

ఎడమవైపున్న ఇంటి వసారాలోకి వెళ్లగా కుటుంబరావు, చలపతిరావు వాళ్లు కుడివైపున వున్న ఇంటివసారాలో తలదాచుకునేందుకు పరుగుతీశారు. అప్పుడు తనతో వున్న మిత్రులు కుటుంబరావును పారిపొమ్మని సలహా ఇచ్చారు.

కుటుంబరావు ఆలోచించాడు. ఇది మంచిపని కాదని మనసుకు అనిపించింది. గౌరవభావంతో తనకు సంకెళ్లు తీసివేసిన ఈ పోలీసులకు తను పారిపోవడం ద్వారా ఎన్నో ఇబ్బందులు కలుగుతాయి. ఎక్కడో తిరుచిరాపల్లి నుంచి పొట్ట చేతపట్టుకొని వచ్చి చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకుంటున్న వీరు తాను పారిపోతే రోడ్డున పడవలసి వస్తుందనే మానవతా హృదయంతో పారిపోవడానికి ఇష్టపడలేదు.

మరునాడు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు కుటుంబరావు మంచితనానికి ముగ్ధులయ్యారు. ఆయన్ని జైల్లో వదలివెళ్తూ కుటుంబరావుకు వారి అడ్రసులు ఇచ్చారు. జైలు నుంచి బయటికి త్వరగా రావాలని ఆకాంక్షిస్తూ తమను మరచిపోవద్దని, ఉత్తరాలు రాయాలని చెప్పి నమస్కరించి కన్నీళ్లతో సెలవు తీసుకున్నారు. 10 రోజులు జైలులో కుటుంబరావుకు కాపలాగా వున్న ఆ పోలీసులు ఆయన గురించి విని అభిమానాన్ని పెంచుకున్నారు. ఆ మరునాడే కుటుంబరావును రాజకీయ డిటెన్యూగా రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

రాజమండ్రి జైలులో కొన్నాళ్లు

మరనాడు ఉదయమే కుటుంబరావును రాజమండ్రి సెంట్రల్ జైలులో సూపరింటెండింటుకు అప్పగించారు. ఆ జైలులో అప్పటికే కమ్యూనిస్టు పార్టీకి చెందిన సీనియర్ నాయకులు డిటెన్యూలుగా వున్నారు. ముఖ్యంగా మద్దుకూరి చంద్రశేఖరరావు, గారపాటి సత్యనారాయణ, ముక్కామల నాగభూషణం, బాంబే ప్రసాద్ (వీరమాచనేని ప్రసాద్), నర్రా వెంకటేశ్వరరావు, మృత్యుంజయుడు, అల్లు రామలింగయ్య(సినీ నటుడు), డా. చెలికాని రామారావు, చండ్ర రామలింగయ్య, కోగంటి గోపాలకృష్ణయ్య, కంభంపాటి సత్యనారాయణ (సీనియర్) వంటివారు రాజమండ్రి జైలుకు కొత్త అతిథి ఖైదీగా వచ్చిన కావూరి కుటుంబ రావుకు స్వాగతం పలికారు. లోపలికి అడుగు పెట్టగానే జైలు సిబ్బంది కుటుంబరావు చేతిలోని సూట్‌కేసును తీసుకున్నారు. టిఫిన్, కాఫీలు ఏర్పాటు చేశారు. అది పెద్ద బంగళా. రెండు హాళ్లుగా విభజించారు.

జైలులోని డిటెన్యూలందరూ విధిగా డ్రిల్లు చేయాలి. కుటుంబరావుకు అప్పట్లో ఉబ్బసపు వ్యాధి ఉండడం వల్ల డ్రిల్లుకు వెళ్లేవాడు కాదు. క్రమశిక్షణ పేరుతో అందరినీ డ్రిల్లు చేయిస్తుండగా ఒకసారి మద్దుకూరి చంద్రశేఖరరావు పడిపోయాడు.

ఇక బయట కమ్యూనిస్టు ఉద్యమంలో అదే సమయంలో పెదధోరణులు చోటు

చేసుకున్నాయి. విచక్షణారాహిత్యం, దుందుడుకు పోకడలు పొడసూపాయి. ఇందుకు ఉదాహరణగా ఒక సంఘటనను పేర్కొంటారు. ఒకరోజు బయటి నుంచి అంటే తాలూకా నుంచి ఉత్తరం వచ్చింది. తాలూకా నాయకులైన గత్తికొండ కోదండరామయ్య మరి నలుగురు అరెస్టయ్యారని, వారంతా లాకప్‌లో ఉండగా పోలీసులను కొట్టమని మిగతావారు కోదండరామయ్యను కోరారు. పోలీసు కస్టడీ వుండి కొట్టడం ఎలా సాధ్యం అని ఆయన నిరాకరించారని, దీంతో పార్టీ కోదండరామయ్యను సస్పెండ్ చేసిందని.... ఆ ఉత్తరంలో సారాంశం. ఈ విషయం రాజమండ్రి జైలులో వున్న కుటుంబరావుకు, చంద్ర రామలింగయ్యకు తెలిసింది. జైళ్లలో వున్న కమ్యూనిస్టుల గురించి వీరికి చాలా తెలుసు గానీ ఏ కమ్యూనిస్టూ జైల్లో పోలీసులకు కొట్టలేదు. ఇక్కడ జరిగింది విడ్డూరంగా తోచింది.

ఫ్రెంచి కమ్యూనిస్టు నాయకుడు మారిస్‌థోరె ఒక సందర్భంలో అన్న మాటలు మననం చేసుకోదగ్గవి. "కమ్యూనిస్టులు జైలులో వున్నప్పుడు పోలీసులు ఎన్ని బాధలు పెట్టినా, హింసించినా కమ్యూనిస్టు పార్టీ నుంచి తొలగిపోకుండా నిలబడడమే గొప్ప విషయం. తిరిగి పోలీసులను కొట్టడం జరగని పని" అని అన్నాడాయన. దివి తాలూకాలో జరిగిన ఈ సంఘటన గురించి నాటి కేంద్ర కమిటీ సభ్యుడైన మద్దుకూరి చంద్రశేఖర రావుకు చెప్పారు. ఇటువంటి పద్ధతులు మంచివి కావని, వీటిని విడనాడమని పార్టీవారికి ఉత్తరం రాయమని కుటుంబరావు చంద్రంగారిని కోరాడు. దీనిపై మీరు రాయమని ఆయన కుటుంబరావును, రామలింగయ్యను కోరాడు. అప్పుడు వీరిరువురూ ఆ రకంగా వివరంగా లేఖ రాసి పంపారు.

తర్వాత పది రోజులకు కమిటీ మాలెంపాటి శారదాంబ ద్వారా వీరికి ఒక సమాధానం పంపింది. అది చదివిన కుటుంబరావు, రామలింగయ్యల కళ్లు బైర్లు కమ్మాయి. 'ఇంతకు ముందు లేఖలో మీరు రాసిన అంశాలు తప్పనీ, మీరు కూడా పిరికితనాన్ని ప్రోత్సహిస్తున్నారనీ, అందుకు శిక్షగా రామలింగయ్య జైలుకు వెళ్లక ముందు తేదీతో ఘంటసాలకు చెందిన వేమూరి వెంకటసుబ్బయ్య దగ్గర 10 వేల రూపాయలు అప్పు తీసుకున్నట్లుగా (తీసుకోకుండానే) నోటు రాసి పంపమని స్టాంపు పత్రాలు పంపింది. పార్టీ క్రమశిక్షణకు లోబడిన చంద్ర రామలింగయ్య మాత్రం పార్టీ చెప్పినట్లే స్టాంపు పత్రాలు రాసి శారదాంబ ద్వారా పంపాడు. కాని ఆ నోటును వేమూరి వెంకటసుబ్బయ్య ఆమోదించలేదు. దాన్ని అంగీకరిస్తే ఎంత మందికి ఆ విధంగా అప్పులిచ్చావని పోలీసులు చిత్రహింసల పాలు చేస్తారని భావించి నిరాకరించాడట.

ఆ తర్వాత దివి తాలూకాలో వయసులో పెద్దవాడైన బార్లపూడి గ్రామస్థుడు కోనేరు సుబ్రహ్మణ్యంను పోలీసులు ఏదో కేసు బనాయించి మూడు నెలలు శిక్ష వేసి రాజమండ్రి జైలుకు పంపారు. జైల్లోకి వచ్చాక ఆ విషయం తెలిసిన కుటుంబరావు, రామలింగయ్య

సుబ్రహ్మణ్యాన్ని డిటెన్యూల వంటమనిషిగా పంపమని జైలర్‌ను అడిగారు. ఆ రోజుల్లో ప్రభుత్వం డిటెన్యూలకు భోజనం కోసం రోజుకు మూడు రూపాయలు ఇచ్చేది. అంతేగాక ఖైదీలను వంటవారిగా వేసేది. చాకళ్లను, మంగళ్లను పంపేది.

డిటెన్యూలను రాత్రీపగలూ లాకప్‌లో వుంచేవారు కాదు. వారికి పనిచేసేందుకు వచ్చే ఖైదీలను మాత్రం పగలు డిటెన్యూల వద్ద పనిచేయనిచ్చి రాత్రివేళల్లో బంధించేవారు. ఆ విధంగా కోనేరు సుబ్రహ్మణ్యానికి పగటిపూట లాకప్‌లో వేసే బాధ నుంచి విముక్తి కల్పించారు. కుటుంబరావు ఇతర నాయకులతో పాటు పత్రికలు చదువుతూ, రాజకీయ చర్చల్లో పాల్గొంటూ పార్టీ పంపిన సర్క్యులర్లను చదువుతూ వుండేవాడు. డిటెన్యూల సంఖ్యను బట్టి ఒక తాలూకావారిని లేదా ఒక జిల్లావారిని ఒకచోట వుంచేవారు. రాజకీయ చర్చలు, పార్టీ సర్క్యులర్లు చదవడం సులభమయ్యేది.

ఆంధ్ర కమ్యూనిస్టులను కడలూరు జైలుకు మార్పు

ఇంతలో ప్రభుత్వ పంథాలో ఏదో మార్పు వచ్చి రాజమండ్రి, విశాఖ, ఇతర జైళ్లలో వున్న ఆంధ్ర కమ్యూనిస్టు డిటెన్యూలను తమిళనాడులోని కడలూరుకు పంపే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ నిర్ణయం ఫలితంగా కృష్ణయ్య, సత్యన్నారాయణ మొదలైన 22 మందిని పోలీసు భద్రతతో కడలూరు జైలుకు తరలించారు. ఆంధ్ర నాయకులు రైల్లో వెళుతున్నారని తెలుసుకున్న పార్టీ సానుభూతిపరులు స్వీట్లు, ఇతర పదార్థాలను తెచ్చి విజయవాడ స్టేషన్‌లో అందజేశారు. కోగంటి గోపాలకృష్ణయ్య మరికొందరు పార్టీ సానుభూతిపరుల సమక్షంలో విప్లవగీతాలను ఆలపించారు. ఈ సందడిని చూసిన ఇతర ప్రయాణికులు కమ్యూనిస్టులకు అభినందన పూర్వకంగా పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు.

సాయంత్రం 7 గంటలకు రైలు నెల్లూరు జిల్లా గూడూరు చేరింది. కమ్యూనిస్టు నాయకులను మద్రాసు మీదుగా కడలూరు పంపే విషయంలో ప్రభుత్వం వెనకడుగు వేసింది. గూడూరు నుంచి మీటరుగేజీ మార్గంలో తిరుపతి మీదుగా తరలించే ఏర్పాటు చేసింది. నాయకులను మీటర్ గేజి రైల్లో ఒక బోగీలో ఎక్కించారు. అందులో ఒకో కూపేలో నాలుగు సీట్లుండేవి. బోగీకి రెండు వైపులా ఎక్కడానికి, దిగడానికి ద్వారాలుండేవి. ఈ 22 మంది డిటెన్యూలను ఆ బోగీలో ఎక్కించి రాత్రి 7 గంటల నుంచి తెల్లవారు జాము 4 గంటల వరకు పోలీసులు చుట్టూ కాపలా కాశారు.

బోగీ చివరి కూపేలో కావూరి కుటుంబరావు, తుమ్మల వెంకట్రామయ్య, కె. శేషాద్రి, సత్యనారాయణ వున్నారు.

రైల్లోంచి దూకిపారిపోయిన శేషాద్రి

తెల్లవారుజాము 4 గంటలకు రైలు ఇంజను మిగతా బోగీలను తగిలించుకొంది. అప్పుడు

కింద వున్న పోలీసులు ఒక్కరొక్కరే బోగీలోకి ఎక్కే ప్రయత్నంలో వుండగానే పోలీసుల కాపలా లేని సంగతి గమనించిన శేషాద్రి కిటికీలోంచి దూకి లుంగీ, బనియన్‌తోనే పారిపోయాడు. అప్పట్లో రైలు కిటికీలకు ఊచలుండేవి కావు. శేషాద్రి ప్రముఖ లాయర్ (కె.జి. కన్నభీరన్ అన్న) దూకి పారిపోవడం సులభమైంది.

తర్వాత పోలీసులు డిటెన్యూలను లెక్కబెట్టారు. 21 మందే తేలారు. మొత్తం 22 మంది కదా 21 మందే ఉన్నారేమిటి అని పోలీసులు కంగారు పడ్డారు. మళ్లీ మళ్లీ లెక్కబెట్టారు. బాత్‌రూములు, అవీ వెతికారు. ఎవరి బెర్తు మీద వాళ్లను ఉండమన్నారు. డిటెన్యూలు అలాగే చేశారు. చివరికి పారిపోయింది కె. శేషాద్రి అన్న విషయం నిర్ధారణ అయింది. ఈలోగా బెజవాడ, తెనాలి స్టేషన్లలో కమ్యూనిస్టులకు వచ్చిన రహస్య సర్క్యులర్లను దాయటం, పారవేయటం చేశారు.

మేమందరం పారిపోతుండగా ఆపామని, ఒకరు పారిపోయారని చెప్పి మిగతావారిని పోలీసులు చిత్రహింసలు పెడతారని భయపడ్డారు నాయకులు. ఏమైనా ఎదుర్కొనేందుకు మానసికంగా సిద్ధపడ్డారు. 'మీ కూపెలోని వ్యక్తే పారిపోయాడు. అతనెవరో చెప్పండి' అని కుటుంబరావును పోలీసులు నిలదీశారు. రాత్రి ఇక్కడున్నవారిలో 'ఆంధ్ర వారు తెలంగాణలోవారు ఎక్కడెక్కడివారో వున్నారు. పారిపోయినతను ఎవరైందీ గుర్తు లేదని కుటుంబరావు వాళ్లకు చెప్పాడు. ఒక్కొక్క పేరు పిలిచి చివరికి పారిపోయిన వ్యక్తి శేషాద్రి అన్న విషయం తేల్చారు. పోలీసు సార్జంటు బావురుమన్నాడు. ఈ కేసు వల్ల తనకు డిపార్టుమెంటు ఏం పనిష్మెంటు ఇస్తుందో, తన భార్యాబిడ్డల పోషణ కష్టమవుతుందని ... ఇలా పరిపరి విధాలుగా భయాందోళనను వ్యక్తం చేశాడు. కుటుంబ రావు తుమ్మల వెంకట్రామయ్య అతడ్ని ఓదార్చారు. శేషాద్రి మిమ్మల్ని కన్ను గప్పి పారిపోయాడని మీపై అధికారుల ఎదుట సాక్ష్యం చెబుతానని నచ్చజెప్పారు.

ఈ సమస్య తాత్కాలికంగా ఈ మలుపు తిరిగింది. శేషాద్రి పారిపోయినందుకు తమనేమైనా పోలీసులు చిత్రహింసలకు గురి చేస్తారేమోనని లోలోపల పడిన బాధ తీరిపోయిందని కుటుంబరావు ఆయన సహచరులు ఊరట చెందారు. తిరుపతి స్టేషన్ వచ్చింది. పోలీసులు వీరిని కిందికి దింపి భోజనం చేయించాడు. భోజనం కానిచ్చి తిరిగి రైలు ఎక్కుతుండగా డిటెన్యూల్లో ఒకరైన ముదినేపల్లికి చెందిన కోడూరు ప్రకాశరావు 'కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్, పోలీసు జులుం నశించాలి' అని నినాదాలివ్వడం ప్రారంభించాడు. తుమ్మల వెంకట్రామయ్య జోక్యం చేసుకొని కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్ అనండి గానీ పోలీసు జులుం నశించాలనే నినాదం అనవసరమన్నారు. మొత్తానికి వారంతా కడలూరు స్టేషన్ చేరారు. అప్పటికి ఉదయం భోజనవేళ అయింది. 'దగ్గర్లో మంచి

హోటలుంది. మిమ్మల్ని అక్కడికి భోజనాలకు తీసుకెడతాను. కాని వెళ్లేటప్పుడు నినాదాలివ్వవద్దు. వచ్చేటప్పుడు ఇచ్చినా ఫరవాలేదు' అని పోలీసు అన్నాడు. అందరూ దిగి భోజనాలు చేశారు. తిరిగి వచ్చేటప్పుడు నినాదాలిస్తూ అక్కడ జైలుకు తీసుకువెళ్లేందుకు వచ్చిన వ్యాను ఎక్కారు. కడలూరు జైలు అక్కడికి 4 కిలోమీటర్ల దూరం. వ్యాను జైలు వద్దకు చేరింది. డిటెన్యూలంతా దిగారు. అక్కడి జైలు అధికారులు కుటుంబరావు ఆయన సహచరుల వెంటనున్న సార్జంటుతో రాజమండ్రి జైలు నుంచి 8 మంది పారిపోయిన వార్త చెప్పారు. రైల్లోంచి పారిపోయిన వ్యక్తిని ఆ ఖాతాలో వేస్తే పోతుందని మాతో వచ్చిన సార్జంటు సంతోషించాడు. ఆ విధంగా తాను ఒడ్డున పడ్డట్లేనని ఊరట చెందాడు.

కడలూరు జైలులో పరిస్థితులు

కుటుంబరావు, తుమ్మల మొదలైన నాయకులను కడలూరు తరలించిన తర్వాత రాజమండ్రి జైలు నుంచి తప్పించుకుపోయినవారిలో ముక్కామల నాగభూషణం, బాంబే ప్రసాద్ (వీరమాచనేని), నర్రా వెంకటేశ్వరరావు, మృత్యుంజయుడు మొదలైనవారున్నారు.

అప్పటివరకు డిటెన్యూలను స్వేచ్ఛగా తిరగనిచ్చిన ప్రభుత్వం ఈ సంఘటనతో రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము 5 గంటలదాకా లాకప్‌లో ఉంచడం ప్రారంభించింది. జైలులో అప్పటి వరకు వున్న వారిని బయటి జైళ్లకు పంపి 300 మంది కమ్యూనిస్టు రాజకీయ డిటెన్యూలను మాత్రమే ఉంచారు. అది విశాలమైన జైలు. ఎనిమిది దిక్కులకు మొత్తం 30 బ్లాకులు, ఒక్కో బ్లాకులో 30 గదులు వుండేవి. వీటి వెనుక మహిళా ఖైదీల కోసం ఒక పెద్ద బ్లాకు ఉండేది. వారిని కూడా ఖాళీ చేయించి కమ్యూనిస్టుల కోసం కేటాయించారు. వాటిలో ఒక తాలూకావారు ఒక చోట, ఒక జిల్లావారు ఒకచోట వుండేలా పార్టీవారు నిర్ణయించారు. ఈ బ్లాకులకు ఎదురుగా వున్న ప్రధాన ద్వారం వద్ద జైలు సూపరింటిండెంట్, జైలర్లు, జవాన్లు ఉండేవారు.

జైలులో వున్న కమ్యూనిస్టు డిటెన్యూలంతా సమావేశమై ఒక జైలు కమిటీని ఎన్నుకున్నారు. అందులో మద్దుకూరి చంద్రశేఖరరావు, మోటూరి హనుమంతరావు, గారపాటి సత్యనారాయణ, కె.ఎల్.రావు, టి, వెంకటేశ్వరరావు, తమ్మారెడ్డి సత్యనారాయణ, వై. విజయకుమార్, ఎం.ఆర్. వెంకట్రామన్ (తమిళనాడు), ఎ.కె. గోపాలన్ (మలబారు) మొదలైనవారున్నారు.

ఇక ఆనాడు కడలూరు జైల్లో వున్న మన కమ్యూనిస్టు నాయకుల్లో మద్దుకూరి చంద్రశేఖరరావు, కావూరి కుటుంబరావు, మోటూరి, కంభంపాటి సీనియర్, టి. వెంకటేశ్వర రావు, కడియాల గోపాలరావు, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, టి. పోతరాజు, లక్ష్మణస్వామి, చంద్ర రామలింగయ్య, తమ్మారెడ్డి సత్యనారాయణ, వై.వి., తుమ్మల వెంకట్రామయ్య, జోస్యభట్ల సత్యనారాయణ, జె.వి.కె. వల్లభరావు, గారపాటి సత్యనారాయణ, కోరుగంటి గోవిందరావు,

కాంచనపల్లి వెంకటరామారావు (నల్లగొండ), రాయల వీరయ్య (ఖమ్మం), వట్టికొండ నాగేశ్వరరావు, చిట్టూరి ప్రభాకరచౌదరి, బాలాజీ దాస్, రాయిటర్ విలేకరి సి. గోపాలకృష్ణ, డి. సీతారామయ్య, గజ్జెల మల్లారెడ్డి, చంద్ర పుల్లారెడ్డి మొదలైన ఆంధ్ర, తెలంగాణ ప్రాంత కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు... వీరు కాకుండా తమిళనాడు కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎం.ఆర్. వెంకట్రామన్ (నోబెల్ బహుమతి గ్రహీత సి.వి. రామన్ బంధువు), వీరందరి కంటే ముందు నుంచే అక్కడ వున్న ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు ఎ.కె. గోపాలన్ చెప్పుకోదగినవారు. కాంగ్రెస్‌వాదులై వుండే కమ్యూనిస్టు సానుభూతిపరులుఐన కాట్రగడ్డ మధుసూదనరావు, కాట్రగడ్డ వెంకట నారాయణ రావు (1936లో విజయవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే), చలసాని ప్రకాశరావు వంటి వారు జైలులో ఉన్నారు. వీరు 1930 సంవత్సర ప్రాంతంలో జాతీయోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. వీరే గాక గొర్రెపాటి వెంకట్రామయ్య (మేడ), కోగంటి రంగయ్య, చలసాని రాఘవయ్య వంటి ఎంతో మంది నాయకులు కడలూరు జైల్లో వున్నారు.

రాజమండ్రి జైల్లో ఇచ్చినట్లే కడలూరులో కూడా భోజనం వగైరాల కోసం తలా మూడు రూపాయలిచ్చేవారు. దీన్ని 15 రోజులకోసారి ఇస్తుండేవారు. అందులోంచి కొంత మొత్తంలో బియ్యం, ఇతర సరుకులు తెచ్చి స్టోర్‌లో నిల్వ చేసేవారు. హనుమర్లపూడి సీతారామారావు ఈ స్టోర్ వ్యవహారాలు చూస్తుండేవారు. ఇక మిగతా మొత్తంతో రోజువారీ కాయగూరలు, పళ్లు, పాలు మొదలైనవి తెచ్చేవారు. ఉదయం కాఫీ, టిఫిన్, మధ్యాహ్నం 12 గంటలకు భోజనం (వారానికోసారి మాంసాహారం), మధ్యాహ్నం 3 గంటలకు మళ్లీ టిఫిన్, టీ, రాత్రి ఏడున్నరకు భోజనం, రాత్రి 9 గంటలకు ఒక గ్లాసు పాలు ఇచ్చేవారు. కుటుంబరావు రాత్రి పాలు తాగక గారపాటి రామశాస్త్రికో, పరుచూరి హనుమంతరావుకో ఇచ్చేవాడు. ఆ విధంగా జైల్లో భోజన వసతులు చక్కగా వుండేవి. ఖైదీలను వంటకు నియమించేవారు. డిటెన్యూల్లో ఒకో నాయకుని ఆధీనంలో పది పదిహేను మందిని విభజించి వంటక తోడ్పడే ఏర్పాటు చేశారు. వీరు వంట పాత్రలు కడగటం, కూరగాయల్ని కోయడం, బియ్యంలో రాళ్లు ఏరడం మొదలైన పనులు చేసేవారు.

కేంద్ర కమిటీ సర్క్యులర్

1949 జులై మొదటివారంలో కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి బి.టి. రణదివే కమ్యూనిస్టు ఖైదీలున్న జైళ్లన్నింటికీ ఒక సర్క్యులర్ పంపించాడు. జైళ్లు విశ్రాంతి కేంద్రాలు కావనీ, పోరాట కేంద్రాలుగా చేయాలని ఆ సర్క్యులర్‌లో పిలుపునిచ్చాడు. ఆ సర్క్యులర్ కడలూరు జైల్లోని కమ్యూనిస్టులు ఎక్కువ మందికి నచ్చలేదు. నిజానికి ఇటువంటి సర్క్యులర్లను కమిటీ వరకే చదువుతారు గాని మిగిలిన డిటెన్యూలకు చెప్పరు. కాని ఒక

రోజున ఎం.ఆర్. వెంకట్రామన్, ఎ.కె. గోపాలన్ గార్లు కుటుంబరావుతో ఉన్న సాన్నిహిత్యంతో ఆయనను చదవమన్నారు. అది చదివిన కుటుంబరావు ఇంకేముంది? వెళ్లి జైలు మెయిన్ గేటు మీద దాడి చేద్దాం పదండి అన్నాడు వ్యంగ్యం ధ్వనించేలా. కుటుంబరావును వారిద్దరు తాతా! అని సంబోధించేవారు. 'తాతా! నీవు కొంచెం ప్రశాంతంగా ఆలోచించేవాడివని, నిన్ను చదవమన్నాం' అన్నారు. కుటుంబరావు వారితో తన అభిప్రాయం స్పష్టంగా చెప్పాడు. 'ఈ జైలు గోడల మధ్య ఏమి పోరాటం చేయగలం. అవసరం వచ్చినప్పుడు కొద్దిరోజులు నిరశనవ్రతం చేయడం లేదా మరొక రూపంలో మన అసంతృప్తిని వ్యక్తం చేయగలం. అంతేగాని ఈ జైలుగోడల మధ్య పోరాటం చేయడమనేది ఆచరణ సాధ్యంకాని పని అని నా అభిప్రాయం అన్నాడు.

జైల్లో ఆగస్టు 10 పోరాటం

అయితే సర్క్యులర్ రూపంలో కేంద్ర కమిటీ పంపిన ఆదేశాన్ని పూర్తిగా విస్మరించలేదు. తీవ్ర పద్ధతిలో ప్రత్యక్ష పోరాటం చేయకపోయినా ఏదో విధంగా ఆందోళన చేయాలని సిద్ధమయ్యారు. కొన్ని డిమాండ్లతో ప్రభుత్వానికి ఒక వినతిపత్రాన్ని పంపాలని, కోర్కెలను అంగీకరించకపోతే చిన్న పోరాటం ద్వారా తమ అసమ్మతిని తెలియజేయాలని జైలు కమిటీ తీర్మానించింది. ఆ పోరాటానికి ముందు బయటినుంచి గోగునార తెప్పించి వడిశెలలు తయారు చేశారు. వడిశెలలో పెట్టి విసిరేందుకు జైలులో అక్కడక్కడ వున్న చిన్న రాళ్లను పోగు చేశారు. ముందు జరిగే పోరాటంలో ఈ చర్య చేపట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ విధంగా ముందు పోరాట ఎత్తుగడను తయారు చేసుకొని డిమాండ్ల పత్రం రూపొందించారు. ఆగస్టు 8న జైలు సూపరింటెండెంటుకు ఆ పత్రాన్ని అందజేశారు. ఆ పత్రాన్ని పరిశీలించి ఆ కోర్కెలను తీర్చడం తన పరిధిలో లేదని, వాటిని ప్రభుత్వానికి పంపుతానని అన్నాడు. ఆగస్టు 10న జైళ్ల ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎం.ఎస్. గిల్ జిల్లా కలెక్టర్‌ను, పోలీసు సూపరింటెండెంట్‌ను ఆయుధాలతో సహా పోలీసులు వెంటరాగా జైలులోనికి వచ్చి నాయకులకు కబురు చేశాడు. ఎం.ఆర్. వెంకట్రామన్, ఎ.కె. గోపాలన్, టి. వెంకటేశ్వరరావు వారి దగ్గరికి వెళ్లి మాట్లాడారు. జైళ్ల ఇన్స్‌పెక్టర్ జనరల్ కూడా ఆ కోర్కెలు తీర్చడం తమ పరిధిలో లేదని, ప్రభుత్వానికి తెలియపరుస్తామని చెప్పారు. మీరు మామూలుగా మీ గదుల్లోకి వెళ్లవలసిందని కోరారు. మా కోర్కెలు తీర్చనిదే జైలులోకి వెళ్లమని చెప్పి నాయకులు వెనక్కి వచ్చారు. తర్వాత ఇన్స్‌పెక్టర్ జనరల్, కలెక్టర్, జైలు సూపరింటిండెంట్ పోలీసులను తీసుకొని నాయకుల పైకి రావడం మొదలు పెట్టారు. నిజానికి ఏదో ఆందోళన చేయబోయారే గాని కమ్యూనిస్టు నాయకులకు జైల్లో తమనేం చేస్తారో తెలియదు. వీళ్లు మటుకు ముందు నిర్ణయించుకున్న వ్యూహం ప్రకారం వడిశెలల్లో రాళ్లు పెట్టి వాళ్లను కొట్టడం ప్రారంభించారు. దీనికి పోలీసులు తగిన విధంగా సమాధానం ఇవ్వడం మొదలు పెట్టారు. జైలు గోడలనానుకుని

వరసగా నిలుచున్న పోలీసులు నాయకులపైకి టియర్ గ్యాస్ వదలడం ప్రారంభించారు. ఇలా చేస్తారని నాయకులు ఊహించలేదు. ఈ దెబ్బకు అవసరాల సూర్యారావు వంటివారు స్పృహ తప్పి పడిపోయారు.

జైలులోపల ముందు వైపు నుంచి అధికారులు సాయుధులైన పోలీసులను తీసుకొని నాయకులపైకి నడచి వస్తున్నారు. దాంతో వీరు పోలీసులతో ఢీకొనడానికి సిద్ధంగా లేకపోవడం వల్ల మొత్తం డెటెన్యూలందరూ జైల్లో వెనుకవైపున్న నాలుగు గోడల మధ్య వున్న గతంలో మహిళల కోసం కేటాయించిన బ్లాకులోకి వచ్చేశారు. డిటెన్యూలంతా కలిపి 240 మంది. పోలీసులు అక్కడికి వచ్చేశారు. వీరిపైకి 303 రైఫిళ్లతో కాల్పులు జరపడం మొదలు పెట్టారు. బ్యాక్ గేటు వద్ద కావూరి కుటుంబరావు, మాలెంపాటి సీతారామయ్య నిలబడి వున్నారు. వారిపైకి దూసుకుపోయిన తూటా వారి పక్కనే బల్ల మీద పడుకున్న ఒక తమిళ ఖైదీకి తగిలింది. అతను అక్కడికక్కడే మరణించాడు. జైల్లో యుద్ధ వాతావరణం నెలకొంది. ఏం జరుగుతున్నదో, జరుగనున్నదో అంతుబట్టని పరిస్థితి. ఇంతలో తమ్మారెడ్డి సత్యనారాయణ, రాయల వీరయ్య అక్కడికి హడావిడిగా వస్తుండగా వారిని రావద్దని కుటుంబరావు, సీతారామయ్య ఆందోళనగా కేకలు వేస్తుండగానే వారు రానేవచ్చారు. మరోవైపు నుంచి తుపాకీ గుండ్లు దూసుకువచ్చాయి. ఒక గుండు తమ్మారెడ్డి సత్యనారాయణ కుడిచేతికి తాకింది. మరొక గుండు రావెళ్ల వీరయ్య చేతికి తగిలి రెండు వేళ్లు రాలిపడ్డాయి. ఖమ్మానికి చెందిన మరో కామ్రేడ్ కూడా గుండ్లు తగిలి చనిపోయాడు. నాయకుల వైపు నుంచి ప్రతిఘటన లేకపోవడంతో కాల్పులు ఆగిపోయాయి. ఇంకోవైపు వీరంతా వెనక వైపు వెళ్లడంతో ఇక్కడున్న పోలీసులు, వార్డర్లు మొత్తం 8 బ్లాకుల్లోని గదుల్లో, డిటెన్యూల విలువైన వస్తువులను పట్టుకుపోయారు.

కడలూరు జైల్లో పరిస్థితి సద్దుమణిగింది. స్మశాన ప్రశాంతత రాజ్యమేలింది. అటు సేలం జైల్లో సర్క్యులర్ మరింత తీవ్ర ప్రభావాన్ని చూపింది. అక్కడ వున్న రాజకీయ ఖైదీలు కడలూరులో కంటే తక్కువే అయినా అంతా మూకుమ్మడిగా తిరగబడాలని కూడబలుక్కున్నారు. తిరుగుబాటు పర్యవసానాల్ని సరిగా అంచనా వేయలేక కేంద్ర కమిటీ అనాలోచితంగా చూపిన పోరాట పంథాను అనుసరించారు. జైలు మెయిన్ గేటుపై దాడి చేశారు. పోలీసులు అక్కడ తుపాకి గర్జనలతో జవాబు చెప్పారు. 22 మంది నేలకొరిగారు. ఈ అనాలోచితమైన సర్క్యులర్ జారీతో కమ్యూనిస్టు పార్టీకి జరిగిన నష్టం పూడ్చలేనిది.

కడలూరులో పెద్ద పెద్ద నాయకులు దిగ్భ్రాంతి నుంచి కోలుకోలేకపోయారు. అయినా సరే వెనక్కి తగ్గకూడదని నిర్ణయించుకున్నారు. పోలీసు కాల్పులకు వ్యతిరేకంగా అంతకు ముందు అధికారుల ముందుంచిన డిమాండ్లతో నిరశన దీక్షలు మొదలుపెట్టారు. దీక్షలు సాగుతున్నాయి. పది రోజులు గడిచాయి. అందరూ బలహీనంగా మారారు. అయినా వెనక్కి తగ్గలేదు.

కావూరి కుటుంబరావు (అప్పట్లో సిగరెట్టు కాల్చేవారు), ఎం.ఆర్. వెంకట్రామన్, ఎ.కె. గోపాలన్ ముగ్గురూ సిగరెట్ కాలుస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆ సమయంలో మెడికల్ ఆఫీసరు అక్కడికి వచ్చి వీళ్లు సిగరెట్ కాల్చడం చూశాడు. అసలే పది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. అది చాలక ఇలా సిగరెట్ కాలిస్తే ఆరోగ్యానికి చాలా హాని కలిగిస్తుందని అన్నారు. దానికి తీవ్రంగా స్పందించిన కుటుంబరావు 'మేము అనారోగ్యం పాలైతే మీకేమి, మేము చనిపోతే మీకేమి?' అన్నారు. 'నేనేమైనా తప్పుగా మాట్లాడానా? ఒక డాక్టర్‌గా నా సలహా చెప్పాను' అన్నాడు మెడికల్ ఆఫీసర్. ఎ.కె. గోపాలన్ కల్పించుకున్నాడు. 'నీవు డాక్టర్‌గా సలహా చెప్పడం తప్పేమి కాదు. కాని నీవు చేసిన తప్పుల్ని కూడా తెలుసుకుంటే మంచిదనుకుంటాను. జైల్లోని స్టోర్‌లో వున్న బిస్కెట్లు వగైరా మేమే తినేస్తున్నట్లు పత్రికలో ప్రభుత్వం ప్రకటించింది. నీవు కూడా చూసే వుంటావు. ఆ స్టోర్ తాళం చెవి నీ దగ్గరుండగా అవన్నీ మేమెలా తింటాం. అది నీకు తెలిసి అది తప్పని చెప్పావా?' అన్నారు కోపంతో. 'నేను డి.ఎం.ఓ.ను. ప్రభుత్వ ఉద్యోగిని అయి వుండీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్టేట్‌మెంట్లు ఇచ్చి ఉద్యోగాన్ని పోగొట్టుకోలేను కదా' అన్నాడు. 'వాస్తవాన్ని వెల్లడించలేని అసమర్థుడవు నీవు మాకు సలహా ఇవ్వనవసరం లేదు' అని గోపాలన్ అనడంతో అతను అక్కడ వుండలేక వెళ్లిపోయాడు. మొత్తానికి 26 రోజుల తర్వాత నాయకులు దీక్షలు విరమించారు.

నిరశన దీక్షకు ముందు 80 పౌండ్లున్న కుటుంబరావు 26 రోజుల తర్వాత 16 పౌండ్లు తగ్గిపోయారు. దీక్షలు సాగినంత కాలం డిటెన్యూల ఆరోగ్యపరిస్థితి పరిస్థితి పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు బరువు చూడడంలో డా. చెలికాని రామారావు ఎంతో శ్రద్ధ వహించారు. ఒకసారిగా ఏకబిగిన 26 రోజులు నిరాహారదీక్ష చేయడం వల్ల దీక్ష ముగిసిన వెంటనే అందరూ తీసుకునే సాధారణ ఆహారం తీసుకోవలసిన అవసరం ఏర్పడింది. ఆ విధంగా కుటుంబరావు, ఆయన సహచరులు కొన్నాళ్లు మజ్జిగ గానీ పాలుగానీ తాగి సరిపెట్టుకోవడానికి, వారం రోజుల తర్వాత మెల్లమెల్లగా మామూలు భోజనాన్ని తీసుకోవడానికి నిర్ణయించుకున్నారు. అనుకున్నట్లే చేశారు. కొందరు యువకులు అతిగా ఆత్మవిశ్వాసానికి పోయి ఆరోగ్యాన్ని పాడు చేసుకున్నారు. అందరిలోకి ఎ.కె. గోపాలన్ పరిస్థితి మెరుగ్గా వుంది. కారణం ఆయన ఎప్పటి నుంచో పోరాటాల్లో భాగంగా జైళ్లలో వుండడం, పలుమార్లు ఇటువంటి నిరశన దీక్షలు చేయడం జరిగింది.

మండవ వెంకటరంగయ్య ప్రాణత్యాగం

కమ్యూనిస్టు పార్టీలో అప్పుడప్పుడు కొందరు వ్యక్తుల తప్పుడు ఆలోచనల ఫలితంగా పెడధోరణులు తలెత్తి ఎంతో నష్టం కలుగుతున్నదని చెప్పే మరొక సంఘటన ఇది. దివి తాలూకా మొవ్వ గ్రామస్థుడైన మండవ వెంకటరంగయ్య భూస్వామ్య కుటుంబంలో పుట్టినా

తొలుత కాంగ్రెస్‌లో వున్నా కమ్యూనిస్టు పార్టీ ఆశయాలు నచ్చి పార్టీ వైపు మళ్లాడు. ఎంతో నిజాయితీ కలిగిన వ్యక్తి. పార్టీలో పనిచేయడమే కాదు పార్టీ కోసం ఏమైనా చేసేవాడు. ఒకసారి అనారోగ్యం పాలై ఆపరేషన్ చేయించుకునేందుకు వెళుతూ కావూరి కుటుంబరావు వద్దకు వచ్చాడు. పార్టీకి 10 వేల రూపాయలు ఇద్దామని అనుకుంటున్నానని, కాని ఇప్పుడు డబ్బు లేదని అంటూ 10 వేలకు ఒక ప్రామిసరీ నోటు రాసి కుటుంబరావు చేతిలో పెట్టాడు. ఆపరేషన్ విజయవంతమై నేను తిరిగి వస్తే ఆడబ్బు పార్టీకి ఇచ్చి నోటు వెనక్కి తీసుకుంటాను. కన్నుమూస్తే ఆ నోటు చూసి మా కుటుంబ సభ్యుల నుంచి వసూలు చేసి పార్టీకి జమ చేయమని చెప్పి ఆస్పత్రిలో చేరాడు. ఆ ప్రామిసరీ నోటు తీసుకోకపోతే తాను ఆపరేషన్ చేయించుకోనని పట్టుబట్టాడు. ఆపరేషన్ విజయవంతమైంది. కోలుకున్నాక కూడా వీలును బట్టి పార్టీకి విరాళాలు ఇచ్చేవాడు. పూర్తిగా పార్టీ సానుభూతిపరునిగానే వుండేవాడు. ఆనాటి తీవ్ర నిర్బంధ వాతావరణం కారణంగా పార్టీ కూడా అతన్ని కాపాడేందుకు ఆయనకు కమ్యూనిస్టు పార్టీతో ఎటువంటి సంబంధం లేదని రంగయ్యతోనే పత్రికాముఖంగా ప్రకటింపజేసింది. అయినప్పటికీ వెంకట రంగయ్యను పోలీసులు అరెస్టు చేసి కడలూరు జైలుకే డిటెన్యూగా పంపారు. ఈ అరెస్టుకు పూర్వపు సంగతులన్నీ రంగయ్య జైల్లో కుటుంబరావుకు వివరించాడు. దివి తాలూకా బాధ్యుని హోదాలో కుటుంబరావు రంగయ్య మంచితనాన్ని, త్యాగబుద్ధిని, పార్టీ పట్ల అతని నిబద్ధతను గురించి జైల్లోని కమిటీకి వివరించాడు.

జైలు కమిటీ ఒంటెత్తు పోకడలతో రంగయ్యను మన క్యాంపులో వుంచడానికి వీలు లేదని తేల్చి చెప్పింది. కుటుంబరావే కమిటీ నిర్ణయాన్ని రంగయ్యకు వివరించి కమ్యూనిస్టేతర క్యాంపులో వుండవలసిందని చెప్పాడు. రంగయ్యకు ఎంతో బాధ కలిగించే నిర్ణయాన్ని చెప్పవలసి రావడం కుటుంబరావును కూడా ఎంతో బాధకు గురిచేసింది. ఈ విషయం చెప్పడానికి కుటుంబరావు ఎంతో మథనపడ్డాడు. అది విన్న రంగయ్య చాలా బాధపడ్డాడు. 'నేను కమ్యూనిస్టు పార్టీలో వున్నాను కదా! పార్టీ చెప్పిన ప్రకారమే తనకు పార్టీతో సంబంధం లేదని పత్రికలకు ప్రకటన ఇచ్చాను. అది కూడా పార్టీ కోసం ఏదైనా చేయడానికే గాని నా స్వార్థం కోసం కాదు కదా! ఇప్పుడిలా పార్టీ కానివారి క్యాంపులో వుండమనడం న్యాయమా?' అన్నాడు. కుటుంబరావు రంగయ్యను ఓదారుస్తూ ఇక్కడ జైలు కమిటీవారు కాస్త దుందుడుకు పద్ధతులకు పాల్పడుతున్నారు. కొన్నాళ్లు ఓపిక పట్టు బయటికి వెళ్లాక ఎప్పట్లా పార్టీలో కలసిమెలసి పనిచేద్దామని నచ్చజెప్పిన మీదట కొంత తేరుకొని అవతలి క్యాంపులోకి వెళ్లాడు.

పార్టీ తనను వెలి వేసిందనే బాధ రంగయ్యను బాగా కుంగదీసింది. ఒకనాడు జైల్లో వున్న వాటర్ ట్యాంకుపై నుంచి దూకి రంగయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎట్లో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. జైల్లో 24 గంటలు పనిచేసే ఆస్పత్రిలో చేర్చారు. జైలు కమిటీ

సభ్యుడొకరు కుటుంబరావుకు ఈ విషయం తెలియజేస్తూ దివి తాలూకా వ్యక్తి ఎవరో వాటర్ ట్యాంక్‌పై నుంచి కింద పడగా ఆస్పత్రిలో చేర్చారట. చూసి రమ్మన్నారు. కుటుంబరావు ఆస్పత్రికి వెళ్లి మంచం మీద రంగయ్యను చూసి చాలా బాధపడ్డాడు. రెండు రోజులకు స్పృహలోకి వచ్చాడు. స్పృహ వచ్చాక కుటుంబరావును చూసి కన్నీళ్లు పెట్టుకుంటూ కమ్యూనిస్టు వ్యతిరేకుల క్యాంపులో బతకదలుచుకోలేదని, ఆత్మహత్య చేసుకోవడానికే దూకానని చెప్పాడు. అతని ఘోష హృదయవిదారకంగా తోచింది. కుటుంబరావు కూడా కదిలిపోయాడు. కొన్నాళ్లు వరసగా ఆస్పత్రికి వెళుతూ రంగయ్యను స్వాంతన పరుస్తూ కొన్నాళ్లు ఓపిక పడితే ఒక కుటుంబంలోని వ్యక్తులుగా ఉందామని నచ్చజెప్పాడు.

తర్వాత రెండు నెలలకు గాని రంగయ్య ఆరోగ్యం మెరుగుపడలేదు. కొన్నాళ్లకు ప్రభుత్వం అతన్ని విడుదల చేసినా, తిరిగి అతడు మొవ్వ చేరుకున్నా ఈ బాధ నుంచి మాత్రం దూరం కాలేకపోయాడు. కొన్నాళ్లకు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసింది.

చైనా అక్టోబర్ విప్లవం

1949 అక్టోబర్ 1వ తేదీ. చైనాలో కమ్యూనిస్టు పార్టీ అక్కడి నిరంకుశ పాలనకు చరమగీతం పాడిన రోజు. 'కొమింగ్ టాంగ్' అనే పెట్టుబడిదారీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆ దేశంలోని ఉత్తర ప్రాంతమైన 'ఏనాన్' పాలకులను ఓడిస్తూ దక్షిణదిశగా కమ్యూనిస్టు సేన జైత్రయాత్ర సాగిస్తున్నదన్న వార్త ఇక్కడ కడలూరు జైల్లోని మిత్రులకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. కమ్యూనిస్టులు 'పెకింగ్'కు చేరినప్పుడు 'కొమింగ్‌టాంగ్' ప్రభుత్వంలోని 41 మంది ముఖ్యులైన ద్రోహులు తమ చేతికి చిక్కితే కాల్చివేస్తామని గర్జించారు. ఆ 41 మందిలో ఒక్కడైన 'పుట్సోయి' అనే అతడు పెకింగ్ ప్రాంతానికి గవర్నర్ జనరల్‌గా వుండేవాడు. కమ్యూనిస్టులను మట్టి కరిపిస్తానని బీరాలు పలికినా కొన్నాళ్లకే కమ్యూనిస్టులపై ఒక్క తుపాకీ గుండు సైతం పేల్చకుండానే తన నాలుగు లక్షల మంది సైన్యంతో సహా లొంగిపోయాడు. ఆరు రోజుల తర్వాత 'షాంఘై' పట్టణాన్ని కూడా కమ్యూనిస్టులు వశం చేసుకున్నారని వార్తలు వచ్చాయి. చైనా చరిత్రలో అది చిరస్మరణీయమైన ఘట్టం.

కడలూరు జైల్లోని కామ్రేడ్స్ ఆనందానికి అవధుల్లేవు. మరునాడు పత్రికల్లో మాత్రం 'షాంఘై' ఇంకా కమ్యూనిస్టుల ఆధీనంలోకి వెళ్లలేదని వార్తలు వచ్చినప్పటికీ కమ్యూనిస్టు సైన్యం ఉధృతంగా పురోగమిస్తున్నదని, దక్షిణ ప్రాంతాన్ని జయిస్తూ మునుముందుకు ఉరకలు వేస్తూ వస్తోందని సమాచారం అందుతోంది. ఒక్కో పట్టణాన్నే కమ్యూనిస్టులు వశపరుచుకుంటున్నారు. అక్కడ స్థానభ్రంశాలవుతున్న కొమింగ్‌టాంగ్ సైన్యం కసితో పట్టణంలో, జైళ్లలో నిర్బంధంలో వున్న కమ్యూనిస్టులను పాశవికంగా చంపుతూ పారిపోసాగింది. ఎట్టకేలకు షాంఘై, నాన్‌కింగ్, కాంటన్ మొదలైన పట్టణాలన్నీ కమ్యూనిస్టుల వశమయ్యాయి.

1950 సెప్టెంబర్ నెలాఖరు నాటికి చైనా దేశమంతా కమ్యూనిస్టుల వశమైంది. దేశం నాలుగు చెరుగులా అరుణపతాక రెపరెపలాడింది. లోగడ బ్రిటిషు వారి ఆధీనంలో వున్న హాంగ్‌కాంగ్, పోర్చుగీసువారి ఆధీనంలో వున్న ఒకటి రెండు చిన్న పట్టణాల జోలికి కమ్యూస్టులు వెళ్లలేదు. చిషాంగ్ కైషేక్ నాయకత్వంలో వున్న కొమింగ్‌టాంగ్ నాయకులు తమ అనుచరులతో చైనాలో భాగమైన సముద్రం మధ్యలో వున్న తైవాన్‌కు పారిపోయారు.

కొంత పూర్వపు కథ చెప్పాలంటే 1911 అక్టోబర్ 10న అప్పుడున్న రాచరిక ప్రభుత్వాన్ని నేలకూల్చి జాతీయ నాయకుడైన సన్ ఎట్‌సేన్ నాయకత్వంలో జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పోరాటాల గురించి ఇక్కడి కమ్యూనిస్టులకు తెలియకుండా పత్రికలను ప్రభుత్వం సెన్సార్ చేసేది. అందువల్ల వాస్తవానికి కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది అక్టోబర్ 1నే. చైనా స్వాతంత్ర్య దినోత్సవం అక్టోబర్ 1ననే అయినా ఈ పత్రికల సెన్సారింగ్ వల్ల అక్టోబర్ 10న అని కడలూరు జైల్లోని ఇక్కడి కమ్యూనిస్టులకు తప్పుడు సమాచారం. ఈ కారణంగా వీరు అక్టోబర్ 10న చైనా విజయోత్సవాన్ని జరుపుకున్నారు.

ఆ రోజు జైల్లో విందుభోజనం, భోజనానంతరం రాత్రి నాటకాలు, విచిత్రవేషాలు మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. సంబరంగా జరుపుకున్నారు. కంభంపాటి సత్యనారాయణ (సీనియర్), హనుమర్లపూడి సీతారామారావు, కోగంటి గోపాలకృష్ణయ్య, వై. విజయకుమార్ మొదలైన నాయకులు నాటకంలో నటించారు.

మరునాడు ఉదయం జైలు చుట్టూ ఒకసారి ఊరేగింపు జరిపి విజయోత్సవాన్ని ముగించాలని అనుకున్నారు. ఊరేగింపు ప్రారంభమైంది. జైలు సూపరింటెండెంట్ వద్దకు వచ్చారు. సూపరింటిండెంట్ తన సిబ్బందితో వచ్చి ఊరేగింపు జరపడానికి వీల్లేదని 144వ సెక్షన్ విధించానని చెప్పాడు. దానికి కమ్యూనిస్టులు అభ్యంతరం చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో ఈ నిషేధాజ్ఞల్ని విధిస్తారు గానీ నాలుగు గోడల మధ్య విధించడమేమిటని ఘర్షణపడ్డారు. సూపరింటెండెంట్ కోపంతో జొన్నలగడ్డ రామలింగయ్యను చెంపదెబ్బ కొట్టాడు. అంతేగాక తమ కార్యాలయంలో వున్న పిట్టలు కొట్టే బర్మార్‌తో విచ్చలవిడిగా కాల్పులు జరిపించాడు. కృష్ణాజిల్లా రైతు నాయకుడు హనుమర్లపూడి సీతారామారావు, మరో ఖైదీ ఈ కాల్పుల్లో మరణించాడు. 50 మంది కమ్యూనిస్టులకు స్ప్లింటర్లు తగిలాయి. వెంకట్రామన్ కింద పడిపోయాడు. కరెంటు స్తంభానికి ఆనుకొని నిలుచున్న డా. చెలికాని రామారావుపైకి కూడా జైలరు కాల్పులు జరిపాడు. అయితే రవ్వలు స్తంభానికి తగిలాయి. ఆయన సురక్షితంగా బయటపడ్డాడు.

ఈ సంఘటనతో కమ్యూనిస్టులు చాలా ఇబ్బందులు పడ్డారు. కాల్పుల్లో రవ్వలు శరీరంలోకి దూసుకుపోయినవాళ్లు జీవితాంతం బాధపడ్డారు. తుపాకీ గుళ్లయితే శస్త్రచికిత్స

చేసి తొలగించవచ్చు. బర్మార్ నుంచి వెలువడి ఒంట్లోకి దూసుకుపోయే రవ్వల్ని తీయడానికి వీలు పడదు. వీటివల్ల బాధపడ్డవారిలో డి. సీతారామయ్య, కోగంటి గోపాలకృష్ణయ్య వంటివారెందరో వున్నారు. ఈ సంఘటన తర్వాత డిటెన్యూలకిచ్చే ఆహారం, ఇతర సౌకర్యాలను కూడా సూపరింటిండెంట్ చాలావరకు తగ్గించాడు. ఈ బాధలు పడలేక కొందరు వేరే క్యాంపులకు వెళ్లిపోయారు.

కడలూరు జైల్లో రెండుసార్లు జరిగిన కాల్పుల పట్ల బయట పార్టీ ఏ విధంగా స్పందించిందో కమిటీలో లేని కుటుంబరావు వంటివారికి తెలిసేది కాదు. జైలు కమిటీకి తెలిసినా ఇతరులకు చెప్పేవారు కారు. ఈ ధోరణిని గురించి పుచ్చలపల్లి సుందరయ్య 'విప్లవపంథాలో నా పయనం' పుస్తకంలో ఇలా రాశారు: "ఒంటెత్తు విధానం అంటే ఎలా వుంటుందంటే, జైల్లో వున్నా సరే సామ్రాజ్యవాదాన్ని ఎదిరించాలి అనేవారు. ఎలా ఎదిరించాలి అంటే జైలు ఉద్యోగులపై దాడి చేయడం, లోపల వుండే సత్యాగ్రహాల వంటివి చేయడం. చెయ్యకపోతే పనికిరాని వారి కింద జమ కట్టేవారు. ఈ విధానాన్నే అన్ని జైళ్లకు పార్టీ వైఖరిగా పంపడం జరిగింది.".

ఏదైనా న్యాయమైన డిమాండుపై పోరాటం చేయవలసి వస్తే తప్పదు గానీ సామ్రాజ్యవాదం పేరుతో జైళ్లలో ఇలాంటి పోరాటాలు చేయడం ఏమిటని కుటుంబరావు, ఇతర నాయకులు భావించారు కాని అది పార్టీ వైఖరి కాబట్టి తప్పలేదు. కడలూరు, సేలం వంటి జైళ్లలో ఈ వైఖరిని అమలు చేశారు. అసలే ఏదో వంకతో జైళ్లలో కూడా క్రూరనిర్బంధాన్ని విధించాలని ప్రభుత్వం చూస్తుంటే మనం అనవసర ఘర్షణ పెట్టుకోవడమే అవుతుందని నాయకుల మనోగతం. కడలూరులో జరిగిన ఇటువంటి వ్యర్థపోరాటంలో హనుమర్లపూడి సీతారామారావు వంటి కామ్రేడ్స్‌ను కోల్పోవలసి వచ్చింది.

కడలూరు ఘటనపట్ల బయట రహస్యంగా వున్న నాయకులు ఎంతో ఆగ్రహానికి గురయ్యారు. కాని కడలూరు జైలు ఆంధ్ర పరిధిలోనిది కాదు. పై నుంచి వచ్చిన ఆదేశాలను అనాలోచితంగా అమలుచేసి జైల్లోని కామ్రేడ్స్ కష్టాలు పడ్డారు.

ఇదంతా ఆత్మహత్యాసదృశమని కావూరి కుటుంబరావు అభిప్రాయం. జైలు నాలుగ్గోడల మధ్య వుండి చేసే పోరాటాలు ఎవరి కోసం. బయట వున్న శ్రేణులు కూడా ప్రజల్ని సమీకరించి జైలుపై పోరాటానికి దిగి గోడలు బద్దలు కొడితే ప్రయోజనమేమిటి అన్నది కుటుంబరావు ఉద్దేశ్యం. జైలులో కూడా దీర్ఘకాలికమైన సత్యాగ్రహాలేమిటి? 26 రోజులు నిరాహారదీక్ష చేశాం. దీనివల్ల సాధించిందేమిటి? నిస్పృహతో గొంతు బొంగురు పోయేలా నినాదాలివ్వడం తప్ప ఒనగూడినదేమిటి? ఆ దీర్ఘకాలిక సత్యాగ్రహాలతో అసలే అంతంత మాత్రంగా వున్న నాయకుల ఆరోగ్యాలు మరీ చెడిపోతే ఎవరు దిక్కు? జైళ్లలో అనుభవాలు మనకేమీ కొత్త

కావు. జాతీయ విప్లవకారులు, గదర్‌వీరులు అండమాన్ మొదలైన చోట్ల జైళ్లలో పోరాటాలు చేశారు గానీ వాటిని విప్లవపోరాటాలుగా భావించేవారు. ఇలాంటి అభిప్రాయాలు చెప్పేవారిని, పిరికిపందలని, పనికిమాలినవారని ముద్రవేసేవారు. కేంద్ర కమిటీ పట్ల విధేయత, క్రమశిక్షణ ఉండాల్సిందే గాని ఇక్కడ భౌతిక పరిస్థితులను విమర్శనాత్మకంగా విశ్లేషించకుండా అనాలోచితంగా వ్యవహరించడం తగదని కుటుంబ రావు అభిప్రాయం.

నిజానికి కమ్యూనిస్టు పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఆనాడు ప్రశ్నార్థకమే. పై కమిటీలు చెప్పింది మంచిదైనా చెడ్డదైనా కార్యకర్తలు అనుసరించవలసిందే. అలా అంగీకరించనివారిపై క్రమశిక్షణ చర్య తీసుకునేవారు. బహిష్కరణ వేటు కూడా పడేది.

1950 ప్రారంభం నుంచీ కడలూరు జైల్లో వున్న రాజకీయ ఖైదీల్లో అభిప్రాయ భేదాలు తలెత్తాయి. రష్యాలో లాగా మనం కూడా కార్మికవర్గ పోరాటం ద్వారా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఏర్పరచాలని కొందరు, చైనాలోని కమ్యూనిస్టు పార్టీ వలె గెరిల్లా పోరాటం చేసి సోషలిజాన్ని స్థాపించాలని కొందరు అన్నారు. రెండూ కాక ప్రజాస్వామిక పద్ధతుల ద్వారానే సోషలిజాన్ని తీసుకురావాలని మరికొందరు... ఈ విధంగా భిన్న పంథాలను ప్రతిపాదించారు. జైల్లో రెండు వర్గాలేర్పడ్డాయి. తమ్మారెడ్డి సత్యనారాయణ, వై. విజయకుమార్, వెల్లంకి విశ్వేశ్వరరావు మొదలైనవారు రణదివే విధానం తప్పని, అది ఒంటెత్తు పోకడలతో ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించేదేనని వాదించారు. తెలంగాణాలో పోలీసు చర్య తర్వాత పోరాటాన్ని ఆపాలని ఒక డాక్యుమెంటును ప్రవేశపెట్టారు. మోటూరి హనుమంతరావు, కడియాల గోపాలరావు వంటివారు దీనికి ఆగ్రహించి ఈ ముగ్గురు ప్రభుత్వ ఏజెంట్లని, వీరిని పార్టీనుంచి వెళ్లగొట్టమని బయటి నాయకత్వానికి లేఖలు రాశారు. బయటి పార్టీలో కూడా ఇటువంటి భిన్నాభిప్రాయాలవల్ల వీరిపై చర్య తీసుకోలేదు.

చల్లపల్లి జమీందారు వ్యతిరేక పోరాటం ఉధృతంగా జరుగుతున్న కాలమది. 1950 మే 12న చల్లపల్లి నారాయణరావును కాల్చి చంపారు. నారాయణరావు కుటుంబ రావు ఈ ఉద్యమంలో కలసిమెలసి పోరాడినవారు. అంతటి ఆత్మీయ సహచరుడు మరణించాడన్న వార్త కుటుంబరావుకు కడలూరు జైల్లో మరో నలుగురు ఇతర డిటెన్యూలతో కలిసి మాట్లాడుతున్నప్పుడు అందింది. కుటుంబరావు దిగ్భ్రాంతుడయ్యాడు. ఆ వార్తను జీర్ణించుకోలేకపోయాడు. బాధతో కళ్ల వెంట నీళ్లు వచ్చాయి. అది చూసిన సాటి కామ్రేడ్ వేరే విధంగా స్పందించాడు. చనిపోయినంత మాత్రాన విప్లవవీరులమైన మనం కంటనీరు పెట్టడమేమిటని ఆక్షేపించాడు. కుటుంబరావు అతని ప్రవర్తనకు బాధపడ్డా ఆశ్చర్యం మాత్రం కలగలేదు. పార్టీలో పెడధోరణులు తెలిసినవే కదా అనుకున్నాడు. పార్టీ సిద్ధాంతాల పేరుతో కొందరు అరాచకవాదులుగా, మానవత్వం లేనివారుగా తయారువుతున్నారని మనసులో అనుకున్నాడు.

కుటుంబరావుకు మార్క్స్ జీవితచరిత్రలోని ఒక సంఘటన జ్ఞప్తికి వచ్చింది. మార్క్స్, ఏంగిల్స్ ఎంతో సన్నిహిత మిత్రులు (మార్క్స్ ప్రపంచానికి తన పేరుతో ఒక సిద్ధాంతాన్నే ఇచ్చిన తత్త్వవేత్త). ఒకప్పుడు వారిద్దరూ వేరువేరు చోట్ల ఉన్నారు. పసివాడైన తన కుమారుడు చనిపోయాడనే విషయాన్ని మార్క్స్ ఏంగిల్స్‌కు ఉత్తరంలో రాశాడు. ఏంగిల్స్ మార్క్స్‌కు ప్రత్యుత్తరం రాశాడు కానీ అందులో కుమారుని మరణం వల్ల కలిగిన దుఃఖాన్ని ప్రస్తావించలేదు. తన వైపు నుంచి సాంత్వన వాక్యాలను రాయలేదు. ఆ విషయాలు ఎత్తకుండా ఏవేవో కార్మికవర్గ పోరాట విషయాలు, దేశ రాజకీయాలను గురించి రాశాడు. దానికి మార్క్స్ జవాబివ్వలేదు. కొంత కాలానికి ఏంగిల్స్ మార్క్స్‌ను కలుసుకొని ఉత్తరాలు రాయడం లేదెందుకని ప్రశ్నించాడు. 'నా బిడ్డ చనిపోయాడని నీకు ఉత్తరం రాస్తే కనీస సానుభూతి కూడా చూపని నీ వంటి హృదయం లేని వ్యక్తికి జవాబు రాయడం అనవసరమని రాయలేదు' అని బదులిచ్చాడు. ఏంగిల్స్ అందుకు బాధపడి సారీ చెప్పాడట.

తనను విమర్శించే మార్క్సిస్టులు భవిష్యత్తులో వస్తారని భావించాడేమో ఆ మహాశయుడు 'మై నేమ్ ఈజ్ మార్క్స్. బట్ అయామ్ నాట్ ఎ మార్క్సిస్ట్' అని అన్న సంగతి కుటుంబరావుకుకు గుర్తొచ్చింది.

జైలు నుంచి విడుదల

బయట వున్న కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో మూడు వర్గాలేర్పడ్డాయి. 1950 చివరి నుంచి 1951 మొదటివరకు మన దేశానికి చెందిన ఎస్.ఎ. డాంగే, అజయ్‌ఘోష్, చండ్ర రాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్య రష్యా వెళ్లి మాస్కోలో స్టాలిన్‌తో చర్చలు జరిపారు. మన దేశ రాజకీయాల్లో చేపట్టవలసిన మార్పులను గురించి మాట్లాడి వచ్చారు. అదే కాలంలో కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా వున్న బి.టి. రణదివే అతివాద, దుందుడుకు పోకడలతో పార్టీని, ప్రజా ఉద్యమాలను నాశనం చేస్తున్నాడనే ఉద్దేశ్యంతో ఆయనను తొలగించి చండ్ర రాజేశ్వరరావును కార్యదర్శిని చేశారు. ఇలాంటి మార్పుల గురించి కిందిస్థాయి కార్యకర్తలకు అస్పష్టంగా తెలియడమే గానీ వివరాలు తెలిసే అవకాశం లేదు. అజయ్‌ఘోష్, డాంగేవంటివారు ఈ ఉద్యమానికి వ్యతిరేకంగా వుండడం, తెలంగాణ పోరాటాన్ని ఆపమని చెప్పిన రావి నారాయణరెడ్డిలాంటి నాయకులు బొంబాయి వెళ్లిపోవడం వంటి చర్యల వల్ల కేంద్ర ప్రభుత్వం కూడా నిర్బంధ విధానాన్ని సడలించింది.

దీంతో కడలూరు జైల్లో వున్న కావూరి కుటుంబరావుకు అడకుండానే నెల రోజుల పేరోల్ మంజూరు చేశారు. అడక్కుండా ఇచ్చిన మొదటి పేరోల్ ఇది. దీనిపై జైలు కమిటీ తర్జనభర్జనలు పడ్డది. ఇలా పేరోల్‌పై వెళ్లవచ్చునా అనే విషయంపై నెల రోజుల పాటు చర్చలు సాగించి చివరికి కుటుంబరావును వెళ్లమన్నది.

కడలూరు నుంచి బయలుదేరిన కుటుంబరావు వెంట స్వగ్రామం వరకు ఒక

కానిస్టేబుల్‌ను పంపారు. మరునాటి ఉదయానికి ఆ కానిస్టేబుల్‌తో పాటు కుటుంబరావు మద్రాసు చేరుకున్నాడు. ఒక హోటల్లో దిగారు. విజయవాడ రావడానికి ఆ సాయంత్రం వరకు రైలు లేదు. తమ బంధువులను కలసి వస్తానని చెప్పి కానిస్టేబుల్ వెళ్లాడు. మధ్యాహ్న భోజనం చేసి కుటుంబరావు మెరీనా బీచ్ వైపు నడిచాడు. అక్కడ సాయంత్రం జరిగే బహిరంగసభలో ఎ.కె. గోపాలన్ ప్రసంగిస్తారని పోస్టర్ కంటబడింది. అక్కడ కొంతసేపు వేచి చూశాక ఎ.కె. గోపాలన్ రానే వచ్చాడు. కుటుంబరావును చూసి సంతోషించి ఎలా వచ్చావ్ అనడిగాడు. క్షేమసమాచారాలయ్యాక ఇరువురు కొన్ని విషయాలు ముచ్చటించు కొన్నారు. తర్వాత ఉత్తరాలు రాసేందుకు కుటుంబరావు నుంచి మారుపేరు, అడ్రసు తీసుకున్నాడు.

ఆ తర్వాత కుటుంబరావు అక్కడ్నించి హోటల్‌కు వెళ్లి అదే రాత్రి బయలుదేరి బెజవాడ మీదుగా రైల్లో బందరు వెళ్లాడు. స్టేషన్‌లో దిగాక దివి తాలూకా అవనిగడ్డ వరకు పోస్టుబాక్సును తీసుకెళ్లే బస్సు వచ్చింది. కుటుంబరావు, ఆయన వెంట కడలూరు నుంచి వచ్చిన కానిస్టేబుల్ ఆ బస్సెక్కారు. బస్సు కాస్త దూరం వెళ్లాక బందరులోని కాబర్ట్‌సన్ పేట పోలీసు స్టేషన్ వద్ద ఆ తమిళ కానిస్టేబుల్ బస్సునాపాడు. స్టేషన్‌లోకి వెళ్లి ఇన్స్‌పెక్టర్‌కు విషయం వివరించి కుటుంబరావు వెంట ఒక కానిస్టేబుల్‌ను పంపమని, తాను తమిళనాడు తిరిగి వెళ్తానని చెప్పాడు. అప్పుడు స్టేషన్‌లో కానిస్టేబుళ్లు లేరని, కుటుంబరావును స్టేషన్‌లోకి తెచ్చి వుంచమని, కానిస్టేబుల్ వచ్చాక చూడవచ్చునని ఇన్స్‌పెక్టర్ అన్నాడు. అప్పటికే దీర్ఘకాలిక ఖైదులో వున్న తనను మళ్లీ పోలీసు స్టేషన్‌లో వుంచడమేమిటనే విసుగుతో వున్న కుటుంబరావు ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు. సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వచ్చి కుటుంబరావును కిందకు దిగమని అనగా కుటుంబరావు అందుకు అంగీకరించలేదు. దిగమని ఇన్స్‌పెక్టర్ బెదిరించాడు. 'నేను మీ ఖైదీని కాను. గట్టిగా పట్టుబట్టి నన్ను దింపాలని ప్రయత్నిస్తే తిరిగి మద్రాసు వెళ్లి చీఫ్ సెక్రటరీతో విషయం చెప్పి జైలుకు వెళ్లిపోతానని కుటుంబరావు హెచ్చరించాడు. అంతటితో ఇన్స్‌పెక్టర్ కుటుంబరావు జోలికి వెళ్లరాదని నిర్ణయించుకొని తమిళ పోలీసునే వెళ్లమన్నాడు. బస్సులో ఇద్దరూ తిరిగి బయలుదేరారు. చల్లపల్లి పోలీసు స్టేషన్ వద్ద ఆపి ఈ విషయాన్ని అక్కడి ఇన్స్‌పెక్టర్‌కు చెప్పి తమిళ పోలీసు వెళ్లిపోయాడు.

ఆ రోజుల్లో బయటి నిర్బంధాలు సరే. పార్టీలో కూడా ఏవో అర్థం కాని నిబంధనలు. మొట్టమొదట పేరోల్ లభించి కుటుంబరావు కడలూరు జైలు నుంచి బయటికి వస్తున్నప్పుడే జైలు కమిటీ 'బయటికి వెళ్లిన తర్వాత అక్కడ పనిచేస్తున్న రహస్య కమ్యూనిస్టులు జూనియర్లయినా సరే వారి మాట ప్రకారమే నడచుకోవాలని కుటుంబ రావును హెచ్చరించి పంపారు. బయట కూడా వీరు చెప్పిన అనుభవమే ఎదురైంది. ఒకతను కుటుంబరావు దగ్గరికి వచ్చి తన పేరు రాఘవయ్య అని బందరు తాలూకాలో రహస్య కమ్యూనిస్టునని

చెప్పాడు. అతను మాట్లాడిన విషయాలను బట్టి కేంద్ర కమిటీలో మార్పులను గురించి ఏమీ తెలియదని కుటుంబరావుకు అర్థమైంది. ముగ్గురికి చేతి గడియారాలు కొనివ్వమని, ఎవరికో తాను చెప్పనని అన్నాడు. అప్పుడు కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు బహిరంగంగా వుంటున్న మోపిదేవికి వారి చెందిన కంఠంనేని అచ్యుత రామయ్య దగ్గర 600 రూపాయలు తీసుకొని ఆ మొత్తంతో మూడు గడియారాల్ని కొని ఇచ్చాడు. ఏ గ్రామానికీ వెళ్లవద్దనీ, ఎవరినీ కలుసుకోవద్దనీ రాఘవయ్య కుటుంబరావుకు ఆంక్షలు విధించాడు. జైల్లోని నాయకులు చేసిన హెచ్చరికలు, ఇటు రాఘవయ్య ఆంక్షల ప్రకారమే నడుచుకోవలసి వచ్చింది.

నిజానికి కుటుంబరావు జైల్లో వుండగానే చల్లపల్లి జమీందారు దౌర్జన్యపూరిత చర్యలకు, పోలీసు కాల్పులకు ఎంతో మంది వీరమరణం పొందారు. ఆ గ్రామాలకు వెళ్లి వారి కుటుంబాలను ఊరడించాలని కుటుంబరావు మనసు ఎంతో ఆరాటపడింది. జైలుకు వెళ్లకు ముందు చల్లపల్లి జమీందారీ వ్యతిరేక పోరాటంలో ఎంతో చురుగ్గా పాల్గొన్నాడు. తను జైల్లో వుండగా జరిగిన పోలీసు కాల్పుల్లో మరణించిన చాలా మంది నాయకులు, రైతు బిడ్డలు కుటుంబరావుకు ఆత్మీయులు. వారి ఇళ్లకు వెళ్లి కుటుంబాలను కలుసుకొని వారి దుఃఖంలో పాలు పంచుకోవాలని కుటుంబరావుకు ఎంతగానో వుంది. పార్టీ ఆంక్షల వల్ల వెళ్లలేని నిస్సహాయతకు బాధపడ్డారు.

ఇంతలో నెల రోజుల పేరోల్ ముగిసి తిరిగి కడలూరు వెళ్లిపోయారు. అయితే జైలులోకి అడుగు పెట్టడంతో మరో అద్భుతం జరిగింది. జైలు నుంచి పూర్తిగా విడుదల చేస్తూ జైలు సూపరింటెండెంటు ఆర్డర్ కుటుంబరావు చేతిలో పెట్టాడు.

కుటుంబరావుకు ఎంతో స్వేచ్ఛ లభించినట్లనిపించింది. రాజకీయ ఖైదీగా నిర్బంధాన్ని అనుభవించి పూర్తిగా విడుదల పొందడం ఒక అనుభవం. అక్కడ్నించి మద్రాసు వచ్చాడు. అంతకు ముందు యువజన సంఘాల్లో పనిచేసి తర్వాత మద్రాసులో స్థిరపడిన బావమరది రావి దుర్గాప్రసాద్ ఇంటికెళ్లాడు. అక్కడ కొన్నాళ్లున్నాడు. అక్కడుండగా ఎ.కె. గోపాలన్‌ను అనేకసార్లు కలుసుకున్నాడు.

ఒక రోజు మద్రాసు టి. నగర్‌లో నడిచి వెళుతున్న కుటుంబరావుకు సమీపంలోని ఇంటి నుంచి ఎవరో 'అన్నా! అన్నా!' అని పిలవడం వినవచ్చింది. ఆ గొంతు సి. గోపాలకృష్ణది. గోపాలకృష్ణ ఎవరో కాదు. లోగడ హైదరాబాద్ నుంచి రాయిటర్ వార్తా సంస్థ విలేఖరిగా వుండేవారు. కమ్యూనిస్టు పార్టీలో పనిచేయడంవల్ల ప్రభుత్వం అరెస్టు చేసి కడలూరు జైలుకు పంపింది. కొంతకాలం కుటుంబరావుతో కలసిమెలసి వుండడం వల్ల ఇరువురికీ మంచి స్నేహం ఏర్పడింది. 'కడలూరు జైలు నుంచి వచ్చిన తర్వాత తిరిగి అరెస్టు చేసి జాల్నా జైలులో కొంతకాలం ఉంచి అటు తర్వాత విడుదల చేశారనీ, మద్రాసు వచ్చి తమ కుటుంబ సంరక్షకులైన భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు డా. భోగరాజు పట్టాభిసీతారామయ్య

ఇంటి వద్ద వుంటున్నాననీ గోపాలకృష్ణ తన విషయాలను మిత్రుడైన కుటుంబరావుకు చెప్పాడు. ఒక రోజు ఒక పోలీసు అధికారి పట్టాభిగారి ఇంటి ముందు నిలబడి వుండగా అప్పుడే ఇంట్లోంచి బయటికి వచ్చిన పట్టాభిగారు అతడ్ని చూసి ఎవరు నువ్వు అని అడిగారు. 'నేను పోలీసు అధికారిననీ, ఈ ఇంట్లో గోపాలకృష్ణ విషయం తెలుసుకోవడానికి వచ్చాన'ని సమాధానమిచ్చాడు. దానికి పట్టాభిగారు అతనిపై మండిపడి వెంటనే హోంమంత్రికి ఫోన్ చేసి చీవాట్లు పెట్టారు. తర్వాత కొన్నాళ్లకు గోపాలకృష్ణను పిలిచి 'ఏదైనా ఉద్యోగం చేస్తావా?' అని అడిగారు. రాయిటర్‌లోనైతే చేస్తానని గోపాలకృష్ణ అనడంతో పట్టాభిగారు రాయిటర్‌వారికి ఫోన్ చేసి మాట్లాడి ఉద్యోగం ఇప్పించారు. ఉద్యోగం వచ్చాక వేరే గది తీసుకొని వుంటున్నాను' అని కుటుంబరావుకు వివరించాడు.

తర్వాత కలకత్తా నుంచి ఆలిండియా కిసాన్ మహాసభ నాయకులు బంకిం ముఖర్జీ కుటుంబరావుకు లేఖ రాస్తూ 'రైతు సమస్యలు, తెలంగాణ పోరాట విషయాల్ని చర్చించాల్సి వుంది' కలకత్తా రావలసిందని కోరాడు.

రాజాజీ వద్దకు రాయిటర్ విలేఖరిని పంపిన కుటుంబరావు

ఇలా వుండగా కావూరి కుటుంబరావుకు ఒక ఆలోచన కలిగింది. ఆ ఆలోచన రావడంతోనే తన మిత్రుడైన రాయిటర్ విలేఖరి గోపాలకృష్ణకు ఆ విషయం వివరించాడు. 'కమ్యూనిస్టు పార్టీ ఎన్నికల్లో పాల్గొంటే ప్రభుత్వ వైఖరి ఎలా వుంటుందో' రాజాజీని అడగమని కోరారు. నాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి చక్రవర్తుల రాజగోపాలాచారిగారిని ఇంటర్వ్యూ చేయడానికి గోపాలకృష్ణ అపాయింట్‌మెంట్ సంపాదించారు. రాజాజీని ఇంటర్వ్యూ చేస్తూ ముఖ్యంగా తాను ఆడగదలచిన విషయం అడిగారు. 'కమ్యూనిస్టులు ఎన్నికల్లో పాల్గొనే విషయంలో కాంగ్రెస్ వైఖరెలా వుంటుంద'ని అడిగారు. గొప్ప రాజకీయ వేత్త, వాక్చాతుర్యానికి పేరు పొందిన రాజగోపాలాచారి నవ్వుతూ 'భారతదేశ అభివృద్ధికి మొట్టమొదట కావలసింది కాంగ్రెస్‌వారు. వారికి ప్రతిపక్షంగా ఉండదగిన త్యాగమూర్తులు, దేశ భవిష్యత్తుకు కృషి చేసే నిస్వార్థపరులూ అయిన కమ్యూనిస్టులు ఎన్నికల్లో పాల్గొంటే దేశ భవిష్యత్తు ఎంతో బావుంటుందని, దీన్ని తమవంటి వాళ్లందరం సహకరిస్తామని ప్రకటించారు. ఈ వార్తను దేశంలోని పత్రికలన్నీ పతాక శీర్షికలతో ప్రచురించాయి. రాజగోపాలాచారి ప్రకటనతో మద్రాసు రాష్ట్రంలో ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతంలో సంచలనాత్మక మార్పు రావడం ఆరంభమైంది. పోలీసులు కమ్యూనిస్టుల పట్ల తమ పూర్వ వైఖరిని మార్చుకోవడం ఆరంభమైంది.

నెల్లూరు శాంతి మహాసభ

ఆంధ్ర రాష్ట్ర శాంతి మహాసభ 1951 జూన్ నెలలో నెల్లూరులో మూడు రోజుల పాటు జరిగింది. వావిలాల గోపాలకృష్ణయ్య, రాటకొండ నరసింహారెడ్డి, కందవల్లి కృష్ణారావు, వి. రామకృష్ణయ్య, టి.కె. రామస్వామి, డి. సీతారామయ్య, పంజం నరసింహారెడ్డి, శ్రీమతి వీరమాచనేని విమలాదేవి, యలమంచిలి బాలకోటయ్య, కావూరి కుటుంబరావు మొదలైన నాయకులు పాల్గొన్నారు. ప్రతినిధులు మూడు వర్గాలుగా చీలిపోయారు. అతివాద వర్గానికి కందవల్లి కృష్ణారావు నాయకునిగా వున్నారు. మితవాద వర్గంలో వావిలాల గోపాలకృష్ణయ్య, టి.కె. రామస్వామి మొదలైనవారు వున్నారు. ఇక తటస్థుల్లో కావూరి కుటుంబరావు, డి. సీతారామయ్య, పంజం నరసింహారెడ్డి మొదలైనవారున్నారు.

మహాసభలో అఖిల భారత శాంతి మహాసభ అధ్యక్షుడైన డా. సైపుద్దీన్ కిచ్‌లూ, సిపిఐ కేంద్ర కమిటీ తరపున మనెక్ గాంధీ పాల్గొన్నారు. నాయకులు మూడు వర్గాలుగా చీలిపోయిన కారణంగా చర్చలు వాడిగావేడిగా జరిగాయి.

ఒకనాటి సభకు శ్రీమతి వీరమాచనేని విమలాదేవి అధ్యక్షత వహించారు. ఈ సభలో కందవల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో సోషలిజాన్ని స్థాపించడానికే శాంతి ఉద్యమం పని చేస్తోందని, ఇక్కడ మన దేశంలో కూడా మనం అదే లక్ష్యం కోసం తీవ్రంగా పోరాటం చేయాలని అన్నారు. కేంద్ర నాయకుడు మనెక్ గాంధీ కృష్ణారావు మాటలకు స్పందిస్తూ 'శాంతి ఉద్యమం ప్రపంచంలో యుద్ధం రాకుండా చేయడం కోసమే గాని సోషలిజం స్థాపన కోసం కాదు' అన్నారు.

అంతలో కృష్ణారావు కాస్త ఆవేశంగా మనెక్ గాంధీ మాటలకు జవాబు చెబుతూ 'మేము ముందు చెప్పినట్లే సోషలిజం కోసమే శాంతి ఉద్యమం నడుపుతామ'ని అన్నారు ఆ మాటలకు మనెక్ గాంధీ కాస్త మందలింపు ధోరణిలో మీ నెల్లూరు యూనిట్ అదే విధానాన్ని అవలంబిస్తే మీ యూనిట్‌ను శాంతి సభ నుంచి బహిష్కరిస్తాం అన్నారు.

కృష్ణారావు అగ్రహోదగ్రుడయ్యారు. చెప్పు పైకెత్తి చూపుతూ 'మా యూనిట్‌ను రద్దు చేయడానికి నువ్వెవరు?' అని బిగ్గరగా అరుస్తుండగా కావూరి కుటుంబరావు పరుగున వెళ్లి కృష్ణారావుతో తనకున్న చిరకాల మైత్రి, సాన్నిహిత్యంతో చెప్పు లాక్కొని 'అన్నా! ఏమిటీ ఆవేశం. ప్రశాంతంగా జరుగుతున్న సభను రసాభాస చేయడం నీ వంటి పెద్దవానికి తగునా?' అని శాంతింపజేశారు.

తర్వాత జరిగిన శాంతి సంఘం ఎన్నికల్లో కుటుంబరావు చొరవవల్లే వావిలాల గోపాలకృష్ణయ్య అధ్యక్షునిగా, యలమంచిలి బాలకోటయ్య కార్యదర్శిగా, రాటకొండ నరసింహారెడ్డి, డి. సీతారామయ్య, పంజం నరసింహారెడ్డి మరికొందరు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఈ మహాసభల్లో పాల్గొన్న కృష్ణాజిల్లా ప్రతినిధుల్లో ముఖ్యులెవరని డా. కిచ్‌లూ అడిగారు. అందరూ కావూరి కుటుంబరావు పేరు చెప్పారు. అప్పుడాయన కుటుంబరావును పిలిచి 'ఏ ప్రాంతంలో వుంటారని, గత మూడేళ్లలో యేయే కార్యక్రమాలు చేపట్టార'ని అడిగారు.

'మాది కృష్ణాజిల్లా దివి తాలూకాలోని చల్లపల్లి ఎస్టేటు ప్రాంతం. చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా ఎనిమిదేళ్లుగా పోరాడుతున్నాను. 1948 జనవరి నుంచి నాపై అరెస్టు వారంటు ఉండటం వల్ల రహస్యంగా వున్నాను. 1947 ఆగస్టు 15న వారంట్ రద్దయిన దరిమిలా బయటికి వచ్చాను. 1948 మార్చి మొదటివారంలో కలకత్తాలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ రెండవ మహాసభలో ప్రతినిధిగా పాల్గొన్నాను. బి.టి. రణదివే నాయకత్వంలో జరిగిన ఆ సభలో 'మనకు ఇంకా స్వాతంత్ర్యం రాలేదని, కాబట్టి బ్రిటిషు అనుకూల కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాల'ని తీర్మానించాం. తర్వాత 1948 మే నెలలో అరెస్టయి రాజమండ్రి, కడలూరు జైళ్లలో ఉండి నెల రోజుల కిందటే బయటికి వచ్చాను' అని కుటుంబరావు తన గురించి క్లుప్తంగా వివరించారు.

'నేనెవరో తెలుసా?' కిచ్‌లూ ప్రశ్న.

'తెలియకేమి? మేం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడే మీ గురించి విన్నాం. ముఖ్యంగా 1919లో జలియన్‌వాలాబాగ్‌లో సభకు మీరు అధ్యక్షత వహించవలసి వుండగా అంతకు ముందుగానే మిమ్మల్ని అరెస్టు చేసి జైలులో పెట్టారు. జలియన్‌వాలాబాగ్‌లో సమావేశమైన మనవారిపై బ్రిటిషువారు జరిపిన కాల్పుల్లో 500మంది అమరులయ్యారు' కుటుంబరావు సమాధానం.

'మీ ప్రాంతంలో జరుగుతున్న కార్యకలాపాలను గురించి చెప్పు' అన్నారు డా.కిచ్‌లూ.

'నేనున్నది చల్లపల్లి ఎస్టేట్ ప్రాంతం. చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా పోరాడుతున్నాం. ఆ పోరాటంలో భాగంగానే జైలుకు వెళ్లాను. నేను జైలుకు వెళ్లిన తర్వాతే అనేక మంది రైతుకూలీలపై కేసులు బనాయించి జైలుకు పంపారు. జమీందారు అనుకూలురైన పోలీసులు కమ్యూనిస్టులు, వారి సానుభూతిపరులైన రైతు, కూలీ, యువజన, విద్యార్థులను మా ఎస్టేటు ప్రాంతంలోనే కాల్చి చంపారు. ఎంతో మందిని జమీందారీ రౌడీలు చిత్రహింసలు పెట్టి చంపివేశారు' కుటుంబరావు వివరించారు.

'ఇప్పటికీ ఆ ప్రాంతం జమీందారీలోనే వుందా?' డా. కిచ్‌లూ ప్రశ్న.

'1949 సెప్టెంబర్‌లో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం చల్లపల్లి ఎస్టేట్‌నే కాకుండా మద్రాసు రాష్ట్రంలోని జమీందారీలను అన్నిటినీ రద్దు చేసింది' అన్నారు కుటుంబరావు.

'ఇంతకూ మన దేశంలో నిజాం, మైసూరు వంటివి ఎన్ని సంస్థానాలుండేదీ తెలుసా?' ప్రశ్న.

'సుమారు 544 సంస్థానాలుండేవి' జవాబు.

'ఇప్పుడు ఆ సంస్థానాల పరిస్థితి ఏమిటి?'

'సంస్థానాలన్నీ రద్దయి కేంద్ర ప్రభుత్వ స్వాధీనంలోకి వచ్చాయి'

'నీవు చెప్పావే రణదివే నాయకత్వంలో కలకత్తా సభలో చేసిన తీర్మానాన్ని గురించి. మీరు తీర్మానంలో అభిప్రాయపడినట్లు మన ప్రభుత్వం జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభభాయ్ పటేల్ వంటివారు బ్రిటిష్ వారి ఏజెంట్లయితే ఈ సంస్థానాలను, ఎస్టేట్‌లను, వాటి పాలకులను రద్దు చేసేవారేనా?' అసలు విషయాన్ని గురించి సూటిగా అడిగారు డా. కిచ్‌లూ.

కుటుంబరావు సమాధానం చెప్పలేకపోయారు.

డా. కిచ్‌లూ మరింత వివరంగా చెప్పసాగారు.

'మీరు కలకత్తాలో చేసిన తీర్మానం చాలా తొందరపాటుతో కూడింది. ఆ తీర్మానం చేయడానికి ముందు మీ చల్లపల్లి ఎస్టేట్‌లో జమీందారు భూములను అక్రమంగా అమ్ముకొంటున్నప్పుడు మీరు శాంతియుతంగా పోరాడి వాటిని అమ్ముకోకుండా చేయ గలిగారు. అంతేగాక అక్రమంగా అమ్మితే రెండేళ్ల జైలు శిక్ష పడేలా చట్టం చేయడంలో కూడా మీ పాత్ర వుంది. నీవు చెప్పినదాన్ని బట్టి చూస్తే 1948 మార్చి తర్వాత మీలో ముఖ్యులు జైలు పాలవడం, బయటనున్న వారిలో 30 మంది దారుణంగా హతులవడం, ఎంతో మంది జైలు పాలవడం జరిగింది. ఈ మరణాల వల్ల, జైళ్లలో మగ్గడం వల్ల ఎవరికి లాభం కలిగింది?

'ఇలా జరుగుతుండగానే ఒక వైపు 1949 సెప్టెంబర్‌లో ప్రభుత్వం జమీందారీ వ్యవస్థను రద్దు చేసినప్పటికీ ఆ చట్టాన్ని అనుసరించి సంస్థానాధీశులు, జమీందారులు లక్షలాది రూపాయల భరణాల్ని అందుకున్నారు. నిజానికి తమకు హక్కులేని భూములపై పట్టాలను పొందేందుకు చట్టంలో వెసులుబాటు క్లాజుల్ని చేర్పించుకోగలిగారు. మీ కలకత్తా తీర్మానం వల్ల జమీందారులకు లాభం కలిగిందే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదు. మీరు ఎంతో కాలంగా వీరికి వ్యతిరేకంగా చేసిన పోరాటాలు, త్యాగాలు చివరికి ప్రజలకు ఉపయోగపడక జమీందారులకే లాభించాయి. ఇది విచారకరం' – అంటూ డా. కిచ్‌లూ ఇన్నేళ్ల పోరాటాన్ని తనదైన పద్ధతిలో విశ్లేషించారు. దీనిపై లోతుగా ఆలోచించమని కుటుంబరావును కోరారు. 'ఈ అనుభవంతో భవిష్యత్తులో ఏం చేయాలనేది నిర్ణయించుకో' అని కూడా హితవు చెప్పారు. 'మనకు త్వరలో ఎన్నికలు రాబోతున్నాయి. మీరు కూడా ఎన్నికల్లో పాల్గొంటే మంచిదని నా కోరిక. నీవు అందుకు అంగీకరించి మళ్లీ రహస్య జీవితంలోకి వెళ్లకుండా బహిరంగంగా పనిచేయడానికి సిద్ధపడు. ఒకవేళ్ల పోలీసులు నిన్ను అరెస్టు చేస్తే ఢిల్లీకి నాకు టెలిగ్రాం ఇవ్వు. మద్రాసు వెళ్లి ముఖ్యమంత్రి కుమారస్వామి రాజాతో కూడా మాట్లాడి ఢిల్లీ వెళ్లిపోతాను' అని చెప్పి తన అడ్రస్ ఇచ్చారు.

డా. కిచ్‌లూ చెప్పిందంతా కుటుంబరావుకు తెలియందేమీ కాదు. కాని జరుగుతున్న విషయాల పట్ల మరింత స్పష్టత వచ్చేలా చేసింది.

మద్రాసు పయనం

నెల్లూరు నుంచి కుటుంబరావు మిత్రులైన డి. సీతారామయ్య, పంజం నరసింహా రెడ్డిలను తీసుకొని మద్రాసు పయనమై వెళ్లారు. అక్కడికి చేరుకొని బ్రాడ్‌వేలో వున్న ట్రేడ్ యూనియన్ ఆఫీసులో వదిలి కుటుంబరావు తన బావమరిది దుర్గాప్రసాద్ ఇంటికి వెళ్లిపోయారు. అప్పటికి ఎ.కె. గోపాలన్, ఎం.ఆర్. వెంకట్రామన్ కూడా జైలు నుంచి విడుదలయ్యారు. వారిద్దరు రణదివే విధానానికి, సాయుధ పోరాటానికి వ్యతిరేకులైనా పార్టీ క్రమశిక్షణకు లోబడి బయటపడలేకపోయారు. కుటుంబరావుకు ఎ.కె. గోపాలన్, ఎం.ఆర్. వెంకట్రామన్‌లతో సాన్నిహిత్యం ఉండడమే గాక ఆయనంటే వారికి ఎంతో అభిమానం కూడా వుంది. వారిని కలిసి రాజాజీతో రాయిటర్ విలేఖరి జరిపిన ఇంటర్వ్యూ గురించీ, డా. సైఫుద్దీన్ కిచ్‌లూతో జరిగిన సంభాషణ గురించీ వివరించారు.

'నీవు చెప్పింది బాగానే వుంది. మేం నాయకత్వంలో వున్నందువల్ల బయట పడలేకుండా వున్నాం. నీవు మాత్రం నీ పంథాలోనే ముందుకు వెళ్లమ'ని వెన్ను తట్టి ప్రోత్సహించారు.

ఈ పరిణామాల దృష్ట్యా కమ్యూనిస్టులు రాబోయే ఎన్నికల్లో పాల్గొనడమే మంచిదని కుటుంబరావు భావించాడు. పార్టీ నాయకత్వం ఎక్కడుందీ తెలియకపోయినా నాయకత్వం ఇదే వైఖరితో వుందనే అభిప్రాయం కలిగించేలా ముందుకు సాదలచాడు. అప్పటికి మద్రాసులో వున్న పార్టీ సీనియర్ నాయకుడు కొసరాజు శేషయ్యను తన దగ్గరికి పిలుచుకున్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ పాల్గొనదలచిందని, దానికి ఒక కమిటీని ఏర్పచిందని అంటూ ఆ కమిటీలో ఒక సభ్యునిగా వుండమని కుటుంబరావు శేషయ్యను కోరారు. దీనికి ఆయన అంగీకరించారు. బ్రాడ్‌వేలో వున్న నరసింహారెడ్డి, సీతారామయ్యలకు కూడా ఈ విషయం చెప్పారు. సీతారామయ్య కూడా కమిటీలో వుండటానికి ఒప్పుకోగా నరసింహారెడ్డి మాత్రం తాను పనిచేస్తాను గానీ కమిటీలో ఉండలేనని చెప్పాడు. ఆ రాత్రి 2 గంటల వరకూ సుదీర్ఘ మంతనాలు జరిపి మొత్తానికి ఇరువురూ నరసింహారెడ్డిని ఒప్పించారు. ఆ మరునాడే విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ రాబోయే ఎన్నికల్లో పాల్గొంటుందనీ, దానికి కొసరాజు శేషయ్య (మద్రాసు), డి. సీతారామయ్య (మదనపల్లె), పంజం నరసింహారెడ్డి (కడప), వెంకటరావు (రామచంద్రాపురం), కోరుగంటి గోవిందరావు (అనకాపల్లి)లతో ఒక కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించి ఆ తర్వాత మోపిదేవి వెళ్లిపోయారు కుటుంబరావు.

సుందరయ్య, రాజేశ్వరరావులతో భేటీ

మద్రాసు నుంచి కుటుంబరావు స్వగ్రామానికి తిరిగి వచ్చిన కొన్నాళ్లకు ఒక వ్యక్తి వచ్చి మిమ్మల్ని పుచ్చలపల్లి సుందరయ్యగారు తీసుకురమ్మన్నారని చెప్పాడు. అతని వెంట కుటుంబరావు బయలుదేరారు. సుందరయ్య ఎక్కడున్నారనే విషయాన్ని వెల్లడించకుండా కుటుంబరావును ముందు మద్రాసు తీసుకెళ్లి అక్కడ రెండు రోజులుంచి అక్కడ్నించి పూనా తీసికెళ్లాడు. పూనాలో హోటల్ యజమాని కుటుంబరావును చూసి ఇతను తెలంగాణా ప్రాంతానికి చెందిన నాయకుడై వుంటాడని భావించాడేమో తన గురించి చెప్పాడు. తాను సోషలిస్టుననీ, సాయంత్రం 7 గంటలకు పోలీసులు వచ్చి హోటల్లో దిగిన వారందరి వివరాలు సేకరిస్తారని చెప్పాడు. దాంతో కుటుంబరావు కొరియర్‌ను తీసుకొని ఆ హోటల్ నుంచి పూనా లా కాలేజీలో చదువుతున్న నీలం ప్రభాకర రెడ్డి లాడ్జికి వెళ్లారు. అక్కడ రెండు రోజులున్నారు. ఆ తర్వాత కొరియర్ కుటుంబరావును అక్కడ్నించి నాగపూర్ తీసుకెళ్లాడు. అక్కడ ఒక రోజు ఉంచి అక్కడ్నించి రాయపూర్ తీసికెళ్లాడు. చివరికి అక్కడ రహస్యస్థావరంలో వుంటున్న పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, మరో పది మంది నాయకులను కలుసుకున్నారు.

ఆ మరునాడు సుందరయ్య, రాజేశ్వరరావు కటుంబరావును పిలిచి 'జైలు నుంచి ఎప్పుడొచ్చావు? తర్వాత దివిసీమలో చేపట్టిన కార్యక్రమాలేమిటి?' అని అడిగారు. కుటుంబరావు వారికి అన్ని విషయాలను వివరించాడు. ఇంతకూ ఆంధ్రా కమ్యూనిస్టు పార్టీ ఎన్నికల్లో పాల్గొంటుందనే విధాన ప్రకటన ఎవరిని అడిగి చేశావని, కమిటీ ఎవరి అనుమతితో వేశావని కుటుంబరావును ప్రశ్నించారు. కుటుంబరావు కూడా ఇటువంటి ప్రశ్న తలెత్తుతుందని అనుకుంటూనే వున్నాడు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యే వున్నారు.

నేను జైలు నుంచి కృష్ణా జిల్లాకు వెళ్లి అక్కడ పార్టీ సానుభూతిపరులు చాలా మందితో మాట్లాడగా 'ఈ పోరాట పంథా మాని ప్రజాస్వామ్య పద్ధతి వైపు వెళ్లడం మంచిద'ని వారంతా అన్నారని చెప్పారు. అదే విధంగా నెల్లూరు శాంతి మహాసభకు వెళ్లినప్పుడు డా. కిచ్‌లూ చెప్పిన మాటలను, కమ్యూనిస్టులు ఎన్నికల్లో పాల్గొంటే స్వాగతిస్తామని రాజగోపాలాచారి ప్రకటించిన విషయాన్ని చెబుతూ వీటన్నిటి దృష్ట్యా కమ్యూనిస్టులు ఎన్నికల్లో పాల్గొంటారని పత్రికలకు తెలియజేశానని కుటుంబరావు సుందరయ్య, రాజేశ్వరరావులకు వివరించారు. దీని తర్వాత తాను కృష్ణా జిల్లాకు వెళ్లగా పోలీసులు గతంలోలా దౌర్జన్యంగా వ్యవహరించక వెనుకకు తగ్గడం, ప్రజలు ఈ వార్త విని ఉత్సాహంగా కనిపించడం వంటివి జరిగాయని అన్నారు.

'ఇలా సమావేశాల్లో పాల్గొనడానికి, కమిటీలు వేయడానికి అధికారం లేదని తెలుసు.

అయితే పార్టీలోనూ, అనుబంధ ప్రజాసంఘాల్లోనూ వివిధ శ్రేణుల మధ్య సమన్వయం లేదు. సమన్వయం లేదు అనేకంటే సమాచారలోపం ఎక్కువగా వుంది. ప్రజల్లో కూడా నిరుత్సాహం వుంది. ఇంకోవైపు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల పట్ల పోలీసులు వ్యవహరించే తీరు సవ్యంగా లేదు. ఈ పరిస్థితుల్లో నిరుత్సాహ వాతావరణాన్ని తొలగించేందుకు చొరవ చూపే ఉద్దేశంతో ఇది ఇలా చేయాలనే చేశాను. నేను చేసింది మీకు అంగీకారం కాకపోతే ఇది పార్టీ వైఖరి కాదని పత్రికాముఖంగా ప్రకటించండి. మీ అంగీకారం లేకుండా ఇదంతా చేసినందుకు నాపై క్రమశిక్షణా చర్య తీసుకోండి. ఆ శిక్ష ఏమిటో చెప్పండి. నేను భరిస్తాను' అని కుటుంబరావు స్పష్టంగా చెప్పారు. 'పార్టీలో ఏర్పడిన స్తబ్దత, సరైన సమయంలో సరైన పనిచేశాను. ఇక మీ ఇష్టం' అన్న రీతిలో సమాధానం చెప్పారు. అయితే క్రమశిక్షణ కలిగిన పార్టీ నాయకునిగా నాయకత్వ నిర్ణయాన్ని గౌరవిస్తానని అన్నారు.

ఇదంతా విన్న చంద్ర రాజేశ్వరరావు 'నీవు చేసింది తప్పని మేం చెప్పడం లేదు. నీవు కమిటీలో వేసిన పంజం నరసింహారెడ్డిని ఆ జిల్లా కమిటీ ఇంతకు ముందే పార్టీలోంచి తొలగించింది. పార్టీలో లేని వ్యక్తిని ఎన్నికల కమిటీలో వేయడమేమిటి? అని కడప జిల్లా కామ్రేడ్స్ మమ్మల్ని అడుగుతున్నారు. అందువల్ల నిన్ను అడగవలసి వచ్చింది' అన్నారు నవ్వుతూ.

దానికి మళ్లీ కుటుంబరావు 'ఇది నిజమే. ఆనాడు రాత్రి 8 గంటల నుండి తెల్లవారుజాము 2 గంటల వరకూ నరసింహారెడ్డిని కమిటీలో ఉండమని అడిగాం. తాను పని చేస్తానే గాని కమిటీలో వుండనని అన్నాడు గానీ పార్టీలో నుంచి తనను తొలగించారనే విషయం చెప్పలేదు. ఆ విషయం తెలియకపోవడం వల్ల నేనతన్ని కమిటీలో వేశాను' అని సమాధానమిచ్చారు.

ఇదంతా విన్న సుందరయ్య, రాజేశ్వరరావు కుటుంబరావుపై ఎటువంటి చర్య తీసుకోకపోగా నీవు చేసిన పని మంచిదేనని, కృష్ణా జిల్లాకు వెళ్లిపొమ్మని చెప్పారు. దాంతో కుటుంబరావు తిరుగుముఖం పట్టారు. వెళ్లిన మార్గం నుంచి కాక మధ్యప్రదేశ్, దుర్గి, విజయనగరం, విశాఖపట్నం మీదుగా ఇంటికి చేరుకున్నారు.

తర్వాత కొన్నాళ్లకు కుటుంబరావు మద్రాసు వెళ్లి మిత్రుడైన ఎ.కె. గోపాలన్‌ను కలుసుకున్నారు. చల్లపల్లిలో ఒక బహిరంగసభ ఏర్పాటు చేయదలచానని, మీరు రావాలని కోరారు. గోపాలన్ అందుకు అంగీకరించారు. 1951 సెప్టెంబర్‌లో సభా నిర్వహణకు ఏర్పాట్లు మొదలుపెట్టారు.

అది వర్షాకాలం. చల్లపల్లిలో నాలుగువేల మంది పట్టే మైదానం లేదు. చల్లపల్లి జమీందారు నిర్మించిన హైస్కూలు మైదానం చాలా విశాలమైంది. కొన్ని వేలమంది పట్టే స్థలం. కాబట్టి మరో మార్గం లేక కుటుంబరావు జమీందారు మేనేజరు, తనకు మిత్రుడైన లక్ష్మీపతి ద్వారా రాజాగారికి హైస్కూలు మైదానాన్ని తమ బహిరంగ సభకు ఇవ్వమని కబురు పంపారు. జమీందారు రెండు రోజులయ్యాక చెబుతానన్నాడని లక్ష్మీపతి కుటుంబ

రావుకు చెప్పారు. రెండు రోజులకు మళ్లీ లక్ష్మీపతి వద్దకు తన మనిషిని పంపారు కుటుంబ రావు. జమీందారు విజయవాడలో వున్నందువల్ల అక్కడికి ట్రంకాల్ బుక్ చేసి మాట్లాడారు. కుటుంబరావు స్వయంగా వచ్చారా అని రాజా ఫోన్‌లో లక్ష్మీపతిని అడిగారు. తాను రాలేదని, వాళ్ల మనిషి ముమ్మనేని శంకర్రావును పంపారని మేనేజర్ రాజాతో అన్నారు. మొత్తానికి హైస్కూలు మైదానాన్ని బహిరంగ సభ కోసం ఇవ్వడానికి ఒప్పుకున్నారు.

ఆ రోజుల్లో ఊరూరా తిరిగి ప్రచారం చేయడానికి మైకులు వుండేవి కావు. అప్పుడప్పుడే బందర్లో ఒకతను మైకు తెచ్చారని తెలిసింది. అతని వద్దకు వెళ్లి మాట్లాడారు. ఒక చిన్న కారును, మైకును అద్దెకు తీసుకొని చావా ఉమామహేశ్వరరావు అనే యువకుడ్ని పెట్టి ఎ.కె. గోపాలన్ బహిరంగ సభ గురించి తాలూకా అంతటా ప్రచారం చేయించారు. అప్పటికి జైల్లో వున్న దివి తాలూకా కమ్యూనిస్టు నాయకులు విడుదల కాలేదు.

అక్కడికీ ఒకవేళ చివరి నిముషంలో హైస్కూలు మైదానాన్ని ఇవ్వనని జమీందారు నుంచి కబురు వస్తుందేమో! అదే జరిగితే చాలా ఇబ్బంది అవుతుందని భావించి సజ్జా రామయ్య అనే కమ్యూనిస్టు పార్టీ అభిమాని ఇంటి దగ్గర ఫర్నీచర్ తెచ్చి పెట్టారు. కాని సభ జరిగే రోజు ఉదయం 9 గంటలకు హైస్కూలు హెడ్ మాస్టరు కబురు చేస్తే కుటుంబ రావు వెళ్లారు. మైదానంలో బహిరంగ సభకు కావలసిన వేదిక నిర్మాణం, ఇతర ఏర్పాట్లు చెయ్యమని జమీందారు చెప్పారని అన్నారు. ఆ ఏర్పాట్లు ఎలా చెయ్యాలో, వాలంటీర్లను పంపిస్తే ఆ ప్రకారం చేస్తామని హెడ్మాష్టరు చెప్పారు.

మధ్యాహ్నం ఒంటి గంట నుంచే బహిరంగసభ హడావుడి మొదలైంది. జనం పెద్ద సంఖ్యలో నినాదాలిస్తూ సభకు తండోపతండాలుగా తరలి రావడం ప్రారంభించారు. సాయంత్రానికి అనూహ్యంగా పరిసర ప్రాంతాల నుంచి సభకు చేరుకున్నారు. ఎక్కడ చూసినా జనం. 'కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్', 'అమరవీరులకు జోహార్', 'పళనియప్పన్‌ను ఉరితీయాలి' అన్న నినాదాలు మిన్నుముట్టాయి. చల్లపల్లి జమీందార్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పోలీసు అధికారిగా వున్న పళనియప్పన్ రైతులను, కూలీలను, విద్యార్థులను కాల్చి చంపాడు. అందుకే అతనిపై ప్రజాగ్రహం పెల్లుబుకింది. జనాగ్రహం తీవ్రస్థాయిలో వుండి ఒక దశలో చల్లపల్లి పోలీసు స్టేషన్‌ను ముట్టడించే వరకు వెళ్లింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కుటుంబరావు కారులో మైక్ తీసుకుని వెళ్లి వారిని ఉద్రేకానికి లోను కావద్దని, శాంతించి బహిరంగ సభకు వెళ్లాలని నచ్చజెప్పారు.

సుమారు 50 వేల మంది ఆనాటి సభలో పాల్గొన్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడైన ఎ.కె. గోపాలన్ ఆ సభలో ఆవేశపూరితమైన ప్రసంగం చేశారు. 'కామ్రేడ్స్! మీ ఎస్టేట్

ఏరియాలో 30 మందికి పైగా రైతులను, కూలీలను, విద్యార్థులను, వారి నాయకులను పోలీసులు పొట్టన పెట్టుకున్నారని తెలిసి నేను చాలా బాధపడ్డాను. ఇందులో ప్రధాన పాత్రధారి అయిన పోలీసు అధికారి పళనియప్పన్ మా మలబారు ప్రాంతంవాడే. అతను మిమ్ములను పెట్టిన చిత్రహింసలకు తగిన బుద్ధి చెబుదాం. మీ బిడ్డలను పొట్టన పెట్టుకున్న ఆ ద్రోహికి వాడి జన్మస్థలమైన మలబారులోనే తగిన శాస్తి చేస్తాం. బిడ్డలను కోల్పోయిన మీకు నా సానుభూతిని తెలియజేస్తున్నాను. రాబోయే ఎన్నికల్లో ఈ దారుణా లన్నిటికీ కారకులైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఆ పార్టీ నాయకులను నామరూపాలు లేకుండా చేయడానికి సిద్ధం కండి!' అని పిలుపునిచ్చారు. ఆయన ప్రసంగం విన్న ప్రజలు ఉగ్రూతలూగిపోయారు.

1952 ఎన్నికలు

రాబోయే ఎన్నికల్లో పాల్గొంటామని 1951లో కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. అయితే ఆ ప్రకటన అంత తేలిగ్గా జరగలేదు. తర్జనభర్జనలు జరిగాయి. కార్మికవర్గ నాయకులమనుకునే తీవ్రవాదులు ఒకవైపు, రైతాంగపోరాటం ద్వారానే సోషలిజం వస్తుందని తలచే ఆంధ్ర కమిటీలోని ముఖ్యులు ఒక వైపు... ఇలా రెండు వర్గాలకు తోడు ఈ రెండు మార్గాలూ తప్పు అనుకునే ఎస్.ఎ. డాంగే, అజయ్ ఘోష్, రావి నారాయణరెడ్డి వంటి వారు మూడవ వర్గంగానూ ఏర్పడడంతో మొత్తం మీద కమ్యూనిస్టుల్లో ఐక్యత లోపించింది. కమ్యూనిస్టు పార్టీ ముక్కలు చెక్కలుగా విడిపోవడానికి బీజాలు పడడం అప్పుడే ప్రారంభమైంది. ఇంతలో 1952 ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల్లో పాల్గొనేందుకు పార్టీ సిద్ధమైంది.

దివి తాలూకా, బందరు తాలూకాలోని గూడూరు ఫిర్కా కలిసి ద్విసభ్య శాసనసభ నియోజకవర్గంగా ఏర్పడింది. దివి, బందరు తాలూకాలు, పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరంతో కలిసి బందరు పార్లమెంటరీ స్థానం ఆవిర్భవించింది. శాసనసభా స్థానానికి చంద్ర రామలింగయ్య, రిజర్వు సీటుకు గుంటూరు బాపనయ్యలను పార్టీ అభ్యర్థులుగా దివి తాలూకా కమిటీ నిర్ణయించింది. ఇవే గాక కృష్ణా జిల్లా మొత్తానికి కలిపి ప్రత్యేకంగా క్రైస్తవుల కోసం ఒక రిజర్వు స్థానం వుండేది. ఈ స్థానానికి కమ్యూనిస్టు కాని టి.జె.ఎం. విల్సన్‌ను కమ్యూనిస్టు పార్టీ నిలబెట్టింది. భట్ల పెనుమర్రుకు చెందిన విల్సన్ గ్రామ కమ్యూనిస్టుల సహాయంతో చదువుకున్నాడు. చదువు పూర్తయిన తర్వాత చల్లపల్లి జమీందారు లాయరైన పిన్నమనేని లింగయ్యవద్ద జూనియన్ లాయర్‌గా విల్సన్ పనిచేస్తున్నాడు. క్రిస్టియన్ నియోజకవర్గం నుంచి ఆయనను నిలబెట్టేందుకు నాయకులకు ఇష్టం లేదు. కాని పార్టీ రాష్ట్ర నాయకుడు, భట్ల పెనుమర్రుకు చెందిన చలసాని వాసుదేవ రావు వత్తిడితో విల్సన్ అభ్యర్థిగా అంగీకరించవలసి వచ్చింది.

బందరు పార్లమెంటు స్థానానికి మద్రాసు రాష్ట్ర పౌర సంఘాల అధ్యక్షునిగా పనిచేసి కమ్యూనిస్టు కార్యకర్తలపై పెట్టిన కేసుల్లో ఫీజులు లేకుండా వాదించిన ప్రముఖ న్యాయవాది

యలమంచిలి నాగభూషణాన్ని నిలబెట్టాలని తాలూకా కమిటీ నిర్ణయించింది. అయితే కమిటీలో సభ్యుడైన సనకా బుచ్చికోటయ్య తానే నిలబడతానని అన్నాడు. ఆయన పెద్దగా చదువుకోలేదు. దానికి తాలూకా కమిటీ అంగీకరించలేదు. దాంతో బుచ్చికోటయ్య విజయవాడ వెళ్లి పుచ్చలపల్లి సుందరయ్యతో మొరపెట్టుకున్నాడు. బుచ్చికోటయ్యనే అభ్యర్థిగా నిలబెట్టమని సుందరయ్య వత్తిడి చేయడంతో తాలూకా కమిటీ తప్పనిసరి పరిస్థితుల్లో ఒప్పుకుంది.

జనరల్ స్థానానికి కాంగ్రెస్ తరఫున గొట్టిపాటి బ్రహ్మయ్య, స్వతంత్ర అభ్యర్థిగా చల్లపల్లి జమీందారు యార్లగడ్డ శివరామప్రసాదు, కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా చంద్ర రామలింగయ్య, రిజర్వు స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా వేముల కూర్మయ్య, కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా గుంటూరు బాపనయ్య పోటీ చేశారు.

బందరు పార్లమెంటు స్థానానికి మొదటి నుంచి జస్టిస్ పార్టీ నాయకునిగా వున్న ప్రముఖ న్యాయవాది కొల్లిపర వెంకటరమణయ్య నాయుడును కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టగా కమ్యూనిస్టు పార్టీ తరఫున సనకా బుచ్చికోటయ్యను నిలబెట్టడం జరిగింది. ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. విజయవాడలో సరస్వతీ టాకీస్, లీలామహల్ మొదలైన సినిమా హాళ్లను నడుపుతున్న వాసిరెడ్డి సత్యనారాయణ ప్రసాద్ కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులకు వేలాదిగా వాల్ పోస్టర్లను ముద్రించి ఇవ్వడమే గాక గోడలపై ఎన్నికల వార్తలు రాయించేందుకు ఇద్దరు పెయింటర్లను నియమించారు. ఆయన సోదరులు చల్లపల్లి జమీందారుకు బంధువులై వుండి కూడా జమీందారువారిని అనేక విధాలైన బాధలు గురి చేయడంతో చల్లపల్లి వదిలి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం మొదలైన చోట్లకు వెళ్లి సినిమా హాళ్లు కట్టుకొని స్థిరపడ్డారు.

గ్రామాల్లో రైతులు, కూలీలు ఎర్రజెండాలు కుట్టించుకొని ఇంటింటికీ తిరిగి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థుల కోసం ప్రచారం చేశారు.

ఆ రోజుల్లో మూడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానం ఎన్నిలకైన ఖర్చు 15 వేల రూపాయలు మాత్రమే. ప్రచారంలో ఆనాడు కూడా సాంస్కృతిక దళాలు పాల్గొన్నాయి. కోసూరు పున్నయ్య, కాజ శ్రీకృష్ణ రెండు దళాలుగా నియోజకవర్గమంతా చుట్టి బుర్రకథలు చెప్పి ప్రజల్లో కమ్యూనిస్టుల తరఫున ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారం ఆ రోజుల్లో మూడు నాలుగు నెలల పాటు సాగేది. పోలింగ్ కూడా ఇప్పట్లా కాక పది పదిహేను రోజులు జరిగేది. అప్పుడు చల్లపల్లిలో రెండు అద్దె కార్లు వుండేవి. అందులో ఒక కారు చల్లపల్లి జమీందారుకు పోగా రెండవదాన్ని కమ్యూనిస్టు పార్టీ ప్రచారం కోసం తీసుకున్నారు. కారు యజమాని కృష్ణారావు.

కుటుంబరావు అద్దె కారు గాక 1800 రూపాయలతో 4 సిలిండర్ల ఫోర్డ్ కారు కొన్నారు.

అద్దె కారుకు రోజు 20 రూపాయలిచ్చేవారు. రెండు కార్లకు పెట్రోలు, కొత్త కారు డ్రైవరు జీతం భరించేవారు. సభలో ఉపన్యాసాలు చెప్పడానికి 600 రూపాయలతో ఒక మైక్‌సెట్ కొన్నారు. దానికయ్యే బాటరీలను బందరు నుంచి తెప్పించేవారు. ఎన్నికలు దగ్గరకు వచ్చాక రెండు మూడు కార్లను అదనంగా అద్దెకు తీసుకొని ఉధృతంగా ప్రచారం చేశారు.

ఎన్నికల ఫలితాలు వచ్చాయి. మూడు అసెంబ్లీ స్థానాలను, ఒక పార్లమెంటు స్థానాన్ని కమ్యూనిస్టులు మంచి మెజారిటీతో గెలుచుకొన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో మొత్తం 41 స్థానాలు కమ్యూనిస్టుల వశమయ్యాయి. 40 చోట్ల కాంగ్రెస్ గెలుపొందింది. ఎన్నిలకు ముందున్న కాంగ్రెస్ ప్రభుత్వపాలనలో యువకులను కమ్యూనిస్టులని ముద్రవేసి పోలీసు కాల్పుల్లో చంపివేయడం, గ్రామాలకు గ్రామాలను చుట్టుముట్టి రాజకీయాలతో సంబంధం లేని యువకులను పోలీసులు చిత్రహింసల పాలు చేయడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ప్రబలిపోవడం ఒక కారణం కాగా కాంగ్రెస్‌లోనే చీలికవచ్చి టంగుటూరి ప్రకాశం పంతులు కె.ఎం.పి.పి. పేరుతో ఒక పార్టీ, రైతు నాయకుడు ఆచార్య ఎన్.జి. రంగా కె.ఎల్.పి. అనే మరొకపార్టీ, సోషలిస్టు వర్గం నుంచి విజయనగరం మహారాజు పి.వి.జి. రాజు నాయకత్వంలో మరో వర్గం ఇలా కాంగ్రెస్ ముక్కలు కావడం మరొక కారణం. దీంతో కాంగ్రెస్ వెనకబడిపోయింది.

ఎన్నికలయ్యాక కావూరి కుటుంబరావు అంతకుముందు ప్రచారం కోసం కారును అద్దెకు తీసుకున్న కృష్ణారావును పిలిచి కొత్తగా కొన్న ఫోర్డ్ కారును తీసుకెళ్లమన్నారు. తన దగ్గర డబ్బు లేదనీ, కారును కొనలేనని చెప్పాడు. కుటుంబరావు నవ్వి ఆ కారు అమ్మకానికి కాదని, ఉచితంగానే ఇవ్వదలిచానని అనగా కృష్ణారావు ఆశ్చర్యానికి అంతు లేకుండా పోయింది. నేను ఈ కారును 1800 రూపాయలకు కొన్న మాట వాస్తవమే అయినా మూడు మాసాలు నువ్వు కుదిర్చిన డ్రైవరు సహాయంతో చక్కగా వాడుకొని ఎన్నికల్లో ప్రయోజనం పొందాననీ, నిజానికి కారును అద్దెకు తీసుకొని వుంటే రెండు వేల రూపాయలు అయ్యేదని చెప్పారు. నీవు చేసిన సహాయం వల్ల కమ్యూనిస్టు నాయకులు ఎంతో సంతృప్తి చెంది ఈ కారును నీకు ఇచ్చెయ్యమని చెప్పారని కుటుంబరావు చెప్పారు. ఈ ఔదార్యానికి ఉబ్బితబ్బిబ్బయిన కృష్ణారావు కుటుంబరావుకు కృతజ్ఞతలు తెలియజేసి కారు తీసుకెళ్లిపోయాడు.

అలాగే ఎన్నిల ప్రచారం కోసం కొన్న మైక్‌సెట్టును సత్యనారాయణ అనే హోటల్ యజమానికి ఇచ్చి హోటల్‌కు ఉపయోగించుకోమన్నారు. ఆ రోజుల్లో మైకులు, రికార్డులు లేవు. దాంతో ఎంతో సంతోషంతో అతను మైకు తీసుకొని రికార్డులు సైతం తెప్పించి వేశాడు. తద్వారా వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. మైకు, రికార్డులు వేయడం వల్ల వ్యాపారం లాభదాయకంగా వుందని అతను కుటుంబరావుకు చెప్పి మైకు ఖరీదు తీసుకొమ్మని అన్నాడు. కుటుంబరావు తీసుకోలేదు.

ఆ విధంగా కమ్యూనిస్టులు సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో ప్రచారం చేశారు. కృష్ణా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలు రేయింబవళ్లు శ్రమించారు. ప్రజలు పార్టీవారిని ఎంతగానో ఆదరించారు. జిల్లాలో నూజివీడు, కైకలూరు రెండు చోట్ల తప్ప మిగతా అన్ని చోట్లా కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులే గెలిచారు. నూజివీడు స్థానంలో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి ఉయ్యూరు జమీందారు ఎం.ఆర్. అప్పారావు అంతకు ముందు జస్టిస్ పార్టీలో ఉండేవారు. కైకలూరులో రంగాపురం జమీందారు కుమారుడు అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు 100 ఓట్ల మెజారిటీతోనే గెలిచారు. ఇక మద్రాసు రాష్ట్రంలో మొత్తం 375 స్థానాలకు గాను కాంగ్రెస్‌కు 152 స్థానాలు మాత్రమే దక్కాయి. ఆంధ్ర ప్రాంతంలోనే 140 స్థానాల్లో కాంగ్రెస్‌కు 40, కమ్యూనిస్టులకు 41 వచ్చాయి.

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం

తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఉద్యమం ప్రారంభమైంది. ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని అందరికంటే ఎక్కువ ఉద్యమించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు. ఆయన 1952 అక్టోబర్ 19 నుంచి ఆమరణదీక్ష చేశారు. ఎంతమంది ఎన్ని విధాలుగా వారించినా ఆయన దీక్ష విరమించలేదు. డిసెంబర్ 15న దీక్ష 58వ రోజున అసువులు బాసారు. ఆయన ప్రాణత్యాగంతో యావదాంధ్ర దేశం, ఆ మాటకొస్తే భారతదేశం అంతటా అలజడి రేగింది. తెలుగునాట హర్తాళ్లు జరిగాయి. జనాగ్రహం మిన్నంటింది. ఫలితంగా ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు అంగీకరించారు. 1952 ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీకి మెజారిటీ రాకపోవడంతో ఎన్నికలో కె.ఎం.పి.పి. తరఫున విజయం సాధించిన టంగుటూరి ప్రకాశం పంతులును ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి కాంగ్రెస్‌వారు తమ వైపుకు తిప్పుకున్నారు.

రాష్ట్ర రాజధానిని ఎక్కడ ఏర్పాటు చెయ్యాలనే విషయంలో కూడా అనేక రకాల డిమాండ్లు వచ్చాయి. 'శ్రీబాగ్' ఒడంబడికను బట్టి రాయలసీమలోనే రాజధాని ఉండాలని కృషీకార్ లోక్ పార్టీ ఆచార్య ఎన్.జి. రంగా కోరారు. విజయవాడ, గుంటూరు మధ్య ఉండాలని కమ్యూనిస్టు పార్టీ కోరింది. విజయవాడ కమ్యూనిస్టులకు బలమైన కేంద్రం కాబట్టి అక్కడ రాజధాని ఏర్పాటు కారాదని కాంగ్రెస్ ప్రయత్నం. చివరికి కాంగ్రెస్, పి.ఎస్.పి., కె.ఎల్.పి. మొదలైన పార్టీలకు చెందిన సభ్యులు మద్రాసులో సమావేశమై కర్నూలు తాత్కాలిక రాజధానిగా నిర్ణయించారు. దీనిపై ఓటింగ్ జరిగింది. విజయవాడ రాజధాని కావాలని దానికంటే కర్నూలు రాజధాని కావాలనే దానికి ఒక ఓటు ఎక్కువ వచ్చింది. ఆ విధంగా 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు.

కర్నూలు శాసనసభలో ఏ పార్టీకీ మెజారిటీ లేకపోవడం వల్ల ఈ ప్రభుత్వాన్ని పడగొడితే తాము ప్రభుత్వంలోకి రావచ్చునని కమ్యూనిస్టులు భావించడం వల్ల మొత్తం మీద 1954 నవంబర్ 4న ఒక్క ఓటు తేడాతో ప్రకాశం ప్రభుత్వాన్ని కమ్యూనిస్టులు కూల్చివేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసినవారిలో ప్రధానంగా అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, నాయకంటి శంకర్ రెడ్డి చెప్పుకోదగినవారు. దీంతో 1954 నవంబర్ 15న గవర్నరు శాసనసభను రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించారు. రాష్ట్రం మధ్యంతర ఎన్నికల వైపు ప్రస్థానించింది.

1955 మధ్యంతర ఎన్నికలు

1952 ఎన్నికలు ఒక రకంగా భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో సువర్ణా క్షరాలతో లిఖించదగినవి. ఎన్నికలు సమీపిస్తున్నా నాయకత్వం ఏ నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఉండగా కావూరి కుటుంబరావు తెగువతో పార్టీ ఎన్నికల్లో పాల్గొనేందుకు సిద్ధమైంది. ఆనాటి పోరాటాల నేపథ్యం వల్ల ప్రజలు కమ్యూనిస్టుల వెంట నడిచారు. వారికి ఘన విజయాన్ని కట్టబెట్టారు. ఆ ఎన్నికల్లో తన అనైక్యతకు కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించుకుంది. అయితే 1955 మధ్యంతర ఎన్నికలు వచ్చేసరికి పరిస్థితి తిరగబడింది. ఈసారి ఆనాలోచిత నిర్ణయాలు, మితిమీరిన ఆత్మవిశ్వాసం కమ్యూనిస్టుల వంతయింది. తమదే మెజారిటీ అని భావించిన కమ్యూనిస్టులు తమతో కలిసి పోటీ చేసేందుకు ఉత్సాహం చూపిన పి.ఎస్.పి. వంటి పార్టీలను అసలు దగ్గరకే రానివ్వలేదు. కాంగ్రెస్ మాత్రం 1952 ఎన్నికలు నేర్పిన గుణపాఠం వల్లనో, దిద్దుబాటు దృష్టివల్లనో ఈసారి రాజకీయ పరిణతితో కె.ఎల్.పి., కె.ఎం.పి.పి. మొదలైనవారిని కలుపుకొని ఎన్నికల్లో పాల్గొంది.

ఈ పరిస్థితుల్లో కావూరి కుటుంబరావు అటు కమ్యూనిస్టు నాయకులకు వాస్తవాలను వివరించారు. ఇదే పద్ధతిలో ఎన్నికల సంగ్రామంలో దూకితే రాగల ఫలితాంశాలను గురించి కూడా నిర్మొహమాటంగా చెప్పారు. ముఖ్యంగా గత ఎన్నికల అనుభవాలకు, ప్రస్తుత ఎన్నికల కర్తవ్యాలకు సంబంధించిన విశ్లేషణ ఇచ్చారు.

గత ఎన్నికల్లో కాంగ్రెస్‌వారు అనేక చీలికలై పాల్గొన్న కారణంగానే వారికి ఓటమి లభించింది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టు వ్యతిరేకత పేరుతో అనేక మంది కమ్యూనిస్టులను, వారి సానుభూతిపరులను, రైతు, కూలీ, విద్యార్థులను పోలీసులు కాల్చి చంపడం, విచక్షణారహితంగా గ్రామాల్లో స్త్రీపురుషులను, యువకులను బాధలకు గురిచేయడం వంటి చర్యలవల్ల ప్రజలు కమ్యూనిస్టులకు ఓట్లు వేశారు. దీనివల్ల కమ్యూనిస్టులు 63 స్థానాలకు పోటీ చేస్తే 41 స్థానాలు లభించాయి. వాటిలో కొన్ని చావు తప్పి కన్ను లొట్టబోయినట విజయాలే వున్నాయి. చిత్తూరు జిల్లా మదనపల్లెలో డిపాజిట్ కూడా కోల్పోయిన

డి. సీతారామయ్య, విశాఖపట్టణంలో డిపాజిట్ కోల్పోయిన ఎం.వి. భద్రం గెలిచారు. అలాగే అవనిగడ్డలో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి గొట్టిపాటి బ్రహ్మయ్య 25 వేల ఓట్లు, జస్టిస్ పార్టీ నాయకుడైన చల్లపల్లి రాజా యార్లగడ్డ శివరామప్రసాదు 35 వేల ఓట్లు, కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి చండ్ర రామలింగయ్య 44 వేల ఓట్లతో గెలిచారు.

ఇటువంటి వాస్తవాలను గమనించకుండా రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం తమకు బలం ఉన్నా లేకపోయినా 196 స్థానాలకు గాను 168 స్థానాలకు పోటీ చేసింది. కేవలం 15 స్థానాల్లోనే గెలుపొందింది. పోలయిన ఓట్లు 31.31 శాతం. అదే సమయంలో కాంగ్రెస్ 142 స్థానాలకు పోటీ చేసి 119 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్‌కు పోలయిన ఓట్లు 39.35 శాతం. కాంగ్రెస్‌కు అనుకూలురైన కె.ఎల్.పి. వారు 37 స్థానాలకు పోటీ చేసి 22 స్థానాల్లో గెలుపొందారు. కమ్యూనిస్టులతో జత కట్టడానికి ముందు వచ్చి వీరు అంగీకరించకపోవడంతో 45 స్థానాల్లో పోటీ చేసిన పి.ఎస్.పి. 5.58 శాతం ఓట్లు పొంది 13 స్థానాల్లో గెలుపొందింది.

ఈసారి కాంగ్రెస్‌వారు గతంలోని అనైక్యతను దిద్దుకోవడమే గాక కమ్యూనిస్టులను ఓడించాలన్న ఏకసూత్ర కార్యక్రమం పెట్టుకున్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్‌ను వ్యతిరేకించి బ్రిటిషువారికి అనుకూలంగా వున్న చల్లపల్లి జమీందారుకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. ఎస్.కె. పాటిల్ నుండి అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు దేబర్ వరకు జాతీయ నాయకులందరూ పార్టీ పక్షాన ప్రచారం చేశారు.

1955 ఫిబ్రవరి 11 నుంచి 27వ తేదీ వరకు ఎన్నికలు జరిగాయి. కోటీ 15 లక్షల మంది ఓటర్లలో 86 లక్షల మంది ఓటర్లు తమ ఓట్లు వేశారు. అంటే 62.35 శాతం ఓట్లు పోలయ్యాయి. 1952 ఎన్నికల్లో 57 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి రాజకీయ పార్టీలు తీసుకున్న శ్రద్ధ, ఓటర్లలో చైతన్యం ఫలితంగా పోలింగ్ శాతం పెరిగింది.

1955 ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గెలుపే ధ్యేయంగా పనిచేసింది. ఎక్కడా రాజీ పడలేదు. 1952 ఎన్నికల్లో మంత్రుల దగ్గర నుంచి పేరు మోసిన నాయకుల వరకు పరాజయాన్ని చవి చూశారు. ఎన్నికల అనంతరం ప్రకాశం, రంగా పార్టీలను చేరదీసి వారి సహాయంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వం కూడా పడిపోవడంతో దిక్కు తోచని పరిస్థితి ఎదురైంది. ఇక ఈసారి ఏ అవకాశాన్నీ వదులుకో దలుచుకోలేదు. నీతి, నిజాయితీ, సిద్ధాంతాలు ఏవీ లెక్క చేసే స్థితిలో లేదు. కమ్యూనిస్టు వ్యతిరేక దుమారాన్ని లేపారు. ఎలాగైనా కమ్యూనిస్టు ప్రతినిధులను ఓడించాలని జమీందారులకు, పెట్టుబడిదారులకు, భూస్వాములకు, జాతీయోద్యమ వ్యతిరేకులకు వీరువారని లేదు అందరినీ పిలిచి కాంగ్రెస్ టికెట్లిచ్చారు. వాళ్ల తరఫున ప్రచారం చేశారు. దివి తాలూకాలో 22 సంవత్సరాలుగా

కాంగ్రెస్‌ను ఓడించడమే పనిగా పెట్టుకున్న జస్టిస్ పార్టీ నాయకుడు, చల్లపల్లి జమీందారు తెల్లవారేసరికి కాంగ్రెస్ అభ్యర్థి అయి కూర్చున్నాడు. రిజర్వు సీటుకు ఇక్కడ అభ్యర్థి లభ్యం కాక పశ్చిమ గోదావరి జిల్లా నుంచి మల్లెపూడి రాజేశ్వరరావును తెచ్చారు. 35 సంవత్సరాల రాజకీయ జీవితం, అనేకసార్లు జైలు శిక్షలు అనుభవించి కాంగ్రెస్ అగ్రనాయకులుగా చలామణి అవుతున్న గొట్టిపాటి బ్రహ్మయ్య, దుగ్గిరాల బలరామకృష్ణయ్య వంటి నాయకులు సైతం అప్పటి వరకు జిల్లా బోర్డు ఎన్నికల్లో, శాసనసభ, కౌన్సిల్ ఎన్నికల్లో చల్లపల్లి జమీందారు చేతిలో తిన్న ఎదురుదెబ్బల్ని మరచిపోయి ఆయనకు అనుకూలంగా ప్రచారం చేయవలసి వచ్చింది. బ్రిటిషువారికి వ్యతిరేకంగా పోరాడిన ఈ నేతలు కమ్యూనిస్టులపై గుడ్డి వ్యతిరేకతతో బ్రిటిషు అనుకూలుడైన రాజాకు వత్తాసు పలకవలసిన దుస్థితిని ఆహ్వానించారు.

ఇదే ఎన్నికల్లో నిలబడ్డ కమ్యూనిస్టు నాయకుల్లో చండ్ర రాజేశ్వరరావు, గుంటూరు బాపనయ్య వంటివారు ముఖ్యులు. ఒక వైపు రైతుకూలీ పోరాటాలు, మరోవైపు స్వాతంత్ర్య పోరాటం నడిపిన సవ్యసాచి చండ్ర రాజేశ్వరరావు. జైలుశిక్షలకు వెరవని వీరుడాయన. ఇవే కాక నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం నడిపి రహస్య జీవితం గడిపి మొక్కవోని కమ్యూనిస్టు నాయకునిగా పేరు పొందిన వ్యక్తి రాజేశ్వరరావు. వ్యవసాయ కూలీల పక్షం వహించి వీరోచిత పోరాటం నడిపిన గుంటూరు బాపనయ్యా పోటీ చేయడంతో ఆ నియోజకవర్గం ఎన్నిక అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది.

ఒకరోజు జాతీయోద్యమం పట్ల అపారమైన అభిమానం కలిగిన సుప్రసిద్ధ బ్రిటిష్ పత్రిక 'న్యూ స్టేట్స్‌మన్ అండ్ నేషన్' సంపాదకుడు కింగ్స్‌లీ మార్టిన్, టైమ్స్ విలేఖరి, న్యూయార్క్ కొలంబియా బ్రాడ్‌కాస్టింగ్ విలేఖరి మొదలైన పాశ్చాత్య పాత్రికేయులు చల్లపల్లి కమ్యూనిస్టు పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో చండ్ర రాజేశ్వర రావు, గుంటూరు బాపనయ్య ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ఎక్కడున్నారో పిలిచేందుకు ఈనాటిలాగా అవకాశం లేదు. వారిని చూడాలని, మాట్లాడాలని ఎంతో ఉత్సాహంగా వచ్చిన పాశ్చాత్య పాత్రికేయులు ఎంతో నిరాశకు లోనయ్యారు. కావూరి కుటుంబరావుతో వారి గురించి, కమ్యూనిస్టు పార్టీ రాజకీయ పోరాటాల గురించి మూడున్నర గంటల సేపు ఇంటర్వ్యూ చేశారు. తాలూకాలోని రైతుకూలీల పరిస్థితులు, జమీందారు ఇంత కాలం నుంచి చేస్తున్న దోపిడీ, జమీందారి వ్యతిరేక పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర, ప్రాణాలర్పించిన అమరవీరుల గాథలను సవివరంగా విన్నారు. కార్యాలయం ఆవరణలో పందిరి కింద నెలకొల్పిన చల్లపల్లి నారాయణరావు విగ్రహం ముందు స్త్రీలు, పురుషులు వరుసలుగా నిలబడి విగ్రహానికి పూలమాలలు వేసి, పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టడం, కొంతమంది స్త్రీలు విగ్రహం దగ్గరకు వచ్చి నారాయణరావు త్యాగాన్ని తలచుకొని కన్నీరుమున్నీరుగా విలపించడం చూసిన కింగ్స్‌లీ మార్టిన్ ప్రభృతులు చలించిపోయారు. కాళ్లకున్న బూట్లను వదిలి వారు కూడా నారాయణరావు విగ్రహం వద్ద మోకరిల్లి రెండు నిమిషాలు మౌనం పాటించి ఆ అమరవీరునికి

శ్రద్ధాంజలి ఘటించారు. తర్వాత వీరు ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూతో సంభాషణలు జరిపారు.

అనంతరం వారు విలేఖరులతో మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలో పర్యటించి అక్కడి కమ్యూనిస్టు పార్టీ చేస్తున్న పోరాటాలు, వీరుల త్యాగాలను స్వయంగా అధ్యయనం చేశామని పేర్కొన్నారు. తనకే ఆ నియోజకవర్గంలో గనుక ఓటు హక్కు ఉంటే ఆ నాయకులకే వేసేవాడినని మార్టిన్ ఉద్వేగంగా చెప్పారు.

ఆ ఎన్నికల సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య పాల్గొన్న బహిరంగ సభకు లక్షలాదిమంది ప్రజలు హాజరై కమ్యూనిస్టు పార్టీ పట్ల అచంచలమైన అభిమానాన్ని చాటారు.

జమీందారు ఎన్ని లక్షలు ఖర్చు పెట్టినా ఎంత ఆర్భాటంగా ప్రచారం నిర్వహిం చినా కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులకు అంతకుముందు ఎన్నికల్లో పడ్డ 44 వేల ఓట్లకు తగ్గలేదు. ఈ దృష్టాంతం చాలు కమ్యూనిస్టుల త్యాగాలకు లభించిన ప్రజాదరణను చాటేందుకు. అంతకు ముందు ఎన్నికల్లో జమీందారుకు, కాంగ్రెస్‌కు వేరువేరుగా పోలయిన ఓట్లు ఈసారి ఇరువురి పక్షాన నిలబడ్డ జమీందారుకు పడడం వల్ల జమీందారు, ఆయన సహచరుడు విజయం సాధించారు.

1952 ఎన్నికల్లో జమీందారు, కాంగ్రెస్ అభ్యర్థులు లక్షలాది రూపాయలు ఖర్చుచేశారు. కమ్యూనిస్టు పార్టీ మాత్రం 15 వేల రూపాయలు మాత్రమే ఖర్చు చేసి అన్ని స్థానాల్ని గెలుచుకుంది. తర్వాతి ఎన్నికల్లో అప్పులు కూడా చేసి మొత్తం 50 వేల రూపాయల్ని ఖర్చు చేసింది. ఎన్నికలు ముగిశాక ఎన్నికల సందర్భంలో కొన్న కారు, మైకు, జనరేటరు, దానికి అవసరమైన బ్యాటరీలు వుంచి రైతులకు శుభకార్యాలకు అద్దెకివ్వడం జరిగింది. దీనిద్వారా వచ్చిన డబ్బుతో పార్టీకి వున్న బాకీల్ని తీర్చేవేసే పని చేశారు. పార్టీ సానుభూతిపరులిచ్చిన విరాళాలు కూడా బాకీలకు ఉపయోగపడ్డాయి. ఎన్నికల ప్రారంభంలో ఒక సంఘటన జరిగింది. కావూరి కుటుంబరావు, తరిమెల నాగిరెడ్డి ఇరువురూ కలిసి మంగళాపురం వెళ్లి చంద్ర సుబ్బయ్య (చంద్ర రాజేశ్వరరావు తండ్రి)ను కలిశారు. కుటుంబరావు నాగిరెడ్డిని సుబ్బయ్యకు పరిచయం చేశాడు. వచ్చిన పనేమిటని సుబ్బయ్య అడిగారు. శాసనసభ ఎన్నికల్లో కమ్యూనిస్టుల ప్రచారం కోసం విరాళాలు పోగు చేస్తున్నామని, అదే పనిమీద మీ దగ్గరకు వచ్చామని చెప్పారు. దీనికాయన 'నేను కమ్యూనిస్టును కాను. విరాళం ఇవ్వను' అని తేల్చి చెప్పాడు. కుటుంబరావుకు చాలా బాధ కలిగింది. కోపం కూడా వచ్చింది. అంతకు ముందు ఎంతో అభిమానంగా, గౌరవంగా చూసే సుబ్బయ్యతో మాట్లాడడమే మానేశాడు. ఎన్నికల ప్రచారం జరుగుతూ వుంది. ఎన్నికలు వారం రోజులు మాత్రమే మిగిలాయి. సరిగ్గా ఆ సమయంలో ఒక రోజు చల్లపల్లిలో కుటుంబరావు సైకిల్ మీద వెళుతున్నాడు. చంద్ర

సుబ్బయ్య కుటుంబ రావును పిలిచి నాతో మాట్లాడటమే మానేశావు? అని అడిగారు. ఆ మాటకు కుటుంబరావు కూడా మనసులోని బాధను వెల్లడిస్తూ నాగిరెడ్డి, నేనూ విరాళం కోసం వచ్చినప్పుడు మీరు అంత కటువుగా మాట్లాడినందుకు బాధపడ్డామని, అందుకే మాట్లాడడం లేదని అన్నాడు. దానికి సుబ్బయ్య నవ్వి 'పెద్దవాడ్ని ఏదో అంటే నువ్వు మాట్లాడడమే మానివేస్తావా? నువ్వంటే నాకెంతో అభిమానం. అలా ఎందుకన్నానో నువ్వర్థం చేసుకుంటావనుకున్నాను. నువ్వు కూడా అందరిలానే ఆలోచించావని ఇప్పుడు తెలుస్తోంది. ఎన్నికలు చాలా రోజులున్నాయి. డబ్బులు అప్పుడే ఇచ్చేస్తే ఖర్చయిపోతాయి. సరైన సమయానికి వుండవనే ఉద్దేశ్యంతో అలా అన్నాను. ఎన్నికలు వారమే వున్నాయి. ఇప్పుడిస్తే నిజంగా ఉపయోగపడతాయి. ఇంతకూ ఎంత కావాలో చెప్పు? అన్నారు. ఆ మాటలకు ఎంతో సంతోషించిన కుటుంబరావు పది వేలిస్తే చాలన్నాడు. సుబ్బయ్య సరేనని వెంటనే సరాసరి మంగళాపురం వెళ్లి పదివేల రూపాయలు తీసుకొని చల్లపల్లి వచ్చారు. కుటుంబ రావు కోసం కబురు పెట్టాడు. పార్టీ ఆఫీసులో వున్న కుటుంబరావు వెళ్లి సుబ్బయ్యను కలుసుకొని ఆ పదివేలు తీసుకున్నాడు. ఇంకా అవసరమైతే అడగమని అంటూ ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని కోరాడు. కొన్నాళ్ల తర్వాత కుటుంబరావు చండ్ర రాజేశ్వర రావుకు ఈ విషయం చెప్పగా తన తండ్రి విరాళమిచ్చిన విషయం తెలిసి సంతోషించాడు.

కలసి నడచిన యోధులు - కుటుంబరావు, చండ్ర రాజేశ్వరరావు

కమ్యూనిస్టు పార్టీ దేశానికి అందించిన గొప్ప నాయకుల్లో చండ్ర రాజేశ్వర రావు అగ్రగణ్యులు. కావూరి కుటుంబరావుకు రాజేశ్వరరావుతో దశాబ్దాల ఆత్మీయమైన అనుబంధం వుంది. ఇరువురూ ఉద్యమంలో కలిసి సాగిన యోధులే. 1937వ సంవత్సరంలో మొట్టమొదటిసారి చండ్ర రాజేశ్వరరావుతో కుటుంబరావుకు పరిచయం కలిగింది. 23 ఏళ్ల యువకుడు పైజామా లాల్చీ ధరించిన ఆజానుబాహువు నాటి దివి తాలూకా రావిపాలెం వచ్చి కుటుంబరావుకు తనను తాను పరిచయం చేసుకున్నాడు. తన పేరు చండ్ర రాజేశ్వరరావు అని, మిమ్మల్ని కలుసుకునేందుకు వచ్చానని అన్నాడు. రాజేశ్వరరావు గురించి కుటుంబరావు అప్పటికే విన్నాడు. ముఖ్యంగా చల్లపల్లి పోలీసు స్టేషన్ సబిన్స్పెక్టర్ నీలి వెంకటేశ్వరరావు నాయుడు పోలీసు స్టేషన్ ముందు నుంచి వెళ్లే యువకులను క్రాపులు తీయించి గుండ్లు కొట్టించడం, జమీందారుకు తొత్తుగా వుంటూ రైతులపై దాడులు చేయడం వంటి చర్యలకు పేరు పొందాడు. పోలీసు స్టేషన్ ముందు పోలీసులతో డ్రిల్లు చేయించేవాడు. ఆ దారిన ఎవ్వరూ నడవడానికి వీలు లేదు. బెనారస్‌లో చదువుకుంటున్న చండ్ర రాజేశ్వరరావు మాత్రం వూరు వచ్చినప్పుడు సైకిల్‌పైన ఆ దారిన ధైర్యంగా తిరిగేవాడు. ఇది సహించలేని వెంకటేశ్వరరావు నాయుడు కోపంతో రగిలిపోతూ రాజేశ్వరరావును ఏదో ఒకటి చెయ్యాలని భావించాడు. అయితే రాజేశ్వరరావు పెద్ద భూస్వామి కొడుకని, బెనారస్‌లో

చదువుకుంటున్నాడని, ఏమైనా చేస్తే ఎదురు తిరుగుతాడని సన్నిహితులు, పోలీసులు చెప్పడంతో రాజేశ్వరరావును ఏమీ చేయలేకపోయాడు. ఆ విధంగా కుటుంబరావుకు రాజేశ్వరరావు గురించి ముందే తెలుసు. అంతేకాదు రాజేశ్వరరావు అంటే అందరికీ గౌరవం ఏర్పడింది.

1937 మే 1వ తేదీ నుంచి గుంటూరు జిల్లా కొత్తపట్నంలో సోషలిస్టు పేరుతో రాజకీయ పాఠశాల నడిపారు. పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు అక్కడికి వచ్చారు. అప్పటికే వారిపై ప్రభుత్వం నిషేధం విధించినా వారు ధైర్యంగా పాల్గొన్నారు. 15 రోజుల తర్వాత ప్రభుత్వం ఆ రాజకీయ పాఠశాలను కూడా నిషేధించింది. రాజేశ్వర రావు, సుందరయ్య తదితర నాయకులు అరెస్టయ్యారు. తర్వాత రాజగోపాలాచారి ప్రభుత్వం ఏర్పడ్డాక వారిని విడుదల చేసింది.

విడుదలయ్యాక రాజేశ్వరరావు పార్టీ పటిష్టతకు ప్రయత్నాలను కొనసాగించారు. రావివారిపాలెంలో పర్యటించి కుటుంబరావు, ఇతర యువనాయకులను కలుసుకున్నారు. పార్టీ కోసం విరాళాలను కూడా సేకరించడంలో నిమగ్నమైన రాజేశ్వరరావును కుటుంబ రావు వాళ్ల పెదనాన్న కావూరి కోదండరామయ్య వద్దకు తీసుకెళ్లాడు. కోదండరామయ్య అప్పటికే ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు. రాజేశ్వరరావు ఆలోచనలు, ఉద్యమిత్వం విని ముగ్ధుడై మీకు మంచి భవిష్యత్తు వుందని ఆశీర్వదించి 116 రూపాయలు విరాళం ఇచ్చి పంపారు.

1938 మేలో బాపట్ల తాలూకా మంతెనవారిపాలెంలో మరో రాజకీయ పాఠశాల నడిచింది. కుటుంబరావు ఈ పాఠశాలకు హాజరు కావడమే కాక రాజేశ్వరరావుతో పరిచయాన్ని పెంచుకున్నాడు.

1942 సంవత్సరంలో జరిగిన మంగళాపురం కూలీల పోరాటం ప్రసిద్ధమైంది. చండ్ర రాజేశ్వరరావు నాయకత్వంలో చల్లపల్లి నారాయణరావు, గుంటూరు బాపనయ్య మొదలైన నాయకులు ఈ పోరాటంలో పాల్గొన్నారు. మంగళాపురం గ్రామంలో చాలా కాలంగా బంజరు భూములను సాగు చేసుకుంటున్న కూలీలను తొలగించేందుకు చల్లపల్లి జమీందారు పూనుకున్నాడు. సి.ఆర్. నాయకత్వంలో కూలీలు సాగు చేసుకునేందుకు వెళ్లారు. జమీందారు పోలీసులతో కుమ్మక్కై 144వ సెక్షన్ విధించాడు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన సి.ఆర్., నారాయణరావు, బాపనయ్యలను పోలీసులు విపరీతమైన దెబ్బలకు గురిచేశారు. ఈ సందర్భంగా నాయకులపై పోలీసులు కేసులు పెట్టడం, చివరికి 6 మాసాల జైలు శిక్ష పడడం జరిగింది. ఈ పోరాటమే చల్లపల్లి జమీందారీ వ్యతిరేక పోరాటానికి ఊపిరులూదింది.

ఈ పోరాటం అనంతరం రాజేశ్వరరావు రాష్ట్ర పార్టీ నిర్మాణ కృషిలో నిమగ్నమయ్యారు. విజయవాడకు మకాం మార్చారు. ఆ రోజుల్లో తండ్రి సుబ్బయ్య రాజేశ్వరరావుకు డబ్బు ఇవ్వకపోవడం వల్ల ఆయన ఆర్థికంగా చాలా ఇబ్బంది పడ్డారు. సి.ఆర్. ఇబ్బందుల్ని చూడలేక

అన్న రామలింగయ్య రహస్యంగా తమ్మునికి డబ్బు అందజేసే వారు. తర్వాత రామలింగయ్య క్రమంగా రైతులతో మమేకమై ఉద్యమంలోకి వచ్చారు. అప్పట్లో కమ్యూనిస్టు పార్టీ ప్రజాశక్తి పత్రికను విజయవాడలో స్థాపించేందుకు భూమి కొనడం వంటి వాటి కోసం పుచ్చపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు విరాళాలు కోరిన ప్రతిసారీ రామలింగయ్య తండ్రికి తెలియకుండా పంపేవారు. చివరికి రామలింగయ్య కూడా పూర్తికాలిక కార్యకర్తగా కమ్యూనిస్టు పార్టీలో పనిచేశారు.

1948వ సంవత్సరం నిర్బంధానికి ముందు రాజేశ్వరరావు, రామలింగయ్య, కుటుంబరావు కూర్చొని ఆస్తిపంపకం విషయం చర్చించారు. రాజేశ్వరరావుకు, రామలింగయ్యకు ఆస్తి పంచమని వాళ్ల నాన్న సుబ్బయ్యకు నచ్చజెప్పే బాధ్యత కుటుంబ రావు తీసుకున్నారు. అప్పటికి సుబ్బయ్య తన ఇద్దరు కుమారులతోనూ మాట్లాడేవారు కారు. రామలింగయ్యను, రాజేశ్వరరావును తోడ్కొని సుబ్బయ్య వద్దకు వెళ్లి మెల్లగా ఆస్తి పంపకం విషయాన్ని కుటుంబరావు ప్రస్తావించాడు. దానికి సుబ్బయ్య మండిపడ్డారు. గదిలోకి వెళ్లి ఒక పుస్తకం తెచ్చి కుటుంబరావుకు చూపారు. అందులో తేదీల వారీగా అయిదు వేలు, పదివేలు, ఇరవైవేలు అంటూ ఎప్పుడెప్పుడు ఎంత తీసుకున్నదీ రాసి వుంది. మొత్తం మీద రెండు లక్షల రూపాయలను నాకు తెలియకుండా తీసుకెళ్లి అన్నదమ్ములు కమ్యూనిస్టు పార్టీకి విరాళంగా అందజేశారని సుబ్బయ్య చెప్పుకొచ్చారు. ఆ డబ్బు సిఆర్ పార్టీకోసం అందజేసినమాట నిజమే. రామలింగయ్య కుటుంబం ఐదుగురు, రాజేశ్వరరావు కుటుంబం ముగ్గురు, తండ్రితో కలిసి ఆస్తినంతటినీ తొమ్మిది పాళ్లుగా విభజిస్తానని, వాళ్ల వంతు ఎంత వస్తుందో ఇప్పటికే ఖర్చు చేసిందానిపై ఏమైనా ఎక్కువ వస్తే ఇస్తాను. తక్కువ వస్తే నాకు ఇచ్చి వెళ్లమని తండ్రి సుబ్బయ్య కరాఖండిగా చెప్పారు. తర్వాత ఆస్తి అన్నదమ్ములు, తండ్రికి మూడు వాటాలు చెయ్యాలని లాయర్ నోటీసులు పంపించారు. ఆయన మూడు వాటాలు చేశారు. ఆ సమయంలో రామలింగయ్యను పోలీసులు అరెస్టు చేసి డిటెన్యూగా పంపారు. రాజేశ్వరరావు రహస్య జీవితం గడుపుతున్నారు. వాళ్ల పొలాన్ని సాగు చెయ్యనివ్వలేదు. రాజేశ్వరరావు తర్వాత రహస్య జీవితం నుండి వచ్చి తన ఆస్తి సమస్తాన్ని పార్టీ కోసమే ధారపోశారు.

ముక్త్యాలరాజాతో అనుబంధం

1952లో పులిచింతల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని కోరుతూ కావూరి కుటుంబరావు, వావిలాల గోపాలకృష్ణయ్య, ముక్కామల నాగభూషణంలతో రాష్ట్ర రైతు సంఘం ఒక సంఘాన్ని నియమించింది. కమిటీ ఏర్పాటు

విషయం పత్రికల్లో వచ్చింది. కొన్నాళ్లకు 'శ్రీశ్రీశ్రీ కుటుంబరావుగారు, చల్లపల్లి' అనే చిరునామాతో ఒక ఉత్తరం వచ్చింది. 'మీరు కృష్ణానదిపై పులిచింతల ప్రాజెక్టుకు కృషి చేస్తున్నట్లు చదివానని, ఆ ప్రాజెక్టుకు నేను కూడా సహాయ సహకారాలు అందిస్తూ మీతో కలిసి పనిచేసేందుకు ప్రయత్నిస్తానని ఆ లేఖలో పేర్కొన్నారు. చివర్న వి.ఆర్.జి.కె.ఎం. ప్రసాద్ అని సంతకం చేశారు. అటువంటివే మరో రెండు ఉత్తరాలు వచ్చినా రాసిందెవరో తెలియక పోయినా కుటుంబరావు బదులు రాశారు. నేను రాజకీయంగా కమ్యూనిస్టునైనా మొదటి నుంచీ రైతుల సమస్యలపై పనిచేస్తున్నానని అందులో తెలిపారు. తిరిగి ప్రసాద్ సమాధానం రాస్తూ 'మీ విషయం నాకు తెలుసునని, త్వరలోనే మిమ్ములను కలుసుకుంటానని' అన్నారు. తర్వాత ఒక రోజు రాత్రి వేళ 7 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి వచ్చి తాను ముక్త్యాలరాజావారి గుమస్తానని, మిమ్మల్ని తీసుకురమ్మని పంపించారని చెప్పాడు. రాజా చల్లపల్లి జమీందార్ల వద్ద కోటలో మకాం వేశారు. కుటుంబరావు అప్పటివరకు కోటలోకి వెళ్లలేదు. ఆ రోజున గుమస్తాతో కలిసి కోటలోకి వెళ్లారు. ముక్త్యాలరాజా కుటుంబరావును సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టారు. తానే వి.ఆర్.జి.కె.ఎం. ప్రసాద్‌నని, తానూ రైతుల పక్షపాతిననీ చెప్పారు. కృష్ణానదిపై ప్రాజెక్టు నిర్మించేందుకు జరిగే కృషిలో పాలు పంచుకుంటున్నానని, ప్రాజెక్టు కోసం కొన్ని ప్లాన్లు కూడా తయారు చేయించానని, దానికి కృషి చేస్తున్న మీతో కలిసి పనిచేస్తానని కుటుంబరావుతో అన్నారు.

పార్లమెంటుకు పోటీ

1957 పార్లమెంటు ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ బందరు స్థానం నుంచి యలమంచిలి నాగభూషణాన్ని స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టింది. ఆయన ప్రముఖ న్యాయవాది. అంతకు ముందు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. కమ్యూనిస్టు పార్టీకి అన్నివేళలా అండగా నిలిచేవారు. పార్టీ కార్యకర్తలపై ప్రభుత్వం పెట్టిన కేసుల్లో జిల్లా కోర్టు నుంచి హైకోర్టు వరకు ఉచితంగా వాదించేవారు. పార్టీపై నిషేధం వున్న రోజుల్లో వారి కేసుల్లో వాదించడానికి ఏ న్యాయవాదీ ముందు రానప్పుడు కూడా నాగభూషణమే ముందుకు వచ్చి వాదించేవారు. 1950లో మద్రాసులో జరిగిన పౌరహక్కుల సంఘం మహాసభలో ఆయన చేసిన ఉపన్యాసాన్ని గురించి హిందూ వంటి పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. ఆయన సేవలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల్లో నిలబెట్టడం జరిగింది. ఎన్నికల ప్రచారానికి అయిన 30 వేల రూపాయల ఖర్చును ఆయనే భరించారు. అంతకు ముందు ఆ నియోజకవర్గంలో వున్న భీమవరం మొదలైన ప్రాంతాలను తొలగించి గుంటూరు జిల్లాలోని రేపల్లె వగైరా ప్రాంతాలను కలిపారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన మండలి వెంకటకృష్ణారావు పోటీ చేశారు. కాంగ్రెస్‌వారే కాకుండా కాంగ్రెస్‌లో చేరిన చల్లపల్లి జమీందారు వంటివారు కూడా నాగభూషణానికి

వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో ప్రచారం చేశారు. ఫలితంగా ఆయన 7 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు.

'స్థానం' ఉపన్యాసం: ఘంటసాల పాటలు

1954లో నీలం సంజీవరెడ్డి, తరిమెల నాగిరెడ్డిల మధ్య రాజకీయ తగాదాలొచ్చాయి. సంజీవరెడ్డి కాంగ్రెస్ నాయకుడు. ఆయన బావమరిది తరిమెల నాగిరెడ్డి కమ్యూనిస్టు నాయకుడు. వీరిద్దరి తగాదాలను వ్యంగ్య నాటకంగా రూపొందించడం జరిగింది. రావివారిపాలెంలో కావూరి కుటుంబరావు ఈ నాటాన్ని ఏర్పాటు చేశారు. దానిపేరు రాజకీయ గయోపాఖ్యానం. తెనాలికి చెందిన శ్రీకృష్ణ అనే రచయిత దాన్ని రాశారు. ఆ నాటకానికి స్థానం నరసింహారావును, ఘంటసాలను ఆహ్వానించారు. స్థానం ప్రముఖ రంగస్థల నటులు. ముఖ్యంగా స్త్రీ పాత్రలకు ఎంతో ప్రసిద్ధి. ఇక ఘంటసాల గురించి చెప్పనవసరం లేదు. వారి స్వగ్రామం అక్కడికి సమీపంలోని టేకుపల్లి. ఇక ఆ రోజు స్థానం ఉపన్యాసమిస్తూ ఇప్పటి వరకు రంగస్థల నటులు పద్యం రెండు నిమిషాలు పాడితే రాగం 5 నిమిషాలు తీసేవారు. ఘంటసాల అలా కాకుండా ఈనాటి శ్రోతల అభిరుచికి తగినట్లుగా పద్యాన్ని చక్కగా 5 నిమిషాలు పాడి రాగాన్ని రెండు నిమిషాల్లో ముగించే మంచి పద్ధతిని ప్రవేశపెట్టారు. అలా అయితేనే ఈనాటివారికి పద్యం నచ్చుతుంది. దానికి ప్రాచుర్యం కూడా హెచ్చుతుంది అన్నారు. స్థానంవారిని నాటకం ప్రదర్శన కోసం పిలిపించుకొని మోపిదేవిలో ఏడాదిపాటు అక్కడే ఉంచారు. స్థానం ఉపన్యాసం తర్వాత ఘంటసాల దేవదాసు సినిమాలోని పాటల్ని పాడి ప్రేక్షకులను అలరించారు. ఆ సినిమా అప్పుడప్పుడే విడుదలై అందులోని పాటలు బాగా ప్రాచుర్యం పొంది వున్నందువల్ల ఆనాటి పాటల్ని అందరూ బాగా మెచ్చుకున్నారు.

ఇరిగేషన్ సభ్యునిగా సేవలు

1957లో కృష్ణా జిల్లాలో ఇరిగేషన్ బోర్డు సభ్యునిగా కుటుంబరావును ప్రభుత్వం నియమించింది. బోర్డు సభ్యునిగా కుటుంబరావు రైతులకు ఎంతో ప్రయోజనం కలిగే పనులు చేశారు. మాగాణి భూముల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ బోర్డులో శాసనసభ్యులు అధికారరీత్యా (ఎక్స్అఫిషియో) సభ్యులుగా వుండేవారు. రైతు సంఘం తరఫున కావూరి కుటుంబరావును, కాంగ్రెస్ తరఫున ప్రముఖ నాయకుడైన గొట్టిపాటి బ్రహ్మయ్యను బోర్డులో సభ్యులుగా నియమించారు. రెండు మాసాలకోసారి బోర్డు సమావేశాలు జరిగేవి. బ్రహ్మయ్య కటుంబరావు చెప్పిన అంశాలనే ఎజెండాలో పొందు పరిచి మిగతా సభ్యులకు పంపేవారు. వాటిపైనే సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకునేవారు. జిల్లా కలెక్టరు సమావేశానికి అధ్యక్షత వహించేవారు. సాగునీటి శాఖ తూర్పు డివిజన్ డి.ఇ., సెంట్రల్ ఇంజనీరు, వారి ఆధీనంలో పనిచేసే ఇంజనీర్లు సమావేశంలో పాల్గొనేవారు.

ఈ బోర్డులో సభ్యునిగా కుటుంబరావు కృషి వల్ల అనేక మంచి పనులు జరిగాయి. రైతు నాయకునిగా సమస్యలపై అవగాహనతో కుటుంబరావు రైతులకు మేలు జరిగే పనులను చేయించారు.

దివి తాలూకాలోని తూర్పులంకపల్లి గ్రామంలో బందరు - అవనిగడ్డ రోడ్డు వరకు ఉత్తరంవైపున వున్న భూములు మాగాణి వచ్చినప్పటి నుంచీ సాగవుతున్నాయి. ఆ కాలువను బందరు - అవనిగడ్డ రోడ్డును దాటించి దక్షిణం వైపున ఉన్న మెట్ట భూములకు సాగు నీరందించాలని కుటుంబరావు ప్రభుత్వాన్ని కోరారు. తూర్పు డివిజన్ ఇంజనీరు సూపరింటెండింగ్ ఇంజనీరుతో మాట్లాడి కాలువను మంజూరు చేయించారు. అప్పటి నుంచి ఆ భూములకు సాగునీరు అందుతోంది. దీంతో మెట్టపొలాలన్నీ మాగాణి భూములుగా మారడమే కాక భూముల విలువ కూడా ఎంతో పెరిగింది.

పామర్రు - చల్లపల్లి రోడ్డు పక్కన చిట్టూర్పు అనే గ్రామం వుంది. ఆ రోడ్డుకు పడమటి మాగాణి భూములకు మురుగు నీరు పోయే వసతి లేక ఇబ్బందిగా వుండేది. పోలవరపు కోటయ్య, ఇతర రైతులు ఈ సమస్యను కుటుంబరావు దృష్టికి తెచ్చి పరిష్కరించమని విజ్ఞప్తి చేశారు. మురుగునీరు వెలుపలికి పోయే పరిస్థితి లేకపోవడంతో ఆ భూముల్లో రెండవ పంట పండకపోగా మొదటి పంట కూడా దెబ్బ తింటూ రైతులు చాలా మంది ఇబ్బంది పడుతున్నారని గ్రహించిన కటుంబరావు విజయవాడలో వున్న డివిజనల్ ఇంజనీరును కలిసి పరిస్థితి వివరించారు. ఇంజనీరును చిట్టూరు తీసుకు వచ్చారు. ఆయన అక్కడి ఇబ్బందులను తెలుసుకొని ఆ రోడ్డుకు తూర్పు, పడమరల్ని కలుపుతూ వంతెన నిర్మించేందుకు ప్రతిపాదన చేశారు. ఆ ప్రతిపాదన అమలుకు నోచుకొని వంతెన వెలిసింది. దాంతో శాశ్వతంగా పడమర మాగాణి భూములలోని మురుగునీరు చిల్లరవాగు కాలువలోకి వెళ్లే ఏర్పాటు జరిగి ఆ భూముల్లో రెండు పంటలు పండేందుకు మార్గం సుగమమైంది.

దివి తాలూకాలో శ్రీకాకుళం నుంచి మోపిదేవి వరకు దివిసీమ ప్రాంతానికి వేసిన కాలువ కింద కొత్తగా మాగాణి సాగులోకి వచ్చింది. 1864లో కృష్ణానదికి వచ్చిన వరదల దృష్ట్యా పాత కట్టకు పడమటి వైపు కొంత దూరంలో శ్రీకాకుళం నుంచి మోపిదేవి వరకు కొత్త కట్ట నిర్మించారు. పాతకట్ట తూర్పు భూములకు జూన్ నెలలోనే నీరు ఇచ్చేవారు. శ్రీకాకుళం నుంచి మోపిదేవి వరకు పాత, కొత్త కట్టల మధ్య వున్న వందలాది ఎకరాలకు ఆగస్టులో నీరిచ్చేవారు. దీనివల్ల ఆ ప్రాంతంలో పంటలు సరిగా పండేవి కావు. ఆ సమస్యను కుటుంబరావు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు.

పూర్వం కృష్ణానదికి వరదలు వచ్చి పులిగడ్డ నుంచి మోపిదేవి వరకు వరదలు ముంచెత్తేవి.

వరదను గ్రామాల్లోకి రాకుండా కృష్ణ ఒడ్డున వున్న కాలువ నుండి హంసల దీవి వరకు ఉత్తర దిశగా ఏటికట్ట అదే విధంగా పులిగడ్డ నుండి హంసలదీవి వరకు పడమట మరో ఏటికట్ట ఉండేది. తర్వాతి కాలంలో నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులు రావడంతో కృష్ణకు వరదలు తగ్గాయి. వరద సమస్య నివారణకే మోపిదేవి దగ్గరున్న కట్టకు బదులుగా పులిగడ్డ అక్విడక్టు నుంచి అయోధ్య వరకు దక్షిణాన కొత్తగా ఏటికట్ట వేశారు. దీనివల్ల మోపిదేవి, నాగాయితిప్ప కట్టల మధ్యనున్న భూమి సాగు చేసేందుకు వీలు కలిగింది. తూర్పు గట్టు కాలువ నుంచి తూర్పుకు కాలువ తవ్వి ఈ గ్రామాల భూముల్ని కూడా మాగాణుల్ని చేయడం జరిగింది. ఇది ఒకనాటి కృషి కాదు. కొన్ని సంవత్సరాల శ్రమ ఫలితంగా నెరవేరిన ప్రయోజనం. నాటి శ్రమ ఫలితంగా ఆయా గ్రామాల రైతులు తమ భూముల్లో సమృద్ధిగా పంటల్ని పండించుకుంటున్నారు.

1936 – 40 మధ్య కాలంలో దేవరకోట ఎస్టేట్‌లోని కొడాలి నుండి మోపిదేవి వరకు సుమారు 40 వేల ఎకరాల మేర సాగునీరు అందుతున్నప్పటికీ చరిత్ర ప్రసిద్ధి వున్న ఘంటసాలకు మాగాణి నీరందే సౌకర్యం లేదు. స్వాతంత్ర్య సమరయోధుడు గొట్టిపాటి బ్రహ్మయ్య ఈ విషయంలో పట్టుబట్టి ఇరిగేషన్ బోర్డు సమావేశంలో ఎజెండా అంశంగా చేర్చారు. సమావేశంలో ఘంటసాల సాగునీటి సమస్యను గురించి వివరించారు. దీనిపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు తుమ్మల కృష్ణారావు గొట్టిపాటి బ్రహ్మయ్యను తూలనాడారు. ఆయనకు స్వార్థం తపన మరోటి లేదని నిందించారు. నిజానికి బ్రహ్మయ్య ఎలాంటి స్వార్థబుద్ధి లేని నాయకుడు. మృదుస్వభావి. అటువంటి పెద్దమనిషిని అనవసరంగా నిందించేసరికి కుటుంబరావుకు కోపం వచ్చింది. చివ్వున లేచి సమావేశానికి అధ్యక్షత వహిస్తున్న జిల్లా కలెక్టరునుద్దేశించి 'ఇది ఇరిగేషన్ బోర్డు సమావేశమా? బహిరంగ సభా? మేము ఎజెండాలోని అంశాలను చర్చిస్తుంటే దీనికి సంబంధం లేని వ్యక్తులు వచ్చి ఎజెండాలో లేని వాటిని మాట్లాడుతూ బ్రహ్మయ్యనో, మమ్మల్నో విమర్శిస్తుంటే మీరు ప్రేక్షకపాత్ర వహించడమేమిటి?' అని తీవ్ర స్వరంతో ప్రశ్నించాడు. దీంతో కలెక్టరు జవాన్లను పిలిచి సభ్యులుకానివారిని బయటికి పంపించమని ఆదేశించారు. దాంతో కృష్ణారావు చేసిన తెలివితక్కువ పనికి సభ్యులు కానివారంతా బయటికి వెళ్లవలసి వచ్చింది. అలా బయటికి వెళ్లినవారిలో గొర్రెపాటి వెంకటసుబ్బయ్య (కిసాన్) వంటి పెద్దలు ఉండడం బాధ కలిగించే అంశం. మొత్తం మీద ఈ సమస్య కూడా పరిష్కారమై ఘంటసాల దాని చుట్టుపక్కల గ్రామాలకు కాలువలు తవ్వి సాగునీరు అందించే ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతాల భూములు సస్యశ్యామలమయ్యాయి.

చల్లపల్లి జమీందారీ వ్యతిరేక పోరాటం

చల్లపల్లి జమీందారీ కింద వున్న ప్రాంతాల్లో ప్రజాజీవనం దుర్భరంగా సాగింది. కృష్ణానదికి ఆనకట్టలు లేని కాలంలో అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలకు జనం తల్లడిల్లేవారు. నాలుగు శతాబ్దాలకు పూర్వం కృష్ణానది ఉత్తర ప్రాంతంలో ఉన్న 60 గ్రామాల శిస్తు వసూలు బాధ్యతను నిజాం నవాబు దేవరకోట ఎస్టేటు పేరున వున్న చల్లపల్లి జమీందారుకు అప్పగించాడు. నిజాముతో ఒప్పందం ఫలితంగా శిస్తు వసూలును 1802లో బ్రిటిషువారు చల్లపల్లి జమీందారుకు సనదు ఇచ్చారు.

ఆనాడు శిస్తు డబ్బు రూపంలో కాకుండా పండిన పంట రూపంలో వుండేది. రైతులు పండించిన పంటలో శిస్తు కింద సగం పంటను ఇవ్వాల్సి వచ్చేది. సిద్ధమైన ధాన్యంలో జమీందారుకు ఇవ్వవలసిన శిస్తును తీసుకెళ్లేందుకు వారి మనుషులు రాకపోతే వారు వచ్చేదాకా ఆ ధాన్యాన్ని వాడకూడదు. పస్తులైనా ఉండాల్సిందే. శిస్తుకొలత కూడా అన్యాయంగా వుండేది.

అధిక వర్షాలు, అనావృష్టి పరిస్థితుల వల్ల పంటలు పండక రైతులు ఆకలికి అలమటించేవారు. తాటిపండ్లు, అమడకాయలనే దుంపలు, ఏలకూర ఆకులను ఆహారంగా తినేవారు. అది ఏడుసార్లు ఉడకబెడితే గాని చేదు విరిగి తినడానికి వీలు పడేది కాదు. ఈ స్థితిలో జమీందారుకు శిస్తు కట్టలేక నానా అగచాట్లు పడేవారు.

1864 నవంబర్ 1న బందరు ఉప్పు తీరప్రాంతం తుపానులో కొట్టుకుపోయింది. యాదర, వాడపాలెం, భోగిరెడ్డిపల్లి, ఎండకుదురు, మాజేరు మొదలైన గ్రామాలు కొట్టుకు పోయాయి. అనేక కుటుంబాలు మృత్యువాత పడ్డాయి. విపరీతమైన ప్రాణ నష్టం జరిగింది. తుపాను బాధితులైన జనం కష్టాలను పట్టించుకోకపోగా జమీందారు వారసులు లేకుండా చనిపోయినవారి భూఉలను తమ పరం చేసుకున్నారు.

రైతుల భూములను కాజేసేందుకు జమీందారు శిస్తు విధానంలో కూడా మార్పు చేశారు. శిస్తు కింద పంట ఇవ్వడం కాకుండా డబ్బు ఇచ్చే పద్ధతి పెట్టారు. ప్రకృతి వైపరీత్యాలవల్ల వేసిన పంట చేతికి అందకపోయినా ఎన్నో కష్టనష్టాలు పడి రైతులు శిస్తు చెల్లించేవారు. శిస్తు కట్టకపోతే భార్యల నగలు ఒలిపించి, చెంబు, ముంతా, గొడ్డుగోదా జప్తు చేసి శిస్తు కింద జమ కట్టుకునేవారు. అవి కూడా లేని రైతులను మెడపై బండ కొయ్యలెత్తి చెవులు చిల్ల పెంకులతో నొక్కుతూ రైతులను చిత్రవధ చేసేవారు. శిస్తు కట్టలేక సాగు చేయకపోతే ఆ భూములను జమీందారు తన పరం చేసుకునేవారు.

శిస్తులు చెల్లించలేక రైతుల పడ్డ అగచాట్లకు మరొక ఉదాహరణ. ఆ రోజుల్లో సరుకుల రవాణాకు ఈనాటి లాగా రైలు వ్యాగన్లు, లారీలు, ట్రక్కులు లేవు. సరుకులను గంతావుల మీద తరలిస్తుండేవారు. ఈ రైతులు బండ్లపై సరుకులను తరలించే పనులు చేసేవారు.

కొంతమంది జగ్గయ్యపేట మీదుగా హైదరాబాద్‌కు, కొందరు నాగపూర్, షోలాపూర్‌లకు బండ్లు తోలేవారు. దారిలో అడవి ప్రాంతం. 20 బండ్లు ఒక్క వరుసగా వెళ్లేవి. బండ్ల ముందూ వెనుకా డప్పులు వాయించేవారు. కోయవాళ్లు ముందు నడుస్తూ దారి చూపేవారు. దారిలో పులుల భయం కోసం అడవి పాలకర్రలతో కాగడాల్ని వెలిగించు కొనేవారు. అలా వెళ్లి తిరిగి రావడానికి 6 నెలలు పట్టేది. భార్యాబిడ్డలను, కొంపాగోడులను వదిలి ఇలా ఆరు నెలలకు తిరిగి వస్తే కూడా 40 లేక 50 రూపాయలు మాత్రమే వచ్చేవి. అంత కష్టపడి జమీందారుకు శిస్తు చెల్లించి తమ భూములను కాపాడుకోగలిగిన వారున్నారు. కాపాడుకోలేక వాటిని కోల్పోయివారున్నారు. అలా వెళ్లినవారిలో కొందరు నాగపూర్ ప్రాంతంలో స్థిరపడ్డారు. అలా చెప్పుకోదగినవారిలో ప్రముఖ హిందీ చిత్ర దర్శకుడు వి. శాంతారామ్ (వద్దే శాంతారామ్) పూర్వీకులు దివిసీమలోని వేములమడ గ్రామస్థులే.

గ్రామాల్లో డొంకలు, గోభూములు, వనంతోటలు, చెరువు లోతట్లు మొదలైన ప్రజలందరికీ ఉమ్మడి ప్రయోజనాలకై వున్న భూములను కూడా జమీందారు వదిలి పెట్టలేదు.

1890లో జరిగిన సర్వేలో పెద కళ్లేపల్లి గ్రామం తాలూకా ఆదెసనాని చెరువు లోతట్టు పోరంబోకు 383 ఎకరాల్ని గ్రామకరణాల చేత స్వంతకమతంగా జమీందారు నమోదు చేయించుకున్నాడు. పెదకళ్లేపల్లి, మంగళాపురం, లక్ష్మీపురం, పెదప్రోలు గ్రామాల మధ్య ఆయా గ్రామాల పశువులు మేయడానికి అరణ్యంగా వున్న సుమారు 5 వేల ఎకరాల గోభూమిని 1936లో ఆ ప్రాంతానికి కాలువ నీటి వసతి వచ్చినప్పుడు జమీందారు అమ్ముకున్నాడు. అలాగే యండకుదురులోని 400 ఎకరాల పోరంబోకు భూమిని ఉద్యోగులకు లంచమిచ్చి స్వంత కమతం కింద మార్చుకొన్నాడు. మోపిదేవి కొరడు, యార్లగడ్డ వారి లంకలోని అంబాపురం కొరడులలోని వందలాది ఎకరాల పశువులు మేసే భూమిని ఆక్రమించుకొన్నాడు. గ్రామ ప్రజలకు ఉమ్మడిగా చింత, నేరేడు, మామిడి మొదలైన తోటలుండేవి. ఈనాటి పార్కుల్లా ఉపయోగపడేవి. జమీందారు స్వార్థపరులైన పెత్తందార్లను లోబరచుకొని వనంతోటల్లోని పచ్చని చెట్లను కొట్టించి బీళ్లు చేసి ఆక్రమించుకొన్నాడు. యార్లగడ్డ, పురిటిగడ్డ, పాగోలు మొదలైన గ్రామాల్లో కూడా వనంతోటల్ని ఆక్రమించి తమ కమతంలో కలుపుకున్నాడు.

ఈ విధంగా అనేక రకాలైన దౌర్జన్యాలు, మోసాలతో చల్లపల్లి జమీందారు ప్రజల్ని ముఖ్యంగా రైతుల్ని అణచివేశాడు. వేలాది ఎకరాలను కాజేశాడు. 1908 ఎస్టేట్‌లాండ్ యాక్ట్ తీసుకొచ్చింది బ్రిటిష ప్రభుత్వం. దీనితో భూముల వర్గీకరణ ప్రయత్నాలు జరిగి ఆగడాలకు కొంత కళ్లెం పడింది. 1908 సంవత్సరానికి పూర్వం వరుసగా 12 సంవత్సరాలు స్వంతగా వ్యవసాయం చేసిన భూమి మాత్రమే జమీందారు స్వంత భూమి అవుతుంది.

అందులో ఈ ఒక్క సంవత్సరం సాగు చేయకపోయినా అది స్వంత కమతం కిందకు రాదు అనేది చట్టంలో ఒక నిబంధన. దీని ప్రకారం ఎస్టేటులో ఏ కొద్ది భూమి మాత్రమే తప్ప చట్టాన్ని అనుసరించి జమీందారు స్వంత కమతం భూమి ఏ మాత్రం రాదనే పరిస్థితి ఏర్పడింది. అయితే చట్టం వస్తుందని ముందు తెలుసుకొన్న జమీందారు కౌలు రైతులను నయానా భయానా భూముల నుంచి తప్పించి అవి తనవే ననిపించుకున్నాడు. చట్టం వచ్చాక తమకూ హక్కులున్నాయని తెలుసుకున్న వక్కలగడ్డ, చిన్నాపురం, బోగిరెడ్డిపల్లి, ఎండకుదురు, మొదలైన గ్రామాల రైతులు తమ హక్కుల్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేశారు. ఆ భూములు చట్టప్రకారం తమవేనని వక్కల గడ్డ రైతులు జమీందారును ప్రతిఘటించారు. నిరంకుశత్వానికి, దౌర్జన్యాలకు పేరు పొందిన జమీందారు వివిధ గ్రామాల్లోని తన అనుచరులను వక్కలగడ్డ రైతులపై దాడికి పంపాడు. ఈ కుటిల యత్నాలను తెలుసుకొన్న చుట్టుపక్కల గ్రామాల రైతులు కూడా వక్కలగడ్డ సోదరులకు అండగా నిలిచారు. ఇరు వర్గాలకు పోరాటం జరిగి జమీందారు మనుషులు కాలికి బుద్ధి చెప్పారు. ఈ విధంగా రైతుల్లో చైతన్యం పెరిగింది.

జమీందారు తన మూకలపై ఆధారపడడం మాని పోలీసులను ప్రయోగించడం ప్రారంభించాడు.

రైతుల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడంలో తొలుత కృష్ణామండల మహాసభలు దోహదం చేశాయి. 1920లో పెదకళ్లేపల్లిలో జరిగిన 21వ కృష్ణా మండల మహాసభకు కానూరి చలపతయ్య అధ్యక్షత వహించారు. ఆ సభలో భోగరాజు పట్టాభిసీతారామయ్య, చెరుకువాడ నరసింహం, కావూరి కోదండరామయ్య మొదలైనవారు పాల్గొన్నారు. జమీందారీ విధానం రద్దయితే గాని రైతుల కష్టాలు గట్టెక్కవని చలపతయ్య నినదించారు.

1937లో మంగళాపురం – పెదప్రోలు గ్రామాల మధ్య అడవి భూమిగా వున్న 5 వేల ఎకరాల భూమిని జమీందారు అమ్మకానికి పూనుకోగా కాంగ్రెస్‌లోని ఒక వర్గం, అతివాద యువకులు భూములను ఎవరూ కొనవద్దని అడ్డుపడ్డారు. అప్పటికి జమీందారీ వ్యతిరేక రైతు సంఘంగా సంఘటితమైన ఉద్యమానికి కిసాన్ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, కావూరి కోదండరామయ్య, కొర్రపాటి రాజేశ్వరరావు, కొల్లి శేషయ్య వంటివారు నాయకత్వం వహించారు. అయితే ఎంత అడ్డుపడినా జమీందారు ఆ భూముల్ని అమ్ముకోగలిగాడు.

ఈ పరిణామాల నేపథ్యంలో 1937లో రైతు సంఘం నేతృత్వాన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుండి మద్రాసుకు జమీందారీలోని రైతులు, ఇతర రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకు చారిత్రాత్మక రైతు యాత్రా దళం వెళ్లింది. ఈ దళంలో కొమ్మారెడ్డి సత్యనారాయణ, గౌతు లచ్చన్న, చలసాని వాసుదేవరావు నాయకత్వం వహించారు.

1938 సంవత్సరంలో నాటి మద్రాసు ప్రభుత్వంలో రెవెన్యూ మంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జమీందారీల విచారణ సంఘాన్ని నియమించారు. ఈ సంఘం రాష్ట్రమంతటా పర్యటించి విచారణ జరిపి నివేదికను రూపొందించింది. రాష్ట్రంలో 448 జమీందారీలున్నాయని, ప్రభుత్వానికి కట్టవలసిన పేష్కస్ పోను ఏటా 98 లక్షల రూపాయలను రైతుల నుంచి వసూలు చేస్తున్నారని, వీరి ఆధీనంలో 88 లక్షల ఎకరాల భూమి ఉందని విచారణ సంఘం తేల్చింది. ఆంధ్ర ప్రాంతంలో వున్న మొత్తం భూమిలో 23 శాతం జమీందార్ల కిందే వుందని తెలిపింది. దీన్ని బట్టి జమీందారులు ఎంతగా భూములను ఆక్రమించుకున్నారో తెలుసుకోవచ్చు. తన వద్ద 17,354 ఎకరాలున్నట్లు చల్లపల్లి జమీందారు చెప్పినమాట అధికారికంగా నమోదైంది.

జమీందారు ఇన్ని దారుణాలు చేస్తూ ప్రజల్ని ముఖ్యంగా రైతులను ఇంతగా పీడిస్తున్నా కాంగ్రెస్ నాయకులు జమీందారు ఆగడాలను ప్రతిఘటించడంలో ఆశించిన స్థాయిలో ముందుకు రాలేదు. దీనితో విసుగు చెందిన అతివాదులు కొంత ఉద్యమిత్వంతో ముందుకు కదిలారు. రైతులతో మమేకమై జమీందారీ వ్యతిరేక పోరాటానికి ఊపిరులూదిన కమ్యూనిస్టు పార్టీ అప్పటికే చాప కింద నీరులా పనిచేస్తోంది. అప్పుడప్పుడూ ప్రభుత్వ నిర్బంధానికి, నిషేధానికి గురవుతూనే వుంది. నిషేధం వున్నప్పుడు రహస్యంగా, అది తొలగినప్పుడు బహిరంగంగా పనిచేస్తూనే వుంది.

1942లో జరిగిన మంగళాపురం కూలీల పోరాటం ఎంతో ప్రసిద్ధమైంది. జమీందారుకు మద్దతుగా రంగంలోకి దిగిన పోలీసులు 144వ సెక్షన్‌ను విధించారు. ధిక్కరించి కూలీలకు అండగా నిలిచిన చండ్ర రాజేశ్వరరావు, గుంటూరు బాపనయ్య, చల్లపల్లి నారాయణరావులను తీవ్రంగా హింసించారు. 6 నెలల జైలు శిక్ష కూడా పడింది.

ఈ విధంగా రైతు సంఘం రైతుల పక్షాన పోరాడుతూ వుండగానే చల్లపల్లిలో డి. సత్యనారాయణ అనే వ్యవసాయాధికారి రైతులకు తక్కావి రుణాలు ఇప్పించాడు. రైతుల వద్ద నుంచి రుణ దరఖాస్తుతో పాటు ఆ మొత్తం అందిందనే రశీదుపై కూడా ముందే సంతకం తీసుకున్నాడు. నిజానికి కొందరే రుణాలు తీసుకున్నారు. కొందరు తీసుకోలేదు. వింతేమిటంటే మరుసటి ఏడాది శిస్తు వసూళ్లతోపాటు రుణాల్ని కూడా తిరిగి చెల్లించండి అని రెవెన్యూ ఉద్యోగులు వత్తిడి తెచ్చారు. అప్పు తీసుకోని రైతులకు కూడా డిమాండు నోటీసులు వచ్చాయి. ఇది చూసి రైతులు లబోదిబోమని రైతు నాయకుడైన కాపూరి కుటుంబరావు వద్దకు వెళ్లారు. కుటుంబరావు వ్యవసాయాధికారిని నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. ఆ డబ్బును ఆ అధికారి తిరిగి రైతులకు ఇచ్చివేశాడు.

1944లో విజయవాడలో జరిగిన అఖిల భారత రైతు మహాసభ ఆంధ్ర రైతు ఉద్యమ

చరిత్రలో గణనీయమైంది. ఆనాటికి 8 లక్షల మంది రైతులు ఆ సంఘ:లో సభ్యులుగా వున్నారు. స్వామి సహజానంద, సర్దార్ పృథ్వీసింగ్, రాహుల్ సాంకృత్యాయన్, బాబా గురుముఖ్ సింగ్, జడ్.ఎ. అహ్మద్, డిసి జోషి, జీవానందం వంటి అతిరథ మహారథులు ఆ సభకు వచ్చారు. ఆంధ్రదేశం నుంచి లక్షలాది మంది రైతులు ఆ సభకు తరలివచ్చారు. ఒక రోజు కావూరి కుటుంబరావు, చల్లపల్లి నారాయణ రావు కలిసి పృథ్వీసింగ్, రాహుల్ సాంకృత్యాయన్‌ల వద్దకు వెళ్ళి చల్లపల్లి సందర్శించాలని ఆహ్వానించారు. తమలో ఒకరమే వస్తామని వారు చెప్పగా విప్లవ వీరుడైన పృథ్వీసింగ్‌ను కోరుకున్నాడు కుటుంబరావు. రాహుల్‌జీ సంజీవ్‌దేవ్ వెంట నాగార్జునకొండ వెళ్లారు.

1945లో శ్రీకాకుళం శివారు అచ్చుపాలెంలో 5 ఎకరాల చెరువు మేటవేసి వుండగా ఆ మేటను తొలగిస్తామనే సాకు చెప్పి జమీందారు మనుషులు 100 మంది దాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తే కావూరి కుటుంబరావు, చల్లపల్లి నారాయణరావు రైతులను సమీకరించి దాన్ని అడ్డుకున్నారు. అదే విధంగా గాజుల్లంక ఘటన కూడా ప్రధానమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టేట్లను రద్దు చేయనుందనే భయంతో జమీందారు ఆ ప్రాంతంలోని రైతుల వద్ద నుంచి అనేక విధాలైన మాయోపాయాలతో ఆక్రమించుకున్న భూములను అమ్మే కార్యక్రమం పెట్టుకున్నాడు. ముందు గాజుల్లంక వంతు వచ్చింది. అక్కడి వందలాది ఎకరాల భూములను అమ్ముకొన్నాడు. రైతులంతా చల్లపల్లి నారాయణ రావు, కుటుంబరావులకు మొరపెట్టుకున్నారు. ఈ నాయకులు రైతులను సమీకరించి జమీందారును ప్రతిఘటించేందుకు పూనుకోగా దౌర్జన్యాలకు అలవాటు పడ్డ జమీందారు 400 మంది రౌడీలను, వారికి కావలసిన ఆహార పదార్థాలను బండ్లపై వేయించి గాజుల్లంక పంపాడు. నారాయణరావు, కుటుంబరావు ఇది గమనించి గుంటూరు, కృష్ణా జిల్లాల కలెక్టర్లకు టెలిగ్రాములిచ్చారు. గాజుల్లంక పరిసరాల్లోని కొల్లూరులో క్యాంపులో వున్న గుంటూరు కలెక్టరుకు వార్తాహరుడు ముందు టెలిగ్రాం అందించాడు. అంతలో ఆ మార్గాన జమీందారు రౌడీలు వెళుతూ కలెక్టర్ కంటపడ్డారు. వారు బరితెగించిన విషయాన్ని కలెక్టరు గ్రహించి స్వయంగా పోలీసు స్టేషన్‌కు వెళ్ళి పోలీసుల్ని వెంట పెట్టుకొని వెళ్ళి చిరుమామిళ్ల చంద్రమౌళి అనే భూస్వామి ఇంటనున్న జమీందారు రౌడీలను అరెస్టు చేశారు.

ఈ విధంగా జమీందారు మనుషులు, పోలీసులు చేసిన దౌర్జన్యాలకు లొంగకుండా రైతులు ధైర్యంగా నిలబడ్డారు. ఇంకా రెచ్చిపోయిన జమీందారు లంకగ్రామాల రైతులపై అక్రమ కేసులు బనాయించారు. దీనికి పరాకాష్టగా గాజుల్లంకలో రెల్లుగడ్డి కోసుకుంటున్న బావిరెడ్డి వియ్యమ్మ, మరో ముగ్గురు అమాయకులైన రైతులను పోలీసులు కాల్చి చంపారు. చల్లపల్లి రైతాంగ పోరాటంలో తొలి త్యాగాలివి.

ఒక వైపు జమీందారు పక్షాన నిలిచిన పోలీసులు రైతు నాయకులను, రైతులను అరెస్టు చేసి జైళ్లలో నిర్బంధించడం, తమ భూములను ఏదో విధంగా జమీందారు ఆక్రమించుకుంటూ

వుంటే ప్రతిఘటించినందుకు రైతులు, రైతు కూలీలపై కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పడం కొనసాగింది.

పోలీసులు మితవాద కాంగ్రెస్ నాయకుల అండతో భూముల ఆక్రమణ కొనసాగిస్తూ వాటిని అమ్ముకోవచ్చునని జమీందారు ధీమాగా వున్నాడు. భట్ల పెనుమర్రు, అచ్చంపాలెం, యార్లగడ్డ, లక్ష్మీపురం తదితర గ్రామాల్లోని పోరంబోకులు, కొన్ని కమతం భూములను అమ్ముకోవడం ప్రారంభించాడు. తక్కువ ధరలకు ఇస్తానని కొందరు రైతులను ప్రలోభపెట్టాడు.

ఎంతటి నిర్బంధం అమలులో వున్నా వెరవక ఎస్టేట్ రైతాంగ పోరాటం నానాటికీ తీవ్ర ప్రతిఘటనోద్యమంగా రూపుదిద్దుకుంది. జమీందారు భూములను అమ్మకుండా, ఆక్రమించుకోకుండా కట్టడి చేసింది. అయ్యంకి దగ్గర్నుంచి పెదకళ్లేపల్లి అయోధ్య వరకు నాగళ్లు కట్టుకొని వందలాదిగా రైతులు తరలివచ్చి తమ పూర్వీకుల నుంచి జమీందారు కాజేసిన భూములను తీసుకొని సాగు చేయడం ప్రారంభించారు. నిడుమోలులో 250 మంది రైతులు 117 ఎకరాలను, పెదముత్తేవి, కాజ, మంత్రిపాలెం, కొండవరం గ్రామాలకు చెందిన 300 మంది జొన్నలదొడ్డిలో 250 ఎకరాలను సాగు చేసుకోవడం ప్రారంభించారు. రైతు ఉద్యమం ధాటికి జమీందారు నుంచి భూముల్ని కొనడానికి భూస్వాములు ముందుకు రావడం మానేశారు.

ఎస్టేటులో రైతాంగం చేసిన తిరుగుబాటుకు భయపడిన జమీందారు వేలాది ఎకరాల భూమిని తమ బంధువుల పేర రాస్తూనే మరోవైపు తన భూముల్ని కాపాడుకునేం దుకు ప్రభుత్వాన్ని ఆశ్రయించాడు. ఈ ఉద్యమాన్ని కమ్యూనిస్టుల పోరాటంగా చిత్రించి కొందరు కాంగ్రెస్ నాయకుల అండతో జమీందారుకు మేలు చేసే ప్రయత్నాలు జరిగాయి. ఆ మేరకు అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర రెవెన్యూ మంత్రి కళా వెంకటరావు మీద కూడా వత్తిడి తెచ్చారు. అయితే ఆయన వొత్తిడికి లొంగక రైతుల న్యాయమైన ఆకాంక్షలను అర్థం చేసుకొని జమీందారీ భూముల అన్యాక్రాంత నిషేధపు ఆర్డినెన్స్ తెచ్చారు. ఇక ముందు జమీందారులు భూములను అన్యాక్రాంతం చేస్తే వారికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించడం జరుగుతుందని, త్వరలో జమీందారీ రద్దు చట్టం తెస్తున్నామని రైతు సంఘం ప్రతినిధులకు చెప్పారు.

1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ప్రభుత్వం డిటెన్యూలను, కేసుల్లో శిక్షలు పడిన రైతులను విడుదల చేసింది. అయితే జమీందారీ వ్యతిరేక పోరాటంలో ముఖ్యపాత్ర నిర్వహించిన చల్లపల్లి నారాయణరావు అరెస్టు వారంట్లను మాత్రం రద్దు చేయలేదు.

ఇంతలో తెలంగాణ సాయుధ పోరాటం ఉధృతం కావడంతో ప్రభుత్వం కమ్యూనిస్టు

పార్టీని నిషేధించింది. 1948 మార్చిలో కావూరి కుటుంబరావు మొదలైన రైతు నాయకులను, కమ్యూనిస్టు కార్యకర్తలను డిటెన్యూలుగా విశాఖ, రాజమండ్రి, కడలూరు జైళ్లకు పంపించారు. ఈ నాయకులు జైళ్లలో ఉండగానే రైతాంగ పోరాట వీరులు చల్లపల్లి నారాయణరావు, చలసాని జగన్నాథరావు, దాసరి నాగేశ్వరరావు, చలసాని శ్రీనివాసరావు, కీర్తి సుబ్బారావు, చలసాని రత్తయ్య, దాసరి నాగభూషణరావు, చలసాని కాంచనరావు, దాసరి లక్ష్మయ్య, కూరపాటి బైరాగి, రావి భీమారావు, గరికిపాటి శివరామయ్య, గరికిపాటి శ్రీరాములు, గరికిపాటి అంజయ్య (ముగ్గురు అన్నదమ్ములు), చేబ్రోలు ఆదాం, మేకా సుబ్బారావు, మండవ వెంకటేశ్వరరావు, కొడాలి శరభయ్య, తాతినేని చెన్నయ్య, వాసిరెడ్డి విశ్వనాథం, కొడాలి బాలయ్య, మేకా నాగేశ్వరరావు, రావి సుబ్బారావు, నడకుదిటి లక్ష్మీపతి, గోగినేని తాతయ్య, కోగంటి వెంకటేశ్వరరావు, మేరుగు శ్రీరాములు, నాదెళ్ల వెంకటకృష్ణయ్య, మండవ శ్రీనివాసరావు, తొట్టెంపూడి నారాయణరావు, సనకా సుబ్బారావు, మత్తి సుబ్బారావు, మండవ కోటేశ్వరరావు, పరుచూరి రాజగోపాలరావు, పీతా అంకినీడు, యలమంచిలి వెంకటేశ్వరరావులను 1949, 1950 సంవత్సరాల్లో వేరువేరు ప్రాంతాల్లో పోలీసులు చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు. జైలు నుంచి విడుదలై తిరిగి వచ్చిన కావూరి కుటుంబరావు ఇతర నాయకులు తాము లేని కాలంలో ఇంత మంది వీరులు నేలకొరగడం పట్ల తీవ్రంగా కలత చెందారు. ఇంత మారణహోమం సృష్టించిన జమీందారుకు మాత్రం ప్రభుత్వం మేలు చేసింది.

1949 సెప్టెంబర్ 7న జమీందారీ రద్దు చట్టం వచ్చింది. జమీందారుకు లక్షలాది రూపాయల పరిహారం, వేలాది ఎకరాల భూములు దక్కాయి. ఇది ప్రభుత్వం రైతులను, ప్రజలను వంచించడమే. ఎంతో మంది జైళ్లలో మగ్గి, ప్రాణాలర్పించిన త్యాగాలను వెక్కిరించడమేనని కుటుంబరావు ఇతర నాయకులు ఆక్రోశించారు.

చట్ట ప్రకారం చట్టం రాకపూర్వం 12ఏళ్ల నాటికి జమీందారుకు వున్న భూముల న్నింటిని వారికే కట్టబెట్టింది. రద్దుకు ముందు 5 ఏళ్ల కాలంలో జమీందారు రైతులకు అమ్ముకున్న భూములకూ పట్టాలు వచ్చాయి. జమీందారుపై ఆధారపడ్డ వారసులకు అతని భూమిలో 5వ వంతు ఇవ్వాలని చట్టం నిర్దేశించింది.

1952లో రైతులు నాయకులు జైళ్ల నుంచి వచ్చేసరికి జమీందారు 17 వేల ఎకరాలకు పట్టా ఇవ్వాలని సెటిల్‌మెంటు కోర్టులో పిటిషన్ పెట్టుకున్నాడు. జమీందారు ఏనాడూ సాగు చేయని మోపిదేవి, మెరకనపల్లి, లంకబీడు భూములను కూడా రెవెన్యూ సిబ్బందిని ప్రలోభపెట్టే తానే సాగు చేసినట్లు రికార్డులు సృష్టించాడు. రైతు ప్రతినిధులు ఎంతగా అభ్యంతరాలు లేవదీసినా 10 వేల ఎకరాలకు పట్టా పొందాడు. 7 వేల ఎకరాలకు మాత్రం

కోర్టు పట్టాలివ్వడానికి నిరాకరించింది. పట్టు వదలని జమీందారు అప్పీళ్లపై అప్పీళ్లు చేస్తూ సుప్రీంకోర్టు వరకూ వెళ్లాడు. కేసు తేలేవరకు ఆ భూములు జమీందారు ఆధీనంలోనే వుండవచ్చుననే చట్టంలోని లొసుగు వల్ల తర్వాత 20 ఏళ్ల పాటు వాటి ఫలాల్ని అనుభవించాడు. చివరికి సుప్రీంకోర్టు జమీందారుకు హక్కు లేదని చెప్పింది.

ప్రభుత్వంలోని పెద్దలు కూడా జమీందారుకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం కమ్యూనిస్టుల అరాచకమని అపోహపడడం వల్ల జమీందారుకు వీలైనంతగా కొమ్ము కాశారు. ఎటు తిరిగీ నష్టపోయింది రైతు నాయకులు, రైతులు. అయితే కడ వరకూ పోరాటం కొనసాగింది.

1961లో రాష్ట్ర ప్రభుత్వం భూసంస్కరణల బిల్లు తెచ్చింది. బిల్లు ప్రకారం ఒక వ్యక్తికి 27 ఎకరాల మాగాణి మాత్రమే ఉండాలని పరిమితి విధించారు. బిల్లు కళా వెంకటరావు రెవెన్యూ మంత్రిగా వుండగా రూపొందించింది. చల్లపల్లి జమీందారు షుగర్ ఫ్యాక్టరీ భూములు కూడా బిల్లు పరిధిలోకి వస్తాయని రాశారు. దీంతో జమీందారు కొన్ని వందల ఎకరాల భూములను బిల్లు రాకముందే అమ్ముకున్నాడు. బిల్లు వచ్చేనాటికి కె.వి. రంగారెడ్డి రెవెన్యూ మంత్రిగా వున్నారు. ముఖ్యమంత్రి సంజీవయ్య. జమీందారుకు అనుకూలంగా షుగర్ ఫాక్టరీ భూములకు భూసంస్కరణల నుంచి మినహాయింపు లభించింది. దివి తాలూకాలో ఒక్క సెంటు కూడా మిగులు కింద రాలేదు.

1973లో రెండవసారి భూసంస్కరణలు వచ్చాయి. పాత చట్టానికి కొన్ని కొత్త మెరుగులు దిద్దారు. జమీందారు షుగర్ ఫాక్టరీ కింద వున్న 3918.73 ఎకరాల భూమిలో ముందే 1200 ఎకరాల్ని అమ్ముకున్నాడు.

షుగర్ ఫాక్టరీ కింద వున్న భూములను పేదలకు పంచాలని కార్మిక సంఘాలు, కమ్యూనిస్టు పార్టీ పోరాటాన్ని సాగించాయి. 1969 – 73 మధ్య పోరాటంలో లంక భూముల్లో జరిగిన పోరాటాల్లో 400 మంది రైతుకూలీలను ప్రభుత్వం అరెస్టు చేసింది. పోరాటం ఫలితంగా 4 గ్రామాల్లోని 400 ఎకరాల భూమి పేదలకు దక్కింది. ఈ సందర్భంలోనే జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి మాలెంపాటి బాలభాస్కరరావు హత్యకు గురయ్యారు.

1970 – 75 సంవత్సరాల మధ్య కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో జమీందారీ వ్యతిరేక పోరాటం ఉధృతంగా సాగింది. 1978లో జమీందారు మిగులు భూములను ఆక్రమించి వేలమంది జైలుకు వెళ్లారు. చివరికి 2650 ఎకరాలను భూసంస్కరణల చట్టం కింద ప్రభుత్వం మిగులుగా ప్రకటించింది. జమీందారు ఫాక్టరీ యాజమాన్యం పేరుతో మద్రాసు హైకోర్టులో రిట్ వేసి స్టే పొందాడు.

జమీందారు చేసిన అత్యున్నత పైరవీ ఫలితంగా 1978లో అప్పటి ప్రధాని మొరార్జీ

దేశాయ్ నుంచి చల్లపల్లి భూములను భూసంస్కరణల చట్టం నుంచి మినహాయించమని ముఖ్యమంత్రులకు లేఖలు వచ్చాయి. ఈ లేఖలకు నిరసనగా రైతు సంఘాలు ఉద్యమం చేశాయి. శాసనసభలో ప్రతిపక్షాలు సైతం వ్యతిరేకించాయి. ఈ పరిణామాలపై కాపూరి కుటుంబరావు విశాలాంధ్రకు వ్యాసం రాసి పంపగా పత్రికవారు సగం మాత్రమే వేశారు. ఈ విషయాన్ని ఆయన చంద్ర రాజేశ్వరరావు దృష్టికి తేగా ఆయన పత్రికవారిని మందలించారు.

మోపిదేవి, చల్లపల్లి ప్రాంతంలో జమీందారు బినామీ కౌలుదార్లను నిరోధించే ఉద్యమం జరిగింది. వెయ్యి మంది అరెస్టయ్యారు. ఆ విధంగా కూలీలు, రైతులు ఫాక్టరీ భూముల్లోని 1400 ఎకరాలను సాగు చేయకుండా ఆపారు.

1979లో చల్లపల్లిలో అఖిల పక్ష కమిటీ నాయకత్వాన సమావేశం జరిగింది. సిపిఐ, సిపిఐ (ఎం) నాయకత్వాన వున్న వ్యవసాయ కార్మిక సంఘాలు, ఇతరులు పాల్గొన్నారు. జిల్లా కమ్యూనిస్టు నాయకుల దోనేపూడి దత్తు పోరాట కమిటీ కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. ఈ ఉద్యమానికి నిరంతరం మార్గదర్శకత్వం వహిస్తూ కడ విజయం వరకూ పోరాడిన నాయకుల్లో భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు దాసరి నాగభూషణ రావు ముఖ్యులు.

ఈ పోరాటం జరుగుతుండగా 1981 డిసెంబరు 4న మద్రాసు హైకోర్టు షుగర్ ఫ్యాక్టరీ కింద వున్న భూములకు భూసంస్కరణల చట్టం వర్తిస్తుందని తీర్పు చెప్పింది. సుప్రీంకోర్టుకు వెళ్లేవరకు అవకాశం వచ్చింది. కడకు సుప్రీంకోర్టు ఆ కేసును తీసుకోలేదు. చివరికి బందరు ల్యాండ్ సీలింగ్ ట్రిబ్యునల్ ముందుకు ఈ కేసు విచారణకు రాగా ఇవి అదనపు భూములేనని ప్రకటించింది.

అనంతరం అఖిల పక్ష కమిటీ ఏర్పడి అదనపు భూములను ప్రజలకు పంచాలని కోరుతూ ఉద్యమం కొనసాగించింది. ఉద్యమానికి మద్దతుగా 1984 జూన్ 27 నుంచి జులై 7 వరకు సామూహిక దీక్షలు జరిగాయి. రాష్ట్రం మొత్తం మీద 21 జిల్లాల్లో, హైదరాబాద్ సచివాలయం వద్ద, 100 తాలూకా కేంద్రాల్లో జరిగిన ఆందోళనలో 20 వేల మంది వ్యవసాయ కూలీలు, పరిశ్రమల కూలీలు, మహిళలు, యువత పాల్గొన్నారు. ఆగస్టు 22న శాసనసభలో, 26న శాసనమండలిలో సావధాన తీర్మానాలు ప్రతిపాదించారు. ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. ప్రభుత్వంలో స్పందన రాలేదు. రైతుల పోరాటం ఆగలేదు. దివిసీమలో ఉధృతంగా సాగింది. మొవ్వలో తాలూకాఫీసు బంద్, 15న తాలూకాలోని అన్ని రోడ్లలో 3 గంటల పాటు రాస్తారోకో జరిగింది. ఇందులో 3000 మంది పాల్గొనగా 476 మందిని అరెస్టు చేశారు.

50 ఏళ్లుగా పేదలు, రైతులు, కూలీలు సాగించిన పోరాటానికి రాష్ట్రవ్యాప్తంగా లభించిన మద్దతుకు ప్రభుత్వం తల ఒగ్గింది. అఖిల పక్ష కమిటీ సూచనల మేరకు 13 గ్రామాల్లోని

11 వేల మంది భూమి లేని పేదలకు ఒక్కొక్కరికి 25 సెంట్ల చొప్పున అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు పంపిణీ చేశారు.

ఈ విధంగా చల్లపల్లి రైతాంగ పోరాటం విజయవంతం కావడానికి ఎంతో మంది రైతు బిడ్డలు చేసిన త్యాగాలే కారణం. ఈ చారిత్రాత్మక పోరాటంలో భాగస్వాములయ్యే అవకాశం కలగడం గొప్ప అనుభవమని కుటుంబరావు చెప్పారు.

మంగళాపురంలో తూముల మంజూరు

1983లో ఒకరోజు కావూరి కుటుంబరావు, చంద్ర సుబ్బయ్య, సుబ్బయ్య కుమారులైన చంద్ర రామలింగయ్య, చంద్ర రాజేశ్వరరావు కలిసి పులిగడ్డ వెళ్లి అక్కడ క్యాంపులో వున్న ఇంజనీరు శేషాచారిని కలిశారు. అప్పటికే రామలింగయ్య మాజీ శాసనసభ్యులు, రాజేశ్వరరావు అఖిల భారత స్థాయిలో కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత. వారిని కుటుంబరావు ఇంజనీరుకు పరిచయం చేశారు. మంగళాపురంలో తూముల సమస్య గురించి రామలింగయ్య ఇంజనీరుకు వివరించాడు. ఇంజనీరు లేనిపోని దర్పాన్ని వెలగబెడుతూ తూములు వేయడం సాధ్యం కాదని సమాధానమిచ్చాడు. ఎంతగా నచ్చజెప్పబోయినా వినలేదు. దాంతో వీరంతా బయటకు వచ్చారు.

కుటుంబరావుకు బుర్రలో ఒక ఆలోచన వచ్చింది. ఇప్పుడే వస్తానని రామలింగయ్యతో చెప్పి మళ్ళీ ఇంజనీరు దగ్గరికి వెళ్లాడు. రేపు ఎటు వెళుతున్నారని ఇంజనీరును అడిగారు. ఉదయం 9 గంటలకు బందరు కలెక్టరు దగ్గరికి వెళతానని చెప్పగా దార్లో లక్ష్మీపురం వద్ద 10 నిమిషాలు ఆగవలసిందని కుటుంబరావు చెప్పడంతో ఇంజనీరు అంగీకరించాడు.

అనుకున్న ప్రకారం ఇంజనీరు లక్ష్మీపురం వద్దకు రాగానే అక్కడ కుటుంబరావును చూసి జీపు ఆపాడు. కుటుంబరావు కూడా జీపులో ఎక్కి డ్రైవరుకు సూచనలిచ్చి మంగళాపురం రోడ్డు వైపు పోనివ్వమని చెప్పాడు. జీపు అక్కడికి చేరుకుంది. ఊరి బయట మురుగు కాలువపై వంతెన లేకపోవడం వల్ల అక్కడ ఇంజనీరు కోసం ఎడ్లబండిని సిద్ధంగా వుంచే ఏర్పాటు చేశారు. జీపు అక్కడికి చేరుకుంది. ఇంజనీరు, కుటుంబరావు కిందికి దిగారు. పది నిమిషాల్లో తిరిగి వద్దామని చెప్పి ఇంజనీరును బండి ఎక్కమని కోరాడు కుటుంబరావు. అప్పటికే బండి మీద చంద్ర రామలింగయ్య వగైరాలు సిద్దంగా వున్నారు. ఇంజనీరును తమతో బండిలో తీసుకెళ్లారు. కుటుంబరావు వారితో వెళ్లకుండా మంగళాపురంలోని చంద్ర రామలింగయ్య ఇంటికి చేరుకొని ఇంజనీరుకు భోజనం తయారు చేయించాడు.

ఉదయం 9 గంటలకు వెళ్లిన ఇంజనీరు 12 గంటలకు వచ్చాడు. కుటుంబరావు ఆయనను భోజనానికి ఆహ్వానించాడు. భోజనం పూర్తిచేసి ఇంజనీరు కిళ్లీ వేసుకొని సిగరెట్

వెలిగించాడు. తాపీగా కబుర్లలో పడ్డాడు. చంద్ర రాజేశ్వరరావు గురించి పరిచయం చేస్తూ రాజేశ్వరరావు బెనారస్‌లో చదువుకున్నారని, కమ్యూనిస్టు పార్టీలో అగ్రనాయకుడనీ, స్టాలిన్ వంటి మహానేతలతో పరిచయం వుందని చెప్పడంతో ఇంజనీరు ఎంతో ఆశ్చర్య పోయాడు. చంద్ర రామలింగయ్య కూడా బెనారస్‌లో న్యాయశాస్త్రం చదివారని, ప్రసిద్ధ రైతు నాయకుడని పరిచయం చేశారు.

ఇంజనీరు చాలా సంతోషించి మిమ్మల్ని కలుసుకోవడం నా భాగ్యమని, తూములను తప్పక మంజూరు చేస్తానని అన్నారు. బందరు వెళ్లిపోయారు. కొన్నాళ్లకే తూముల్ని మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీనికంతటికీ సూత్రధారి కుటుంబరావేనని సుబ్బయ్య సంతోషించి కుటుంబరావును అభినందించారు.

నాదెండ్ల చలవతో కాలవ నిర్మాణం

1936లోనే మంగళాపురం నుంచి మాజేరు వరకు భూములకు మాగాణి వచ్చినా మురుగు కాలువ మాత్రం 1983 వరకూ తవ్వలేదు. దీనితో మంగళాపురం నుంచి మాజేరు వరకు మురుగునీరు పోయే వసతిలేక భూముల్లో మొదటి పంట కూడా సరిగా పండేది కాదు. ఒకరోజు చంద్ర రాజేశ్వరరావు కుటుంబరావును పిలిచి అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావును కలుసుకొని ఆ మురుగు కాలువ నిర్మాణం గురించి మాట్లాడుదాం రమ్మన్నారు. ఇంత చిన్నదానికి ముఖ్యమంత్రి వరకూ ఎందుకు నేను చూసుకుంటాను లెమ్మన్నారు. అప్పట్లో ఆర్థిక మంత్రిగా వున్న నాదెండ్ల భాస్కరరావుతో కుటుంబరావు ఈ విషయం మాట్లాడారు. కాలువ తవ్వకానికి వారం రోజుల్లోనే భాస్కరరావు 32 లక్షల రూపాయలను మంజూరు చెయ్యడమే గాక కాలువ నిర్మాణం పనులను త్వరగా పూర్తి చెయ్యాలని ప్రజా పనుల శాఖను ఆదేశించారు. ఆయన స్వయంగా ఎప్పటికప్పుడు అధికారులతో పనుల ప్రగతిని గురించి వాకబు చేసేవారు. ఈ కాలువ నిర్మాణం పూర్తయిన ఫలితంగా వందలాది ఎకరాల భూములకు నీటి వసతి సమకూరింది. భూముల ధరలు కూడా పెరిగిపోయాయి.

ప్రోత్సాహం... సహాయం

కావూరి కుటుంబరావు బాల్యం, విద్యాభ్యాసం చేసిన రోజుల్లో ఎన్నో ఇబ్బందులనెదుర్కొన్నారు. ఆ రోజుల్లో ఆయన పాఠశాల విద్యతోనే చదువు చాలించవలసి వచ్చింది. ఉన్నత విద్యావకాశాలు తక్కువగా ఉండడం ఒక కారణమైతే పెద్దల ప్రోత్సాహ సహకారాల లోపం మరో కారణం. కుటుంబరావు పెద్దనాన్న కావూరి కోదండరామయ్యొ ఒక్కరే అప్పట్లో హైస్కూలు విద్యను అభ్యసించారు. తాను పెద్ద చదువులు చదవకపోయినా లోకానుభవం, ఉద్యమిత్వం, సాటివారిని పైకి తీసుకువచ్చే గుణం కుటుంబరావులో ఉండడం వల్ల పెద్ద పెద్ద వారికి తలలో నాలుకలా వున్నారు. కుటుంబరావు అంటే అపారమైన

గౌరవం ఆనాడూ, ఈనాడూ. చదువుకొనేవారంటే మొదటి నుంచీ ఇష్టపడే కుటుంబరావు అందుకోసం తగిన ప్రోత్సాహం అందించడంలో ముందుంటూ వచ్చారు. ఎంతో మంది ఆయన తోడ్పాటుతో జీవితంలో ముందడుగు వేశారు.

రావి సుబ్బారావు

సుబ్బారావు తల్లిదండ్రులు నిరక్షరాస్యులు. కుటుంబరావు ప్రోత్సహించి చల్లపల్లి హైస్కూలులో చేర్చారు. 1937లో సుబ్బారావు అతివాద రాజకీయాల వైపు ఆకర్షితుడై గుంటూరు జిల్లా కొత్తపట్నంలోనూ, ఆ మరుసటి సంవత్సరం మంతెనవారిపాలెంలోనూ సోషలిస్టులు నడిపిన రాజకీయ పాఠశాలకు హాజరయ్యాడు. తర్వాత హైస్కూలు విద్య పూర్తి చేసి బహిరంగంగా వచ్చిన కమ్యూనిస్టు పార్టీలో కొంత కాలం పనిచేశాడు. తర్వాత ఉన్నత విద్యనభ్యసించాడు. గుంటూరులో బి.ఎ. పట్టభద్రుడై, పూనాలో న్యాయశాస్త్ర పట్టా పూర్తి చేశాడు. అటుపైన బందరులో న్యాయవాద వృత్తి చేపట్టాడు. 1948లో కమ్యూనిస్టు రాజకీయాల్లో పాల్గొంటున్నాడని పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడులోని కడలూరు జైలుకు డిటెన్యూగా పంపారు. జైలు నుంచి విడుదలయ్యాక మళ్లీ బందరులో ప్రాక్టీసు ప్రారంభించాడు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక కుటుంబరావు చంద్ర రాజేశ్వరరావుతో మాట్లాడి సుబ్బారావును హైదరాబాద్ తీసుకొచ్చాడు. హైకోర్టులో ప్రాక్టీసు చేపట్టి పేరు ప్రఖ్యాతులు సంపాదించిన సుబ్బారావు 1974లో ఆకస్మిక మరణం చెందారు.

యార్లగడ్డ లక్ష్మయ్య

రావి సుబ్బారావు సహధ్యాయి అయిన లక్ష్మయ్య బిఎలో చేరబోతుంటే వారించి కుటుంబరావు బి.కాం.లో చేర్పించాడు. ఆ రోజుల్లో మద్రాసులో భాగంగా వున్న ఆంధ్ర ప్రాంతంలో సాంకేతిక, వృత్తి విద్యలు లేవు. వైద్య కళాశాలలు లేవు. బిఎతో పాటు బికాం కోర్సులు మాత్రమే ఉండేవి. భవిష్యత్తులో స్వాతంత్ర్యం వస్తుందని, అప్పుడు వ్యాపార, పారిశ్రామిక రంగాలు విస్తరిస్తాయని, బికాం చదివినవారికి అవకాశాలు అందివస్తాయనే ముందు చూపుతో కుటుంబరావు యార్లగడ్డ లక్ష్మయ్యను బికాంలో చేర్పించాడు. అనుకున్నట్లే బికాం పూర్తి చేసిన లక్ష్మయ్య విజయా బ్యాంకులో ఉద్యోగంలో చేరాడు. అయితే ఆ బ్యాంకులో కొంత కాలం పనిచేశాక గానీ జీతం ఇచ్చేవారు కారు. అలా సంవత్సర కాలం పనిచేసినా లక్ష్మయ్యకు వేతనం ఇవ్వలేదు. అప్పటికే కుటుంబరావు కమ్యూనిస్టు పార్టీ రాజకీయాల్లో పాల్గొని ప్రముఖ నాయకునిగా పేరు పొందారు. ఒకనాడు పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశంలో కొత్తగూడెం సింగరేణి కాలరీస్‌లో కార్మిక నాయకునిగా వున్న తన మిత్రుడు శేషగిరిరావు మాట్లాడుతూ కొత్తగూడెంలో కొన్ని వేల మంది కార్మికులకు ప్రయోజనదాయకంగా వుండేందుకు ఒక స్టోర్స్ ప్రారంభించామని, అయితే దాన్ని నిర్వహించేందుకు బికాం చదివిన

కమ్యూనిస్టు యువకులు దొరకడం లేదని అన్నాడు. కమ్యూనిస్టు పార్టీలో వుండి బికాం చదివి అప్పటికి విజయాబ్యాంకులో పనిచేస్తున్న యార్లగడ్డ లక్ష్మయ్య గురించి కుటుంబరావు పార్టీ సమావేశాల్లో ప్రస్తావించి వున్నాడు. ఈ మారు శేషగిరిరావుకు కూడా చెప్పడం, ఆయన అంగీకరించడంతో 1942 చివరలో కుటుంబరావు లక్ష్మయ్యను అప్పగించాడు. కొత్తగూడెంలో స్టోర్స్ నిర్వాహకునిగా లక్ష్మయ్య సమర్థవంతంగా పనిచేసి కార్మికులకు సేవ చేశాడు. 1949లో ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించినప్పుడు కార్మిక నాయకుడైన శేషగిరిరావును పోలీసులు కాల్చివేశారు. ఆ సంఘటనకు తీవ్రంగా కలత చెందిన లక్ష్మయ్య అక్కడ ఉండలేక బొంబాయి వెళ్లిపోయాడు. 1951లో పోలీసు నిర్బంధం పోయాక సింగరేణి కాలరీస్ కార్మిక నాయకులు బొంబాయిలో వున్న లక్ష్మయ్యను తిరిగి కొత్తగూడెం తెచ్చుకున్నారు. లక్ష్మయ్య అక్కడే పనిచేసి పదవీవిరమణ చేశాడు. ఆయనకు పిల్లలు లేరు. భార్య కూడా మరణించింది. కుటుంబరావు తెనాలిలో ఇటీవలే కలిసి పరామర్శించారు.

ఘంటా శ్రీరాములు

శ్రీరాములు చల్లపల్లి హైస్కూల్లో ఎస్.ఎస్.ఎల్.సి. చదివి ఉత్తీర్ణుడయ్యాడు. ఆ రోజుల్లో వారికి ఉపాధ్యాయశిక్షణ తప్ప వేరే కోర్సులుండేవి కావు. తమిళనాడు లోని కోయంబత్తూరులో ప్రముఖ పారిశ్రామికవేత్త జి.డి. నాయుడు వృత్తివిద్యాసంస్థలు నెలకొల్పారని విని శ్రీరాములును వాటిలో చేర్పించేందుకు కుటుంబరావు ప్రయత్నాలు చేశాడు. అయితే అతను నిరుపేద కావడం వల్ల ఆర్థికంగా సహాయం కోసం అప్పట్లో మద్రాసులో ఉన్నతోద్యోగంలో వున్న వెలగపూడి రామకృష్ణ ఐసిఎస్ వద్దకు పంపాడు. రామకృష్ణ ఇతని పరిస్థితికి జాలిపడి కోయంబత్తూరులోని జి.డి. నాయుడికి సిఫారసు లేఖ ఇచ్చి పంపాడు. ఆ లేఖలో శ్రీరాములును సాంకేతిక విద్యాసంస్థలో సీటు ఇవ్వడంతో పాటు ఉచిత నివాస, భోజనవసతి కూడా కల్పించాలని సిఫారసు చేశాడు. లేఖ తీసుకు వెళ్లి నాయుడికి ఇవ్వగా అన్నీ సమకూర్చేందుకు అంగీకరించారు. నిశ్చింతగా వేరే ధ్యాస లేకుండా చదువుకొమ్మని హితవు చెప్పారు. చివరికి దినపత్రిక కూడా చదువరాదని షరతు పెట్టారు. ఆ విధంగా శ్రీరాములు పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రికల్ కోర్సు చేరాడు. జి.డి. నాయుడు తమిళనాడులోనే గాక దేశవ్యాప్తంగా పేరుపొందిన పారిశ్రామికవేత్త, ఆయనకు పారిశ్రామిక విషయాలతో పాటు వ్యవసాయంపై కూడా ఆసక్తి వుండేది. అనేక రకాలైన కొత్త విత్తనాల్ని తయారు చేస్తుండేవారు. అదృష్టవశాత్తు శ్రీరాములు ఆయన అందించిన సహాయంతో శిక్షణ పూర్తి చేసుకొని ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి శాఖలో చేరారు. గుంటూరు జిల్లా మాచర్లలో పనిచేస్తున్నప్పుడు... అప్పటికి వెలగపూడి రామకృష్ణ పదవీ విరమణ చేసి మాచెర్లలో ఒక సిమెంటు కర్మాగారాన్ని నడుపుతున్నారు. కర్మాగారంలో ఒక విడి భాగం చెడిపోయింది. దాన్ని జర్మనీ నుంచి తెప్పించాలి. అప్పటి వరకూ కర్మాగారం

పనిచేయని పరిస్థితి ఏర్పడింది. మాచెర్లలోనే పనిచేస్తున్న ఘంటా శ్రీరాములు వచ్చి పాత పరికరాల (స్క్రాప్) గదిలోకి వెళ్లి అక్కడ పడవేసిన పాత పార్టును తీసి బాగు చేసి తిరిగి అమర్చి పని చేయించాడు. అలా నెల రోజుల పాటు కర్మాగారం ఉత్పత్తిని కొనసాగించింది. వెలగపూడి రామకృష్ణ మాచెర్ల వచ్చినప్పుడు ఈ విషయం తెలుసుకొని ఆశ్చర్యానికి లోనయ్యారు. శ్రీరాములును పిలిపించుకొని ఆయన వివరాలు అడిగారు. 'కుటుంబరావు తొలుత నన్ను మద్రాసుకు మీ వద్దకు పంపగా మీరు జి.డి. నాయుడుకు సిఫారసు లేఖ ఇచ్చి పంపారని, మీ చలవవల్ల కోయంబత్తూరులో శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగం చేస్తున్నానని చెప్పినప్పుడు రామకృష్ణ ఆనందానికి అంతు లేదు. చేస్తున్న ఉద్యోగాన్ని మానివేసి మరింత ఉన్నతస్థితిలోకి వెళ్లమని ఆయన శ్రీరాములును కోరారు. కోరడమే కాదు తణుకులో వున్న ఆంధ్రా షుగర్స్ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్‌కు లేఖ రాసి పంపారు. హరిశ్చంద్ర ప్రసాద్ శ్రీరాములుకు మంచి ఉద్యోగం ఇచ్చి జర్మనీకి శిక్షణ కోసం పంపారు. శిక్షణ పూర్తి చేసుకొని వచ్చి కొన్ని సంవత్సరాల పాటు శ్రీరాములు అక్కడ ఉద్యోగం చేశారు. తర్వాత శ్రీరాములు గురించి విన్న ఆనాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు రాష్ట్రంలోని ఐదు చక్కెర కర్మాగారాలకు శ్రీరాములును సాంకేతిక సలహాదారుగా హైదరాబాదులోని నిజాం షుగర్స్ కార్యాలయంలో నియమించారు. తర్వాత వచ్చిన మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వం కూడా శ్రీరాములును కొనసాగమని కోరింది. శ్రీరాములు అందుకు ఇష్టపడలేదు. తర్వాత కెన్యాలో ఒక చక్కెర కర్మాగారాన్ని ప్రారంభించాడు. అనంతరం విశాఖపట్నంలో స్థిరపడి అకాల మరణం చెందాడు.

భారత్‌పై చైనా దాడిపై భిన్నాభిప్రాయాలు - పార్టీలో చీలిక

అప్పటికి ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల్లో స్వల్పంగా అభిప్రాయ భేదాలున్నట్లు కుటుంబరావుకు ఇతరత్రా చాలామంది ఇక్కడి కమ్యూనిస్టు నాయకులకు తెలియలేదు. 1962లో అకారణంగా చైనా మన దేశంపై దాడి చేసి... మన భూభాగంలో కొంత దూరం వచ్చి తనంతట తాను తిరిగి వెనక్కి వెళ్లిపోయింది. ఇది భారతదేశంలోనే కాక ప్రపంచంలోనే ఒక కొత్త విధానానికి దారి తీసింది. అప్పటి వరకు రష్యాతో సహా ఏ కమ్యూనిస్టు దేశమూ ఇతర దేశాలపై దాడి చేయలేదు. అప్పటికి చైనా, రష్యాల మధ్య కూడా అభిప్రాయభేదాలున్నట్లు తర్వాత తెలిసింది.

ఈ చైనా దాడిని భారత కమ్యూనిస్టు కేంద్ర కమిటీలో మెజారిటీ సభ్యులు వ్యతిరేకించారు. వీరికి చంద్ర రాజేశ్వరరావు నాయకత్వం వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య మరికొందరు పరోక్షంగా ఈ దాడిని సమర్థించారు. ఫలితంగా ప్రభుత్వం సుందరయ్యను, ఇతరులను అరెస్టు చేసి కొంత కాలానికి విడుదల చేసింది. మనదేశంపై చైనా దాడి చేయడాన్ని కావూరి కుటుంబరావు కూడా వ్యతిరేకించారు.

1964లో కమ్యూనిస్టు పార్టీ రెండుగా చీలిపోయింది. ఒకటి కమ్యూనిస్టు పార్టీ పుట్టినప్పటి నుంచి వున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ). రెండవది భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) (సిపిఐ ఎం) పేరుతో అవతరించింది.

నిజానికి కమ్యూనిస్టులలో రణదివే నాయకత్వాన కలకత్తాలో జరిగిన మహాసభ తీర్మానానంతరం ప్రభుత్వం పార్టీని నిషేధించడం, నాయకులను జైళ్లలో వేయడం జరిగింది. పార్టీ నాయకులు రహస్య జీవితం గడుపుతూ పోరాట పంథా తీసుకుంది అప్పుడే. అప్పుడే వారిలో భేదాభిప్రాయాలు ప్రారంభమయ్యాయి.

ఉదాహరణకు రష్యాలో కార్మిక వర్గ విప్లవంవలె ఇక్కడ కూడా పోరాటం చేయాలని ఒక వర్గం, అలా కాకుండా చైనా కమ్యూనిస్టుల వలె రైతాంగ పోరాటం ద్వారా సోషలిజాన్ని నెలకొల్పాలని మరొక వర్గం కీచులాడుకోవడం మొదలు పెట్టారు. ఆ విధంగా రగిలిన భేదాభిప్రాయాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా అధికమై 1964 నాటికి అవి ముదిరి అనైక్యతకు చివరికి చీలికకు దారి తీసింది.

ఈవిధంగా రాష్ట్రంలో కూడా పార్టీ ఉభయవర్గాల్లో దీని ప్రతిఫలనం కనిపించింది. అంతకు ముందు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బలీయంగా ఎదిగిన పార్టీ చీలిక ఫలితంగా బలహీనమైంది. ఎన్నికల్లో తమపై తామే పోటీ చేసుకొనే పరిస్థితి వచ్చింది. దీనివల్ల సిపిఐకి, సిపిఐ – ఎం కు నష్టం జరిగింది. వీరి చీలిక వల్ల కాంగ్రెస్‌కు కలిగిన లాభం ఇంతా అంతా కాదు.

1983 ఎన్నికల్లో ఎన్.టి.ఆర్.తో పొత్తులోనూ వైఫల్యం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయాన్ని గురించి కొన్ని ముఖ్యమైన అంశాలు చెప్పుకోవాలి. దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన పార్టీ మాది అన్న కాంగ్రెస్ పార్టీకి కమ్యూనిస్టులు తొలి నాళ్లలో గట్టి పోటీనిచ్చారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రజాదరణ చూరగొన్నారు. తర్వాత కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గుముఖం పట్టింది. కాంగ్రెస్ ఇక తనకు ఎదురులేదని విర్రవీగే దశ వచ్చింది. దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని ఏలింది. 1977లో దేశమంతటా జనతా ప్రభంజనం వీచినా రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్ రాజ్యమే సాగింది. ఇటువంటి ఎదురులేని పరిస్థితుల్లో కాంగ్రెస్ స్వీయ తప్పిదాలతో ఆడింది ఆటగా పాలన సాగించింది. సరిగ్గా అటువంటి దశలో ప్రజల్లో అపారమైన అభిమానం, ఆదరణ వున్న సినీనటుడు నందమూరి తారకరామారావు 1982లో తెలుగుదేశం పార్టీ నెలకొల్పి 1983లో కాంగ్రెస్‌తో ఢీకొన్నారు. ఆ ఎన్నికల సందర్భంలో ఎన్.టి.ఆర్. నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీతో కమ్యూనిస్టుల ఎన్నికల పొత్తు ఆలోచన తెరపైకి వచ్చింది. కాంగ్రెసేతర శక్తుల చరిత్రలో, ముఖ్యంగా వామపక్షాల ఎన్నికల వ్యూహ చరిత్రలో అది కీలకమైన

సమయంగా పరిణమించింది. ఈ దశలో పొత్తు ప్రతిపాదన చేసినవారిలో కావూరి కుటుంబరావు ముఖ్యుడు.

ఎన్.టి. రామారావుకు అప్పట్లో సన్నిహితంగా వున్న నాయకుడు నాదెండ్ల భాస్కరరావు కుటుంబరావుకు పూర్వ మిత్రుడు. తెలుగుదేశం పార్టీ 1983 జనవరి 5న జరగబోయే ఎన్నికల కోసం సమరోత్సాహంతో ఉరకలు వేస్తున్న సందర్భంలో ఒకనాడు కుటుంబరావు తన మిత్రుడైన నాదెండ్లను కలుసుకొని మాట్లాడారు. 'మీరు పెడుతున్న సభలకు ప్రజలు పెద్ద సంఖ్యలోనే వస్తున్నా రామారావు సినిమా నటుడని, ఆంధ్ర ప్రాంతం వాడనీ, కోటీశ్వరుడని, కమ్మ కులస్తుడనీ వ్యతిరేక ప్రచారం చేసి మీకు నష్టం కలిగించే ప్రయత్నాలు కూడా ప్రత్యర్థులు చేస్తారు. ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొని నిలవాలంటే గెలవాలంటే ఎన్నికల్లో కమ్యూనిస్టులతో కలిసి పని చేస్తే మీకు లాభిస్తుంది' అని అన్నారు.

భాస్కరరావు ఈ విషయాన్ని రామారావుతో కూడా చర్చించగా ఆయన కూడా ఈ ప్రతిపాదనకు అంగీకరించారు. నాదెండ్లతోనూ, ఎన్.టి.ఆర్.తోనూ కుటుంబరావు మాట్లాడారు. 'ఈ విషయాన్ని మాట్లాడేందుకు కమ్యూనిస్టులు మీ ఇంటికి రారు. మీరు కూడా వాళ్ల వద్దకు వెళ్లవలసిన అవసరం లేదు. ఉభయులకు అంగీకారయోగ్యమైన మూడవ చోట కూర్చుందామ'ని కుటుంబరావు చెప్పారు. ఎన్.టి.ఆర్. కూడా సరేనన్నారు. జూబ్లీహిల్స్‌లో తనకున్న ఖాళీ స్థలం (ఇప్పుడు బాలకృష్ణ ఇల్లు ఉన్న స్థలం)లో కలుసుకుందామనుకున్నారు. ఈ విషయాలను కుటుంబరావు నల్లమల గిరిప్రసాద్, దాసరి నాగభూషణ రావులతో చర్చించగా వారూ సరేనన్నారు. అనుకున్న ప్రకారం ఆ రోజు కుటుంబరావు, గిరిప్రసాద్, దాసరి వెళ్లారు. అటు వైపు నుంచి ఎన్.టి.ఆర్., నాదెండ్ల వచ్చారు. మొత్తం ఐదుగురు ఎన్.టి.ఆర్. కార్లో కూర్చున్నారు. రామారావు మొదట మాట్లాడుతూ 'మీరు, మేము కలిసి ఎన్నికల్లో పాల్గొనడం మంచిదని సోదరులు కుటుంబరావు చెప్పిన సలహా బావుందని మేం భావిస్తున్నాం. మీ వారెందరో స్వాతంత్ర్యోద్యమంలో ప్రాణాలర్పించారు. అనేక మంది జైళ్ల పాలయ్యారు. అటువంటి త్యాగమూర్తులతో కలిసి పనిచేయడానికి ఎంతో సంతోషంగా వుంది' అని తనదైన శైలిలో అన్నారు. మీతో కలిసి పనిచేయడానికి మాకూ సంతోషంగానే వుందని, ఉభయ కమ్యూనిస్టు పార్టీలం మీతో కలిసి పనిచేస్తామని, మార్క్సిస్టు పార్టీతో కలిసి మాట్లాడుతామని, తర్వాత ముగ్గురమూ కలిసి చర్చించి నిర్ణయం తీసుకుందామని గిరిప్రసాద్ రామారావుతో అన్నారు.

తర్వాత సిపిఐ, సిపిఐ ఎం నాయకులు నల్లమల గిరిప్రసాద్, పుచ్చలపల్లి సుందరయ్య ఎన్.టి. రామారావును కలుసుకోగా ఆయన విందుకు ఆహ్వానించారు. అనంతరం ఎన్నికల పొత్తు గురించి జరిగిన చర్చల్లో 60 శాసనసభా స్థానాలిస్తామని రామారావు ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు చెప్పారు. కమ్యూనిస్టు నాయకులు అందుకు అంగీకరించక వెళ్లిపోయారు. తర్వాత

కుటుంబరావు నాదెండ్ల భాస్కరరావు, ఎన్.టి. రామారావులను కలుసుకున్నారు. కమ్యూనిస్టులు 80 స్థానాలు అడిగారని, మేం 60 స్థానాలు ఇస్తామని చెప్పామని చెప్పారు. 'మీరు మరి కాస్త రాజీ పడాల'ని కుటుంబరావు అనగా ఈసారి మరో 5 స్థానాలు ఇద్దామని ఎన్.టి.ఆర్. అంటున్నారని భాస్కరరావు చెప్పారు.

ఎన్.టి.ఆర్. మరో 5 స్థానాలు ఇవ్వడానికి సంసిద్ధులుగా ఉన్నారని, పొత్తు గురించి ఆలోచించమని సిపిఐ నాయకులకు చెప్పేందుకు కుటుంబరావు మగ్దూమ్ భవన్‌కు వెళ్లారు. నాయకులు నవ్వుకుంటూ ఎదురొచ్చి గౌతు లచ్చన్న, బాబుల్‌రెడ్డిలతో ఒప్పందం చేసుకున్నామని, పత్రికలకు కూడా ఆ విషయం వెల్లడించామని చెప్పారు.

కుటుంబరావు నిరుత్తరుడయ్యారు. అంతకు మించి నిరుత్సాహపడ్డాడు. కొంత వ్యంగ్యం, కొంత కోపం మిళితమైన స్వరంతో 'మనం ఎప్పుడూ మంచి నిర్ణయం తీసుకొని ఎరగం. ఇప్పుడు మీరు తీసుకున్న నిర్ణయం ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీకి నష్టం కలిగించేదే కాని బాగు చేసేది కాదు. మీరు పెట్రోలు పోసినారు. రేపు ప్రజలు నిప్పంటిస్తారు' అంటూ వెళ్లిపోయారు.

నిజానికి ఎన్.టి.ఆర్. చెప్పిన స్థానాలకు ఒప్పుకొని కలిసి పోటీ చేసినట్లయితే కనీసం 50 స్థానాలు గెలుచుకొని వుండేవారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టుల బలహీనత బయటపడింది. అలా కాకుండా ఎన్.టి. రామారావుతో కలిసి పోటీ చేసి వుంటే కనీసం 50 స్థానాల్ని గెలుచుకోవడమే కాకుండా కమ్యూనిస్టుల మద్దతుతోనే రామారావు ఎక్కువ స్థానాలు గెలిచినట్లు వాతావరణం ఏర్పడేది. కమ్యూనిస్టు నాయకుల అనాలోచిత, దూరదృష్టి రహిత రాజకీయ ఎత్తుగడలవల్ల 1948లోనూ, 1955లోనూ, ఆ తర్వాత కూడా పార్టీ ఎంతో బలహీనపడింది. 1984లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో నేను సిపిఐ నాయకులకు కుటుంబరావు ఒక సలహా ఇచ్చారు. నల్లగొండ, భద్రాచలం లోక్‌సభా స్థానాల్లో సిపిఐ పోటీ చేసి మిర్యాలగుడా, ఖమ్మం లోక్‌సభ స్థానాలను సిపిఐ ఎంకు వదలమని ఎంతగానో చెప్పారు. కాని ఆయన మాటలు పెడచెవిన పెట్టి ఉభయ కమ్యూనిస్టులు ఖమ్మం స్థానానికి పోటీ చేయడంతో ఇద్దరూ ఓడిపోవడమే గాక రాజకీయాలతో సంబంధం లేని పోలీసు అధికారి అయిన పి.వి. రంగయ్యానాయుడు కాంగ్రెస్ పక్షాన విజయం సాధించడమే గాక కేంద్ర మంత్రి కూడా అయ్యారు. ఈ విధంగా సమైక్యంగా కమ్యూనిస్టు ఉద్యమాన్ని పటిష్టం చేయడం, పేదలకు సేవ చేయడం మాని ఉద్యమాన్ని నిర్వీర్యం చేశారు. బలహీనపడుతున్న కాంగ్రెస్ ఎంతగానో బలపడేలా చేసేందుకు వీరి తెలివి తక్కువ ఎత్తుగడలు తోడ్పడ్డాయి. ఇటువంటి పరిస్థితులు చూసే నాలాంటి సీనియర్ కార్యకర్తలు పార్టీ నుండి, రాజకీయాల నుండి దూరం కావడం జరిగింది. అని కావూరి కుటుంబరావు తన అభిప్రాయాలను వివరించారు.

కావూరి (హిల్స్) కుటుంబరావు హైదరాబాద్ జీవితం

భవిష్యత్తు భూమి చుట్టూ తిరుగుతుందని ఊహించకపోయినా ఏనాడైనా భూమికి ప్రాధాన్యత తప్పక ఉంటుందని భావించిన కుటుంబరావు, ఆయన మిత్రులు అక్కడ కూడా భూములను కొన్నారు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక హైదరాబాద్ తరలివచ్చారు. అమీర్‌పేట సమీపంలోని నాగార్జుననగర్ ప్రాంతంలో కుటుంబరావు, చంద్ర రాజేశ్వరరావు, తమ్మారెడ్డి సత్యనారాయణ, వై.వి. కృష్ణారావు, కడియాల గోపాలరావు, వీరమాచనేని ప్రసాద్, దేవులపల్లి వెంకటేశ్వరరావు కలిసి 14 వేల రూపాయలకు 9 ఎకరాల స్థలాన్ని కొన్నారు. యూసుఫ్‌గూడాలో కుటుంబరావు, చంద్ర రామలింగయ్య, రావి సుబ్బారావు కలిసి 15 వేల రూపాయలకు 3 ఎకరాల స్థలాన్ని కొన్నారు. ఆనాడు వ్యాపారదృష్టి లేదు. భూములకు ధరలు లేవు. ఆ భూములను తలా కొంత పంచుకొన్నారు. ఎవరికో ఇచ్చుకున్నారు. ఆనాడు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ లేవు. ఎర్రగడ్డ నుంచి కాలి నడకన తిరిగేవారు.

జార్జ్ ఎడ్మండ్ కాక్ అనే ఇంగ్లీషు ఆయన నిజాం వద్ద ఉద్యోగిగా ఉండేవాడు. ఇప్పటి మాసాబ్‌టాంక్ ప్రాంతంలో ఉండేవాడు. ఇప్పటి కావూరి హిల్స్ (కావూరి కుటుంబ రావు పేరిట వెలిసిన సంపన్నుల నివాసాల ప్రాంతం), మాదాపూర్, హైటెక్ సిటీ, సైబర్ టవర్స్ (ఐటి కంపెనీల నెలవైన మరో హైటెక్ నగరం) ప్రాంతంలో 360 ఎకరాల స్థలాన్ని ఒకతను 20 వేల రూపాయలకు కొన్నాడు. వెయ్యి రూపాయలు అడ్వాన్స్ ఇచ్చారు. మిగతా మొత్తం ఇవ్వలేదు. భూమికి సంబంధించిన కాగితాలు కాక్స్ వద్దే వున్నాయి. రామలింగేశ్వరరావు, కోడూరి వెంకట్రామయ్య, కావూరి కుటుంబరావు, యలమంచిలి బాలకోటయ్య కలిసి ఆ భూమిని 80 వేలకు కొన్నారు. అంతా కొండలు, గుట్టలమయంగా వుండేది. శిస్తు ఎకరం రూపాయి. మిగతా ఇద్దరు అదీ ఇవ్వలేదు. బాలకోటయ్యకు కుటుంబ బాధ్యతలుండేవి. వెంకట్రామయ్య నుంచి ఆవుల సాంబశివరావు 10 ఎకరాలు, రాజారావు 10 ఎకరాలు కొన్నారు. శిస్తులు కట్టలేక వాళ్లు కూడా అమ్ముకున్నారు. బాలకోటయ్యకు 90 ఎకరాలు, కావూరి కుటుంబరావుకు 90 ఎకరాలు వచ్చింది. బోరబండ వైపు భూమి రామలింగేశ్వరరావుకు, మెహర్‌బాబా మందిర్‌వైపు బాలకోటేశ్వర రావుకు, కావూరి హిల్స్ ప్రాంతం కుటుంబరావుకు వచ్చింది. ఈ భూమిని మెయింటేన్ చెయ్యడం వీళ్ల వల్ల కాలేదు. పట్టణ భూగరిష్ట పరిమితి చట్టం కింద కొంత భూమి పోగా లే అవుట్ అప్రూవల్ వంటి ఖర్చులు పోయాయి. 1979లో 77 ఎకరాలను అధికారికంగా లే అవుట్ చేసి 550 ప్లాట్లుగా విభజించారు. ఎకరానికి 8 వేలు, గజం 9 రూపాయలకు అమ్మారు.

కుటుంబరావుకున్న స్థలం పోయింది పోగా మిగిలిందాన్ని చాలా చవకగా అమ్మగా చాలామందికి ఉచితంగా ఇవ్వగా, తనను నమ్ముకున్న బంధువర్గానికి కూడా ఇవ్వగా మిగిలిన

కొద్దిపాటి స్థలంలో ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్నారు. ఆయన వద్ద నుంచి అలా పొందినవాళ్లు ఈనాడు కోటీశ్వరులు. కుటుంబరావుకు మిగిలింది చాలా తక్కువ. అదే ఆయన ఆస్తి. ఇప్పటికీ ఉన్నదాంట్లో దానాలు చేస్తూనే వుంటారు.

మాదాపూర్ పోలీసు స్టేషన్‌కు స్థలదానం

మాదాపూర్ పోలీసు స్టేషన్‌కు 1300 గజాల సుమారు 50 లక్షల ఖరీదైన స్థలాన్ని కుటుంబరావు ఉచితంగా ఇచ్చారు. కొంత నగదు విరాళాన్ని కూడా అందజేశారు. గుట్టల బేగంపేట గ్రామంలో రెండు దశలుగా నిర్మించిన ఈ పోలీసు స్టేషన్‌కు కుటుంబరావు ఇచ్చిన స్థలం ఎంతో విలువైంది. ఆయనను ఆదర్శంగా తీసుకొని మరి కొంత మంది దాతలు తమ వంతు పరికరాలు, ధనసహాయం అందించడంవల్ల ఈనాడు నగరంలోని పోలీసు స్టేషన్లకు మించిన వసతులతో అది నిర్మించబడింది. సైబరాబాద్‌గా కనీవినీ ఎరుగనంత అభివృద్ధి సాధించిన ఆ ప్రాంతానికి తగిన వసతులతో కూడిన పోలీసు స్టేషన్ వచ్చిందంటే అందుకు కుటుంబరావు ఇచ్చిన స్థలదానం ప్రధాన కారణమని చెప్పవచ్చు. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, హోంమంత్రి దేవేందర్ గౌడ్, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి కె. విజయరామారావు, డిజిపి పేర్వారం రాములు కుటుంబరావును సత్కరించారు.

మెహర్‌బాబా మందిర్‌కు ఎకరం స్థలం దానం

అవతార్ మెహర్‌బాబా కొన్ని నెలల పాటు సంచరించిన పవిత్రమైన హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్రాంతంలో మెహర్‌బాబా మందిరాన్ని నిర్మించాలన్న దేశవిదేశాల్లో వున్న లక్షలాది భక్తుల కోరిక నెరవేరింది. కావూరి కుటుంబరావు ఉచితంగా కేటాయించిన ఖరీదైన 1000 గజాల స్థలం వల్ల భక్తుల కోరిక నెరవేరింది. దీని వెనక కథ... మెహర్‌బాబా భక్త సమాజం నిజామాబాద్ కేంద్రానికి చెందిన ఇద్దరు భక్తులు 1982 జనవరి నుంచీ హైదరాబాద్‌లో అవతార్ మెహర్‌బాబా మందిర నిర్మాణానికి అనువైన స్థలం కోసం అన్వేషిస్తున్నారు. ఒక రోజు ఎస్.ఎస్. ప్రసాద్ సలహాపై వారు జూబ్లీహిల్స్‌లో అప్పట్లో రవీంద్ర సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడిగా వున్న కావూరి కుటుంబరావును కలుసుకున్నారు. ఆ ప్రాంతంలో మెహర్‌బాబా మందిరాన్ని నిర్మించేందుకు స్థలం కావాలని, మాకు మేముగా ప్రయత్నిస్తే వివాదాలతో కూడిన స్థలం తప్ప మంచి స్థలం లభించదని, ఈ విషయంలో సహాయం చెయ్యమని అడిగారు. నిజానికి మొదటి నుంచీ కమ్యూనిస్టు, దేవునిపై విశ్వాసం లేని కుటుంబరావు ఒక దేవుని మందిరం కోసం ఉచితంగా స్థలం ఇస్తారని ఆ వచ్చినవారు అసలు ఊహించలేదు. నాకు దేవుని మీద భక్తి లేదు. కాని దేవునిపై ధ్యాస నిలిపి కొలిచే భిన్న మతాలు, భిన్న ప్రాంతాల ప్రజలకు ఒక ప్రశాంతమైన ఆధ్యాత్మిక వేదికను నిర్మించాలనే

సంకల్పంపై గౌరవంతో స్థలాన్ని ఇస్తానని కుటుంబరావు వాగ్దానం చేశారు. ఆ వచ్చినవారి ఆనందాశ్చర్యాలకు అంతు లేదు. ఈ వార్త ప్రపంచంలోని వివిధ దేశాల మెహర్‌బాబా భక్తులకు ఆనందాన్ని కలిగించింది. 1982 మార్చి 21న కాకినాడలో జరిగిన అవతార్ మెహర్‌బాబా రాష్ట్ర సంఘం పాలకవర్గం సంఘం అధ్యక్షుడు డా. తోట ధనపతిరావు నాయుడు అధ్యక్షతన జరిపిన సమావేశంలో కావూరి కుటుంబరావు దాతృత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేసింది.

1982 మార్చి 31న మెహర్‌బాబా ముఖ్య శిష్యుడైన ఆలోబాజీ మెహర్‌బాబా మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ సమావేశంలో పాల్గొన్న బాబా భక్తులు కుటుంబరావు స్థలం ఇవ్వడం పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అదే సభలో మెహర్‌బాబా మందిర నిర్మాణ పనులను ప్రారంభించేందుకు కుటుంబరావు తన వంతుగా 10,000 రూపాయలను విరాళంగా అందజేశారు. ఆయన ప్రకటించిన విరాళానికి స్పందించి మరికొందరు 30,000 రూపాయల విరాళం ప్రకటించారు. త్వరత్వరగా పనులు చేపట్టి శంకుస్థాపన చేసిన 10 నెలలు తిరక్కుండానే అంటే 1982 నవంబర్ 28న అవతార్ మెహర్‌బాబా మందిరం ప్రారంభమైంది. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బి.ఎన్. రామన్ మందిరాన్ని ప్రారంభించారు. ప్రధాన ద్వారాన్ని మాజీ డిజిపి ఎం.వి. నారాయణరావు ప్రారంభించారు. ఆ రోజుల్లో ఆ ప్రాంతానికి బస్సులు కూడా నడిచేవి కావు. ప్రభుత్వానికి విజ్ఞప్తి పంపగా రెండు బస్సుల్ని వేశారు.

చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ స్థాపన

కుటుంబరావు, చంద్ర రాజేశ్వరరావు ఎంతో సన్నిహితంగా వుంటూ పోరాటాల్లో పాల్గొన్నారు. దశాబ్దాల మైత్రి, ఆత్మీయతానుబంధం. అటువంటి సహచరుడు మరణించడం కుటుంబరావుకు తీరనిలోటు కలిగించింది. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో రాజేశ్వరరావు స్మృత్యర్థం ఆయన విగ్రహం, సి.ఆర్. ఫౌండేషన్ నెలకొల్పాలని నాయకులు ఆలోచన చేశారు. ముఖ్యంగా దాసరి నాగభూషణరావు, సురవరం సుధాకర్ రెడ్డి వంటివారు కుటుంబరావును కలిసి తమ ఆలోచన తెలపగా ఆయన కూడా దాన్ని బలపరిచారు. అది కొద్ది కాలంలోనే కార్యరూపం దాల్చింది. చక్కని వాతావరణంలో సి.ఆర్. ఫౌండేషన్ వెలసింది. పార్టీకి సేవ చేసి వార్ధక్యంలో వున్న వారు, ఇతర పెద్దలకు ఫౌండేషన్ ఆశ్రయం కల్పిస్తోంది. తాము కనిపెంచిన పిల్లలకంటే బాగా చూసుకుంటూ వేళకు అన్నీ సమకూర్చే ఏర్పాటు వుంది. మంచి గాలి, పుష్పఫల వృక్షాలు, ఆహ్లాదకరమైన పరిసరాలు, చదువుకునేందుకు ఎటువంటి పుస్తకాలనైనా సమకూర్చే గ్రంథాలయం... ఇవన్నీ ఫౌండేషన్ లో వున్నాయి. ఫౌండేషన్ స్థాపన కోసం కావూరి కుటుంబరావు తన వంతు విరాళం అందించారు. గ్రంథాలయానికి కంప్యూటర్ కూడా సమకూర్చారు.

కుటుంబరావు వదాన్యత గురించి చెప్పుకునేవారెందరో. ప్రతిభావంతులై వుండి డబ్బు లేదన్న కారణంతో చదువు మానేసే వారంటే ఆయన ఎంతగానో స్పందిస్తారు. అటువంటివారికి ఉన్నత చదువు కోసం అవసరమైన ఫీజులు కట్టి ఎలా పైకి రావాలో సలహాలనిచ్చి వెన్ను తట్టడం ఆయన మంచితనానికి నిదర్శనం. ఎంతోమందికి కుల, మతాలకు అతీతంగా ఆదర్శ వివాహాలు చేశారు. వాళ్లు నిలదొక్కుకునేందుకు ఊతం కల్పించారు. ఆయన ప్రోత్సాహంతో పెద్ద చదువులు పూర్తి చేసి ఉద్యోగాలు చేసుకుంటున్న వారు ఎంతో మంది వున్నారు. ఇటీవల తాను చదువుకున్న రావివారిపాలెం పాఠశాలకు, తన పిల్లలు చదువుకున్న హైస్కూలుకు అభివృద్ధి కోసం విరాళాలు అందజేశారు. గ్రంథాలయాల్ని నెలకొల్పేందుకు సహాయం చేశారు. ఆయన సహాయంతో ఎన్నో పుస్తకాలు వెలుగు చూశాయి. ఎంతో మంది కవి, రచయితలు కుటుంబరావుకు పుస్తకాలను అంకితమిచ్చారు. ముఖ్యంగా చెప్పుకోదగ్గ వాటిలో డా. వాసా ప్రభావతి కళాప్రపూర్ణ రావూరి వెంకటసత్యనారాయణ జీవితంపై రచించిన 'కళాతపస్వి రావూరు' గ్రంథాన్ని కుటుంబరావుకు అంకితమిచ్చారు. వెంకట సత్యనారాయణతో కుటుంబరావుకు ఆత్మీయ స్నేహం, అనుబంధాన్ని పురస్కరించుకొని ఆయనపై పుస్తకాన్ని అంకితం పొందేందుకు అంగీకరించారు. డా. ఎ.బి.కె. సంపాదకీయాల సంకలనం 'అక్షర జలపాతాలు – ఆత్మ విశ్వాసాల పారిజాతాలు', డా. కె.బి. కృష్ణ సెలెక్టెడ్ రైటింగ్, డా. రావి రంగారావు 'వచన కవితోదయం', డా. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి 'ప్రజాపోరాటాల రంగస్థలి ప్రజానాట్య మండలి', పోలవరపు కోటేశ్వరరావు 'కృష్ణావైభవం', శింగరాజు విజయ లక్ష్మీప్రసాద్ 'విజయ గీతికలు' వంటి గ్రంథాలకు కుటుంబరావు ఆర్థిక సహాయం అందజేశారు. ఎక్కడికైనా సాహిత్య సభకు, సాంస్కృతిక కార్యక్రమానికో వెళితే ఊరకే వినోదం చూసి రారు. కళాకారుల ప్రదర్శనల వెనుక కష్టాలను గుర్తించి వెయ్యో రెండు వేలో ఉన్న పళాన చేతిలో పెట్టి రావడం ఆయనకు ఇష్టం. కాని పేరు కోసం పాకులాడే తత్వం కాదు. తొంబయ్యో సంవత్సరంలో అడుగిడినా నిత్యం చైతన్యవంతమైన జ్ఞాపకాల్లో ఆయన మునిగి తేలుతూ వుంటారు. ఆయన జ్ఞాపకశక్తికి జోహారనవలసిందే.

కుటుంబరావు కుటుంబం

నిరంతరం ప్రజల కోసమే తపిస్తూ రైతు సంఘ కార్యకలాపాల్లో, కమ్యూనిస్టు పోరాటాల్లో, రహస్య జీవితం, కారాగారవాసంలో నిమగ్నమైనా కుటుంబరావు తమ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయలేదు. నలుగురు అన్నదమ్ముల్లో ఆయన అగ్రజుడు. ఆయన సతీమణి శ్రీమతి వరలక్ష్మి కృష్ణా జిల్లా కాటూరు గ్రామానికి చెందిన సూర్యదేవర పున్నయ్య, కోటమ్మ దంపతుల రెండవ కూతురు. 1937 డిసెంబర్‌లో కుటుంబరావు, వరలక్ష్మిల వివాహమైంది. ఆమె చదువుకోకపోయినా భర్తకు అన్ని విధాలా తోడునీడగా వుండేది. కుటుంబరావు ప్రజాజీవితంలో

వుండి కుటుంబాన్ని పట్టించుకునే పరిస్థితి లేనప్పుడు ఆమె ఇల్లును చక్కదిద్దుకుంది. 1948లో జరిగిన ఒక సంఘటన. వాళ్ల ఇల్లు ఊరికి దూరంగా పొలాల్లో వుండేది. కుమారుడు, కూతురు, మామయ్య శివరామయ్యలను చూసుకునే బాధ్యత ఆమెదే. కుటుంబరావు సహచరులైన చల్లపల్లి నారాయణరావు, చలసాని జగన్నాథరావు వంటి నాయకులకు ఆమె ఇంట్లో ఆశ్రయం ఇచ్చేది. కుటుంబరావు జైల్లో వున్నప్పుడు ఆమె జైలుకు వెళ్లి అక్కడి నాయకులు ఇచ్చిన లేఖల్ని ఇక్కడి నాయకులకు అందజేయడం చేసేది. ఒక రోజు చంద్ర రామలింగయ్య భార్య సూర్యాంబ, చంద్ర రాజేశ్వరరావు చెల్లెలు నీలకంఠమ్మ, మాలెంపాటి సీతారామయ్య భార్య శారదాంబ వరలక్ష్మి వద్దకు ఆమె ద్వారా జైలులోని నాయకులకు 10 వేల రూపాయలు పంపించాలని వచ్చారు. ఆ సమయానికి ఆమె లేదు. కుటుంబరావు నాన్న శివరామయ్య ఉన్నారు. సరిగ్గా అదే సమయంలో పోలీసులు ఇంటి చుట్టు అలముకొన్నారు. ఆ మహిళలు హడావిడిలో తాము తెచ్చిన డబ్బును ఇంటి చూరులో కుక్కారు. పోలీసులు ఇంట్లోకి వచ్చి మీరెందుకు వచ్చారని ప్రశ్నించారు. మా కోడలు వరలక్ష్మితో కలిసి జైలుకు వెళ్లి తమ వారిని చూసి వద్దామని వచ్చారని శివరామయ్య చెప్పారు. అయినా వినలేదు. వారిని పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. చల్లపల్లిలో కాంగ్రెస్ నాయకుడు పోలీసుల్ని మందలించి వారిని విడిపించారు.

1941లో కుటుంబరావు, వరలక్ష్మి దంపతులకు ఒక కుమారుడు కలిగాడు. వెంకట్రావు అని పేరు పెట్టారు. ఎస్.ఎస్.ఎల్.సి వరకు చదివి రైస్ మిల్లు వ్యాపారం ప్రారంభించాడు. ఒక మిల్లు అద్దెకిచ్చి ఒకదాన్ని స్వయంగా నడిపేవాడు. హైదరాబాద్ రమ్మని తండ్రి కోరినా ఇక్కడి వాతావరణం ఇష్టపడక ఊరు వదలడానికి ఇష్టం లేక అక్కడే వుండిపోయాడు. వెంకట్రావుకు అరుణకుమారితో వివాహం జరిపించారు. మదిరపాడుకు చెందిన మానికొండ సూర్యావతి వరలక్ష్మితో అరుణకుమారికి 'తల్లిదండ్రులు లేరు, పెద్దమ్మ పెంపకంలో వుంది, ఆస్తిపాస్తులేమీ లేవు. మంచి అమ్మాయని చెప్పింది. వరలక్ష్మి కుటుంబరావుతో ఆ అమ్మాయిని మనబ్బాయికి చేసుకుందామా అంటే ఆయన సరేనన్నారు. వెంకట్రావు అరుణకుమారి దంపతులకు రవికుమార్ అనే కుమారుడు, సుధారాణి, ఉషారాణి అనే కుమార్తెలున్నారు. కుటుంబరావుకు కుమారుడు వెంకట్రావుతో పాటు లక్ష్మీదేవి, నాగమణి అనే కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె లక్ష్మీదేవి భర్త రఘురామా రావు. రెండవ కుమార్తె నాగుల చవితినాడు 1959 నవంబర్ 4న పుట్టింది. అందువల్ల నాగమణి అని పేరు పెట్టారు. ఆమె భర్త వెంకటేశ్వరరావు. లక్ష్మీదేవి ఊళ్లోనే వుంటున్నారు. నాగమణి మాత్రం హైదరాబాద్‌లోని కావూరి హిల్స్‌లో వుంటున్నారు.

కుటుంబరావు సతీమణి వరలక్ష్మి 1985లోనూ, ఏకైక కుమారుడు వెంకట్రావు

1987లోనూ మరణించారు. భార్యాకుమారుడు వెంటవెంటనే కన్ను మూసిన విషాదం నుంచి కోలుకోవడానికి చాలా కాలం పట్టింది. కాలమే గాయాలను మాన్పుతుందన్నట్లు అయ్యింది. వెంకట్రావుకు రవికుమార్ అనే కుమారుడున్నారు. రవి బిటెక్, ఎంబిఎ చదివి హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తున్నారు. ఆయన భార్య సుధారాణి. వీరి కుమార్తె కావ్య. కుటుంబరావు పెద్ద కుమార్తె లక్ష్మీదేవి కుమార్తె రమాదేవి బిఎస్సీ చదివింది. ఆమె భర్త గోపీచంద్. వీరి కుమారులు గద్దె శరచ్చంద్ర, వేణుగోపాల్. వేణుగోపాల్ బిటెక్, భార్య సరిత బిఎస్సీ. వారి కుమారుడు అరవింద్.

కావూరి శివరామయ్య నలుగురు కుమారుల్లో కుటుంబరావు అగ్రజుడు. తర్వాత వెంకటేశ్వరరావు, డా. కోటయ్య, వీరరాఘవ రావు. వీరిలో వెంకటేశ్వరరావు తేనె రంగంలో ఉన్నత శిఖరాలకు అధిరోహించారు. తేనె పరిశ్రమ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారు. ఐదు దశాబ్దాల గణనీయమైన సేవలకు గాను అఖిల భారత తేనె మహోత్సవాల్లో తేనె పరిశ్రమ పితామహుడని అవార్డు బహూకరించారు. ఏజెన్సీ ప్రాంతంలోనే తప్ప వేరెక్కడా తేనె పరిశ్రమ అభివృద్ధికి అవకాశం లేదనే నిపుణుల అభిప్రాయాన్ని తిరగరాసి ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం లేకుండానే తేనె దిగుబడులను సాధించారు. ఒక్కో తేనె పట్టు నుంచి లభించే సగటు తేనె 5 కిలోలు మాత్రమే వుండేది. వెంకటేశ్వరరావు ప్రయోగాలతో ఒక్కో పట్టు నుంచి 20 కిలోల తేనె సాధించి నిపుణులను సైతం ఆశ్చర్యపరిచారు. ఒక్క కృష్ణా జిల్లాలోనే 3 వేల మందికి శిక్షణ సలహా సూచనలు అందించడం ద్వారా తేనెటీగల పెంపకందార్లుగా తీర్చిదిద్దారు. తెనాలిలో స్థిరపడ్డ వెంకటేశ్వరరావు తేనెటీగల పెంపకంలో సాధారణ మేస్త్రీగా వ్యవసాయ శాఖలో ఉద్యోగిగా ప్రవేశించి సబ్ అసిస్టెంట్‌గా పదవీవిరమణ చేశారు. తేనెటీగల పెంపకంలో విశేషమైన అనుభవం సంపాదించిన కావూరి వెంకటేశ్వరరావును ఆంధ్రప్రదేశ్ తేనె పెంపకందార్ల సంఘం అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. కోస్తాలోని గుంటూరు, కృష్ణా, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోనూ, తెలంగాణలోని హైదరాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోనూ వెంకటేశ్వరరావు రైతులకు తేనె పరిశ్రమలో శిక్షణనిచ్చారు. ఇక్రిశాట్, వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం వంటి ప్రముఖ సంస్థలు ఎంపిక చేసిన రైతులు, నిరుద్యోగ యువతకు తేనె పరిశ్రమ చేపట్టడంలో వెంకటేశ్వరరావు శిక్షణనిచ్చారు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో కూడా వెంకటేశ్వరరావు సేవలందించారు.

వెంకటేశ్వరరావు భార్య తులశమ్మగారు. పెద్ద కుమార్తె కండెపు విమల. ఆమె భర్త రాజశేఖర్. వారి మొదటి కుమారుడు సీతారామప్రసాద్, ఆయన భార్య రోజాదేవి. వారికి ఇద్దరి కుమారులు. 1. సీతారామ వినయకుమార్, భార్య నీరజ. వారిరువురి పిల్లలు గీతాప్రసాద్, జాహ్నవీకృష్ణ. 2. విజయకుమార్, భార్య రేణుక. మొదటి కుమారుడు రేవంత్. రెండవ కుమారుడు బుచ్చిబాబు. ఆయన భార్య ఝాన్సీరాణి. పిల్లలు: కుమార్తె లత, భర్త అమిర్నేని వెంకటేశ్వరరావు. రెండో కుమార్తె లక్ష్మీదేవి. భర్త యలవర్తి వేణుబాబు. వెంకటేశ్వరరావుగారి మూడో కుమారుడు సుబ్బారావు. ఆయన భార్య లక్ష్మి. రావుగారి

మూడో కుమార్తె విజయలక్ష్మి. భర్త దోనేపూడి వెంకటేశ్వరరావు, పిల్లలు పావని, ప్రతిమ. నాలుగో కుమారుడు సాంబశివరావు. ఆయన భార్య అరుణకుమారి. వాళ్ల కుమారుడు విజయేందర్. నాలుగో కుమార్తె గంగాభవాని, భర్త యలవర్తి సాంబశివరావు, పిల్లలు కిరణ్, దొరబాబు. వెంటకేశ్వరరావు 2003లో కన్నుమూశారు.

డాక్టర్ కోటయ్య 1926 జులై 1న జన్మించారు. పశుసంవర్ధన రంగంలో విశేషానుభవం గడించారు. మొదట రెండేళ్లు సైన్యంలో పనిచేసి తర్వాత వెటర్నరీ సైన్స్ అధ్యయనం చేశారు. పశుసంవర్ధక శాఖలో 1951వ సంవత్సరంలో చేరారు. లెక్చరర్‌గా, రీసెర్చ్ ఆఫీసర్‌గా తిరుపతి, నిడుబ్రోలు, విశాఖ మొదలైన చోట్ల పనిచేశారు. 1965లో రష్యాలో ప్రత్యేక ప్రాజెక్టులో కొంత కాలం పనిచేశారు. మైక్రో బయోలజీలో పరిశోధన చేసి డాక్టరేట్ తీసుకున్న డా. కోటయ్య సూర్యాపేటలో పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కేంద్రంలో అధికారిగా సేవలందించారు. మండపేటలోని వెటర్నరీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఇండో స్విస్ ప్రాజెక్టు అధికారిగా క్రాస్ బ్రీడర్ ఫామ్ జాయింట్ డైరెక్టర్‌గా, ప్రాజెక్టు మేనేజర్‌గా చేశారు. పశుసంవర్ధక శాఖలో హైదరాబాదులో అదనపు డైరెక్టర్‌గా 1983 ఫిబ్రవరి 28న పదవీవిరమణ చేశారు. వారి సతీమణి నాంచారమ్మ. పిల్లలు పెద్దకుమార్తె డా. కొండా పద్మజారాణి (ఎం.డి. అమెరికా), ఆమె భర్త డా. కొండా బాలచంద్రమౌళి (ఎం.ఎస్. అమెరికా), వాళ్ల కుమారులు సందీప్ (ఎం.ఎస్. అమెరికా), ప్రదీప్ (అమెరికా). కోటయ్య రెండవ కుమార్తె నల్లమోతు అమృతలోచన, భర్త నల్లమోతు రామకృష్ణ, కుమారులు శ్రీకాంత్, రవికాంత్. మూడవ కుమార్తె మేకా రుక్మిణి, ఆమె భర్త మేకా కృష్ణారావు. కుమారులు వెంకటశివతేజ, లీలా కృష్ణన్. కోటయ్యకు ఒక కుమారుడు. ఆయన పేరు కావూరి అనిల్ బాబు. భార్య సుజాత, కుమార్తె శివాని, కుమారుడు శివాజి. డా. కోటయ్య 1994లో మరణించారు.


తర్వాత వీరరాఘవరావు. 1933 జూలై 1న జన్మించిన రాఘవరావు ప్రభుత్వంలో వ్యవసాయాధికారిగా, మండల ప్రజాపరిషత్తు అధికారిగా సేవలందించారు. 1950లో వ్యవసాయ శాస్త్రవేత్తగా ఔద్యోగిక జీవితాన్ని ప్రారంభించారు. తర్వాత ఐదేళ్లకు అగ్రికల్చర్ ఫామ్ మేనేజర్ అయి కోరుట్ల, నేలకొండపల్లి, వైరాల్లో పనిచేశారు. తర్వాత వ్యవసాయాధి కారిగా చర్లలో ఐదేళ్లు, హుజూర్‌నగర్, కోదాడల్లో ఎనిమిదేళ్లు సేవలందించి మంచి గుర్తింపు పొందారు. తర్వాత మండల అభివృద్ధి అధికారిగా పదోన్నతి పొంది నడిగూడెంలో 1991లో పదవీవిరమణ చేశారు. సతీమణి స్వర్ణకుమారి. ఇద్దరు కుమారులు. పెద్దవాడు గోపీనాథ్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్, రెండవవాడు కొండలరావు హైకోర్టు న్యాయవాది. కుమార్తె హేమలత. గోపీనాథ్, కళ్యాణి దంపతులకు దీప్తి, మానస (అమెరికా) కుమార్తెలు. కొండలరావు, నీరజ దంపతుల సంతానం చందన, సాయినాథ్. అమ్మాయి హేమలత భర్త సుధాకర్ (డిఎస్‌పి), పిల్లలు శ్వేతసుధ (అమెరికా), స్నేహసుధ.

123


చిత్రమాలిక




రావివారి పాలెం గ్రంథాలయ
ప్రారంభోత్సవంలో కావూరి
కోదండరామయ్య, గొట్టిపాటి బ్రహ్మయ్య




కావూరి వెంకట క్రిష్ణయ్య, కావూరి కోదండరామయ్య (కుటుంబరావుగారి పెదనాన్న), కావూరి శివరామయ్య (కుటుంబరావు తండ్రి గారు)




కుటుంబరావు రెండవ కుమార్తె నాగమణి వివాహ సందర్భంలో ఆయన సోదరులు, వారి సతీమణులు పిల్లలు, ఇతర కుటుంబసభ్యులతో...



వారనేక యుద్ధములనారితేరిన యోధులు...
కావూరి కుటుంబరావు, చంద్ర రాజేశ్వరరావు




రాజకీయంగా విభేదించవలసి వచ్చినా, వ్యక్తిగతంగా ఎంతో స్నేహంగా వుండే చల్లపల్లి రాజా ఎస్.ఆర్.వై. రామకృష్ణ ప్రసాద్ గారితో కావూరి




కుటుంబరావు ఏకైక కుమారుడు
కావూరి వెంకట్రావు, కోడలు
అరుణకుమారి



సంస్కరణ వివాహం చేయిస్తున్న కుటుంబరావు



ఏకైక కుమారుడు కావూరి వెంకట్రావు




కావూరి హిల్స్‌లో కుటుంబరావుగారి ఇల్లు



కంఠంనేని అచ్యుతరామయ్య, యార్లగడ్డ లక్ష్మయ్య కుటుంబరావుగార్లతో
కుటుంబరావు వెనుక నిల్చున్నవారు పెద్దల్లుడు గద్దె రఘురామారావు




తాను దానమిచ్చిన స్థలంలో అవతార్ మెహర్‌బాబా మందిర నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో... కావూరి మధ్యలో



తాను దానంచేసిన స్థలంలో నిర్మించిన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ భవన ప్రారంభోత్సవంలో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హోంమంత్రి మాధవరెడ్డి, డిజిపి దొరతో కుటుంబరావు



మాజీ శాసన సభ్యులు మిత్రులైన కాట్రగడ్డ వెంకటనారాయణ,
శ్రీనివాసరావుగార్లతో కావూరి కుటుంబరావు



వామపక్ష లౌకిక ప్రజాతంత్ర శక్తుల ఏకీకరణ సదస్సులో ప్రసంగిస్తున్న
మాదాల రంగారావు. వేదికపై కుటుంబరావు, ప్రగతి హనుమంతరావు



వేంకటేశ్వరరావు (అల్లుడు), రవికుమార్ (మనుమడు), కుటుంబరావు,
కావ్య (మునిమనుమరాలు), చంద్రబాబు నాయుడు, విజయరామారావు



మునిమనువరాలు కావ్య పుట్టినరోజు కేకు తినిపిస్తున్న కుటుంబరావు.
చిత్రంలో మనవడు రవికుమార్, ఆయన శ్రీమతి సుధారాణి




'విజయగీతికలు' అంకితోత్సవ సభలో శ్రీమతి ప్రసాద్, కావూరి కుటుంబరావు, మండలి బుద్ధప్రసాద్, ఐ.వి. చలపతిరావు



బాదం సరోజాదేవి డి.ఏ.వి. పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న కావూరి కుటుంబరావు ప్రక్కన బాదం రామస్వామి




తెనాలి, కమ్మజన సేవా సమాఖ్య ఉపకార వేతన పంపిణీ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న దృశ్యం



డాక్టర్ సి. నారాయణ రెడ్డిగారితో కావూరి



చల్లపల్లి రైతాంగపోరాటం పుస్తకావిష్కరణోత్సవంలో కుటుంబరావును సత్కరిస్తున్న శాసనసభ స్పీకర్ కె.ఆర్. సురేష్ రెడ్డి. ఎడమవైపు కొరటాల సత్యనారాయణ, దాసరి నాగభూషణ రావు




గ్రంథావిష్కరణ సభలో తమ అలనాటి రాజకీయ సహచరుడు
ప్రొఫెసర్ కె. శేషాద్రికి జ్ఞాపికనందిస్తున్న కుటుంబరావు




ఒక గ్రంథావిష్కరణ సభను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కుటుంబరావు.
వెనుక మండలి బుద్ధప్రసాద్, పిన్నమనేని వెంకటేశ్వరరావు కూడా ఉన్నారు



మోపిదేవి, చిన్ననాడు చదువుకున్న పాఠశాల వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న
కావూరి కుటుంబరావు



సి.ఆర్. ఫౌండేషన్‌లో జరిగిన గ్రంథావిష్కరణలో పాల్గొన్న ఎడమనుంచి
డా॥ కె. నారాయణ, కుటుంబరావు, దాసరి నాగభూషణరావు, మధు,
డా॥ కె. రామచంద్రమూర్తి




ప్యారిస్‌కు చెందిన పాల్ కోమర్‌తో కుటుంబరావు



మిత్రులు పోలవరపు కోటేశ్వరరావు,


డా॥ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిలతో కుటుంబరావు



సత్యసాయి అనాధ శరణాలయాన్ని ప్రారంభిస్తున్న కుటుంబరావు.
ఎడమవైపు కోడలు అరుణ కుమారి



రావి రంగారావు కవిత్వోదయం అంకితం తీసుకుంటున్న కుటుంబరావు
చిత్రంలో (ఎడమనుండి) మండలి బుద్ధప్రసాద్, కొల్లూరి కోటేశ్వరరావు,
డా॥ సి.నా.రె., డా॥ ఆవుల మంజులత, ద్వా.నా. శాస్త్రి



ముని మనవరాలు
కావ్యతో...



తమ ఇంటి ముంగిట...

141

అనుబంధం

142

143

వార్త

కమ్యూనిస్టు యోధుడు కుటుంబరావు మృతి

ప్రభాతవార్త, సైబరాబాద్‌జోన్ ప్రతినిధి

ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు కావూరి వెంకట కుటుంబరావు(90) సోమవారం రాత్రి ఒంటిగంటకు అనారోగ్యంతో మృతిచెందారు. కృష్ణాజి ల్లాకు చెందిన కుటుంబరావు అనేక కమ్యూనిస్టు, రైతాంగ పోరాటాల్లో కీలక భూమిక పోషించారు. చల్లపల్లి జమీందార్ రైతు వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహించారు. మాదాపూర్‌లోని కావూరిహిల్స్ తన కూతురు ఇంటివద్ద మృతిచెందిన ఆయనకు పంజాగుట్ట స్మశాన వాటికలో మంగళ వారం అంత్యక్రియలు నిర్వహించారు. తెలుగుభాషా సంఘం అధ్యక్షులు ఎబికె.ప్రసాద్, సినీ నటుడు మురళీ మోహన్, సిపిఐ, సిపిఎం నాయకులు ఆయన మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు.

ఆంధ్రభూమి
my news. my stories.
www.andhrabhoomi.net
8 సంచిక 18 హైదరాబాద్ సిటీ బుధవారం 17 అక్టోబర్ 2007 హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, అనంతపురం, కరీం...

కావూరి కుటుంబరావు కన్నుమూత

హైదరాబాద్, అక్టోబర్ 16: తొలితరం కమ్యూనిస్టు నాయకుడు, చల్లపల్లి జమీందారి రైతాంగ పోరాట యోధుడు కావూరి కుటుంబరావు మంగళవారం తెల్ల వారు జామున ఇక్కడ మరణించారు. ఆయన వయసు 88 సంవత్సరాలు. కృష్ణా జిల్లా దివిసీమలోని రావివారి పాలెంలో జన్మించిన కుటుంబరావు చిన్న వయసు లోనే సామ్యవాద భావాలు, సంస్కరణ దృష్టితో సమాజ సేవ చేశారు. ఆదర్శ వివాహాలు జరిపించారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా చల్లపల్లి జమీందార్లకు వ్యతిరేకంగా రైతుల పక్షాన పోరాడిన కుటుంబరావు కమ్యూనిస్టు అగ్రనేతలు చండ్ర రాజేశ్వరరావు, మద్దు కూరి చంద్రశేఖరరావు, ఎకె గోపాలన్, ఎం ఆర్ వెంక ట్రామన్, మోటూరు హనుమంతరావువంటి వారికి సన్నిహితులు. కుటుంబరావు మృతదేహానికి పంజాగుట్ట లోని శ్మశాన వాటికలో అంత్య క్రియలు జరిగాయి.

144

· WEDNESDAY, OCTOBER 17, 2007 ·

THE HINDU

INDIA'S NATIONAL NEWSPAPER SINCE 1878

Communist leader passes away

Special Correspondent

HYDERABAD: Veteran Communist leader Kavuri Kutumba Rao, 89, passed away in Hyderabad on Tuesday following cardiac arrest.

A first generation leader of Communist movement in the State, Kutumba Rao was known for participating in the struggle against Challpalli zamindar.

He was born in Ravivaripalem in Diviseema and was attracted towards socialist ideology.

Serving the poor and taking initiative in performing ideal marriages, Kutumba Rao worked closely with leading Communist leaders like Chandra Rajeswara Rao, Muddukuri Chandrasekhara Rao, A.K. Gopalan, M.R.Venkatraman and Moturi Hanumantha Rao. At the peak of repression against the Communist party, Kutumba Rao organised youth meetings and created awareness among the farmers. He was jailed for two years and spent his term in Rajahmundry and Cuddalore prisons.

CPI MP Suravaram Sudhakar Reddy in a statement said in the death of Kutumba Rao, CPI had lost a senior leader. Telugu University Vice-Chancellor Avula Manjulatha, film actor Murali Mohan, Communist leader Dasari Nagabhushan Rao and others paid homage to the departed leader.

కావూరి కుటుంబరావు మృతికి సంతాపం



నారాయణగూడ: తొలితరం కమ్యూనిస్టు నాయకులు, చల్లపల్లి రైతాంగ పోరాట యోధుడు కావూరి కుటుంబరావు (89) మంగళవారం తెల్లవారుజామున నగరంలో గుండెపోటుతో మృతి చెందారు. కృష్ణాజిల్లా దివి సీమలోని రావివారిపాలెంలో జన్మించిన కుటుంబరావు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా, చల్లపల్లి జమీందార్లకు వ్యతిరేకంగా రైతుల పక్షం వహించి పోరాటాన్ని సాగించిన వీరయోధుడు. కమ్యూనిస్టు పార్టీ అగ్రనేతలు చండ్ర రాజేశ్వరరావు, ఎ.కె గోపాలన్, ఎం.ఆర్ వెంకట్రామన్, మద్దుకూరి చంద్రశేఖర్‌రావు, మోటూరి హనుమంతరావు, దాసరి నాగభూషణం వంటివారితో కలిసి పనిచేశారు. కావూరి మృతి చెందారని తెలిసి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా. ఆవుల మంజులత, సీపీఐ నాయకులు దాసరి నాగభూషణరావు, కె.ప్రతాప్‌రెడ్డి, సినీనటుడు మురళీమోహన్ ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

...బాద్ 18-10-2007 గురువారం సిటీ సంపుటి 34 . సంచిక 70

ఈనాడు

THE LARGEST CIRCULATED DAILY IN ANDHRA PRADESH

165

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

పేజీలు: 18 + 20

కావూరి మృతికి అరసం సంతాపం

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆన్‌లైన్, సిటీబ్యూరో): స్వాతంత్ర్య సమర యోధుడు, వామపక్ష ఉద్యమ శ్రేయోభిలాషి కావూరి కుటుంబరావు మృతి పట్ల అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించింది. వితరణశీలి, ప్రగతి శీల ఉద్యమాలకు స్నేహశీలిగా నిలిచిన కుటుంబరావు మరణం అభ్యుదయ ప్రజాసంఘాలకు తీరని లోటని అరసం అధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ ఒక ప్రకటనలో నివాళులర్పించారు.

చాడ వెంకటరెడ్డి సంతాపం

కావూరి కుటుంబరావు మృతి పట్ల సీపీఐ శాసనసభాపక్షనేత చాడ వెంకటరెడ్డి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కాకలు తీరిన కమ్యూనిస్టు నేతలతో కలిసి పోరాటాల్లో కావూరి పాల్గొన్నారని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. చల్లపల్లి ఎస్టేట్ రైతు పోరాటంలో పాల్గొని జమీందారీ వ్యతిరేక ఉద్యమాన్ని నిర్వహించారని, స్వాతంత్ర్యపోరాటంలో రాజకీయ ఖైదీగా జైలుశిక్షలు అనుభవించి ఆదర్శ జీవితం గడిపారని పేర్కొన్నారు.

కావూరి కుటుంబరావు అస్తమయం

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆన్‌లైన్): స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు నాయకుడు కావూరి వెంకట కుటుంబరావు మంగళవారం తెల్లవారు జామున ఒంటి గంట ప్రాంతంలో హైదరాబాద్‌లోని తన స్వగృహంలో కన్నుమూశారు. పంజాగుట్ట హిందూ స్మశానవాటికలో ఆయన భౌతికకాయానికి సాయంత్రం బంధువులు, సన్నిహితుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. మృతి విషయం తెలియగానే అభిమానులు, బంధుమిత్రులు, వివిధ పార్టీల నాయకులు జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంటికి పెద్దఎత్తున తరలివచ్చారు. పరుచూరి హనుమంతరావు, సినీనటుడు మురళీమోహన్, అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఏబీకే ప్రసాద్, దాసరి నాగభూషణం, చండ్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించారు. 1918, మే 5న కావూరి శివరామయ్య, సీతరామమ్మలకు కృష్ణా జిల్లా రావివారిపాలెంలో ఆయన జన్మించారు. కావూరికి ఇద్దరు కుమార్తెలు. భార్య, కుమారుడు మృతి చెందారు. కమ్యూనిస్టు భావాలు ఉన్న ఆయన ఆంగ్లేయులపై అవిశ్రాంత పోరాటం చేశారు. చల్లపల్లి జమిందారు వేలాది ఎకరాల స్థలాలను స్వాధీనం చేసుకున్న సంఘటనలో జమీందారుకు వ్యతిరేకంగా కుటుంబరావు పోరాటం చేశారు. తెలంగాణ సాయుధ పోరు తరహాలో కోస్తాంధ్రలో పోరాటాలు చేశారు. రాజమండ్రి జైలులో ఆయన మూడేళ్ల రాజకీయ ఖైదుగా కారాగార శిక్షను అనుభవించారు. ఎన్నో పురస్కారాలను పొందిన ఆయన ఇటీవల ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం, 2007 అవార్డునూ అందుకున్నారు. రైతు సమస్యలపై అనేక రచనలు చేశారు.

వామపక్షాల సంతాపం

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు దిగ్గజం కావూరి కుటుంబరావు మృతికి సీపీఎం, సీపీఐలు సంతాపం వ్యక్తం చేశాయి. కావూరి మొదటి తరం కమ్యూనిస్టు నాయకుల కోవకు చెందిన వారని సీపీఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావూరి మృతి సీపీఐకే కాకుండా వామపక్ష ఉద్యమానికే నష్టమని అన్నారు. సీపీఐ జాతీయ కౌన్సిల్ తరఫున కావూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కావూరి భౌతిక కాయానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. మంత్రి మండలి బుద్ధప్రసాద్ కూడా కావూరి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.



కావూరి కుటుంబరావు మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మురళీ మోహన్, పరుచూరి హనుమంతరావు తదితరులు

Estd. 1938

ఆంధ్రప్రభ

Journalism first!

సంపుటి: 41 • సంచిక: 208 • బుధవారం 17 అక్టోబర్ 2007 • హైదరాబాద్ సిటీ ✻ • పేజీలు: 14 • వెల: రు 3.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhap

కాపూరి కుటుంబరావు మృతికి సంతాపం

ఆయన సేవలు చిరస్మరణీయం : సురవరం

(ఆంధ్రప్రభ ప్రతినిధి)

హైదరాబాద్, అక్టోబర్ 16: కమ్యూనిస్టు యోధుడు, సీనియర్ ఉద్యమ నాయకుడు కాపూరి కుటుంబరావు మరణం సమాజానికి తీరని లోటని, ఆయన సేవలు చిరస్మరణీయమని సిపిఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. రైతు ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన ఆయన చల్లపల్లి జమీందారు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్వహించారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు ఉద్యమాల్లో ఆయన రాసిన గ్రంథం నేటి తరాలకు ఆదర్శప్రాయమని తెలిపారు. సిఆర్ ఫౌండేషన్‌కు, పార్టీకి, ప్రజా సంఘాలకు విరాళాలిచ్చి ప్రోత్సహించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కుటుంబరావు మృతిపట్ల సిపిఐ పార్టీ తరపున ఆయన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

సిపిఎం సంతాపం

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కాపూరి కుటుంబరావు మరణంపట్ల సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటీ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఆయన సేవలను కొనియాడుతూ పార్టీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సిపిఎం రాష్ట్ర కమిటీ తరఫున ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై. వెంకటేశ్వర్ రావు కుటుంబ రావు భౌతిక కాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

147

వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తుల సమైక్యతకై ప్రజా సదస్సు

హైదరాబాదులో 3.9.95 ఆదివారం సాయంత్రం 5 గం॥కు సుందరయ్య విజ్ఞాన కేంద్రం హాలులో ప్రారంభం

సోదరీ, సోదరులరా!

నేడు దేశం అత్యంత క్లిష్ట పరిస్థితులలో ఉన్న సంగతి అందరకూ తెలిసినదే. దేశ రాజకీయ, ఆర్థిక, సాంఘిక వ్యవస్థలు తీవ్ర సంక్షోభంలో పడినాయి. ఏరంగంలో చూసినా అనిశ్చిత, అస్థిరత లక్షణాలే కనపడుతున్నాయి. కుల, మత, ప్రాంతీయ దురహంకారాలను రెచ్చగొట్టి, కొన్ని రాజకీయ పార్టీలు, వారివారి విభిన్న సరళులలో ప్రజానీకాన్ని పెడత్రోవ తొక్కించి, రాజ్యాధికారాన్ని చేజిక్కుంచుకొనుటకు చూస్తున్నాయి. ఈ కుల, మత, ప్రాంతీయ దురహంకార శక్తులు అధికారంలో స్థిరపడితే, దేశమంతా మత కలహాలు, కుల సంఘర్షణలు, చెలరేగి తిరిగి మధ్యయుగాల కల్లోల పరిస్థితులు పునరావృతం కాక తప్పదేమో అనిపిస్తుంది.

ఇటీవలి కాలంలో, ఆర్థికరంగంలోని పరిణామాలు కూడ ప్రజానీకానికెంతో ఆందోళన కల్గిస్తున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన కొద్ది దేశాలు ప్రపంచాన్ని తమ పెత్తనం క్రిందకు తీసుకునే ప్రయత్నాలలో భాగంగా, పాలకవర్గాల ప్రోద్బలంతో, సంపూర్ణ స్వేచ్ఛాయుత ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టబడినవి. ఎన్నో దశాబ్దాలుగా ఆర్థిక స్వావలంబన కొరకు సామ్రాజ్యవాదులకు ఎదురునిల్చి స్వతంత్ర ఆర్థిక విధానాలను రూపొందించుకొన్న మన దేశంలో ఒక్కసారిగా ప్రైవేటు విదేశీ పెట్టుబడులకు, బహుళ జాతి సంస్థలకూ, విచక్షణారహితంగా ద్వారాలు తెరిచారు. రైతులు, కార్మికులు, మధ్య తరగతి ప్రజలు, చిన్న పారిశ్రామికులూ వారి భవిష్యత్తును గూర్చి భయాందోళనతో చూస్తున్నారు. దేశ ఆర్థిక భవితవ్యం సామ్రాజ్యవాద, పెట్టుబడిదారి వ్యవస్థ దయాదాక్షిణ్యాలకు పూర్తిగా వదలివేయబడింది.

పై చెప్పిన రాజకీయ, ఆర్థిక పరిణామాల ఫలితంగా దశాబ్దాలుగా జరిగిన జాతీయోద్యమ, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలలో పరిణితిచెంది, రాజ్యాంగంలో పొందుపరుచబడిన జాతీయ లక్ష్యాలు – సార్వభౌమ్యత్వం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ఆర్థిక, సామాజిక న్యాయం – తీవ్ర విపత్తులో పడ్డాయి. ఈ తిరోగమన విధానాలను ఎదిరించి, త్రిప్పికొట్టవలసిన తక్షణ కర్తవ్యాన్ని నిర్వహించగల శక్తులు వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు మాత్రమే. కుల, మత దురహంకారాలను, ప్రాంతీయ దరభిమానాలను రెచ్చగొట్టకుండా, వెనుకబడిన జాతులకు, వర్గాలకు ఆర్థిక, సామాజిక న్యాయం కలుగజేయుటకునూ, రాజకీయాలను, ప్రభుత్వ వ్యవహారాలను మతానికి, మత సంబంధిత ఆచారాలకూ దూరంగా ఉంచి, మతం వ్యక్తిగతం అనే సిద్ధాంతంపై ఆధారపడిన లౌకికవాదం అమలు కొరకునూ, సమాజంలో వ్యక్తి, సమిష్టి పౌర హక్కులను పరిరక్షించి, జన సంక్షేమమే ధ్యేయంగా పెట్టుకొని, నీతిబద్ధమైన ప్రజాస్వామ్య స్థాపన కొరకూ, పోరాడగల శక్తులనూ, వ్యక్తులనూ సమీకరించుట ద్వారానే ఈ విశాలమైన వామపక్ష లౌకిక, ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం సాధ్యమగునని మావిశ్వాసం. అలాంటి శక్తుల సంఘటన మాత్రమే ఎన్ని విధాలుగానో కలుషితమైన

నేటి సామాజిక జీవితాన్ని రాజ్యాంగంలో పొందుపరచబడిన జాతీయ లక్ష్యాల పునాదులపై సమగ్రంగా పునరుద్ధరించగలదని మానమ్మకం.

అయితే ఈలౌకిక, ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తులు, ఈమధ్య వచ్చిన జాతీయ, అంతర్జాతీయ పరిణామాల కారణంగా ఎంతో నిస్పృహ చెందివున్నాయి. వీరిని ఉత్సాహపరచి, సమీకరించటం తక్షణ కర్తవ్యం. ఈకర్తవ్యాన్ని ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించటానికి ముందుకు రావలసింది కమ్యూనిస్టు పార్టీలని మాఅభిప్రాయం. ఆంధ్రలోని జాతీయ ఉద్యమంతోనూ, సోషలిస్టు సిద్ధాంతాలతోనూ ప్రభావితమైన కమ్యూనిస్టు పార్టీ ఒకప్పుడు అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించింది. జమీందారీ రైతుల రక్షణ కొరకు, కుల, మత వివక్షతకు వ్యతిరేకంగానూ, సాంఘిక దురాచారాల నిర్మూలనకొరకు, తెలుగు ప్రజల సాంస్కృతిక వికాసంకొరకు, నైజాం ప్రభుత్వ దమనకాండను సాయుధంగా ఎదిరించి, ఫ్యూడల్ వ్యవస్థను కూలద్రోయటద్వారా తెలంగాణ రైతు, కూలీ వర్గాల విమోచన కొరకు, దానితోపాటు ముక్కలు, చెక్కలుగావున్న తెలుగు గడ్డను సమైక్యం చేయుటకు, ఇంకా ఎన్నో తెలుగు జాతి జీవితంతో పెనవేసికొన్న అనేక సమస్యలపై ఉద్యమాలను నడిపింది. బ్రహ్మ సమాజం, జాతీయోద్యమాల ద్వారా మహిళల్లో కల్గిన సాంఘిక చైతన్యాన్ని, విద్యావంతులైన మహిళలకే పరిమితంగాకుండా, అన్ని వర్గాల మహిళలదైనందిన జీవిత సమస్యలపై పోరాటాల ద్వారా పరిపుష్టిచేసి, మహిళా ఉద్యమాన్ని గ్రామాలకు కూడ విస్తరింపజేసి ఆఉద్యమానికి కమ్యూనిస్టులు సమగ్రత చేకూర్చారు. ఈవిధంగా అన్నిరంగాలలోనూ తెలుగు జాతి కొరకు కమ్యూనిస్టు పార్టీ చేసిన విశేష కృషి 'విశాలాంధ్ర' స్థాపనకు దారితీయుటయే కాక, తరువాత రాష్ట్ర సమగ్రతను పరిరక్షించుటలో కూడ గణనీయమైనదిగా తెలుగు ప్రజలు భావిస్తున్నారు. అందుచేత, కమ్యూనిస్టులు ఆంధ్రప్రదేశ్‌లో, వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులను, ఒక నిర్దుష్ట ప్రజాహిత కార్యక్రమంపై, సమీకరించుటకు వెంటనే పూనుకోవలసిందిగా కోరుతూన్నాం. ఆకార్యక్రమం రూపొందించటంలోగాని, దాన్ని అమలు పర్చటంలోగాని సైద్ధాంతిక విభేదాలు అడ్డురావని, రాకూడదని కూడ మాఅభిప్రాయం. చరిత్ర కమ్యూనిస్టులపై నుంచిన ఈగురుతర బాధ్యతను కమ్యూనిస్టులందరూ నిర్వహించాలనీ, నిర్వహించగలరని, ఆంధ్రావనిలో ప్రజానీకం ఆశిస్తూంది. ఎదురుచూస్తూంది.

ఈకృషి విజయవంతమగుటకు తగిన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని భావిస్తున్నాం. 1994 ఫిబ్రవరిలో సి.పి.ఐ., సి.పి.ఐ.(మార్కిస్టు) పార్టీల పిలుపుమేరకు విజయవాడలో జరిగిన గొప్ప ప్రజాసమీకరణ ఒక ఉదాహరణ. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికలలో ఈపార్టీలకు చెందిన పలువురు శాసనసభకు ఎన్నికవడం కూడ గమనించదగిన విషయం. విజయవాడలో కార్పొరేషన్ ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీలు సాధించిన ఘనవిజయం మరో మంచి తార్కాణం. విజయవాడలో చూపిన కమ్యూనిస్టు ఐక్యతాభావాన్ని రాష్ట్రంలో ఎందుకు విస్తరింపజేయలేరు అని అనేక మంది ప్రశ్నిస్తున్నారు. ఇందుకే ఇటీవల విజయవాడలో పలువురు స్వాతంత్ర యోధులు, విద్యావేత్తలు, రచయితలు, తదితర మేధావులు ఇచ్చిన విజ్ఞప్తి మేరకు వామపక్ష, లౌకిక ప్రజాతంత్ర శక్తుల సమైక్యతకై ఒక సదస్సు నిర్వహింపబడింది. ఆసదస్సు రాష్ట్రంలో మంచి ఆసక్తిని, ఉత్సాహాన్ని కలిగించింది. ఎందరెందరో ఈప్రయత్నాన్ని హర్షించారు. ఈప్రగాఢమైన ప్రజావాంఛను ప్రస్ఫుటం చేయడానికి రాష్ట్ర రాజధానిలో కూడ వామపక్ష, లౌకిక ప్రజాతంత్ర శక్తుల సమైక్యతకై ఒక ప్రజాసదస్సును జరపాలని నిర్ణయించాం. ఈసదస్సులో అభ్యుదయకాముకులు, లౌకిక ప్రజాతంత్రవాదులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయవలసిందని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఇట్లు

కాపూరి కుటుంబరావు
స్వాతంత్ర్య సమరయోధులు

పరుచూరి హనుమంతరావు
ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్

వీరమాచనేని మధుసూదనరావు
ఫిలిం డైరెక్టరు

తమ్మారెడ్డి కృష్ణమూర్తి
ఫిలిం ప్రొడ్యూసర్

కాజ, చంద్రం
సంఘ సేవకులు

కొల్లి రామ మోహనరావు
కంపెనీ రిటైర్డ్ డైరెక్టరు

వి. హనుమంతరావు
సీనియర్ జర్నలిస్ట్

డా॥ బి.వి. రంగారావు
మాజీ ప్రొఫెసర్,
జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటి

డా॥ కె. శేషాద్రి
మాజీ ప్రొఫెసర్,
జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటి

యం.యల్. శాస్త్రి
రిటైర్డ్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటి
ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్

గూడూరు వెంకటరత్నం
సంఘ సేవకులు

అట్లూరి వెంకటేశ్వరరావు
సంఘ సేవకులు

యస్. నాగభూషణ రెడ్డి
రిటైర్డ్ సూపరిన్‌టెండెంట్, సెంట్రల్ ఎక్సైజ్

వి.యస్. ప్రకాశరావు
రిటైర్డ్ లెక్చరర్

అట్లూరి పూర్ణచంద్రరావు
ఫిలిం ప్రొడ్యూసర్

డి. నరసింహారావు

చలసాని శిశిర్
ఇంజనీర్

దేవినేని చంద్రశేఖరరావు
వ్యాపారస్తులు

డా॥ వి. కామేశ్వరరావు, M.D.
కన్సల్టెంట్, అపోలో హాస్పిటల్

దేవినేని సీతారామయ్య
చార్టర్డ్ ఎకౌంటెంట్

గుమ్మడి వెంకటేశ్వరరావు
చలనచిత్ర నటులు

కె.యల్. నరసింహారావు
రిటైర్డ్ ఆఫీసర్, ఎ.పి.ఎ.యస్.

కె. నాగేశ్వరరావు
రిటైర్డ్ సూపరింటెండింగ్ ఇంజనీర్

వై. కృష్ణమూర్తి
జోనల్ సెక్రటరీ,
ఆల్ ఇండియా యల్.ఐ.సి. ఎంప్లాయీస్ ఫెడరేషన్

మాదాల రంగారావు
సినీ నటులు

కె. ప్రతాప రెడ్డి
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి

వేమూరి బుచ్చయ్య
మేనేజింగ్ డైరెక్టరు, స్నేహధార పరిశ్రమ

కాట్రగడ్డ వెంకట నారాయణరావు
స్వాతంత్ర్య సమరయోధులు,
మాజీ శాసన సభ్యులు

కాట్రగడ్డ శ్రీనివాసరావు

ప్రొఫెసర్ యం. రామకృష్ణారావు, **Ph.D.**
సైన్‌టిస్ట్ & కన్సల్టెంట్

శ్రీ రాజ్యం సిన్హా
మాజీ డైరెక్టర్ - ఇన్‌ఫర్‌మేషన్,
పబ్లిక్ రిలేషన్సు, ఆం.ప్ర.

తమ్మారెడ్డి లెనిన్ బాబు
సినీ డైరెక్టర్

మనోహర్ రాజ్ సక్సేనా
న్యాయవాది

జి. గంగాధరరావు
L.A. అడ్వైజర్స్

టి.వి. నారాయణ రెడ్డి
రిటైర్డ్ వెల్‌ఫేర్ కమీషనర్,
గవర్నమెంట్ ఆఫ్ ఇండియా

డా॥ కె. రాఘవులు
రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్,
మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్, ఆం.ప్ర.

యం. ధర్మయ్య
రిటైర్డ్ డిప్యూటి కలెక్టర్, సెంట్రల్ ఎక్సైజ్

తమ్మారెడ్డి భరద్వాజ
సినీ నిర్మాత, దర్శకులు

పొట్లూరి సత్యనారాయణ
స్వాంతంత్ర్య సమరయోధులు

కొడాలి అంజయ్య
స్వాంతంత్ర్య సమరయోధులు

మల్లయ్య
కార్మిక నాయకులు

వి. శాస్త్రి
కార్మిక నాయకులు

టి. సంగీతరావు
కార్మిక నాయకులు

పొట్లూరి సుభాష్ చంద్రబోస్
ప్రెసిడెంట్, లయన్స్ క్లబ్

తురుమెళ్ళ గోవిందయ్య
న్యాయవాది

పి.వి.యస్. కృష్ణ శాస్త్రి
ప్రొఫెసర్

యన్.పి.బి.ఎల్. శర్మ
ఆడిటర్

మండలి వెంకట కృష్ణారావు, అవనిగడ్డ,

ది. 15.11.85.

శ్రీ కావూరి కుటుంబ రావుగారికి

నమస్కారములు,

తమ సతీమణి శ్రీమతి కావూరి వరలక్ష్మి స్వర్గస్థులైనట్లు తెలిసి చాలా విచారపడినాము. తమకు, తమ కుటుంబ సభ్యులెల్లరకు మా హృదయ పూర్వక సానుభూతిని తెలియజేసు కొంటున్నాము.

ఇట్లు,

[illegible]
21.12.1993

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

21.12.93

[illegible]
[illegible]
29.10.90

[illegible]

[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible] [redacted] [illegible]
[illegible]

Kistna District Board. 1923

Total receipts including Government grant & excluding minor items

Land Cess	Rs 3,17,478 (Dt Bd's share)
Railway earnings	363750
Tolls ——	123610
Ferries ——	22116
Government grant	288033
Total	Rs 1114987

There are 5 High schools and 9 middle schools under this Bd.

· 8 Tq Bds and 21 Ranges.

155

COMMUNIST PARTY OF INDIA

ANDHRA PRADESH STATE COUNCIL

Phones : During office hours : 32473
After office hours : 30088
GRAMS: 'COMMUNIST'

"MAKHDOOM BHAVAN"
HIMAYATNAGAR
HYDERABAD-500029.

..........................1984

[illegible] 27-12-84

[illegible]

[illegible]

ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ

హైదరాబాదు

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అవార్డు - 2007

స్వాతంత్ర్య సమరయోధుడు

శ్రీ కావూరి కుటుంబరావు



భారత జాతీయ ఉద్యమంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటం చేసిన ప్రజాస్వామ్యవాది, స్వేచ్ఛాభిలాషి, స్వాతంత్ర్యయ ఉపాసి, కాకలు తీరిన కమ్యూనిస్ట్ నాయకుడు కావూరి కుటుంబరావు. దివిసీమలో ఒక రైతుగా కమ్యూనిస్టు కార్యకర్తగా కార్మిక, కర్షక నాయకుడిగా చల్లపల్లి జమిందార్ ఆగడాలను, అధికార అహంకారాన్ని ధైర్య సాహసాలతో ఎదుర్కొని ప్రతిఘటించిన పోరాట యోధుడు కావూరి. దివిసీమ ప్రాంతాల్లోని అనేక గ్రామాల్లో వివిధ రకాలైన మాయోపాయాలతో, కుటిల ప్రయత్నాలతో, దమన నీతితో వేలాది ఎకరాల రైతుల భూములను ఆక్రమించుకున్న చల్లపల్లి జమిందార్లకు వ్యతిరేకంగా ఎదతెగని సుదీర్ఘ పోరాటంలో సాహసోపేతంగా పాల్గొన్న సైనికుడు కుటుంబరావు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రప్రభుత్వ కాలంలో కేంద్రప్రభుత్వానికి రైతుల సమస్యలు నివేదించి సామాజిక న్యాయం కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసిన ధీరుడు కావూరి.

పవిత్ర కృష్ణానది ఒడ్డున మోపిదేవి శివారులోని రావివారి పాలెం గ్రామంలో సీతారావమ్మ కావూరి శివరామయ్య పుణ్యదంపతులకు 1918 మే 5న జన్మించారు. అప్పట్లో బందరులో ట్రైనింగ్ స్కూల్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న గుడిపాటి వెంకటాచలం కావూరికి అక్షరాభ్యాసం చేయించారు.

దీపంతో దీపం వెలిగించండి, విజ్ఞాన జ్యోతులు ప్రసరింప చేయండి, సమాజాన్ని విద్యాగంధంతో చైతన్యవంతం చేయండి అనే నినాదాలను గట్టిగా నమ్మిన కావూరి ఉపాధ్యాయునిగా పని చేస్తూనే అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. పేద విద్యార్థులను చేరదీసి తానే ఫీజులు చెల్లించి వివిధ కోర్సుల్లో చేర్పించి చదివించే వారు. పాఠశాలల్లో వసతులు సమకూర్చేందుకు విరాళాలు సేకరించే వారు. రాత్రిబడుల్లో కూలీలకు చదువు చెప్పేవారు. రైతులకు పంటకు తగ్గ ఫలితం దక్కేందుకు అవిరళ కృషి చేశారు. సామ్యవాద భావాలతో సామాజిక చైతన్యం కోసం నిస్వార్థంతో అహర్నిశలు పాటు పడ్డారు. సమత, మమతలను కోరుతూ సమ సమాజ స్థాపన కోసం జీవితాంతం కృషి చేశారు కావూరి. సమాజంలో నైతిక విలువలను పునరుద్ధరించడంలో ఆయనకున్న తపన సాటి లేనిది. వర్ణాంతర, కులాంతర వివాహాలు జరిపించి అంటరానితనం దురాచారాన్ని రూపుమాపడానికి కృషి చేస్తూ అనేక సంఘ సంస్కరణ కార్యక్రమాలను చేపట్టారు.

తెలంగాణ సాయుధ పోరాటం తరహాలో కోస్తాంధ్ర ప్రాంతాలలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించి అనేకసార్లు అరెస్ట్ అయ్యారు. రాజమండ్రి, కడలూరు మొదలైన చోట్ల మూడేళ్ళ కాలం రాజకీయ ఖైదీగా కారాగార శిక్షను అనుభవించారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు కావూరి కుటుంబరావు.

అభ్యుదయ భావాలతో సంఘ సంస్కరణాభిలాషితో మాతృదేశ విముక్తి కోసం పోరాటం చేసిన యోధుడు నిరాడంబర జీవి, సమాజ శ్రేయోభిలాషి మానవతావాదియైన మన కావూరి కుటుంబరావును ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అవార్డు-2007తో సత్కరించడం గర్వంగా భావిస్తోంది.

హైదరాబాద్

[signature]

157

[illegible]

[illegible] JAIL.

Dear Kutumrarao,

[illegible] Confirmations [illegible] Confirmation [illegible] Confirmation [illegible] Purdah [illegible] bail [illegible]

Signature of Censoring Officer. Date. 21-4-1950 Name of sender.

[illegible]

కావూరి వెంకట సుబ్బారావు ప్రథమ వర్ధంతి సందర్భమున
రచించి సమర్పించిన
— సుందర పద్యములు —

తే॥గీ॥ అమల వృక్షానికి తొలి మందు వెలయు
దివి తాలూకాయందున వెలసె నగు
మోపిదేవి పురంబున మోదములర
కాపురంబుండు ప్రముఖులు కమ్మవారు

సీ॥ రాచరికమును మానీటి రణరంగమునను
ఘనత కెక్కిన వారు కమ్మవారు
నానా రిపుల గెల్చి సేనాధిపతులౌచు
ఘనత కెక్కిన వారు కమ్మవారు
ఆరయ శస్త్రశక్తిని శరణన్న రక్షించి
ఘనత కెక్కిన వారు కమ్మవారు
పంటల పండించి బడుగుల బ్రతికించి
ఘనత కెక్కిన వారు కమ్మవారు

తే॥గీ॥ దాన ధర్మాదులను సాటి లేని వారు
కమ్మగుట్లది మొప్పుడు గడపదాటి
జనని లోకోన్నతికి నిలయంబు నగుచు
ఘనత కెక్కిన వారలు కమ్మవారు.

తే॥గీ॥ అందు కావూరి వంశంబునందు పుట్టి
గురుడు శివరామయ్యగారి సద్గుణ పౌత్రి
బాప్పనాయని సుముఖ పరోపకారి
వెంకట సుబ్బారావను విమలయశుడు.

తే॥గీ॥ తనదు తమ్ముల కొడుకులందరకు మిగుల
ధనము స్థలముల నిచ్చి సంతసము గూర్చి
తనదు పేరును సార్థకమొనరజేసె
పరులకును మేలుసేయు సద్భావమెప్పు

ఆ॥వె॥ వెంకటేశ్వరుండు విమలుండు కాపాడు
వీరరామపుత్రుండు వెలసిన పురు
తమ్ముబాప్పనమందు ధరణి నెలగలారు
శాంతి కంటె ఘనము శాంతి సుఖములు

రచయిత
కావూరి రామకృష్ణయ్య

హైదరాబాద
1-4-1993.

ఓమ్

గొట్టిపాటి బ్రహ్మయ్య ఘంటశాల

తేది 8-8-80

ప్రముఖ సాహిత్య సాంస్కృతిక సంఘాలకు,

నమస్కారములు

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

భవదీయుడు

గొట్టిపాటి బ్రహ్మయ్య

మానవీయ విలువలు, సిద్ధాంతాలను ఆచరించారు.

రైతు ఉద్యమంలో ధీరోదాత్తంగా పాల్గొన్నారు.

జైలు శిక్షలు అనుభవించారు.

పదవులను, ఏ రకమైన ప్రతిఫలాన్ని కోరలేదు.

తాను సంపాదించిన దాన్నుంచి

నలుగురికి దానం చేశారు.

గొప్ప గొప్ప స్నేహితులు, ఆత్మీయుల

తలలో నాలుకగా మెలిగారు.

తొమ్మిది పదుల దీర్ఘ జీవితాన్ని

ఫలప్రదంగా గడిపారు.

అటువంటి విశిష్ట వ్యక్తి

జీవన ప్రస్థానానికి అక్షర రూపం...